ప్రాచీన పట్టణాలు

తూర్పు గోదావరి జిల్లా

బొల్లోజు బాబా

SHOUT
SHARE
IT

ప్రాచీన పట్టణాలు

తూర్పుగోదావరి జిల్లా

బొల్లోజు బాబా

పల్లవి పబ్లికేషన్స్

29-28-26/1 ,దాసరి వారి వీధి, సూర్యారావు పేట, విజయవాడ - 520002

సెల్ : 9866115655

Pracheena pattanaalu - thoorpugodavari zilla

Bolloju Baba
30-7-31, Gollala Veedhi ,Suryanarayanapuram
Kakinada, East Godavari District, Andhra Pradesh - 533001
Ph. 9849320443

First Edition
November, 2021

Publishers
PALLAVI PUBLICATIONS
29-28-26/1, Dasarivari Street,
Suryaraopet, Vijayawada - 520002
Cell : 9866 115655
email : pallavipublications85@gmail.com

Printers
Nagendra Offset Printers
Vijayawada 3

Cover Design
A. Giridhar

Getup
Mummidi Chinnari

Copyright©2020 by bollojubaba@gmail.com

Price :

ISBN : 978 - 93 - 5473 - 695 - 7

విషయసూచిక

చరిత్రపై మక్కువ పెంచే రచన	డా. కె. ఎస్. కామేశ్వరరావు	4
శుభాశీస్సులు	డా. జాస్తి దుర్గాప్రసాద్	6
మనవి మాటలు		8
ఒకనాటి ఆంధ్ర రాజధాని పిఠాపురం		12
అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి		44
అపురూప ఆలయసంపదకు నిలయం బిక్కవోలు		67
చరిత్రపుటలలో – కోరంగి మహాపట్టణం		83
చారిత్రిక ప్రాధాన్యం కలిగిన ఇతర పట్టణాలు		102
ఆంధ్ర వేదాద్రి – కోరుకొండ		102
ఆదుర్రు		106
చాళుక్యభీమవరం		109
సర్పవరం		113
దాక్షారామము		118
బెండపూడి		123
పలివెల		126
తొలితిరుపతి		128
పెద్దాపురం		130
తూర్పుగోదావరి జిల్లా ప్రాచీన భౌగోళికత		133
కాలగర్భంలో కలిసిపోయిన కోటలు		137

చరిత్రపై మక్కువ పెంచే రచన

డా. కె. ఎస్. కామేశ్వరరావు

బొల్లోజు బాబా కవిగా, రచయితగా గత మూడు దశాబ్దాలనుంచి పాఠకులకు సుపరిచితులు. అయితే ఇతనిలో కనిపించే ఒక ప్రత్యేక లక్షణము తనకు అత్యంత ఇష్టమైన కవిత్వము, జంతుశాస్త్ర అధ్యాపకత్వముతో పాటుగా సామాజిక శాస్త్రాలలో ఒకటి అయిన చరిత్రను శాస్త్రీయ దృక్పథంలో అధ్యయనం చేయుటలో ఆసక్తి. ఇది గమనించిన నేను బొల్లోజు బాబా పై అభిమానం పెంచుకొన్నాను. ఇతడు యానాం పై రాసిన పుస్తకాలు నాకున్న అభిప్రాయాన్ని బలపరిచాయి. అంతే కాక తూర్పుగోదావరిజిల్లా కైఫియ్యతులపై ఇతను చేసిన కృషి నన్ను మరింతగా ఇతన్ని ప్రేమించేట్టు చేసింది. ఒక యాభైఏళ్ళుగా ఎంతో శ్రద్ధగా చరిత్రను చదువుతున్న వాణ్ణిగా తూర్పుగోదావరి జిల్లా చరిత్ర సంస్కృతి గ్రంథ సంచాలకునిగా ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లా పట్టణాల చరిత్రను శ్రద్ధగా చదివాను అయితే ఈ గ్రంథం యొక్క లక్ష్యం సామాన్య పాఠకులలో యువతీ యువకులలో చరిత్రపైన మక్కువను పెంచుతుందని, తాను జీవిస్తున్న ప్రాంతంగురించి మరింతగా తెలుసుకోవాలనే తపన పెంచేందుకు సహాయపడుతుంది అని నేను నమ్ముతున్నాను.

తూర్పుగోదావరి జిల్లా అనే పేరు శతాబ్దకాలంగా విస్తారంగా వ్యాప్తిలోకి వచ్చింది. అంతకుపూర్వం ఈ ప్రాంతం అంతా కూడా కృష్ణా జిల్లాలో భాగంగా ఉండేది. అలాగే ప్రాచీన కాలంలో ఈ ప్రాంతాన్ని అనేకమైనటువంటి పేర్లతో పిలిచారు. వాటిని కూడా అప్పటిపేర్లు అప్పటి నాడులలో ఈ పుస్తకంలో పేర్కొన్న నగరాలు పట్టణాలు ఉండేవో సోదాహరణ పూర్వకంగా ఉదహరిస్తూ రచన చేసినట్లయితే మరింతగా బాగుండే దనిపించింది. అదే విధంగా ఈ ప్రాచీన అనే పదానికి నిర్వచనం కూడా ఇవ్వాల్సి ఉంది. ఎందువలన అంటే చరిత్రలో కాలవిభజన అంటే ప్రాచీన, మధ్య, ఆధునిక అనేవాటికి, హిందు, ముస్లిమ్, బ్రిటిష్ కాలం అనేవాటి గురించి చరిత్రలో గత అర్ధ శతాబ్దంలో

జరుగుతున్న చర్చ నేపథ్యంలో ఈ ప్రాచీన అనేటటువంటి దాన్ని ఏ అర్థంలో వాడారో వివరించి వ్రాసి ఉంటే మరింతగా ఈ కృషి రాణించేదని నాకనిపించింది.

ఇతనిలో ఉన్నటువంటి మరొక విశేషగుణం పుస్తకాన్ని పట్టుకొంటే వదలకుండా చదివించగలిగే నేర్పు, ప్రావీణ్యం ఇతనికి భాషపైన ఉన్న పట్టుతో సాధించాడని నాకు అనిపించింది.

మొత్తం మీద బొల్లోజు బాబా కృషి చరిత్రపైన ఉన్న ఆసక్తి, లోతైన అవగాహన అందుకొరకు కాలాన్ని వెచ్చిస్తూ ఈనాటి ఆధునిక పరికరాలైన ఇంటర్నెట్‌ని సక్రమంగా సవ్యంగా ఉపయోగించుకోవటంలోను, పూర్వ చరిత్రకారుల వలె వివిధ గ్రంథాల అధ్యయనంలోను ఇతనికున్నటువంటి ప్రావీణ్యము అభినందనీయం.

బాబా మరింతగా కృషిచేసి ఒక సద్విమర్శకుడుగా సశాస్త్రీయ పద్ధతిలో గతం నుంచి ఈనాటివరకూ ఉన్న చారిత్రిక గమనాన్ని అర్థం చేసుకొని మరింత లోతుగా అధ్యయనం చేసి మరింతగా ఆసక్తిని చరిత్రపట్ల సంస్కృతిపట్ల పెంచేందుకు కృషిచేస్తాడని ఆశీర్వదిస్తున్నాను....

డా. కె. ఎస్. కామేశ్వరరావు
విశ్రాంత చరిత్ర అధ్యాపకులు
పరిశోధకులు, చరిత్ర రచయిత

అక్టోబరు, 2021

శుభాశీస్సులు

డా. జాస్తి దుర్గాప్రసాద్

స్థానిక చరిత్ర పరిశోధనలు, రచనలపై ఆసక్తి, అనురక్తి యీ నాటిది కాదు. మెకంజీ కాలం నుంచీ అన్వేషణ పెద్ద ఎత్తున ప్రారంభం అయిందని చెప్పాలి. స్వంత వనరులతోనే గ్రామ గ్రామానికీ మనుషులను పంపి స్థానిక కరణాల సహాయంతో గతాన్ని వీలైనంత సవివరంగా ఆధారాలతో వెలుగులోకి తెచ్చిన ఆ మహానుభావుని ఒరవడిలోనే ఈ నాటికీ ఎందరో చరిత్ర పరిశోధనలో ముందుకి సాగుతున్నారు. మన దేశ చరిత్ర పునర్నిర్మాణానికి వీరందరూ దోహదపడుతున్నారు. స్థానిక చరిత్ర పరిశోధనలు ఒక మహా యజ్ఞం. ఈ యజ్ఞంలో కవులు. రచయితలు, చరిత్రకారులు అందరూ తమ తమ దృక్కోణాల నుండీ అన్వేషణలను సాగించి క్రొత్త క్రొత్త విషయాలను మనకు అందిస్తున్నారు.

ఇక్కడ ప్రత్యేకంగా నేను గమనించిన విషయం ఏమంటే మిత్రులు శ్రీ బొల్లోజు బాబా ప్రాథమికంగా కవి, రచయిత. అటువంటి వ్యక్తి చరిత్ర అన్వేషకునిగా, పరిశోధకునిగా, చరిత్రకారునిగా పరిణామం చెందడం అభినందనీయం. తన రచనా వ్యాసంగాన్ని బహు ముఖంగా విస్తరించిన శ్రీ బాబా చరిత్రకారునిగా మరింత పరిణతి చెందాలని నేను ఆకాంక్షిస్తున్నాను.

ఈ ఆప్తవాక్యం ముగించే ముందు శ్రీ బాబా గురుంచి, వారి యీ సరిక్రొత్త రచన గురించీ ఒక మాట చెప్పాలి. తొమ్మిది సంవత్సరాల క్రితం వెలువరించిన 'ఫ్రెంచి పాలనలో యానాం' నాటి బాబాకి, గత సంవత్సరం మనకు అందించిన 'మెకంజీ కైఫీయ్యతులు–తూర్పు గోదావరి జిల్లా' బాబాకి, నేటి యీ 'ప్రాచీన పట్టణాలు–తూర్పు గోదావరి జిల్లా' బాబాకీ చరిత్ర పరిశోధకునిగా ఎదిగిన పరిణామక్రమాన్ని, పరిణతిని నిశితంగా గమనించాలి. ఒక సాహిత్యకారుడు చరిత్రకారునిగా రూపాంతరం చెందడం వీక్షించ వచ్చును.

నాకు అత్యంత ఆసక్తిని కలిగించిన విషయం.విస్తృత చరిత్ర ఆధారాలను సేకరించడం, విషయాలను సమన్వయీకరించి క్రోడీకరించడం, సమగ్రంగా విశ్లేషించి పాఠకులకు పరిశోధనా ఫలితాన్ని అందించే ప్రయత్నం నిజాయితీగా చేయడం. దీనికి నేను శ్రీ బాబాని మనసారా అభినందిస్తున్నాను.

ఈ సందర్భంగా శ్రీబాబా నుండి మరింత పరిణతితో మరి కొన్ని ఉత్తమ పరిశోధక గ్రంథాలు రావాలని ఆకాంక్షిస్తూ , ఆత్మీయంగా...

డా. జాస్తి దుర్గాప్రసాద్
విశ్రాంత చరిత్ర అధ్యాపకులు
పరిశోధకులు, చరిత్ర రచయిత

మనవి మాటలు

వ్యవసాయంద్వారా ఆహారోత్పత్తుల మిగులు ఏర్పడ్డాక ప్రజలు ఒక చోట స్థిరంగా నివసించటానికి మొగ్గుచూపారు. జీవించటానికి అనువుగా ఉంటూ రాజకీయ, ఆర్థిక, మతపరమైన ప్రాధాన్యత కలిగిన జనావాస ప్రాంతాలు క్రమేపీ పట్టణాలుగా రూపుదిద్దు కొన్నాయి. మెగస్తనీస్ ఆంధ్రులకు ప్రాకారాలు కలిగిన ముప్పై పట్టణాలు ఉన్నాయని చెప్పాడు. ఇవి ఎక్కడెక్కడ ఉండేవో నేడు గుర్తించటానికి ఏ రకమైన ఆధారాలు లభించవు.

శాసనాలలో జనసాంద్రత కలిగిన ప్రాంతాలు – నగర, పుర, పట్టణ అనే మూడురకాల పేర్లతో చెప్పబడ్డాయి. పర్వతాలవంటి భవనాలతో, వ్యాపార కార్యకలాపాలు ఎక్కువగా జరిగే ఊరును "నగరము" అని; తీరప్రాంతంలో ఉండే రేవు స్థలాన్ని "పట్టణము" అని; బలమైన కోటను కలిగి ఉన్న ఊరుని "పురము" అని చరిత్రకారులు నిర్వచించారు. పిఠాపురం, రాజమహేంద్రవరం లలో బలమైన కోటలు ఉండేవి కనుక వాటికి పిష్టపురి, జననాథపురం అనే పేర్లు ఉన్నాయని ఊహించవచ్చు కానీ ఈ విభజనను అంత ఖచ్చితంగా పాటించినట్లు కనిపించదు. రాజమహేంద్ర పట్టణం (EI Vol 5 p.32), పిఠా పట్టణం (శ్రీనాథుని పద్యం) లాంటి ప్రయోగాలు కూడా ఉండటం గమనార్హం.

ఒక ప్రాంతంలో ఏమేరకు పట్టణీకరణ జరిగిందో అనేది అది ఆ ప్రాంతపు రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక అభివృద్ధికి, నాగరికతకు సూచిక. ఆయా పట్టణాల ఉత్థాన పతనాలు ఆ ప్రాంత చరిత్రకు అద్దంపడతాయి.

భౌగోళికంగా వివిధ ప్రాంతాలను కలిపే రహదారులు; అన్ని వృత్తుల వారికి అవకాశాలు; ఆర్థిక వ్యవస్థను నడిపించే ఏదైన ఒక ప్రముఖ దేవాలయం; ఓడరేవుల ద్వారా విదేశీ వ్యాపారం; ప్రజలకు రక్షణ; భిన్నమతాల మధ్య సహిష్ణుత; రాజకీయ ప్రాధాన్యత కలిగి ఉండటం– లాంటివి పట్టణీకరణకు దోహదపడే అంశాలు.

తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించిన పట్టణీకరణపై ఆధ్యాత్మిక కేంద్రాల ప్రభావం అధికంగా కనిపిస్తుంది. ప్రాచీన కాలంలో ఆలయాలు సమాజంలో Money Circulate చేసే ఆర్థిక కేంద్రాలు. ఇవి గ్రామీణ ఎకానమీని అర్బన్ ఎకానమీని అనుసంధానం చేసేవి. దేవుని పేరుమీద జరిగే ఈ తతంగంలో అప్పటి సమాజంలోని దాదాపు అన్ని సామాజిక వర్గాలకు ఏదోఒక పాత్ర ఇవ్వబడింది.

జిల్లాలో ప్రాచీన చరిత్ర కలిగిన ద్రాక్షారామ, సామర్లకోట, సర్పవరం, పిఠాపురం, బిక్కవోలు, పలివెలలో నెలకొని ఉన్న వివిధ ఆలయాలు ఆయా ప్రాంతాలు అభివృద్ధి చెందటానికి సహాయపడ్డాయి. బౌద్ధ, జైన మతాలకు సంబంధించి జిల్లాలో అనేక చోట్ల భారీ అవశేషాలు లభిస్తూండటాన్ని బట్టి ఈ ప్రాంతం ఒకప్పుడు బౌద్ధ, జైన విశ్వాసులకు కూడా దర్శనీయస్థలంగా ఉండేదని భావించవచ్చు. ఒక ప్రాంతంలో నెలకొన్న ఆధ్యాత్మిక కేంద్రం మతాలకు అతీతంగా ఆ ప్రాంత పట్టణీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తుంది.

ఆధ్యాత్మిక కేంద్రాల తరువాత జిల్లా పట్టణీకరణకు దోహదపడిన మరొక అంశం కోరంగి, ఆదుర్రు లాంటి ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఓడరేవులు. పట్టణాలలో నివసించే వృత్తికారులు, వర్తకులు వివిధ వ్యాపార శ్రేణులుగా (Guilds) సంఘటితమై ఈ ఓడరేవుల ద్వారా పెద్దఎత్తున విదేశీ వ్యాపారం జరిపేవారు. కోరంగి ఓడరేవు మాత్రమే కాదు ఒకప్పటి గొప్ప నౌకానిర్మాణ కేంద్రం కూడా. పిఠాపురం కూడా ఒకనాటి ఓడరేవు కావొచ్చు అనే ఒక అభిప్రాయం ఉంది.

తూర్పుగోదావరి జిల్లాలోని పిఠాపురం కొంతకాలం కళింగరాజ్యానికి, రాజమహేంద్ర వరం వేంగి రాజ్యానికి రాజధానులుగా ఉన్నాయి. అవికాక బిక్కవోలు, చాళుక్యభీమవరం, కోరుకొండ, కడలి, ముమ్మిడివరం, రంప లాంటి ప్రాంతాలు వివిధకాలాలలో రాజకీయ కేంద్రాలుగా ఉండటం వల్ల అవి పట్టణాలుగా మారి అభివృద్ధిపథంలో నడిచాయి.

వేంగి, కళింగ రాజ్యాలను కలిపే ప్రాచీన రహదారి జిల్లా లోని రామచంద్రపురం, బిక్కవోలు, పిఠాపురం, కొడవలి మీదుగా రామతీర్థం వైపు వెళుతుంది. ఇది సుమారు రెండువేల సంవత్సరాలనాటి జాతీయ రహదారి. ఆ విధంగా ఈ ప్రాంతం ఒకప్పటి ప్రముఖ ప్రాచీన రాజ్యాలతో అనుసంధానింపబడి ఉంది. ఈ లక్షణం కూడా పట్టణీకరణకు అనుకూలించే అంశము.

హిందు, బౌద్ధ, జైన విశ్వాసాలకు చెందిన అనేక ప్రాచీన క్షేత్రాలు జిల్లాలో కనిపిస్తాయి. బౌద్ధానికి సంబంధించి ఆదుర్రు, పిఠాపురం, గొల్లప్రోలు, కొడవలి, కాపవరం,

తుని, రంపఎర్రంపాలెం, కోరుకొండ లాంటి ప్రాంతాలలో వివిధ భారీ బౌద్ధ అవశేషాలు లభిస్తున్నాయి. ఇవి ఆయా ప్రాంతాల ప్రాచీన ప్రాధాన్యతను నిరూపిస్తాయి. అదే విధంగా జిల్లాలో జల్లూరు, కాజులూరు, ఆర్యావటం, పిఠాపురం, బిక్కవోలు, తాటిపాక, రాజోలు, రామచంద్రపురం లాంటి ప్రాంతాలలో ఒకప్పుడు జైనమతం వెలసిల్లినట్లు నేడు అనేక విగ్రహాలు బయటపడుతున్నాయి.

ఈ భిన్న మతాలు ఒకనాడు సమాంతరంగా సహజీవనం చేసినట్లుకూడా అర్థమౌతుంది. ప్రజలు భిన్నవిశ్వాసాలకు సహిష్ణుత కలిగి ఉండటం మానవ నాగరికత, సంస్కృతుల ఔన్నత్యానికి ఉత్తమోత్తమ నిదర్శనం.

ఈ పుస్తకంలో తూర్పుగోదావరికి చెందిన ప్రాచీనపట్టణాల చరిత్రను చెప్పటానికి ప్రయత్నించాను. దీనిలో హుయాన్ త్సాంగ్ పిఠాపుర సందర్శన, గుణగ విజయాదిత్యుని చారిత్రిక స్థానం, బిక్కవోలు ఆలయ శిల్ప సంపద, కోరంగి సాంస్కృతిక అంశాలు లాంటివి విశిష్టమైనవి అని తలుస్తాను.

నిజానికి ప్రాచీనపట్టణాలు అనే అంశం చాలా లోతైనది. ఎంత చదివినా తరగని మెటీరియల్ అందుబాటులో ఉంది. వాటిని శక్తిమేరకు క్రోడీకరిస్తూ, సులభంగా అందించాలని నేను చేసిన ప్రయత్నం ఇది. నేను విస్మరించిన లేదా నా దృష్టికి రాని అనేక అంశాలు మిగిలే ఉంటాయి అన్న స్పృహ నాకు ఎప్పుడూ ఉంటుంది.

తూర్పుగోదావరి జిల్లా చరిత్ర-సంస్కృతి సామాజిక విషయాల అధ్యయన సంస్థ కార్యదర్శి డా.పి.చిరంజీవినీ కుమారి అమ్మ ఇచ్చిన ప్రోత్సాహానికి హృదయపూర్వక కృతజ్ఞతలు.

ఈ పుస్తకం అనేక సలహాలు, సూచనలు ఇచ్చి, ప్రేమపూర్వక ఆశీర్వాద వాక్యాలను వ్రాసి ప్రోత్సహించిన ప్రముఖ చరిత్రకారులు, విశ్రాంత ఆచార్యులు, ఆంగ్లాంధ్రభాషలలో ఎన్నో ప్రామాణిక చరిత్ర గ్రంధరచయిత, సమగ్ర ఆంధ్రప్రదేశ్ చరిత్ర సంస్కృతి ఎనిమిది సంపుటాలకు వర్కింగ్ ఎడిటర్ శ్రీకూచిభొట్ల కామేశ్వరరావు గారికి నా నమస్సులు

ఈ పుస్తకానికి చక్కని ఆశీవాక్యాలు వ్రాసిన ప్రముఖ చరిత్రకారుడు, గ్రంధకర్త డా. జాస్తి దుర్గాప్రసాద్ గారికి సదా వినమ్రుడను

ఈ పుస్తకం రూపుదిద్దుకొంటున్న సమయంలో అనేక సందర్భాలలో సారవంతమైన చర్చచేసి పరిపరి విధాలుగా సాగే నా ఆలోచనలకు దిశను చూపించిన ఆత్మీయ మిత్రుడు శ్రీ రామకృష్ణ శ్రీవత్సకు,

నాపై అవ్యాజమైన ప్రేమకురిపించే శ్రీ శిఖామణి, శ్రీ గనార, డా.వాడ్రేవు వీరలక్ష్మీదేవి, శ్రీ దాట్ల దేవదానం రాజు, శ్రీ మధునాపంతుల సత్య నారాయణ మూర్తి, చెల్లిరాం ఇంకా కవి మిత్రులు శ్రీ ప్రభు అద్దేపల్లి, శ్రీ అవధానుల మణిబాబు, శ్రీ అనిల్ డానీ, డా.పి.హరిరామ ప్రసాద్, సంజీవ కుమార్, డా.ఎన్. సుజాతలకు

ఇంకా ... ఈ పుస్తకానికి కవర్ డిజైన్ అందించిన శ్రీ గిరిధర్ గారికి, ముందు వెనుక అందంగా గెటప్ చేసిపెట్టిన నా బాల్యమిత్రుడు శ్రీ ముమ్మిడి చిన్నారికి

అందరకూ ధన్యవాదములతో

బొల్లోజు బాబా
అక్టోబరు, 2021

ఒకనాటి ఆంధ్ర రాజధాని పిఠాపురం

పిఠాపురం పట్టణ ప్రాచీన చరిత్రను కనీసం రెండువేల సంవత్సరాల నుండి గుర్తించవచ్చు. పిఠాపురానికి పిష్టపుర, పీఠికాపుర, పురూహూతికా పుర అనే వివిధ పేర్లు కాలానుగుణంగా కనిపిస్తాయి. ఈ ప్రాంతంలో ఒకసమయంలో హిందూ, బౌద్ధం, జైనమతాలు సమాదరణ పొందాయని అనేక ఆధారాలు కలవు. కుక్కుటేశ్వర, కుంతీమాధవ, పురూహూతికా దేవి ఆలయాలు అనాదిగా ఇచ్చటి ప్రసిద్ధ హిందూ క్షేత్రాలు. పిఠాపురానికి సమీపంలో కల కొడవలి, గొల్లప్రోలు లాంటి ప్రాంతాలలో బౌద్ధ ఆరామాలు, స్తూపాలు కలవు. జల్లూరు, చేబ్రోలుల వద్ద జైన విగ్రహాలు బయటపడ్డాయి. పిఠాపురంలోనే సన్యాసిరాళ్ళ పేరుతో జైన విగ్రహాలు నేటికీ పూజలందుకొంటూన్నాయి. దత్తాత్రేయుని అవతారంగా శ్రీపాద శ్రీవల్లభుడు క్రీశ. 1320 లో పిఠాపురంలో జన్మించి అనేక మహిమలు చూపినట్లు శ్రీపాద శ్రీవల్లభ చరిత్రం ద్వారా తెలుస్తుంది. పంతొమ్మిదో శతాబ్దాంతంలో జన్మించిన కవి, సూఫీ వేదాంతి ఉమర్ అలీషా వంశీకులు పర్షియానుంచి వలసవచ్చి ఢిల్లీ, హైదరాబాదులలో జీవించి పిఠాపురంలో స్థిరపడ్డారు. వీరి పూర్వికులు జ్ఞానపీఠము పేరుతో ఢిల్లీలో క్రీశ.1472లో ఒక ధార్మిక పీఠాన్ని స్థాపించారు. దీనిద్వారా ప్రజలకు మతాతీతంగా ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అందించారు. ఇది క్రీశ 1665 నుండి 1872 వరకూ తునికేంద్రంగా పనిచేసి, 1872 నుండి పిఠాపురంలో "శ్రీ విజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం" పేరుతో నేటికి నడుస్తున్నది.

భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే జైన, బౌద్ధ, హిందూ, ముస్లిం, గురుపూజ సంప్రదాయాలకు పిఠాపురం ఆలవాలంగా ఉంటూ వస్తున్నది. పిఠాపురం చరిత్రను మూడు దశలుగా గుర్తించవచ్చు

మొదటిదశ

భారతదేశపు తూర్పుతీరం దాదాపు సగం వరకూ ఆంధ్రప్రదేశ్‌లోనే విస్తరించి ఉంది. ప్రాచీనకాలం నుంచీ తూర్పుతీరం ద్వారా జరిగిన విదేశీవ్యాపారాలకు ఆంధ్రప్రదేశ్

కేంద్రబిందువుగా ఉంది. క్రీపూ నాలుగోశతాబ్దం నుంచీ ఆంధ్రులు విదేశీవ్యాపారాలు జరిపినట్లు నేడు అనేక పురావస్తు, ప్రాచీననాణాలు, శాసనాలు సాక్ష్యాలుగా నిలుస్తున్నాయి. ఈ కోణంలోంచి తరచిచూస్తే ఆంధ్రతీరంపై విస్తరించి ఉన్న దంతపుర, కళింగపట్నం, పిథుండ, కోరింగ, మోటుపల్లి, మచిలీపట్నం, కొత్తపట్నం, భట్టిప్రోలు లాంటి రేవుపట్టణాలు పోషించిన పాత్రను, ఆంధ్ర ప్రాంత చరిత్రను విడదీయలేం.

గోదావరికి తూర్పువైపు ఉన్న ప్రాంతం (తూర్పుగోదావరి జిల్లా) ఒకప్పుడు కళింగరాజ్యం[1]లో ఉండేది. ఇది చాలాకాలంపాటు వేంగి, రాయలసీమ ప్రాంతాలతో కలవలేదు. ఆ విధంగా పిఠాపురం కళింగరాజ్యంలో ఒక భాగం. వివిధ శాసనములలో కళింగరాజ్య పట్టణములలో పిఠాపురం ప్రముఖంగా పేర్కొనబడింది. క్రీపూ. 4 వ శతాబ్దంలో ఉత్తరాదికి చెందిన మహాపద్మనందరాజు కళింగను జయించగా, అతని రాజ్యం మగధనుండి గోదావరి తీరంవరకూ విస్తరించిందని చెప్పబడింది. అంటే క్రీపూ 4 శతాబ్దానికంటే ముందునుంచే తూర్పుగోదావరిజిల్లా కళింగ సామ్రాజ్యంలో ఉండేదని అనుకోవచ్చు.[2] పిఠాపురం కళింగరాజ్యానికి కొన్ని సమయాలలో రాజధానిగా కూడా ఉండింది. కళింగ రాజ్యానికి ఒకవైపు తూర్పుకనుమలు, మరొకవైపు సముద్రం ఉండటం వల్ల చరిత్రలో దాదాపు ఎవరూ చేరలేని ప్రాంతంగా ఉంటూ చాలా కాలం అది ఒక ప్రత్యేకమైన అస్తిత్వాన్ని కలిగి ఉండేది. బుద్ధిజం ప్రభావంతో నగర వ్యాపార వర్గాలు (Guilds) అభివృద్ధి చెంది పెద్దఎత్తున సాగించిన విదేశీవ్యాపారాల కారణంగా కళింగరాజ్యం అంతర్గతంగా గొప్ప సంపన్నరాజ్యంగా అవతరించింది. ఈ అభివృద్ధిని గమనించిన అశోకుడు క్రీపూ. 261 లో దక్షిణాదిపై దండెత్తినపుడు కళింగరాజ్యాన్ని అతికష్టం మీద జయించి మౌర్య సామ్రాజ్యంలో విలీనం చేసాడు. మౌర్యసామ్రాజ్యం పతనమైనప్పుడు కళింగ రాజైన ఖారవేలుడు స్వతంత్రాన్ని ప్రకటించుకొని రాజ్యాన్ని విస్తరింపచేసాడు. ఆ సందర్భంగా క్రీపూ. 183లో వేయించిన హాతిగుంఫ శాసనంలో ఖారవేలుడు తమ పూర్వీకులు నిర్మించిన పిథుండ పట్టణాన్ని జయించి తిరిగి స్వాధీనం చేసుకొని దానిని గాడిదలతో దున్నించినట్లు చెప్పుకొన్నాడు[3].

---

1. మార్కండేయపురాణంలోఉత్తర,మధ్య,దక్షిణదేశమందు మూడుచోట్ల కళింగ దేశమున్నట్లు వర్ణించబడింది. దీని హద్దులు తెలియరావు. గంగ మొదలు కటక్ వరకు ఉత్తరకళింగ లేదా ఉత్కళ, కటక్ మొదలు మహేంద్రపర్వతము (ఆంధ్ర ఒరిస్సా బోర్డర్) వరకు మధ్య కళింగము, మహేంద్రపర్వతము మొదలు పిఠాపురము వరకు మూడవ కళింగము కావొచ్చు.
2. History of Orissa, by Sahu, pn 76-77
3. 11వ లైను EI XX p88, Early History of the Andhra country by K Gopalachary pn9

పిథుండా[4] నగరం ఎక్కడ ఉంది

రెండో శతాబ్దపు టోలెమీ తన ప్రపంచపటంలో కృష్ణా గోదావరి మధ్య విస్తరించిన రాజ్యానికి రాజధాని పిటిండ్రా/పితోర అనే రేవుపట్టణమని (Pityndra/Pitoura) ఇది గోదావరి, మహానదులకు మధ్యలో ఉందని చెప్పాడు. ఖారవేలుని శాసనంలోని పిథుండ పట్టణము, టొలెమి వర్ణించిన పిటిండ్రా ఒకటే అని ప్రముఖ ఇండాలజిస్ట్ Sylvain Levi నిర్ధారించాడు.

Cunningham తన Ancient Geography of India అనే పుస్తకంలో పిథుండని రాజమహేంద్రవరంగా గుర్తించాడు. McCrindle గుంటూరుజిల్లాలోని ధరణికోట అవ్వొచ్చని ప్రతిపాదించాడు.[5] Benudhar Patra అనే చరిత్రకారుడు పిథుండ శ్రీకాకుళం వద్ద ఉండే ఏదైనా రేవుపట్టణం కావొచ్చునని అభిప్రాయపడ్డాడు.[6] ఈ మూడుప్రాంతాలు పిథుండా కాకపోవచ్చు అనటానికి కొన్ని కారణాలు చెప్పుకోవచ్చు.

1. టొలెమీ pityndra ఒక రేవుపట్టణమని చెప్పాడు. రాజమహేంద్రవరం రేవు పట్టణం కాదు కనుక Cunningham అభిప్రాయాన్ని తోసిపుచ్చవచ్చు. అంతేకాక రాజమహేంద్రవరానికి రెండువేలసంవత్సరాల ప్రాచీనతకూడా సందేహమే.

2. McCrindle చెప్పినట్లు పిథుండ పట్టణం కృష్ణాజిల్లాలోని ధరణికోట అవ్వటానికి అవకాశాలు తక్కువ ఎందుకంటే ఖారవేలుడు గోదావరిని దాటి కృష్ణా నదీతీరం ప్రవేశించాలంటే అప్పటికి ఆ ప్రాంతాన్ని ఏలుతున్న శాతవాహనులను దాటుకొని వెళ్ళాలి. అదే జరిగి ఉన్నట్లయితే అదొక చారిత్రాత్మక విశేషం అవుతుంది. శాతవాహనుల శాసనాలలో కానీ, ఖారవేలుని శాసనంలో కానీ అలాంటి ప్రస్తావనలు కనిపించవు. టోలెమి pityndra కృష్ణానదికి ఉత్తరంవైపు, గోదావరి– మహానదుల మధ్య ఉండే రాజధాని అని స్పష్టంగా

---

4. పిథుండా ప్రస్తావనలు చరిత్రలో నాలుగు చోట్లకనిపిస్తాయి. A ఖారవేలుని శాసనం B. కళింగ రాజ్యంలో పిటిండ్రా అనే రేవుపట్టణం ఉందని టొలెమి చేసిన వర్ణన. C. ఉత్తరాధ్యాయన సూత్ర అనే జైన గ్రంథంలో పిహుండ అనే పట్టణం మహావీరుని కాలంలో గొప్పవ్యాపార కేంద్రమని ఇక్కడకు సముద్రమార్గంలో విదేశీయాత్రికులు వచ్చేవారని ఇదొక ప్రముఖరేవుపట్టణమని చెప్పబడింది. D. క్రీశ. మూడవశతాబ్దంలో ఇక్ష్వాకరాజు ఎహుబలశాంతమూలుడు వేయించిన ఒక శాసనం.
5. Ancient India of Ptolemy by Mccrindles
6. Ports and Port towns of early Odisha – Proceedings of the Indian History Congress vol 74

చెప్పాడు. కనుక కృష్ణకు దక్షిణం వైపున ఉన్న ధరణికోట కావటానికి అవకాశం తక్కువ. అంతేకాక ఇక్ష్వాకరాజు ఎహువలశాంతమూలుడు (క్రీశ263-307) ఇచ్చిన ఒక దాన శాసనం పశ్చిమగోదావరి పాతగండిగూడెం వద్ద దొరికింది. ఇది భారతదేశంలోనే అత్యంతపురాతనమైన తామ్రశాసనంగా చెబుతారు. దీనిలో శాంత మూలుడు "పిథుండ"లో ఉంటున్న అపరశైలీయ బౌద్ధ భిక్షుకులకు వారి ఆరామం మరమ్మత్తులకొరకు కొంతభూమిని దానంగా ఇచ్చాడు. ఈశాసనం అమరావతి కేంద్రంగా ఇవ్వబడింది. ఈ శాసనంలో పిథుండా పట్టణం అమరావతికి ఉత్తరం దిక్కున ఉన్నట్లు చెప్పబడింది.[7]

3. ఖారవేలుడు పిథుండాని జయించినట్లు తన శాసనంలో చెప్పుకొన్నాడు. ఆ కాలానికి శ్రీకాకుళం కళింగ రాజ్యంలోనే ఉండేది కనుక తనరాజ్యంలోనే ఉండే పిథుండాని జయించటమనే ప్రసక్తి రాదు. ఆ విధంగా పిథుండా శ్రీకాకుళం కూడా కాకపోవచ్చు.

పై అంశాల ఆధారంగా పిథుండా పట్టణము పిఠాపురం కావటానికి ఈ క్రింది అవకాశాలు కనిపిస్తాయి.

1. నేడు సముద్రానికి పిఠాపురానికి మధ్య దూరం 7 కిలోమీటర్లు కొన్ని శతాబ్దాలుగా సముద్రం వెనుకకు జరిగింది అని ఓషనోగ్రఫీ అధ్యయనాలు చెపుతున్నాయి. రెండువేల సంవత్సరాల క్రితం పిఠాపురం నేరుగా రేవుపట్టణం కాకపోయినా సముద్రతీరానికి చేరువలో ఉండిన ప్రాచీనపట్టణం అయి ఉండవచ్చు.

2. క్రీశ 360 లో సముద్రగుప్తుని దాడిని దృష్టిలో ఉంచుకొంటే టొలెమీ కాలానికి (క్రీశ. రెండో శతాబ్దం) కళింగ రాజ్యానికి పిఠాపురం రాజధానిగా, విదేశీవ్యాపారం చేసే రేవుపట్టణంగా ఒక వెలుగు వెలుగుతూ ఉండేదని భావించాలి. ఎందుకంటే అప్పటికి పిఠాపురమొక చిన్న ఊరు అయితే పిష్టపురానికి సముద్రగుప్తుని ప్రసస్థి శాసనంలో చోటు దక్కేది కాదు.

3. టొలెమి చెప్పినట్లు పిఠాపురం కృష్ణానదికి ఉత్తరంగా, గోదావరి-మహానదుల నడుమ ఉన్న పట్టణం

4. పూరి జగన్నాథుని ఆలయంలో దొరికిన "పురుషోత్తమ చంద్రిక" అనే తాళపత్ర గ్రంథంలో పూర్వ ఒరిస్సాను పాలించిన రాజులవంశావళి (కళింగ) పేర్కొనబడింది.

---

7. Early Buddhist Architecture in Context by Akira Shimada p.n 202

ఇందులో గౌతమదేవు క్రీస్తుపూర్వం తొమ్మిదోశతాబ్దంలో గోదావరి తీరంవరకు తన రాజ్యాన్ని విస్తరించాడని ఉన్నది[8]. ఇరవైమూడవ తీర్థంకరుడైన పార్శ్వనాథుడు క్రీపూ. ఏడవ శతాబ్దంలో కళింగరాజ్యాన్ని సందర్శించి జైనాన్ని బోధించాడు. క్రీపూ ఆరవ శతాబ్దంలో మహావీరజైనుడు కళింగను సందర్శించి పిథుండ పట్టణంలో మొదటి తీర్థంకరుడైన రిషభనాథుని విగ్రహాన్ని ప్రతిష్టించాడు.[9] వీటిని సమాంతర చారిత్రిక ఆధారాలుగా స్వీకరిస్తే క్రీపూ తొమ్మిదో శతాబ్దం నుంచీ పిఠాపురం పట్టణాన్ని కళింగరాజులు పాలించారనిఅనుకోవచ్చు. ఆ విధంగా హాతిగుంఫ శాసనంలో అన్నట్లు పిఠాపురం/ పిథుండా ఖారవేలుని పూర్వీకులు నిర్మించిన పట్టణం కావటానికి అవకాశాలు ఎక్కువ.

ఏది ఏమైనప్పటికీ పిఠాపురం పిథుండా అయిఉండటానికి అవకాశాలు కనిపిస్తున్నాయి అనే పై ప్రతిపాదనకు స్పష్టత రావాలంటే పిఠాపురం ప్రాచీనతను నిర్ధారించే శాస్త్రీయమైన ఆర్కియలాజికల్ శోధనలు జరపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

శాతవాహనులు

ఖారవేలుని అనంతరం పిఠాపురం శాతవాహనుల పాలనలోకి వెళ్లినట్లు కొడవలి శాసనం ద్వారా తెలుస్తుంది. పిష్టపురానికి 20 కిలోమీటర్ల దూరంలో కల కొడవలి గ్రామం వద్ద ధనం దిబ్బ పేరుతో ఉన్న బౌద్ధ అవశేషాలుకలవు. ఈ బౌద్ధ ఆరామం వద్ద కల ఒక రాతిగోడపై ఆరు పంక్తుల బ్రహ్మిలిపి శాసనం కలదు. దీనిని శాతవాహన వంశంలో చివరిరాజులలో ఒకరైన చంద్రసాతి సాతవాహనుడు క్రీశ.210 లో వేయించాడు. దీనిని కొడవలి శాసనంగా పేర్కొంటారు. దీనిలో "వాసిష్టిపుత్ర సామిసిరి చందసాతి పాలనలో ఖద్దవలిలోని సాస అనేమంత్రి బౌద్ధులకొరకు ఒక సత్రం కట్టించాడు" అని ఉన్నది[10].

జిల్లాకు సంబంధించి కొడవలి శాసనము అతి ప్రాచీనమైనది. సముద్రగుప్తుడు పిఠాపురాన్ని జయించటానికి నూటయాభై ఏండ్లక్రిందటి దానశాసనము ఇది. సాధారణంగా

8. Lists of Inscriptions and sketch of dynasties of southern India, Roert Sewell vol 8 pn 204
9. క్రీస్తుపూర్వం నాలుగో శతాబ్దంలో మహాపద్మనందుడు కళింగను జయించి ఈ రిషభ విగ్రహాన్ని మగధరాజ్యానికి తీసుకొనిపోయాడు. ఖారవేలుడు మగధను జయించి రిషభనాథుని విగ్రహాన్ని తిరిగి కళింగకు తెచ్చి ప్రతిష్టించినట్లు జైన సాహిత్యం చెపుతుంది.
10. EI 18 p 318

రాజు, వ్యాపారస్తుల ఆదరణపొందటం కొరకు బౌద్ధులు పట్టణాలకు సమీపంలో తమ ఆరామాలను ఏర్పరచుకొంటారు. పిఠాపురం ప్రసిద్ధిచెందిన పట్టణం కనుక సమీపంలో అనేక బౌద్ధారామాల శిథిలాలు బయటపడుతున్నాయి.

పిష్టపురం అనే పేరు మొదటిసారిగా చరిత్రలో సముద్రగుప్తుని ప్రసస్తి శాసనంలో కనిపిస్తుంది. సముద్రగుప్తుడు క్రీశ.330–375 మధ్య గుప్తసామ్రాజ్యాన్ని ఏలిన చక్రవర్తి. ఇతడు దక్షిణభారతదేశముపై దండెత్తినపుడు ఉత్కళ, కళింగ, ఆంధ్ర, ద్రవిడ రాజులను జయించానని క్రీశ.360 లో అలహాబాదులో ఒక శాసనము వేయించుకొన్నాడు. దీనిలో సముద్రగుప్తుడు పిష్టపురంలోని మహేంద్రుడనే రాజును జయించినట్లు ఉన్నది. శాతవాహనుల తరువాత ఈ మహేంద్రుడనే రాజు పిఠాపురాన్ని కేంద్రంగా చేసుకొని స్వతంత్రరాజ్యాన్ని నిర్మించుకొని ఉంటాడు. పిఠాపురం అప్పటికే ఒకగొప్ప స్వతంత్ర రాజ్యంగా మనుగడసాగిస్తూందని, దీని వైభోగం చక్రవర్తి దృష్టిని ఆకర్షించి ఉంటుందని ఊహించాలి.. సముద్రగుప్తుడు ఈ ప్రాంతాలను జయించినట్లు చెప్పినా తిరిగి వారివారి రాజ్యాలను పాలించుకొమ్మని వారికే ఇచ్చివేయటం ఆసక్తిదాయకం. ఇతని దిగ్విజయయాత్ర ఒకరకంగా హిందూధర్మ ప్రచార యాత్ర అనే అభిప్రాయం కూడా కలదు.

మాథరులు

సముద్రగుప్తుని తరువాత కళింగలో శక్తివర్మ నాయకత్వంలో మాథర వంశస్థాపన జరిగింది. వీరివంశీకులు క్రీశ.375 నుండి 500 వరకు ఈ ప్రాంతాన్ని ఏలారు. శక్తివర్మ పిష్టపురం రాజధానిగా మహానది నుండి కృష్ణానది వరకూ కళింగ రాజ్యాన్ని విస్తరింపచేసి పాలించాడు. శక్తివర్మ పేరుముందు వాసిష్టిపుత్ర అని రాగోలు ఫలకంలో ఉండటాన్ని బట్టి వీరు శాతవాహనులవలె మాతృస్వామ్య సంప్రదాయాన్ని పాటించారని తలచవచ్చు. క్రమేపీ ఇతని వారసులు వేయించిన శాసనాలలో తల్లిపేరు కనిపించదు. అప్పటికి ఆ సంప్రదాయం కనుమరుగై ఉండొచ్చు.

శక్తివర్మ తన 14 వ Regnal year నందు క్రీశ 400 లో కుమారస్వామి అనే బ్రాహ్మణునికి శ్రీకాకుళం సమీపంలో ఉన్న రాకలువ (నేటి రాగోలు) అనే గ్రామాన్ని దానంగా ఇచ్చాడు. రాగోలు తామ్రశాసనం శక్తివర్మ పిఠాపురంలో ఉంటూ వేయించాడు.[11]

11. The quarterly Journal of Andhra Historical Research Society Vol 2 1927 p.no 161.
శాసనవాక్యాలు–"సిద్ధిరస్తు స్వస్తి విజయ పిష్టపురాన్ కళింగాధిపతిర్మాథర కులాలంకరిష్ణు ర్వాసిష్ఠీ పుత్రో మహారాజశ్రీ శక్తివర్మా కళింగ విషయే రాకలువ గ్రామే సర్వసమన్వాగతాస్తహ పతితో .....

రాగోలు శాసనం తరువాత చెప్పుకోదగ్గది శృంగవరపుకోట తామ్రశాసనం. దీని ద్వారా క్రీశ. 481లో పిఠాపురంలో ఉండి పాలిస్తున్న అనంతవర్మ అనే రాజు ఆచంటకు చెందిన ఒక వ్యక్తికి కిందెప్ప అనే గ్రామాన్ని పన్నురహితమాన్యంగా ఇచ్చినట్లు ఉన్నది.[12]

పశ్చమం నుండి విష్ణుకుండినుల దాడులు ఎక్కువవ్వటంతో ఈ అనంతవర్మ తన రాజధానిని పిఠాపురం నుండి సింహపురం (శ్రీకాకుళం)కు తరలించి ఉంటాడు ఎందుకంటే ఆ తదుపరి కళింగ శాసనాలు అన్నీ సింహపురంనుంచి వేయించినట్లు కనిపిస్తాయి.

విష్ణుకుండినులు

ఆ తరువాత పిఠాపురం విష్ణుకుండినులపాలనలో (ఐదు, ఆరు శతాబ్దాలలో) ఉన్నట్లు, తుండి, పొలమూరు తామ్రశాసనాలు తెలుపుతున్నాయి. విష్ణుకుండిన రాజైన రెండవ విక్రమేంద్రవర్మ (క్రీశ. 555–569) తుండి (తుని) గ్రామాన్ని ఒక బ్రాహ్మణునకు దానమిచ్చినట్లు తుండి తామ్రశాసనం తెలుపుతున్నది. అదే విధంగా విష్ణుకుండిన రాజైన నాల్గవ మాధవవర్మ గోదావరి జిల్లాలోని అసనపుర[13] గ్రామస్తుడయిన ఒక బ్రాహ్మణునికి పొలమూరు గ్రామాన్ని (రామచంద్రపురం) క్రీశ. 621లో దానమిచ్చినట్లు పొలమూరు శాసనం చెపుతున్నది. ఈ విష్ణుకుండినులకు సామంతునిగా దుర్జయవంశానికి చెందిన రణదుర్జయుడు పిఠాపురాన్ని కేంద్రంగా చేసుకొని పాలనసాగించాడు. దుర్జయ వంశీకుడైన పృధ్వీమహారాజు పిఠాపురంలో స్వతంత్రాన్ని ప్రకటించుకోగా నాల్గవ మాధవవర్మ అతనిని క్రీశ. 610 లో ఓడించి తిరిగి తనకు సామంతుడిగా అతడినే కొనసాగించాడు. (Figure 1)

క్రీశ 616 లో చాళుక్య చక్రవర్తి రెండవ పులకేశి దుర్జయులను జయించి పిఠాపురాన్ని స్వాధీనం చేసుకొని ఈ ప్రాంతంలో చాళుక్యరాజ్యాన్ని విస్తరింపచేసిన సందర్భంలో, నాలుగవ మాధవ వర్మ చాళుక్యులతో చేసిన యుద్ధాలలో క్రీశ. 621 లో మరణించాడు. ఇతని కుమారుడు మంచనభట్టారకుడు కూడా ఆ చాళుక్యులతో చేసిన యుద్ధాలలో క్రీశ 624లో మరణించటంతో పిఠాపురంలో విష్ణుకుండినుల పాలన అంతమై చాళుక్యుల పాలన మొదలైంది. (History of andhras upto 1565 AD by J. Durgaprasad)

---

12. శాసన వాక్యాలు–ఓమ్ స్వస్తివిజయ పిష్టపురాధిష్ఠాన్ మహీమండలవ్యాపి శారదేందుకర...
13. ఆరోశతాబ్దంలో విష్ణుకుండినులు ఘటికాస్థానముల పేరిట "Residential Colleges" ఏర్పరిచి హిందూధర్మ ప్రచారం చేసారు. వాటిలో 'అసనపురము' అనేచోట ఉన్న ఘటికాస్థానము మూలఘటికా స్థాయిని పొందింది (University Status). ఈ అసనపురము రామచంద్రపురం సమీపంలో ఉండి ఉండవచ్చునని చరిత్రకారుల అభిప్రాయం.

రెండవ దశ

శాతవాహనుల కాలంలో తెలుగువారి చరిత్రకు తీరప్రాంతం కేంద్రమయింది. ఓడరేవుల ద్వారా పెద్దఎత్తున విదేశీ వ్యాపారం జరిగేది. శాతవాహనుల పాలన ముగిసే సరికి వాణిజ్యం, పరిశ్రమలు క్షీణించటంతో ప్రస్తుత రాయలసీమ కొద్దిగా, తెలంగాణ పూర్తిగాను తమ వైభవాల్ని కోల్పోయాయి. ఇందుకు కారణం ఆర్థికవ్యవస్థకు వ్యవసాయం కీలకం కావటం. ఆ రెండుప్రాంతాలు వ్యవసాయానికి అంతంతమాత్రపు వసతులు కలిగి ఉండేవి. తీరప్రాంతం అనాదిగా వ్యవసాయభూమి. దీనిపై ఆధిపత్యానికి అనేక రాజవంశాలు నిరంతరం యుద్ధాలలో మునిగితేలేవి. వీరిలో ఎక్కువకాలం ఈ ప్రాంతంపై ఆధిపత్యం చలాయించింది తూర్పుచాళుక్యులు.

చాళుక్య రాజ్యస్థాపకుడు మొదటి పులకేశి. పులకేశి అంటే "Tiger haired" అని అర్థం చెపుతారు. క్రీశ 534-44 లో పులకేశి బాదామిని జయించి స్వతంత్ర చాళుక్యరాజ్యాన్ని స్థాపించాడు. ఇతని మనుమడు రెండవ పులకేశి. ఇతను క్రీశ.609లో సింహాసనాన్నధిరోహించాడు. ఈ రెండో పులకేశి భారతదేశ చరిత్రలో చంద్రగుప్త, సముద్రగుప్త, గౌతమీపుత్రలతో పోల్చదగిన గొప్ప చక్రవర్తి. ఇతడు ఉత్తరభారతదేశ సమకాలీన చక్రవర్తి శ్రీహర్షునితో తలపడి అతనిని జయించాడు. ఆ పరాజయంతో శ్రీహర్షుడు అశోకునివలే యుద్ధకాంక్షను విడనాడి బౌద్ధాన్ని స్వీకరించి సాత్వికజీవనాన్ని సాగించాడంటారు. శ్రీహర్షునిపై సాధించిన విజయంతో రెండవపులకేశి సమరోత్సాహియై దక్షిణాపథాన్ని జయించి ఏకచ్ఛత్రాధిపత్యం నెలకొల్పటానికి దిగ్విజయయాత్ర చేసాడు. ఈ క్రమంలో అనేక దండయాత్రలు చేసి, కర్ణాటక, మహారాష్ట్ర, ఆంధ్ర ప్రాంతాలను జయించాడు. ఈతని దిగ్విజయాలను కీర్తించే శాసనాలలో కర్ణాటకలో ముగిటికొండపై ఉన్న జైన ఆలయంలో దొరికిన ఐహోలు శాసనం (క్రీశ. 634) ప్రముఖమైనది. దీనిలో "దుర్భేధ్యమైన పిష్టపురం కోటను" రెండవ పులకేశి జయించినట్లు 27వ పంక్తిలో ఉల్లేఖించబడింది[14].

రెండవ పులకేశి ఎప్పుడు పిష్టపురాన్ని జయించాడు అనే దానిపై భిన్నాభిప్రాయాలున్నాయి. క్రీశ.617లో రెండవ పులకేశి తీరాంధ్రను జయించి[15] ఈ ప్రాంతాన్ని

14. పిష్టం పిష్టపురం యేనజాతం దుర్గ మదుర్గమమ్....

15. రెండవపులకేశి వేయించిన మారుటూరు దానశాసనంలో "పిష్టపురాదాన గ్రహణానంతరేనా ....(పిష్టపురాన్ని వశపరచుకొన్న అనంతరం) అనే వాక్యం ద్వారా రెండవ పులకేశి క్రీశ 617 నాటికే పిఠాపురాన్ని జయించాడని ఒక అభిప్రాయం కలదు.

పిఠాపురం పరిసరప్రాంతాలలో దొరికిన ప్రాచీననాణాలు - సేకరణ శ్రీ కందుల వెంకటేష్

పిష్టపురానికే చెందిన శ్రీరామ కశ్యప పృథ్వీమహారాజు పిష్టపుర రాగి నాణెములు క్రీశ. 570 to 624

విషమసిద్ధి జరుదుకరి కుబ్జవిష్ణువర్ధనుడి పిష్టపుర రాగినాణెములు క్రీశ. 624-642

Figure 1

క్రీశ. 1 వ శతాబ్దపు బౌద్ధారామ దానశాసనం



This inscription was found at A. Kothapalli, 30 kms from Pithapuram
It reads: Nigama Lovi levaa pavāraa divasa Vilataya
It records the causing of a cave by a person Vilataya, belonging to the guild of Lovi on a full-moon day
It is in Prakrit language and Brāhmī characters of the 1st century A.D
It is interesting to note that the place Lovi, exists even now near A. Kottapalli

Deciphered by Sri. K Muniratnam Reddy, director (epigraphy), Archaeological Survey of India

Figure 2

పాలించుకొమ్మని తన తమ్ముడైన కుబ్జవిష్ణువర్ధనుడిని ఇక్కడ నియమించాడు. అంతవరకూ ఈ ప్రాంతాన్ని ఏలుతున్న విష్ణుకుండినులు తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవటం కొరకై వీరితో క్రీశ. 624 వరకూ యుద్ధాలు చేస్తూ వచ్చారు. క్రీశ. 624 నుండి కుబ్జవిష్ణువర్ధనుడు శత్రునిర్మూలనం కావించి, స్వతంత్రం ప్రకటించుకొని తన పాలనను స్థిరపరచుకొని వేంగిచాళుక్య/తూర్పుచాళుక్య వంశాన్ని స్థాపించటంతో తీరప్రాంత చరిత్రలో అయిదు శతాబ్దాలపాటు కొనసాగిన సరికొత్త అధ్యాయం మొదలైంది. కుబ్జవిష్ణువర్ధనుడు క్రీశ. 624–642 వరకు వేంగిరాజ్యాన్ని పిఠాపురం రాజధానిగా చేసుకొని పాలించాడు. కుబ్జ విష్ణువర్ధనుడి సామ్రాజ్యం శ్రీకాకుళం నుండి నెల్లూరు జిల్లా వరకూ విస్తరించి ఉండేది. కుబ్జవిష్ణువర్ధనుడి తిమ్మాపురం, చీపురుపల్లి దానశాసనాలు పిఠాపురం కేంద్రంగా చేసుకొని ఇచ్చాడు. *"ఆ విధంగా నేటి నవ్యాంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పిఠాపురం ఒకనాటి రాజధాని"*

కుబ్జవిష్ణువర్ధనుడు తన అన్న రెండవ పులకేశికి యుద్ధాలలో కుడిభుజంగా ఉంటూ ఎలాంటి విషమపరిస్థితులలోనైనా గొప్ప వీరత్వాన్ని ప్రదర్శించి విజయాల్ని సాధించటంచే ఇతనికి విషమసిద్ధి అనే పేరుకూడా కలదు. ఇతనివద్ద బ్రాహ్మణుడైన కాలకంపడు, చతుర్ధాన్వయుడైన బుద్ధివర్మ,[16] మత్స్యవంశజుడైన అటవీ దుర్జయుడు అనే సమర్ధులైన సేనానులు ఉండేవారు.[17]

కుబ్జవిష్ణువర్ధనుడు విష్ణు ఆరాధకుడు. తన శాసనాలలో పరమభాగవతుడిగా (విష్ణుభక్తుడు) వర్ణించుకొన్నాడు. కుబ్జవిష్ణువర్ధనుడు పిఠాపురంలోని కుంతీమాధవస్వామి ఆలయాన్ని నిర్మించాడు.[18] వైష్ణవుడైనప్పటికీ ఇతను అన్ని మతాలను సమాదరించాడు. ఇతని భార్య అయ్యణ మహాదేవి జైన మతాన్ని అవలంబించింది. బెజవాడలో కవరూరిగణ అనే శాఖకు చెందిన జైనులకు నడుంబివసతి నిర్మించింది. ఇతని కాలంలోనే పిఠాపురం ప్రముఖ బౌద్ధక్షేత్రంగా కూడా ఉండింది.

---

16. ఈ బుద్ధవర్మ వంశీకులు చాళుక్య సామంతులుగా గుంటూరు జిల్లా పరిసరప్రాంతాలను పన్నెండో శతాబ్దం వరకూ పరిపాలించారు.
17. వేంగి తూర్పుచాళుక్యులు – నేలటూరి వెంకటరమణయ్య.
18. Ancient and Medieval history of Andhra Pradesh by P. Raghunadha Rao p.n 36

ఇతని అన్న రెండవ పులకేశిరాజ్యంపై పల్లవులు దాడిచేసి, వాతాపి నగరాన్ని నాశనం చేసారు. ఆ సమయంలో కుబ్జవిష్ణువర్ధనుడు సహాయంగా వెళ్ళి అన్నతో పాటు మరణించి ఉంటాడని నేలటూరివెంకట రమణయ్య అభిప్రాయపడ్డారు. కుబ్జవిష్ణువర్ధనుడి అనంతరం అతని కుమారుడు మొదటి జయసింహవల్లభుడు క్రీశ.642 లో వేంగిరాజ్యాధినేత అయ్యాడు. ఇతడు పరిపాలనా సౌలభ్యం కొరకు రాజధానిని పిఠాపురం నుండి వేంగికి మార్చాడు. ఆ విధంగా అప్పటికి దాదాపు ఓ వెయ్యి సంవత్సరాలపాటు వివిధ రాజ వంశాలకు రాజధానిగా వెలిగిన పిఠాపురపట్టణ వైభోగంపై మబ్బులు కమ్మాయి.

హుయాన్‌త్సాంగ్ పిఠాపురాన్ని సందర్శించాడా?

Yuan Chwang క్రీశ.631 లో భారతదేశం ప్రవేశించి క్రీశ.645లో తిరిగి చైనా వెళ్లిపోయాడు. ఇతడు ఆంధ్రదేశంను క్రీశ.635-36ల మధ్య సందర్శించాడు[19].

హుయాన్‌త్సాంగ్ కోశల నుండి బయలుదేరి An-to-lo చేరుకొన్నాను దీని రాజధాని Ping-chi/Ping-ki-lo అని పేర్కొన్నాడు. An-to-lo ని చరిత్రకారులు ఆంధ్రగా గుర్తించారు. ఇది ప్లీని చెప్పిన Andara పదంతో సరిపోతుంది. ఇక Ping-ki-lo పదాన్ని Julein అనే చరిత్రకారుడు కొంత సంశయపూర్వకంగా Vingila లేదా వేంగి కావొచ్చునని (పెదవేగి, పశ్చిమగోదావరి) అన్నాడు. Fergusson ఈ రాజధాని ఎక్కడో తెలియటం లేదు కానీ ఉచ్చారణ రీత్యా వేంగి తో సరిపోలుతుంది అన్నాడు.[20]

హుయాన్‌త్సాంగ్ Ping-ki-lo నుంచి దక్షిణంవైపున 1000 లీలు ప్రయాణించి Te-na-ka-che-ka చేరుకొన్నట్లు చెప్పాడు.[21] Te-na-ka-che-ka అనే ప్రాంతాన్ని చాలా సులభంగానే Dhanakataka (ధరణికోట, గుంటూరు జిల్లా) గా అందరూ గుర్తించారు. హుయాన్‌త్సాంగ్ 1000 లీలు ప్రయాణించానని అన్నాడు.

19. ఆంధ్రదేశము విదేశీయాత్రికులు - భావరాజు కృష్ణారావు పేజినంబరు. 62
20. On Yuan Chwang's travels in India, 629-645 A.D, Thomas Watters Vol II-p.no 210. The Capital, Ping-ki (or Chi)-lo, is restored doubtfully by Julien as Vingila. Fergusson says that the name here given for it "sounds very like Vengi……"
21. Ibid p.no 214

హుయాన్‌త్సాంగ్ కొలతలను అతను భారతదేశంలో సందర్శించిన ప్రాచీననగరాల మధ్య దూరంతో పోల్చిచూసి Cunningham 40 లీలు 6.75 మైళ్ళుగా తేల్చాడు. అంటే 6 లీలు ఒక మైలు దూరం.[22]

6 లీలు ఒక మైలు అయితే వెయ్య లీలు 167 మైళ్ళు అవుతుంది. Ping-ki-lo ని వేంగి అనుకొంటే వేంగి నుంచి ధరణికోటకు దూరం 167 మైళ్ళు లేదు 70 మైళ్ళే. కనుక హుయాన్‌త్సాంగ్ చెప్పిన ఆంధ్రరాజధాని Ping-ki-lo వేంగి అయ్యే అవకాశం లేదు. Ping-ki-lo అనేది ధరణికోటనుండి 167 మైళ్ల దూరంలో ఉండే మరొక పట్టణం అవ్వాలి. ఇది పిఠాపురం కావొచ్చు. ఎందుకంటే

1. ధరణికోటనుంచి పిఠాపురానికి దూరం 160 మైళ్ళు. ఇది హుయాన్‌త్సాంగ్ చెప్పిన వెయ్యి లీల దూరానికి సరిపోతుంది.

2. హుయాన్‌త్సాంగ్ ఈ ప్రాంతాన్ని క్రీశ.635–36 ల మధ్య సందర్శించాడు. అది కుబ్జ విష్ణువర్ధనుడి కాలము. అప్పటికి శ్రీకాకుళం నుండి నెల్లూరువరకూ విస్తరించిన ఆంధ్రప్రాంతానికి వేంగి రాజధానిగా లేదు. పిఠాపురం రాజధాని.[23] ఈ కోణంలోంచి ఆలోచించి చూస్తే హుయాన్‌త్సాంగ్ కోసలనుండి ధరణికోటకు పిఠాపురం మీదుగా వెళ్ళి ఉంటాడని నిష్కర్షచేయటానికి అవకాశాలు ఎక్కువగా కనిపిస్తాయి.

Ping-ki-lo (పిఠాపురం) గురించి హుయాన్‌త్సాంగ్ చేసిన వర్ణనలు ఇవి.

ఈ ఆంధ్రదేశము వైశాల్యం 3000 లీలు. దీనికి రాజధాని Ping-ki-lo (పిఠాపురము). దీని విస్తీర్ణము 20 లీలు. ఇక్కడ సారవంతమైన నేలలు కలవు. తేమ, వేడి అధికము. ఇక్కడి ప్రజలు సాహసము కలవారు. వీరిభాష మధ్యభారతదేశ భాషకన్నా భిన్నముగా ఉన్నది. లిపి మాత్రము మధ్యభారతదేశ లిపి వలె ఉన్నది (బ్రహ్మి లిపి కావొచ్చు)

ఈ రాజధాని సమీపంలో ముప్పైకి పైగా బౌద్ధారామములు, 3000 మంది భిక్షువులు ఉన్నారు. ఒక సంఘారామము కలదు. ఇది పెద్ద పెద్ద గదులతో, అంతస్తులతో అందమైన

---

22. The Linear measures of Fahian and yuan chwang by Major W. Vost - The Journal of the Royal Asiatic Society of Great Britain and Ireland Jan., 1903), pp. 65-107)

23. తిమ్మాపురం తామ్రశాసనంలో – EI Vol IX . pn 317 – Vishnuvardhana I (కుబ్జవిష్ణు వర్ధనుడు క్రీశ.624–641) resided at Pishtapura, the modern Pithapuram in the godavari district అని ఉన్నది.

అలంకారములతో శోభిల్లుతున్నది. ఇందులో ఉన్న బుద్ధుని విగ్రహము సుందరముగా, జీవకళ ఉట్టిపడుతూ ఉన్నది. ఈ సంఘారామము ప్రాంగణమున కొన్ని వందల అడుగుల ఎత్తైన స్తూపమొకటి కలదు. ఈ సంఘారామమును, స్తూపమును అచలుడను శిల్పి నిర్మించాడు.

ఇక్కడి నుండి నైరుతి దిక్కుగా ఇరవై లీల దూరములో ఒంటరిగా ఒక కొండపై శిలాస్తూపము, అశోకవనము కలదు. ఇచ్చట తథాగతుడు కొంతకాలము నివాసముండి తన ప్రవచనాలను అందించి, మహిమలు చూపి, అనేకమందిని తన అనుయాయిలను చేసుకొన్నాడట.[24] ఇక్కడినుండి ఇరవై లీల దూరంలో ఒక కొండపై జినభోధిసత్వుడు (జైనమతబోధకుడు) "హేతు విద్యాశాస్త్రమును" రచించెను. బుద్ధుని అనంతరమీ జినభోధిసత్వుడు బౌద్ధమతము స్వీకరించి శ్రమణకుడై బౌద్ధధర్మాన్ని ప్రచారం చేసాడు.[25]

హుయాన్‌త్సాంగ్ Ping-ki-lo (పిఠాపురము) సందర్శించిన సమయములో చూసిన బౌద్ధఆరామాలు, స్తూపాలలో కొన్ని మనకు ఈ ప్రాంతపరిసరాలలో నేటికీ శిథిలాలరూపంలో కనిపిస్తాయి (Figure 4). పిఠాపురం సమీపప్రాంతాలైన గొల్లప్రోలు, కొడవలి, మల్లవరం, అన్నవరం, కొత్తపల్లి (Figure 2),కుమ్మరిలోవ, గోపాలపట్నం, శృంగవృక్షం, రంప ఎర్రం పాలెం, కోరుకొండ, ఎర్రవరం, పెద్దాపురంలలో అసంఖ్యాకమైన బౌద్ధ అవశేషాలు కలవు. ఏ ప్రాంతంలో తవ్వినా లెక్కకు మించిన బౌద్ధనిర్మాణాలు బయటపడుతున్నాయి. పిఠాపురానికి ఏడుకిలోమీటర్ల దూరంలో కల గొల్లప్రోలు, ఎవీ నగరం గ్రామంలో ఇటీవల భారీ బౌద్ధస్తూపం గుర్తించారు. ఇక్కడి శిథిలాలలో గాంధారశిల్పశైలిలో చెక్కిన బుద్ధుడి తలభాగం దొరికింది. స్తూపం వద్దకు వెళ్ళటానికి రాతితో చెక్కిన మెట్లు కలవు. ఇంకా లోతైన పరిశోధనలు జరిగితే మరిన్ని ప్రాచీన అవశేషాలు ఈ ప్రాంతంలో బయటపడతాయి. పిఠాపురం సమీపంలోని చిత్రాడ వద్ద వజ్రయానానికి చెందిన బౌద్ధ అవశేషాలు లభించాయి.[26] చేబ్రోలు వద్ద కూడా క్రీస్తుపూర్వంనాటి బౌద్ధ/జైన విగ్రహాలు బయటపడ్డాయి.

---

24. ఇది కొడవలి స్తూపం కావొచ్చు. - Where the Buddha preached, displayed miracles, and received into his religion a countless multitude - p.209, On Yuan Chwang's Travels in India, Thomas Watters Vol II
25. Where *Chenna Pusa* composed Treatise on logic -- ibid p.no 209
26. The Hindu, 15, December, 2015

Ping-ki-lo (పిఠాపురము) లో 30కి పైగా బౌద్ధారామములు ఉన్నాయి అన్న హుయాన్‌త్సాంగ్ ధనకటకంలో చాలా బౌద్ధారామాలు ఉన్నాయి కానీ చాలామట్టుకు ఖాళీగా ఉన్నాయి, మహాసంఘికకి చెందిన బిక్షుకులు మాత్రం ఓ వెయ్యిమంది వరకూ ఉన్నారు, 100 కు పైగా దేవ ఆలయాలు (హిందూ) ఉన్నాయి అని చెప్పటం ఆసక్తికరం. అంటే ఆంధ్రలొ బౌద్ధం ధనకటంలో అప్పటికి క్రమేపీ కనుమరుగవుతూ ఉండగా పిఠాపురం వద్ద మెరుగైన స్థితిలో ఉండేదని అనుకోవచ్చు.

హుయాన్‌త్సాంగ్ చెప్పిన వర్ణనలను బట్టి Ping-ki-lo గొప్ప బౌద్ధక్షేత్రంగా విలసిల్లిందని అర్ధమౌతుంది. పిఠాపురం, సమీప ప్రాంతాలలో నేడు అడుగడుగునా అసంఖ్యాకంగా బౌద్ధ అవశేషాలు బయటపడుతూన్నాయి. 1848లో పిఠాపురంలోని ఒక దిబ్బవద్ద జరిపిన తవ్వకాలలో ఒక గాజుభరిణి (casket) దొరికిందని దానిలో పచ్చలు, కెంపులు, పగడాలు, కొన్ని ముత్యాలు, స్వర్ణంతో చేసిన నగిషీలు ఉన్నాయని వాటిని మద్రాసు మ్యూజియంకు పంపటం జరిగిందని ప్రముఖ బ్రిటిష్ చరిత్రకారుడు Walter Elliot పేర్కొన్నాడు.[27]

దొరుకుతున్న ఆధారాలను బట్టి హుయాన్‌త్సాంగ్ వర్ణించిన ఒకనాటి Ping-ki-lo నేటి పిఠాపురం కావొచ్చు అనే ప్రతిపాదనను అంత సులభంగా త్రోసిపుచ్చలేం.

పిఠాపురం చాళుక్యులు

క్రీశ.624 నుండి 973 వరకూ వేంగి రాజ్యాన్ని కుబ్జవిష్ణువర్ధనుడి వారసులే పాలించారు. వీరిలో గుణగ విజయాదిత్యుడు (క్రీశ.848–891), మొదటి చాళుక్య భీముడు (క్రీశ.892–922) ముఖ్యులు.

గుణగవిజయాదిత్యుడు ఈ రోజు ఆంధ్రప్రదేశ్ అని చెప్పుకొంటున్న ఉత్తరాంధ్ర నుండి నుండి రాయలసీమవరకూ ఉన్న ప్రాంతాలను ఏకంచేసి పాలించాడు. తెలుగు భాషను ప్రోత్సహించాడు. బిక్కవోలు, చేబ్రోలు, విజయవాడలలో ఆలయాలు నిర్మించాడు. రాజమహేంద్రవరం పట్టణాన్ని, కోటను నిర్మించాడు.[28]

27. JAHRS Vol 5, 1930 p.no151

28. చూడుడు రాజమహేంద్రవరం వ్యాసం

మొదటి చాళుక్య భీముడు చాళుక్యభీమవరం (సామర్లకోట సమీపంలో) పట్టణాన్ని నిర్మించి అక్కడ నివాసం ఉండేవాడు. ఇతను ద్రాక్షారామ భీమేశ్వర, సామర్లకోట కుమారామభీమేశ్వర ఆలయాలను నిర్మించాడు. పంచారామక్షేత్రాలలో ఈ రెండు ఆలయాలు ప్రముఖమైనవి. ఇతను కళలను పోషించాడు.

క్రీశ 928 లో మొదటి చాళుక్యభీముని మనవడు మొదటి అమ్మరాజు మరణించాకా వేంగిరాజ్యవారసత్వం కొరకు అంతర్గత విభేధాలు తలెత్తాయి. అమ్మరాజు కొడుకు బేత విజయాదిత్యV క్రీశ.924 వేంగి రాజ్యాధినేతగా పదిహేనురోజులు మాత్రమే పాలించాడు.[29] వారసత్వపోరులో శత్రువుల ధాటిని తట్టుకోలేక ఇతను వేంగిని విడిచిపెట్టి పిఠాపురం కేంద్రంగా చేసుకొని ఈ ప్రాంతాలను పాలించటం మొదలుపెట్టాడు. బహుశా బేత విజయాదిత్యV తన బలాబలాలను అంచనా వేసుకొని విశాలమైన వేంగిరాజ్య వారసత్వాన్ని వదులుకొని పిఠాపురానికే పరిమితమైన చిన్న రాజ్యాన్ని ఎంచుకోవటం ఇతని వ్యక్తిత్వాన్ని ప్రతిబింబిస్తుంది.

బేతవిజయాదిత్య V వంశీయులను చరిత్రకారులు *"పిఠాపురం చాళుక్యశాఖ"* గా గుర్తించారు. ఇతని వంశంలో సత్యాశ్రయుడు, మొదటి విష్ణువర్ధనుడు (క్రీశ1123-1145),

---

29. బేత విజయాదిత్య V ని తరిమేసాకా (క్రీశ.973 లో కర్నూలుప్రాంతానికి చెందిన తెలుగు చోళ వంశీయుడైన జటాచోడ భీముడు, అప్పటికి వేంగిని పాలిస్తున్న దానార్ణవుడిని చంపి అతని కొడుకులైన మొదటి శక్తివర్మ, విమలాదిత్యుడులను తరిమేసి వేంగి రాజ్యాన్ని ఆక్రమించుకొన్నాడు. వీరిద్దరూ వేంగిరాజ్యం నుండి పారిపోయి చోళ చక్రవర్తి రాజరాజు ఆశ్రయం పొంది, అతనితో బంధుత్వం కలుపుకొని చోళ చక్రవర్తి సహాయంతో జటాచోడ భీముడిని సంహరించి వేంగిరాజ్యాన్ని క్రీశ.1002లో తిరిగి సంపాదించుకొన్నారు. (విమలాదిత్యుడిని ఓడించి చోళచక్రవర్తి బంధించి తీసుకుపోయినట్లు తమిళ చరిత్రకారుల అభిప్రాయం) ఇక్కడనుంచి వేంగి/తూర్పుచాళుక్యరాజ్యం స్వాతంత్ర్యాన్ని కోల్పోయి తమిళదేశ చోళసామ్రాజ్యపు సామంతరాజ్యంగా మారిపోయింది. ఆ విమలాదిత్యుని కొడుకే రాజరాజ నరేంద్రుడు. కొంతకాలం రాజరాజ నరేంద్రుని వారసులు వేంగి రాజ్యాన్ని పాలించి, తరువాత తమకు సహాయకులుగా ఉంటున్న సేనాధిపతులకు వేంగిరాజ్యాన్ని అప్పగించారు. అలా పృథ్వీశ్వర మహారాజు (క్రీశ.1186-1207) పాలిస్తున్నప్పుడు కాకతీయులు వేంగిని జయించి విశాలమైన కాకతీయ సామ్రాజ్యాన్ని ఏర్పరచారు.

11వ శతాబ్దంలో కొంతకాలం బీహారుకు చెందిన చిక్కోర వంశీయులు పిఠాపురాన్ని పాలించారని చేసిన ప్రతిపాదన తదుపరి వీగిపోయింది. (ర. The Dynastic History of Northern India Vol 1 , Ray HC, pn 339)

రెండవ మల్లపదేవుడు (1145-1158), మూడవ విజయాదిత్య [30] (1158 1202), మూడవ మల్లపదేవుడు (1202-1223), ఉదయచంద్ర విష్ణువర్ధనుడు (1223-1226), చంద్రశేఖరదేవ చక్రవర్తి (1226-1246), నాల్గవ విజయాదిత్య (1246-1255) మొదలగు రాజులు పిఠాపురాన్ని కేంద్రంగా చేసుకొని పరిపాలించారు. వీరి శాసనాలు పిఠాపురం సామర్లకోట, సర్పవరం, గుడివాడ (పెద్దాపురం వద్ద ఒక గ్రామం), ద్రాక్షారామం, పాలకొల్లు, రాజమహేంద్రవరం, భీమవరం, తణుకు, ఆచంట లాంటి ప్రాంతాలలో లభించటాన్ని బట్టి వీరి రాజ్య పరిధులను అర్థంచేసుకొనవచ్చును.

పిఠాపురం చాళుక్యరాజులలో కొద్దిమంది వేంగిరాజ్యపాలకులకు కొంతకాలం సమయానుకూలంగా సామంతులుగా ఉన్నప్పటికీ ఎక్కువశాతంమంది స్వతంత్రపాలన చేసారు. వీరు కాకతి ప్రతాపరుద్రునితో మైత్రివహించినట్లు క్రీశ. 1186 నాటి ద్రాక్షారామ శాసనం చెబుతుంది. పిఠాపురం చాళుక్యశాఖ రాజులు సుమారు మూడు శతాబ్దాలపైగా ప్రశాంతంగా పిఠాపురాన్ని రాజధానిగా చేసుకొని పాలించినట్లు వివిధ శాసనాల ద్వారా తెలుస్తుంది. ఈ ప్రాంతం కాకతీయగణపతి పాలనలోకి వెళ్ళిపోవటంతో చివరి రాజు నాల్గవ విజయాదిత్యుడితో పిఠాపురం చాళుక్యశాఖ రాజ్యపాలన ముగిసిపోయింది. [31]

పిఠాపురం ఆలయ శాసనాలు

కుంతీమాధవస్వామి: ప్రస్తుతం మనం చూస్తున్న పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయం పదిహేడవ శతాబ్దంలో నిర్మించారు. నిజానికి ఈ ఆలయానికి కనీసం వెయ్యేళ్ల చరిత్ర ఉంది. పిఠాపురం కుంతీమాధవస్వామి ఆలయంలో ధ్వజస్తంభం పక్కనే నలు చదరంగా సుమారు పన్నెండు అడుగుల ఎత్తులో ఉండే నల్లరాతి స్తంభముపై నాలుగు వైపులా, వివిధ కాలాలలో చెక్కిన నాలుగు శాసనాలు కలవు. ఈ శాసన స్తంభం చరిత్ర కారులకు ఎంతోవిలువైనది. దీనిని చరిత్రకారులు Pithapuram Piller inscription

30. ఈ విజయాదిత్యుని తల్లి పేరు చండాలదేవి. ఈమె హైహయ వంశానికి చెందిన రాజైన బ్రహ్మయ కూతురు. హైహయులు జైనఆరాధకులు. పిఠాపురంలో జైన సంప్రదాయం అప్రతిహతంగా కొనసాగటానికి ఇది కూడా కారణం కావొచ్చు.

31. History of Andhra Country 1000AD - 1500AD by Yashoda Devi, Historical Inscriptions of Southern India no V by Robert Sewell

అంటారు. తూర్పు చాళుక్యుల వంశావళికి సంబంధించిన అనేక వివరాలు ఈ శాసన స్తంభంపై కలవు. E.Hultzsch అనే చరిత్రకారుడు ఈ శాసనాల్ని పరిష్కరించాడు (Epigraphia Indica Vol IV). దీనిపై కల వివిధ శాసనములు

1. క్రీశ.1186 లో మూడవ గొంకరాజు భార్య, పృధ్వీశ్వర మహారాజు తల్లి అయిన జయాంబిక నవఖండ్రవాడ[32] అనే గ్రామాన్ని నిత్యదీపారాధనకొరకు కుంతీమాధవ స్వామికి సమర్పించుకొని, మాధవదేవరకు, శ్రీ లక్ష్మిదేవి అమ్మవారికి గోపురములు, ప్రాకారములు కట్టించెను.

2. క్రీశ.1195 లో కోన మండలాధిపతులైన మల్లిదేవుడు, మనుమ సత్యరాజులు ద్రాక్షారామము సమీపములోని ఒడియూరు (ఓడూరు) గ్రామమును కుంతీమాధవ స్వామికి దానంగా సమర్పించుకొన్నారు. ఈ శాసనములో కోనసీమను పాలించిన రాజుల వివరాలు కలవు.

3. క్రీశ 1202, జూన్ 16 న పిఠాపురంచాళుక్య వంశానికి చెందిన మూడవ మల్లపదేవుడు (మల్లవిష్ణువర్ధన చక్రవర్తి), కుంతీమాధవస్వామి దేవాలయములో పట్టాభిషిక్తుడై, స్వామివారికి గుడివాడ గ్రామాన్ని (పెద్దాపురం తాలూకాలోని) ధారవోసెను.

4. క్రీశ1391లో కాటయవేమారెడ్డి తన తల్లిదండ్రులకు శుభంకలగాలని కుంతీ మాధవదేవర ఆలయానికి శిలాప్రాకారాన్ని నిర్మించి వేయించుకొన్న శాసనం.

ఇతరప్రాంతాలలో లభించే శాసనాలు, తామ్రఫలకాలలోని వ్యక్తుల వంశావళిని ఈ కుంతీమాధవస్వామి ఆలయశాసనాలలోని వంశావళితో పోల్చి సరిచూసి వాటి కాలాన్ని చరిత్రకారులు నిర్ధారించటం చేస్తున్నారంటే చరిత్రపరంగా Pithapuram Piller Inscription (Figure 3) ఎంతవిలువైనదో అర్థం చేసుకోవచ్చును. శాసనాన్ని చెక్కిన వ్యక్తి పేరు అయ్యపిల్లార్య, కంఠాచారి, శ్రీ పిఠాపురం అని ఉన్నది. ఈ స్తంభంపై శాసనాలు వివిధకాలాలలో వేయించినవి కనుక అది బహుశా వంశపారంపర్య పదవి అయి ఉండొచ్చు.

---

32. ఈ నవఖండ్రవాడ తూర్పుగోదావరిజిల్లా పిఠాపురం సమీపంలోని కొండెవరం గ్రామంగా గుర్తించారు. ఇదే గ్రామాన్ని రాజరాజనరేంద్రుడు జైన గణిత సారసంగ్రహ గ్రంథాన్ని తెనిగించిన పావులూరి మల్లన తాత మల్లనకు దానంగా ఇచ్చాడు. బహుశా వారి వంశం అంతరించిపోవటంతో మరలా అదే గ్రామాన్ని జయాంబిక కుంతీమాధవస్వామికి దానమిచ్చి ఉంటుంది.

Pithapuram Piller inscription

Figure 3

పిఠాపురంలో లభించిన అయిదోశతాబ్దపు బౌద్ధస్థూపం

Figure 4

కుయ్యేరులో బయటపడ్డ ప్రాచీన జైన ఆలయ స్తంభాలు, జైన విగ్రహం. ఒక ఆలయ స్తంభంపై త్రిస్తర ఛత్రంతో జైనతీర్థంకరుడు ఒక వైపు, మరో వైపు పూజలందుకొంటున్న శివలింగం కలదు. (వలయంలో)

Figure 5

సాధారణంగా దానశాసనాల చివరలో శాసన అంశాల అతిక్రమణలకు పాల్పడిన వారు, బ్రాహ్మణ హత్య, తల్లి హత్య చేస్తే వచ్చేలాంటి పాపంమూటకట్టుకొని నరకానికి పోతారంటూ వివిధ రకాల శాపాలు ఉంటాయి. ఈ శాసనంలో "దానం శత్రువు చేసిన దైనప్పటికీ అది రక్షింపబడాలి. ఎందుకంటే శత్రువు శత్రువే కావచ్చు, కానీ దానం శత్రువు కాదు" అనే గొప్ప వాక్యం ఆకర్షిస్తుంది.

పుత్తర్ మసీదు: పిఠాపురం అప్పట్లో ప్రధానరాజకీయ కేంద్రం కావటంతో మహమ్మదీయుల దాడులకు గురయ్యింది. ఆ సందర్భంలో కుంతీమాధవ, కుక్కుటేశ్వర ఆలయములలోని కొన్ని స్తంభములను తీసుకొని పోయి మసీదు నిర్మాణము గావించుకొన్నట్లు తెలుస్తుంది. పిఠాపురం పుత్తర్ మసీదుస్తంభములపై కనిపించే తెలుగుశాసనములు ఇవి.

1. క్రీశ.1433 లో వాసిరెడ్డి పోతినేండు అనే వ్యక్తి అల్లాడరెడ్డి కుమారులకు శుభం కలగాలని కుంతీమాధవ దేవర గుడిలో తూర్పు మండపము కట్టించాడు.[33]

2. వేమభూపాల కారుణ్య విమలపాత్రుడు అనే దాత కుక్కుటేశ్వరస్వామి ఆలయములో శివిలింగేశ్వరమున్ను గవిరిదేవతను సహితమైన ఐదు ప్రతిష్ఠలు చేయించి ఊగుళ్ళు కట్టించెను. కుంతీమాధవ ఆలయానికి సున్నం వేయించాడు. నాలుగు లక్షల అరవై వేల తాళ్ళు నాటించాడు.[34]

3. క్రీశ1430లో వాసిరెడ్డి పోతినేండు కుమారుడు వేమయ్య దేవరకు శ్రీ బృందావనము పెట్టించాడు.[35]

మహమ్మద్ బిన్ తుగ్లక్ క్రీశ.1323 లో రాజమహేంద్రవరం కోటను జయించి అక్కడి గోపినాథ ఆలయాన్ని మసీదుగా మార్చాడు. ఆ సమయంలో పిఠాపురంవైపు వచ్చి ఉండకపోవచ్చు. ఆ తరువాత రెండు శతాబ్దాలకుపైనే హిందూరాజులైన రెడ్డిరాజులు, గజపతుల పాలనలో పిఠాపురం ఉంది. తిరిగి మరలా క్రీశ 1572 లో ఈ ప్రాంతం

---

33. SII vol VI 673 – *మాధవేశ్వరుండున్ను, లక్ష్మిదేవమ్మాను వేంచ్చేసి వాశిరెడ్డి పోతినేండు....*

34. SII vol VI 674 -- *యీ తాటి యెవ్వరి నాంటిరి మాం భూమి ప్రజలకు బుద్ధిన్ని మతివిశేషమున్ను ధర్మమున్ను యీ తాడాకుల నే పంచాంగాలు పురాణాలు శాస్త్రాలు ధర్మకర్తలు వ్రాసి చదువంగాను/ / సకళధర్మాలకున్ను తాంటి వ్రిక్షమే మూలము...*

35. *నగరి ఉత్తరంవల్ల శ్రీ బ్రిందావనం తోంట వెట్టించ్చెను*

గోల్కొండ బహుమనీ సుల్తానుల పాలనలోకి వెళ్ళింది. మసీదులో లభిస్తున్న స్తంభాలపై ఉన్న శాసనాలు క్రీశ.1430 లకు చెందినవి కనుక పిఠాపురం మసీదు 1572 తరువాత నిర్మించినదై ఉండవచ్చు.

మూడవ దశ

కాకతీయ రుద్రదేవరాజు తెలంగాణలో తన రాజ్యాన్ని స్థిరపరచుకొన్నాక తీరాంధ్రపై దృష్టిపెట్టాడు. ద్రాక్షారామభీమేశ్వర ఆలయంలో క్రీశ.1158, క్రీశ.1163లలో వేయించిన శాసనాలను బట్టి రుద్రదేవుడు అప్పటికే ఈ ప్రాంతంపై ఆధిపత్యాన్ని నిరూపించుకొని ఉంటాడని భావించినా క్రీశ.1181 లో రెండవ రాజేంద్రచోడుడు మరణించేవరకూ అతనికి తీరాంధ్రపై గట్టిపట్టు లభించలేదు. చోడుని అనంతరం అతని మనుమడు పృథ్వీశ్వరుడు రాజ్యాన్ని అధిష్టించి కాకతీయుల ధాటికి తట్టుకోలేక వేంగిని విడిచి పిఠాపురం వచ్చి పిఠాపుర చాళుక్యశాఖకు చెందిన మల్లపదేవుని తొలగించి క్రీశ 1208 వరకూ పాలించి కాకతి గణపతిదేవుని చేతిలో మరణించాడు. మూడవ మల్లపదేవుడు గణపతిదేవుని సహాయంతో పిఠాపురాన్ని తిరిగి దక్కించుకొన్నాడు. కాకతి గణపతిదేవుడు మొత్తం ఆంధ్ర దేశాన్ని ఒకేపాలన క్రింద తీసుకొచ్చాడు. నెల్లూరు నుంచి కళింగవరకూ కాకతీయ సామ్రాజ్యములో చేరింది.

కొప్పుల నాయకులు

గణపతి దేవుని పాలనలో కొంతకాలం పిఠాపురం చాళుక్యవంశీయులు సామంతులుగా ఉన్నారు. కారణాలు తెలియరావు కానీ ఆ తదుపరి కాకతి ప్రతాపరుద్రుని పాలనలో పిఠాపురం పట్టణం కొప్పుల నాయకుల చేతిలోకి వెళ్లింది. వీరుకూడా పిఠాపురాన్నే కేంద్రంగా చేసుకొని రాజ్యం చేసారు.

కాకతీయ ప్రతాపరుద్రుడు ఆంధ్రదేశంలో వివిధ ప్రాంతాలలో 72 మంది సామంతులను ఏర్పరచుకొని పాలించాడు. క్రీశ.1323లో ఢిల్లీ సుల్తానుల చేతిలో ప్రతాప రుద్రుడు పరాజయం చెందగా కాకతీయ సామ్రాజ్యం కూలిపోవటంతో, ఆంధ్రదేశంలో అంతవరకూ సామంతులుగా వ్యవహరించిన అనేకమంది స్వతంత్రాన్ని ప్రకటించుకొని సొంత ఏలుబడి మొదలెట్టారు. వీరిలో ముఖ్యులు అద్దంకి కేంద్రంగా ప్రోలయరెడ్డి, రేకపల్లి

నుండి ముసునూరి నాయకులు. అలా ఆనాటి కొప్పుల నాయకులు కూడా స్వతంత్రాన్ని ప్రకటించుకొని పిఠాపురాన్ని రాజధానిగా చేసుకొని స్వతంత్రపాలకులుగా అవతరించారు.[36] క్రీశ. 1337 నుంచి 1388 వరకూ కొప్పులనాయకుల పాలన సాగింది. వీరు పిఠాపురం, కిమ్మూరు, బిక్కవోలు, తుని, కొట్టాం, మొల్లేరు, బెండపూడి మొదలగు ప్రాంతాలేకాక సింహాచలం వరకూ కూడా తమ రాజ్యాన్ని విస్తరించారు. గోదావరి, వంశధార నదులమధ్య ప్రాంతాన్ని వీరు రాజ్యం చేసారు.

బెజవాడ మల్లేశ్వరస్వామి ఆలయంలో క్రీశ. 1267 నాటి ఒక శాసనంలో[37] కొంప్పుల ప్రోలినాయుడు, ముప్పసాని, దొడ్డదేవర, నగనబోయుడులు– తమ తాత అయిన గొప్పమారెడ్డి కి (కొప్పుల మారెడ్డి?), తండ్రి అయిన నారబోయడు, తల్లి కొమ్మసాని లకు శుభం కలగాలని 50 ఆవులు దానం చేసినట్లు ఉన్నది. దీని ఆధారంగా ఈ కొప్పుల వంశ పూర్వీకులు కృష్ణాజిల్లాకు చెంది, కాకతీయులపాలనలో వీరు కృష్ణాతీరంనుండి పిఠాపురానికి సామంతులుగా వచ్చి ఉండాలి. కొప్పుల వంశస్థులు కొంతకాలం తుని సమీపంలోని కొట్టాం ను రాజధానిగా చేసుకొని పాలించినట్లు తెలుస్తుంది. ఈ కొట్టాం పదిహేడవ శతాబ్దం వరకూ కొప్పులవారి కొట్టాంగా పిలువబడేది.

క్రీశ. 1337 దోనేపూడి తామ్రశాసనం[38] ద్వారా కొప్పుల నాయకుల ప్రశస్తి తెలుస్తుంది. గోదావరినుంచి కళింగ వరకూ వీరు పాలిస్తున్న రాజ్యాన్ని ఆంధ్రఖండ మండలంగా చెప్పుకొన్నారు (ఆంధ్రలో కొంత భాగం). దీని రాజధాని పిఠాపురం. ఈ రాజ్యమూలపురుషుడు కాపయనాయకుడు. ఇతని కొడుకు కొప్పుల ప్రోలయనాయకుడు. (ఇతను ముసునూరి ప్రోలయనాయకుని సమకాలీనుడు[39]). ఇతనికి చోడమాంబ ద్వారా జన్మించిన పుత్రుడు నామయనాయకుడు. ఇతనికి పగమేచ్చుగండ, ప్రత్యర్థిగర్వనిర్వాపణ అనే బిరుదులు కలవు. ఇతను పిఠాపురం సమీపంలోని దోనేపూడి అనే గ్రామాన్ని గణపతి

36. Pithapuram a Historical town PVP Sastry P.no 89 Itihas journal 1976
37. SII Vol IV No 765 – *కొంప్పుల ప్రోలినయందు...నగనబోయిందు....గొప్ప మారెడ్డికి.... నారెబోయిన్కి....కొమ్మసాన్కి...*
38. Epigraphia Indica Vol IV p.no 356 – 6 వ లైను *//మండలం ఆంధ్ర–ఖండం ఆరభ్య గౌతమి నది తటం, కళిగం ఆలోక్య....పిఠాపురి జయతి తత్ర సమస్త దేవ శక్తి ప్రయత్న పరికల్పిత....*
39. విలస తామ్రశాసనంలో ఆంధ్రదేశాన్ని ముస్లింల చెరనుండి విడిపించానని చెప్పుకొన్న ముసునూరి ప్రోలయనాయకునికి పిఠాపురం కొప్పుల ప్రోలయనాయకుడు సహాయసహకారాలు అందించాడు. History of Reddy Kingdoms, M. Somasekhara Sarma pn. 29

అనే బ్రాహ్మణునికి దానంగా ఇచ్చిన సందర్భంలో వేయించిన శాసనం కవిత్వ మెరుపులతో ఆసక్తిదాయకంగా ఉంటుంది. నామయనాయకుని కొడుకు రెండవ ప్రోలయనాయక.

దోనేపూడి శాసనంలో(క్రీశ. 1337) పిఠాపురపట్టణ వర్ణనలు ఈ విధంగా ఉన్నాయి

పిఠాపురీ జయతి తత్ర సమస్తదేవ
శక్తి ప్రయత్నపరికల్పిత తోరణశ్రీః
యస్యాస్సునిర్మలనభోముకురాంతరాలే
ధత్తే సురేంద్రనగరీప్రతిబింబలీలమ్

(తాత్పర్యం: సమస్తదేవతలు కొలువున్న పిఠాపురం యొక్క అందాలు ఎంతటి దివ్యమైనవి అంటే ఆకాశం అనే అద్దంలో పిఠాపురం అందాలే ఆ ఇంద్రుని అమరావతి అందాలుగా ప్రతిబింబిస్తున్నాయి)

యత్ సౌధాగ్రనిషణ్ణవారవనితావక్త్రేందుమధ్యస్థితః
స్వైరం నైషవిభావ్యతే హిమరుచిస్తేభ్యోవిభిన్నాకృతిః
ఏవం చేతపి శకితేనరచితో ధాత్రాకళంకస్ఫుటమ్
నోచే దీదృశి నిర్మలే కథ మిదమ్ మాలిన్య ముజ్జృంభతే.

(తాత్పర్యం: పిఠాపురం భవనాల మిద్దెలపై వెన్నెలలో కూర్చున్న నాట్యకత్తెల గుండ్రని వెలుగులీనే మొఖాలలో కలిసిపోయి చంద్రుడు కనిపించటం లేదట. అందుకని బ్రహ్మదేవుడు చంద్రునిపై నల్లమచ్చలు పెట్టటంతో ఆ అప్సరసల ముఖబింబాల మధ్య చంద్రబింబాన్ని గుర్తించటం వీలయిందట)

పై పద్యాలను బట్టి ఆనాటి పిఠాపురం ఎత్తైన భవనాలతో, అందమైన గొప్ప దేవాలయాలతో, అద్భుత సుందరాంగులతో విరాజిల్లిన పట్టణంగా ఊహించుకొనవచ్చును. ఒక దానశాసనంలో ఇంతటి ఉత్కృష్టమైన చమత్కారము, కవిత్వము చోటుచేసుకోవటం ఆనాటి రాజుల సాహిత్యపోషణను పట్టిచూపుతుంది.

కొప్పుల నాయకులు రాజమహేంద్రవరం రెడ్ల చేతిలో ఓడిపోవటంతో పిఠాపురం పట్టణం రెడ్లపాలనలోకి వెళిపోయింది. క్రీశ. 1388 నుండి ఈ కొప్పుల వంశస్థులు ఎక్కడా శాసనాలలో కనిపించరు. కాటయవేమారెడ్డి, కొప్పుల రెండవ ప్రోలయనాయకను జయించి పిఠాపురంను స్వాధీనం చేసుకొని ఉంటాడు. దీనికి ఆధారంగా క్రీశ. 1388లో సర్పవరం

భావనారాయణస్వామి ఆలయం[40], క్రీశ.1391లో పిఠాపురం కుంతీమాధవస్వామి[41] ఆలయాలలో కాటయవేమారెడ్డి వేయించిన శాసనాలు కనిపిస్తాయి. రాజమహేంద్రవరం రెడ్ల శాఖకు చెందిన వీరభద్రారెడ్డి పాలన క్రీశ1448 వరకూ సాగింది.

ఆ పిమ్మట కటక్ రాజధానిగా చేసుకొని పాలిస్తున్న కళింగాధిపతి కపిలేంద్రగజపతి ఈ ప్రాంతాలను జయించాడు. ఆ విధంగా రెడ్డిరాజ్యము అంతరించి గజపతుల రాజ్యం ప్రారంభమైంది. క్రీశ 1515 లో శ్రీ కృష్ణదేవరాయలు ఈ ప్రాంతాన్ని జయించి, ప్రతాపరుద్ర గజపతి కుమార్తెను వివాహం చేసుకొని, విజయనగర రాజ్యానికి– గజపతుల రాజ్యానికి కృష్ణానదిని సరిహద్దుగా నిర్ణయించి సంధికుదుర్చుకొని గజపతులకు మరలా ఈ ప్రాంతాలను ఇచ్చివేసాడు.

క్రీశ.1572 లో గోల్కొండ బహుమనీ సుల్తాను అయిన ఇబ్రహిమ్ కుతుబ్‌షా సైన్యం మాలిక్‌నైబ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం కోటను జయించటంతో గజపతుల పాలనకు తెరపడి ఈ ప్రాంతం అంతా గోల్కొండ నవాబుల పాలనలోకి వెళ్ళింది.

గోల్కొండ నవాబుల సైన్యంలో కొంతమంది వెలమలు సైన్యాధ్యక్షులుగా పనిచేసే వారు. వారిలో తెలుగురాయ అనే వెలమ గోల్కొండ నవాబు ఖులికుతుబ్‌షా బంధువు ప్రాణాలను కాపాడినందుకు ప్రతిఫలంగా క్రీశ 1647 లో పిఠాపురంను పన్నురహిత మాన్యంగా తెలుగురాయకు బహూకరించాడు నవాబు. ఈ జాగీరులో కాకినాడ, పిఠాపురం సామర్లకోట ఉండేవి. దీనిని ప్రోలునాడుగా పిలిచేవారు. అప్పటినుంచి వారి వారసులు పిఠాపురం జమిందారీని అనుభవిస్తూ ఉన్నారు.

క్రీశ.1753 లో ఫ్రెంచి ఇండియా కంపనీ మిలటరీ అధికారి బుస్సీ, నిజాం ప్రభువుకు సైనిక సహాయం అందించినందుకు బదులుగా శ్రీకాకుళం, రాజమండ్రి, కొండపల్లి, ఏలూరు వంటి ప్రాంతాలను గ్రాంటుగా పొంది కోస్తాతీరాన్ని ఫ్రెంచి పాలనలోకి తీసుకెళ్ళాడు. ఆ సమయంలో పిఠాపురం కూడా క్రీశ.1757 వరకూ ఫ్రెంచిపాలనలో ఉంది. ఫ్రెంచి వారినుండి తిరిగి ఈ ప్రాంతాలను విజయనగరం పూసపాటి వంశస్థులు ఇంగ్లీషువారి సాయంతో గెలిచి కొంతకాలం పాలించారు.

---

40. SII Vol 5, No 7 - *కాటమరెడి నగరికి చెల్లించిన నలభై టంకాలు పెటి శ్రీశ్రీ సర్పవరం భావయ్యకు....*

41. EI Vol 4 pn 329 – *కాటమరెడి తమ తండ్రి కాటమరెడి గారికింని తమ తల్లి దొడ్డసాని అమ్మ గారికింని అక్షయ సుకృతముగాను పిఠాపురము నందు శ్రీ కుంత్తీమాధవదేవరకు శిలాప్రాకారం చేయించిరి*

క్రీశ.1768 లో ఏటా ఐదులక్షల రూపాయిలు శిస్తు కట్టే ఒప్పందంపై ఈ ప్రాంతాలను నిజాం రాజు ఈస్ట్ ఇండియా కంపనీకి ఇచ్చాడు. 1823లో ఈస్ట్ ఇండియా కంపనీ ఈ ప్రాంతాలను మూడవ నిజాం రాజునుండి కోటి అరవై ఆరు లక్షల రూపాయిలు చెల్లించి కొనుక్కోవటంతో కోస్తా ఆంధ్రా మొత్తం మద్రాసు ప్రెసిడెన్సీలో కలిసిపోయింది.[42]

ఈస్ట్ఇండియా కంపనీ 1802లో Permanent Settlement చేసే సమయానికి (అప్పటికి జమిందారీలను అనుభవిస్తున్న వ్యక్తులకు శాశ్వతంగా వాటిని స్థిరపరచటం) పిఠాపురం జమిందారీలో 128 గ్రామాలు ఉన్నట్లు వాటికి ఏటా 2,58,979 రూపాయిలు శిస్తు కంపనీకి చెల్లించేటట్లు నిర్ణయించారు. ఆ ప్రకారము శ్రీ వెంకట నీలాద్రిరావు పిఠాపురం జమిందారుగా (1844–1850) బాధ్యతలు చేపట్టారు. ఆ తరువాత వారి కుమారుడు రాజా వెంకట మహిపతి గంగాధర రామారావు బహద్దుర్ (1862–1890), తదనంతరం వారి కుమారుడు రాజారావు వెంకట కుమార మహిపతి సూర్యారావు బహద్దుర్ (1907–1964) పిఠాపురం జమిందారులుగా వ్యవహరించారు. 1951 లో భారతదేశంలో జమిందారీ వ్యవస్థ రద్దవటంతో పిఠాపురం జమిందారీ ముగిసిపోయింది.

సాహిత్యంలో పిఠాపురం

తూగో జిల్లాలో ఏలేశ్వరం వద్ద బయలుదేరిన ఏలేరు నది– దివిలి, పిఠాపురం పాదగయకోనేరు మీదుగా దిగువకు ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. డబ్బైలలో ఏలేశ్వరం రిజర్వాయరు నిర్మించటంతో ఈ నది క్రమేపీ తన ఉధృతిని కోల్పోయింది. ఏలేరు నది ప్రస్తావనలు సాహిత్యంలో అనేకం కనిపిస్తాయి. ఈ ఏలేరుకు కొమరేఱు, ఏలానది అనే పేర్లు కలవు

శ్రీనాథుడు భీమేశ్వరపురాణంలో ''ఏ పట్టనము మ్రోల నేలేఱు ప్రవహించు/బృథివికి ముత్యాల పేరువోలె....'' అంటూ ఏలేరు గొప్పతనాన్ని వర్ణించాడు.

తే// నారికేళంపు బుట్ట నెన్నడిమిచాయ
దళములందును బోలె సంతతము బాఱు
వేణికా సారణులయందు విస్మయముగ
జగతి నెక్కడి వేలేటి సాటినదులు .... అంటూ రమ్యంగా వర్ణించాడు.

42. Autocracy to Integration: Political developments in Hyderabad State, 1938-1948 by Lucien D. Benichou

పిఠాపురాన్ని ఏలానది ముత్యాల పేరులా చుట్టుకొన్నదట, కొబ్బరినీళ్ళ నిరంతర ప్రవాహంతో ఏలేరునదితో తూగగలిగే నదులే లేవట ప్రపంచంలో..... పదిహేనో శతాబ్దంలో ఎలానది ఎలా పిఠాపురాన్ని వెలిగింపచేసిందో ఇంత అందంగా శ్రీనాథుడుతప్ప మరెవ్వరు చెప్పగలరు?

ఒకనాటి పిఠాపురం భౌతిక వర్ణనను మరో పద్యంలో శ్రీనాథుడు ఇలా చిత్తరువుగా నిలిపాడు

సీ// ఏటేట విలినీట నిరుగారునుం బండు
బ్రాసంగు వరిచేల బసిడిచాయ
బరిపాకమున వేరుపనసపండుల తావి
ఇందిందిరములకు విందుసేయు
వేబోక ఒలుపారు వింధ్యాద్రిపవనంబు
పోకపువ్వుల తావి బుక్కిలించు
వేశ్యవాటికలందు విహరించు వలరాజు
ననయంబు జెఱకువిల్లును ధరించు

తే.గీ. నారదంబులవలపు పొన్నల బెనగి
విచికిలామోదములతోడ వియ్యమందు
బాటలీపుష్ప కేతకీపరిమళములు
పొదల విలసిల్లు బీఠికాపురమునందు.

(తాత్పర్యం : ఎటు చూసినా బంగారు వన్నెల వరిచేలు, తుమ్మెదలకు విందు చేసే బాగా ముగ్గిన పనస పండ్ల సువాసనతోను; వింధ్య పర్వతపు పోక పువ్వుల పరిమళాలను పుక్కిలించే చల్లనైన గాలులతోను; మన్మథుడు తన చెరుకు వింటిని ఎక్కుపెట్టే వేశ్య వాడలతోను; పొన్నపూలు, పాటలీ పుష్పాలు, పరిమళాలు వెదజల్లే పొదలు కలిగిన పిఠాపురం. లాంటి వాక్యాలలో శ్రీనాథుడు ఆనాటి పిఠాపురం picturesque సౌందర్యాన్ని కళ్లముందు నిలుపుతాడు)

వ// కుంతీమాధవదేవునకు విశ్రాంతిప్రదేశంబును, హుంకారిణీ
మహాదేవికి విహార సంకేతభవనంబును, బీఠాంబికా లక్ష్మి
కాటకూటంబును, హేలాసానికి హాలాపానగోష్ఠీ మంటపంబును, ననం
దగి భూతభేతాళడాకినీప్రేతరంక భైరవవ్రాతనిర్మిత
ప్రాకారవప్రహట్ట కుట్టిమం బగు పిఠాపట్టనంబు .....

(తాత్పర్యం: ఇది (పిఠాపురం) కుంతీమాధవుని విశ్రాంతి ప్రదేశం, హుంకారిని దేవి[43] విహరించు భవనం, పీఠికాపురిలక్ష్మి పాలించు కూటమి, ఎన్నో విలాసాలకు అలవాలమైన మంటపం, భూత బేతాళ ఢాకిని ప్రేత భైరవ శక్తుల నిర్మిత రక్షణ ప్రాకారం కలిగిన పీఠికాపురి అంటూ ఇక్కడ కొలువైన వివిధ మూర్తులను వర్ణించాడు[44])

తెనాలి రామకృష్ణుడు (క్రీశ. 1485-1575) వ్రాసిన పాండురంగ మహాత్మ్యం నిగమశర్మోపాఖ్యానము లో పిఠాపురాన్ని *"కళింగ దేశాభరణంగా"* వర్ణించాడు.

కొన్ని చర్చనీయాంశాలు

పాదగయ, కుక్కుటేశ్వర ఆలయ స్థలపురాణంలో ఇలా ఉంది. గయాసురుడు అనే రాక్షసరాజు తపస్సుచేసి ఇంద్రపదవిని పొందాడు. ఇంద్రుడు తనపదవిని తిరిగి తనకు ఇప్పించమని బ్రహ్మ విష్ణు మహేశ్వరులను వేడుకోగా, వారు బ్రాహ్మణవేషాలలో గయాసురుడివద్దకు వెళ్లి తామొక విశిష్టమైన యజ్ఞం చేస్తున్నామని దానికి యజ్ఞపీఠంగా నీ దేహం కావాలని కోరారు. దీనికి అంగీకరించిన గయాసురుడు బీహారులో తల (శిరోగయ) ఒరిస్సాలో నాభి (నాభిగయ) పిఠాపురంలో పాదాలు (పాదగయ) ఉండేటట్లు తన శరీరాన్ని పెంచాడు. యజ్ఞం జరిగే ఏడురోజులపాటు శరీరాన్ని కదలకుండా ఉంచాలని ఒప్పందం. విష్ణుమూర్తి ఆలోచనను అనుసరించి ఏడవరోజు రాకుండానే శివుడు కోడివేషము ధరించి కూతవేయగా గడువు ముగిసిందని భావించిన గయాసురుడు దేహాన్ని కదిలించటంతో వధించబడ్డాడు. ఆ ప్రకారం పిఠాపురం త్రిగయాక్షేత్రాలలో ఒకటిగా నిలిచింది. ఈశ్వరుడు కుక్కుటరూపం ధరించాడు కనుక ఇక్కడ కుక్కుటేశ్వరుడిగా కొలువైనాడు. ఈ రకమైన రూపం శివునికి మరెక్కడా లేకపోవటం గమనార్హం.

---

43. ఈ హుంకారిణీదేవి విగ్రహము ఇప్పుడు కుక్కుటేశ్వరుని సన్నిధానంలో ఎదురుగా కలదు. నేడు పురూహూతికా దేవి పేరిట ఉన్న విగ్రహం ఇటీవల ప్రతిష్టించినది.
44. ఈ వ్యాసంలోని వివిధ పద్య తాత్పర్యాలను వివరించిన ప్రముఖ కవి రామకృష్ణ శ్రీ వత్సగారికి కృతజ్ఞతలు.

ప్రముఖ చరిత్రకారులు భావరాజు కృష్ణారావు[45] ఈ స్థలపురాణం ఆధారంగా పిఠాపురం పూర్వనామం పిట్టపురం కావొచ్చునని, రెండు జాతక కథలలో[46] బుద్ధుడు పూర్వజన్మలో కోడిపుంజుగా జన్మించాడని ఆ కథలకూ పిఠాపురం స్థలపురాణానికి సంబంధం ఉందేమో శోధించవలసి ఉంది అన్నారు. వీరు లేవనెత్తిన ఈ అంశానికి శ్రీ కుందూరి ఈశ్వరదత్తు ఒక వ్యాసములో[47] సమాధానమిస్తూ *'శ్రీ కృష్ణారావుగారూహించినటుల నీ కుక్కుటేశ్వర క్షేత్రమునకు ఆ పేరు కుక్కుట జాతకకథ ననుసరించి వచ్చియుండెననుటకు బ్రబల సాక్ష్యముండినగాని చెప్పుటకు వీలులేదు'* అన్నారు.

బీహార్‌లో ఉన్న బోధగయ నేటికీ పూజలందుకొంటున్న ఒక ప్రముఖ బౌద్ధక్షేత్రం. బుద్ధుడు ఇక్కడ ఒక బోధివృక్షం క్రింద ధ్యానం చేసి జ్ఞానం పొందాడని బౌద్ధుల విశ్వాసం. ఏడవశతాబ్దప్రారంభంలో భారతదేశాన్ని సందర్శించిన హుయాన్ త్సాంగ్ తన ట్రావెలాగ్‌లో గయనుండి బయలుదేరి కుక్కుటపర్వతంపై (కోడిపాదాల వలె మూడుపాదాలను కలిగిఉన్న పర్వతం) ఉన్న కుక్కుటారామాన్ని[48] చేరుకొన్నానని అక్కడ కశ్యప ఋషి దేహం ఒక రాతితొట్టిలో భద్రపరచబడి ఉన్నదని పేర్కొన్నాడు. మూడవశతాబ్దానికి చెందిన

---

45. History of Early Dynasties of Andhra Desa p.n 332

46. ఇవి E.B. Cowel సంకలనపరచిన జాతకకథలలో నంబరు 383, 448 కథలు. వీటిలో బుద్ధుడు తన పూర్వజన్మలో కోడిపుంజుగా జన్మించినప్పటి ఉదంతాలను వివరిస్తూ ఒకకథలో పిల్లిబారిన, మరొక కథలో డేగ బారిన పడకుండా తనను తాను ఎలా కాపాడుకొన్నదో చెపుతూ– చివరగా అబద్దాలు ఆడేవారిని, మోసపు మాటలు చెప్పేవారిని ఎన్నడూ నమ్మరాదని తన శిష్యులకు బోధించాడు.

47. ఆంధ్రసాహిత్యపరిషత్పత్రిక Commemoration Volume of Maharaja of Pithapuram 52–53 సంచిక. pn 89

48. కుక్కుటుడు అనే వ్యాపారి పాటలిపుత్రలో బుద్ధుడు జీవించిన కాలంలోనే బౌద్ధభిక్షుకుల కొరకు కుక్కుటారామాన్ని నిర్మించాడు. కుక్కుటారామానికి మహాదేవ భిక్షు ఆచార్యునిగా ఉన్న కాలంలో పుష్యమిత్రశృంగుడు (క్రీపూ. 185) దాన్ని ధ్వంసం చేయటానికి ప్రయత్నించాడట. ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతికి శంఖుస్థాపన చేసిన వ్యక్తిపేరు మహాదేవ భిక్షు అని బౌద్ధగాథలలో కనిపిస్తుంది. క్రీపూ రెండోశతాబ్దంలో శ్రీలంకలో దుత్తగామని అనే రాజు పట్టాభిషేక మహోత్సవంలో ఆంధ్రనుంచి వచ్చిన ఒక మహదేవ భిక్షు పాల్గొన్నట్లు జైన సాహిత్యం ద్వారా తెలుస్తుంది. బోధగయ, అమరావతి, శ్రీలంక లలో కనిపించే మహాదేవ భిక్షు ఒకరేనా అనేది నిర్ధారించలేం. ఒకవేళ ఒకరే అనుకొంటే బోధగయవద్దనున్న కుక్కుటారామం విధ్వంసం జరిగాక ఆయన దక్షిణాదికి వచ్చి పిఠాపురంలో కొంతకాలం ఉండి, పిదప అమరావతి, శ్రీలంక లలో సంచరించాడని అనుకోవచ్చు.

ఫాహియాన్ వ్రాతలలో కూడా కుక్కుటారామ ప్రస్తావన కలదు.[49] చైనా యాత్రికుడు Wang Ki-ye క్రీశ.964-976ల మధ్య భారతదేశాన్ని సందర్శించాడు. ఇతడు కుక్కుట పాదగిరిని సందర్శించినట్లు అది కశ్యపుడు నిర్యాణం చెందిన పుణ్యక్షేత్రమని అన్నాడు.[50]

బోధగయకు పదహారుమైళ్లదూరంలో "కుక్కుటపాదగిరి"ని గుర్తించానని అలెగ్జాండర్ కన్నింగ్‌హామ్ తెలిపాడు. ఇక్కడ జరిపిన తవ్వకాలలో120 అడుగుల వ్యాసంతో ఉన్న ఒక ఆరామం బయటపడిందని, దీని చుట్టూ 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో అనేక బుద్ధ విగ్రహాలు ఇతర అవశేషాలు లభించాయని, ఇక్కడ దొరికిన క్రీశ 800-1000 కాలానికి చెందిన శాసనాలలో కాంచీపురానికి చెందిన భక్తులు వేయించిన రెండు శాసనాలు విలువైనవని పేర్కొన్నాడు.[51]

ప్రముఖ బౌద్ధక్షేత్రం అయిన బోధగయ వద్ద కనిపించే కుక్కుటారామం, పిఠాపురంలో అవే పేర్లతో పాదగయ, కుక్కుటేశ్వర ఆలయం ఉండటం భావరాజు కృష్ణారావు వెలిబుచ్చిన అభిప్రాయాన్ని బలపరుస్తుంది.

పిఠాపురం ప్రాచీననామం పిష్టపురం. పిష్టపురికాదేవి పేరుకల దేవత గురించిన ప్రస్తావనలు చరిత్రలో కొన్ని కనిపిస్తాయి.

1. బోధగయకు సమీపంలో మానపుర (Modern Manpur in Bihar) అనే చోట క్రీశ.528-29లో సంక్షోభ అనే పేరుగల రాజు పిష్టపురిక దేవి ఆలయాన్ని నిర్మించాడు.[52]

2. సంక్షోభ మహారాజు మనవడు సర్వనాథుడు కూడా పిష్టపురికదేవి ఆలయానికి గోపురాన్ని ఏర్పరచి రెండు గ్రామాలను ఆలయనిర్వహణ కొరకు దానం చేసాడు. ఇతడే 533-34 లో మానపుర పట్టణంలో పిష్టపురిక దేవికి మరొక ఆలయాన్ని నిర్మించాడు.[53]

---

49. Travels of Fah-Hian and Sung-Yun, Budhist Pilgrims from china to India by Beal, Samuel pn 133
50. Maha Bodhi&the United Buddhist world vol 30 by Dharmapala p.no 417
51. Report of a Tour in Bihar and Bengal, 1879-1880 by Alexander Cunningham p.n 5
52. Khoh Copper plates Inscriptions, Fleet
53. Life in the Gupta Age, Rajaram Narayan p.n502-503

క్రీశ. 360లో సముద్రగుప్తుడు దక్షిణభారతదేశాన్ని దండెత్తి పిష్టపుర రాజ్యాన్ని పాలిస్తున్న మహేంద్రుడనే రాజుని జయించానని అలహాబాదు శాసనంలో చెప్పు కొన్నాడు. సాధారణంగా ఏదైనా ఒక రాజ్యాన్ని జయించినపుడు ఆ రాజ్యదైవంగా పూజలందుకొంటున్న ఆలయప్రతిమలను తీసుకొనిపోయి తమ రాజ్యంలో ప్రతిష్టించు కోవటం ఒక ఆనవాయితీ. దీనికి ఖారవేలుని నుండి కృష్ణదేవరాయల వరకూ అనేక ఉదాహరణలు చరిత్రలో కనిపిస్తాయి. పైన చెప్పబడిన పిష్టపురికాదేవి పిష్టపుర రాజ్యంలో కొలువుండిన రాజ్యలక్ష్మి కావొచ్చు. సముద్రగుప్తుడు ఆ దేవతా విగ్రహాన్ని తన రాజ్యానికి తరలించుకుపోయి, అక్కడ నెలకొల్పి ఆలయనిర్మాణం గావించి ఉంటాడా అనేది ఆలోచించాల్సిన విషయం. సముద్రగుప్తుని తరువాతి కాలంలో వచ్చిన అక్కడి రాజులు పిష్టపురికాదేవిని కొలిచార నటానికి పైన చెప్పిన ఆధారాలు సాక్ష్యంగా నిలుస్తాయి.

దక్షయజ్ఞంలో అవమానింపబడి ప్రాణత్యాగం చేసుకొన్న సతీదేవి మృతదేహాన్ని శివుడు భుజాన వేసుకొని విరాగియై తిరుగుతున్నప్పుడు, ఆ విధమైన వైరాగ్యం మంచిది కాదని విష్ణుమూర్తి తన సుదర్శన చక్రంతో సతీదేవి మృతదేహాన్ని ఖండించాడు. అలా ఆ పార్వతీదేవి దేహభాగాలు పడిన పద్దెనిమిది చోట్ల అష్టాదశ శక్తిపీఠాలు నెలకొన్నాయి. తుంటిభాగం పడిన ప్రదేశం కనుక పిఠాపురంలోని శక్తిపీఠం పురుహూతిక అయిందని పురాణశ్రుతి. శక్తిపీఠం ఉన్నది కనుక ఈ ఊరికి పీఠికాపురం అనే పేరు వచ్చిందని అంటారు.

శక్తి ఆరాధన భారతీయ సంస్కృతిలో భాగం. రుగ్వేదంలో అంబిక, ఉమ, దుర్గ, కాళి లాంటి పేర్లతో శక్తి కల్ట్ కనిపిస్తుంది. మార్కండేయ, దేవి మహత్య పురాణాలలో శక్తి కల్ట్ (ఆరాధన) జగన్మాత, జగదాంబగా చెప్పబడింది. రుగ్వేదంలోని (X 61) ప్రజాపతి యజ్ఞం ఘట్టాన్ని కొంతమార్చి నాలుగో శతాబ్దంలో గుప్తుల పాలనలో దక్షయజ్ఞం కథగా పురాణాలలో వ్రాయటం జరిగిందంటారు. ఇదే గాథను మధ్యయుగాలలో శక్తిపీఠాలు ఎలాపుట్టాయో చెప్పే స్థలపురాణాలకు హేతువుగా తీసుకొన్నారు.[54] గుప్తులకంటే ముందే

54. బుద్ధుని దేహ అవశేషాలపై బౌద్ధస్తూపాలు నిర్మించటం అనే ఆచారం దీనికి ప్రేరణఅయి ఉండవచ్చు అని D.C. Sircar అనే చరిత్రకారుడు (The Sakta Pithas pn.6) అభిప్రాయ పడ్డాడు.

వ్రాయబడిన మహాభారత వనపర్వంలో మూడు శక్తిపీఠాల ప్రస్తావన మాత్రమే కనిపిస్తుంది. ఎనిమిదో శతాబ్దానికి చెందిన పద్మవజ్రుడు రచించిన Hevajra Tantra అనే బౌద్ధ గ్రంథంలో నాలుగు శక్తి పీఠాలు చెప్పబడ్డాయి. (జలంధర, ఉజ్జయిని, పూర్ణగిరి, కామాపుర). అదే కాలానికి చెందిన కాళికాపురాణంలో ఏడు శక్తిపీఠాలు చెప్పబడ్డాయి. వీటి సంఖ్య క్రమక్రమంగా పెరుగుతూ రావటం గమనించవచ్చు[55]. పదకొండవ శతాబ్దానికి చెందిన Rudrayamala అనే గ్రంథంలో పది శక్తిపీఠాలు కనిపిస్తాయి. వీటిలో దక్షిణభారతానికి చెందిన కంచి, మధుర దేవాలయాలు కొత్తగా చేర్చబడ్డాయి. శక్తిపీఠాలు 51 అని 108 అనీ వివిధ సంఖ్యలు వివిధ గ్రంథాలలో ఉన్నప్పటికీ ఆదిశంకరాచార్యుని విరచితముగా చెప్పబడే *"లంకాయాం శంకరీదేవీ, కామాక్షీ కాంచికాపురే...* అనే శ్లోకంద్వారా శక్తిపీఠాల సంఖ్య 18 గా ప్రామాణికమై నిలిచింది. ఆ శ్లోకంలో పిఠాపురం పురూహూతికాశక్తిపీఠం పదవ పేరుగా ఉన్నది.

ముగింపు

నేటి సమాజం మతప్రాతిపదికన నిలువునా చీలిపోయింది. హిందుయేతర మతాలు అన్యమతాలుగా పరిగణింపబడుతున్నాయి. మధ్యయుగంలో భారతదేశానికి వచ్చిన ముస్లిములను బయటనుంచి వచ్చినవారిగా, అదే విధంగా కలోనియల్ పాలనలో క్రిష్టియన్ మతం స్థానిక ప్రజలను మార్పిడులకు గురిచేసినట్లుగా మతవాదులు అభిప్రాయపడతారు. బ్రిటిష్ పాలకులు జనగణన చేసేటపుడు భారతదేశ ప్రజలకు మతం, కులం అనే అస్తిత్వాలను ఆపాదించి విభజించారని ఆ కారణంగా సమకాలీనసమాజం నేడు భిన్న సమూహాలుగా బిగుసుకుపోయిందని మరి కొందరి అభిప్రాయం.

బ్రిటిష్ పాలనకు ముందు భారతీయసమాజం అంతా ఏకతాటిపై లేకపోయినప్పటికీ క్రీస్తుపూర్వకాలం నుంచీ ఈ నేలపై భిన్నవిశ్వాసాలు సహజీవనం చేసేవి. బౌద్ధం, జైనం, హిందూమతం, ఇస్లామ్ విశ్వాసాలను ఆచరించిన ప్రజలు ఒకప్పుడు కలిసిమెలిసి జీవించారని ఒకరినొకరు గౌరవించుకొన్నారని చరిత్రలో అనేక ఆధారాలు కనిపిస్తాయి. క్రీశ. 1324 నాటి విలస తామ్రశాసనంలో తెలుగునాట తుగ్లక్ యుద్ధోన్మాదంతో జరిపిన అకృత్యాలను రికార్డు చేస్తుంది. ఆధిపత్యపోరులలో "యుద్ధోన్మాదంతో జరిగిన విధ్వంసాన్ని" మినహాయిస్తే "ప్రశాంత పాలనాసమయంలో"[56] హిందూ ముస్లిమ్ సంస్కృతులు సమాజంలో కలగలసిపోవటం గమనించవచ్చు.

---

55. Ibid

56. Temple Desecration in Pre-modern India part I and II by Richard M Eaton

కృష్ణదేవరాయలు మసీదులు కట్టించాడు, పర్షియన్ తరహా నిర్మాణాలు నిర్మించాడు. హిందూరాజులలో "సుల్తాను" అని పిలిపించుకోవటం ఒక బిరుదుగామారింది. ఇబ్రహిం కుతుబ్ షాను మల్కిభరాముని‌గా కవులు సొంతం చేసుకొన్నారు. సాహిత్యం, శాసనాలలో ఎక్కడా ముస్లిమ్ వ్యతిరేకత కనిపించదు. కుతుబ్ షాహి పాలనలో ప్రభుత్వ ఉత్తర్వులు తెలుగులో కూడా వెలువరించేవారు. ఈ కాలంలోనే తెలుగుభాషలోకి అనేక ఉర్దూపదాలు వచ్చి చేరాయి. సూఫీ, పీర్ల సంస్కృతులు సమాజంలో ఆదరణ పొందాయి ఒరిస్సారాజులకు గజపతులని, విజయనగర రాజులను నరపతులని, గోల్కొండరాజులను అశ్వపతులని సమానహోదాతో హిందూ ముస్లిమ్ రాజులు వ్యవరించుకొన్నారు. దీనికి ప్రధానకారణం అనాదిగా భారతదేశంలో భిన్న సంస్కృతులు ఒక జీవనవిధానంగా ఉండటమే.

శాతవాహనులు హిందూ మతాన్ని అవలంబించినా అనేక బౌద్ధ ఆరామాలు, చైత్యాలు నిర్మించారు వాటి నిర్వహణకు దానాలు ఇచ్చారు. కొన్ని శాతవాహన నాణాలపై జైనమతానికి చెందిన శ్రీవత్స ముద్ర ఉండటాన్ని బట్టి వారు జైనాన్ని కూడా సమాదరించారని అనుకోవచ్చు.

జైనమతానికి చెందిన కళింగరాజు ఖారవేలునికి "సర్వ పసంద పూజక" (అన్ని ఆరాధన పద్ధతులను గౌరవించేవాడు) "సర్వ దేవయతన సంస్కరణ" (అన్ని ఆరాధనా విధానాలకు ఆలయాలు నిర్మించేవాడు) అనే బిరుదులు[57]కలవు.

కుబ్జ విష్ణువర్ధనుడు తాను వైష్ణవుడని చెప్పుకొన్నప్పటికీ ఇతని భార్య అయ్యణ మహాదేవి జైన మతాన్ని అవలంబించింది. జైనులకు అనేక బసతులను నిర్మించింది. విష్ణువర్ధనుడి కాలంలోనే పిఠాపురం గొప్ప బౌద్ధక్షేత్రంగా విలసిల్లటం మరో విశేషం.

గుణగవిజయాదిత్యుడు శైవుడైనప్పటికీ ఇతని వద్ద సేనానిగా పనిచేసిన పండరంగని కుటుంబ సభ్యులు జైనమతాన్ని పాటించేవారు. శైవమతాలంబక రెండవ అమ్మరాజు ఒక జినాలయానికి మైలంపూడి అనే గ్రామాన్ని దానంగా ఇచ్చాడు.

క్రీశ.ఆరోశతాబ్దంలో కోనసీమను పాలించిన పృధ్వీమూలుడు హిందువు. ఇతని కొడుకు హరివర్మ, కూతురు పరమభట్టారక బౌద్ధమతాన్ని అవలంబించారు. అది ఆనాటి మతస్వేచ్ఛ.[58]

57. Jain Journal, Volume 38, P 109
58. Raja Prithvimula, by M. Ramarao, SVU Oriental Journal Vol X p.no 63.

ద్రాక్షారామంలో కూడా ఒక శైవ మఠంలో ముస్లింగురుశిష్య బృందానికి ఆశ్రయం ఇచ్చినట్లు జనశ్రుతి ఉంది.

ఈ ప్రాంతంలో ఒకసమయంలో హిందూ, బౌద్ధం, జైనమతాలు సమాదరణ పొందాయి. చాలాకాలం ప్రజలు భిన్నవిశ్వాసాలను పాటిస్తూ, ఒకరిపట్ల మరొకరు సహిష్ణుత ప్రదర్శించుకొంటూ కలిసిమెలసి జీవించారనటానికి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన కుయ్యేరు గ్రామంలో ఒక ప్రాచీన జైనాలయానికి చెందిన స్తంభంపై జైన, హిందూ శిల్పాలను పక్కపక్కనే ఉండటం గమనించవచ్చును నేటికీ. (Figure 5) కాలక్రమేణా కొన్ని విశ్వాసాలు రాజాదరణ కోల్పోవటంతో క్రమేపీ కనుమరుగయ్యాయి. అయినప్పటికీ ఈ వ్యాస ప్రారంభంలో చెప్పినట్లు భారతీయ సంస్కృతిని ప్రతిబింబించే జైన, బౌద్ధ, హిందూ, ముస్లిం, గురుపూజ సంప్రదాయాలకు పిఠాపురం అనాదిగా ఆలవాలంగా ఉంటూ వస్తున్నది.

అమరధామంలా శోభిల్లే రాజమహేంద్రి

రాజమహేంద్రవరం దాటిన తరువాత గోదావరి నది ఏడుపాయలుగా విడిపోతుంది. గౌతమి, వశిష్ట, వైనతేయ, ఆత్రేయ, భరద్వాజ, తుల్యభాగ, కశ్యప. వీటిలో గౌతమి, వశిష్ట, వైనతేయలు ప్రవహించే నదులు, మిగిలినవి అంతర్వాహినులు. క్రీపూ. నాలుగో శతాబ్దానికి చెందిన బ్రహ్మాండపురాణంలో ఈ ఏడుపాయలు సప్త గోదావరిగా చెప్పబడ్డాయి.తూర్పుగోదావరి జిల్లాలో పోలవరం, రంపచోడవరం ఎల్లవరం, వీరవరం, పెద్దాపురం, ఏలేశ్వరం, బొమ్మూరులాంటి అనేకచోట్ల Paleolithic cultures అవశేషాలు లభ్యమయ్యాయి.[1] ఇవి ఎక్కువగా మెట్టప్రాంతాలలో లభిస్తున్నాయి. నదీతీరప్రాంతంలో ఏటా వచ్చే వరదలకు ఏ విధమైన పూర్వయుగ ఆనవాళ్ళు నిలవటం కష్టం.

పురాణాలలో ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆంధ్ర అన్న శబ్దం వాడుకలో ఉండేది. బౌద్ధులు ఆంధ్రను నాగరాష్ట్రమని, ఆంధ్రులను నాగులు, యక్షులు అని పిలుచుకొనేవారు. మెగస్తనీసు ఆంధ్రులకు ప్రాకారాలు కలిగిన ముప్పై పట్టణాలు ఉన్నాయని వారు చాలా బలవంతులని చెప్పాడు. టొలెమీ ఆంధ్రను మైసోలియా అన్నాడు. పెరిప్లస్ అనే గ్రంథంలో మసాలియ అని ఉన్నది. క్రీ.పూ. నాలుగో శతాబ్దానికి చెందిన నందరాజులు ఆంధ్రప్రాంతాన్ని పాలించారని కళింగరాజు ఖారవేలుడు వేయించిన హాతి గుంఫ శాసనం ద్వారా తెలుస్తుంది. అప్పట్లో కళింగరాజ్యం గోదావరి తీరం వరకూ ఉండేది. నందుల తరువాత మౌర్యులు ఆ తరువాత క్రీశ. రెండో శతాబ్దంవరకూ శాతవాహనులు ఈ ప్రాంతాన్ని పాలించారు.

క్రీపూ. 4 నుండి క్రీశ. 6 వ శతాబ్దం మధ్యలో నిర్మించిన బౌద్ధస్థూపాలు గోదావరి, కృష్ణాతీరప్రాంతంలో విస్తారంగా కనిపిస్తాయి. అశోకుని ఎర్రగుడి శాసనంలో "ఆంధ్రులు

1. Stone Age cultures of the Eleru River Vally in East Godavari District, Andhra Pradesh PhD by M. Kasturi Bai

ఇప్పటికే బౌద్ధ ధర్మాన్ని అవలంబిస్తున్నారని ఉండటాన్ని" బట్టి అశోకునికాలం కన్నా ముందే ఆంధ్రలో బౌద్ధమతం విస్తరించిందని భావించాలి. దేశం మొత్తం మీద ఆంధ్రలో ఉన్నన్ని అతి ప్రాచీన కట్టడ అవశేషాలు మరెక్కడా లేవు. నేటికి కూడా ఏ ప్రాంతంలో తవ్వినా బౌద్ధ లేదా జైన శిథిలాలు బయటపడుతూంటాయి.ఆ తరువాత క్రీశ.మూడవ శతాబ్దం నుండి హిందు మతం విస్తరించింది.

ఇటీవల కాలంలో రాజమహేంద్రవరం సమీపంలో కాపవరం వద్ద బౌద్ధఆరామం బయటపడింది. బొమ్మూరు దగ్గర సన్యాసుల మెట్టపై మట్టిపాత్రలు, పెంకులు దొరికాయి. ఇవి బౌద్ధుల కాలానికి చెందినవి. తవ్వకాలు జరిపితే ఇక్కడ బౌద్ధస్థూపం ఉండవచ్చు. కాతేరు వద్ద బౌద్ధ అవశేషాలు లభించాయి. రాజమహేంద్రవరం బౌద్ధులకాలం నుంచే జనావాస ప్రాంతమని అర్థమౌతుంది.[2]

తీరప్రాంతానికి సంబంధించి కళింగ, పెదవేగిలు క్రీస్తుపూర్వం నుంచి ప్రాముఖ్యం కలిగిన రాజ్యాలు. ఈ రెండు ప్రాంతాల మధ్య రాకపోకలు పెదవేగి నుండి బయలుదేరి బొబ్బర్లంక-ధవళేశ్వరం వద్ద గోదావరిని దాటి పిఠాపురం మీదుగా జరిగేవి. ఈ మార్గపు ప్రాచీనతను దారిమధ్యలో వచ్చే రామచంద్రపురం, బిక్కవోలు, ఆర్యావటం జల్లూరు, కాకినాడ, పిఠాపురం కొడవలి, శంకరం, రామతీర్థం లాంటి ప్రాంతాలలో ఉన్న బౌద్ధ, జైన అవశేషాలు నిరూపిస్తాయి. ఈ దారిని సుమారు రెండువేల సంవత్సరాలనాటి జాతీయరహదారిగా అనుకోవచ్చు[3]. గోదావరిని రాజమహేంద్రవరం వద్ద దాటకపోవటాన్ని గమనిస్తే ఆనాటి రాజమహేంద్రవర ప్రదేశం నిర్జనప్రాంతమైతే కాకపోవచ్చు కానీ ఇంకా ఒక ప్రముఖ పట్టణంగా రూపుదిద్దుకొని ఉండకపోవచ్చు.

Robert Sewell రాజమహేంద్ర పట్టణాన్ని నిర్మించిన వ్యక్తులంటూ ఇద్దరి పేర్లు చెప్పాడు.[4]వారు క్రీస్తుపూర్వం తొమ్మిదో శతాబ్దానికి చెందిన కళింగ చక్రవర్తి గౌతమి దేవుని కుమారుడైన మహేంద్రదేవుడు ఇంకా చాళుక్యరాజు విజయాదిత్య మహేంద్రుడు.

పూరి జగన్నాథుని ఆలయంలో దొరికిన "పురుషోత్తమ చంద్రిక" అనే తాళపత్ర గ్రంథంలో పూర్వ ఒరిస్సాను పాలించిన రాజుల వంశావళి పేర్కొనబడింది. ఇందులో

2. The Evolution And Growth Of An Ancient City Rajamahendravaram - www.academia.edu
3. Budhist Remains of Andhra by K.R. Subramanian – p.vii.
4. Antiquarian Remains of Madras Presidency

గౌతమదేవు క్రీస్తుపూర్వం తొమ్మిదోశతాబ్దంలో గోదావరి తీరంవరకు తన రాజ్యాన్ని విస్తరించాడని, ఇతని కొడుకు మహేంద్రదేవు తనపేరున రాజమహేంద్రవరం అనే పట్టణాన్ని నిర్మించినట్లు ఉంది.[5] ఈ వివరాలను ధృవపరచే ఇతర చారిత్రిక ఆధారాలు లేవు కనుక దీన్ని విశ్వసించలేం. ఈ ప్రాంతాన్ని పాలించిన తూర్పుచాళుక్యులు రాజమహేంద్ర పట్టణాన్ని నిర్మించారని చరిత్రకారులందరూ అంగీకరించారు.

తూర్పుచాళుక్య రాజులు/వేంగిరాజులు తమ రాజధానులను తరచూ మార్చుతూ ఉండేవారు. మొదటగా పిష్టపురం (పిఠాపురం), తరువాత పెద్దవేగి (ఏలూరు వద్ద), కొంతకాలం బెజవాడ, పిదప వేమగిరి చివరగా రాజమహేంద్రవరం. ఇవి కాక సామర్లకోట చాళుక్య భీమవర, బిక్కవోలు లలో కూడా నివసించేవారు. నిత్యం రణస్థలంగా ఉండే ప్రాంతం కనుక రక్షణ కొరకు తమ నివాసస్థలాలను మార్చుతూ ఉండేవారని అనుకోవచ్చు. అంతే కాక అప్పట్లో యుద్ధాలలో విజేతలు పరాజితుల నగరాలను దగ్ధం చేసేవారు. అది కూడా కారణంగా కావొచ్చు.

Henry Morris 1878లో రాజమహేంద్రవరం గురించి వ్రాస్తూ, ఈ పట్టణాన్ని మొదటి లేదా రెండవ అమ్మరాజులలో ఎవరో నిర్మించి ఉంటారని కాగా రాజమహేంద్రవరం అనేపట్టణాన్ని విజయాదిత్య మహేంద్రుడు నిర్మించాడని స్థానిక కథనాలు చెపుతున్నాయని అన్నాడు.[6]

'రాజమహేంద్ర" బిరుదు కలిగిన మొదటి అమ్మరాజ విష్ణువర్ధనుడు రాజమహేంద్ర పట్టణాన్ని నిర్మించి ఉంటాడని చిలుకూరి వీరభద్రరావు, భావరాజు వెంకట కృష్ణారావులు అభిప్రాయపడ్డారు. రాజమహేంద్ర అనే బిరుదు మొదటి, రెండవ అమ్మరాజులకే కాక రాజరాజ నరేంద్రునికి కూడా ఉండటంచే రాజరాజనరేంద్రుడు రాజమహేంద్రపట్టణాన్ని నిర్మించి ఉంటాడని నేలటూరి వెంకట రమణయ్య అభిప్రాయపడ్డారు.[8]

ఇక మొదటి అమ్మరాజు రెండవ అమ్మరాజులు రాజమహేంద్రపట్టణాన్ని నిర్మించినట్లు ఏ రకమైన ఆధారాలు కనిపించవు. వీరు "రాజమహేంద్ర" అనే బిరుదును కలిగి ఉన్నారు

5. Lists of Inscriptions and sketch of dynasties of southern India, Robert Sewell vol 8 pn 204 "Gautam Deva Extended the kingdom of Orissa to the Godavari river. Mahendra Deva founded the town of Rajamahendri as his Capital"
6. Descriptive and historical account of Godavary District by Henry Morris
8. శ్రీ రాజరాజ నరేంద్రపట్టాభిషేక సంచిక, శ్రీ ఎమ్. రవికృష్ణ 2015 పే. 323

కనుక Henry Morris అలా అనుకొని ఉండొచ్చు. అంతేకాదు రాజమహేంద్రపట్టణాన్ని నిర్మించినట్లు ప్రత్యేకించి ఏ రాజు పేరిటా ఏ విధమైన శాసనాలు కాని దానపత్రాలు కాని కానరావు.

రాజమహేంద్రి ప్రాచీన నామం జననాథపురం

రాజమహేంద్రవరం అనే పేరు క్రీశ.13వ శతాబ్దంవరకూ శాసనాలలో ఎక్కడా కన్పించదు. అంతవరకూ రాజమహేంద్రవరం కేంద్రంగా జరిగి ఉండచ్చు అని భావించ టానికి అవకాశం ఉన్న ఘట్టాలన్నీ "జననాథపురం[9]" అనే పేరుగల పట్టణంలో జరిగినట్లు వివిధ శాసనాలలో కనిపిస్తుంది. కుళోత్తుంగుడు క్రీశ.1078 లో తన రెండవ కుమారుడైన ముమ్మడి రాజరాజ చోడుని వేంగి రాజ్యానికి "జననాథపుర" లో పట్టాభిషిక్తుడిని చేసాడని రాజరాజచోడగంగ వేయించిన క్రీశ.1099 నాటి టేకి, పిఠాపురం తామ్ర శాసనాలలో ఉన్నది[10]

వీరచోడుని (క్రీశ.1078-83) పిఠాపురం ఫలకంలో అతను "జననాథనగరి" నుంచి పాలించినట్లు ఉన్నది.[11]

---

9. జననాథ పురం అనే పేరు ఎలా వచ్చి ఉండవచ్చుననటానికి రెండు అవకాశాలు ఊహించవచ్చు. విమలాదిత్యుని మామగారైన రాజరాజ చోళచక్రవర్తికి (క్రీశ.985-1014) "జన నాథుడు" అనే బిరుదు కలదు. జననాథుడు అంటే ప్రజలను కాపాడేవాడు అని అర్థం. అలా ఈ పట్టణం జననాధపురం అయ్యే అవకాశం కలదు.

   తూర్పుచాళుక్యులు జైనమతాన్ని ఎక్కువగా ప్రోత్సహించారు. మొదటి చాళుక్య భీముడు, రెండవ అమ్మరాజులు జైనాన్ని ఆదరించారు. ఈ విమలాదిత్యుడు (క్రీశ. 1011-1018) త్రైలోక్యదేవ సిద్ధాంతదేవ అనే జైనాచార్య గురువు వద్ద జైనమతాన్ని స్వీకరించి కన్నడదేశం నుంచి అనేకమంది జైనగురువులను ఆంధ్రదేశానికి ఆహ్వానించి ప్రచారం చేసుకొమ్మని అనుమతించాడు. ఈ గురువు విశాఖపట్నం రామతీర్థం వద్ద నివసించేవాడు. జిననాథుడు/పార్శ్వనాథుడు పేరిట కట్టిన నగరం కనుక (జ)జిననాథపురం అనే పేరు వచ్చి ఉండవచ్చనే అవకాసాన్ని త్రోసిపుచ్చలేం. దీనికి తార్కాణంగా కర్ణాటకలోని శ్రావణబెళగొళ వద్ద "జిననాథపురం" పేరిట ప్రముఖ జైనక్షేత్రం కలదు. రాజరాజనరేంద్రుని పాలనలో హిందూమతం ప్రాచుర్యం పొందటంతో జైన మూలాల విస్మరింపు జరిగి ఉండొచ్చు.

10. EI Vol 6 p. 346 - Line 76 – "The City named Jananatha"
11. Topographical list of Sewell Inscriptions 68

క్రీశ. 1115 లో విక్రమాదిత్య VI, చోళ సైన్యాన్ని వేంగినుంచి తరిమివేసి, గొంక రాజును బంధీగావించి, బెజవాడ,కొండపల్లి,"జననాథపుర"లను జయించినట్లు చెప్పు కొన్నాడు. క్రీశ. 1126 నాటి మరో శాసనములో విక్రమాదిత్య VI వేంగిపురాన్ని ధ్వంసం చేసి, "జననాథపురం" లోని యువరాజును ఓడించి, గొంకరాజును జయించాడు అని ఉన్నది. క్రీశ. 1192 నాటి ఒక తమిళఆలయశాసనంలో వేంగిరాజ్యంలోని "జననాథ చతుర్వేదిమంగళం"కి చెందిన మాధవభట్ట అనే వ్యక్తి అఖండదీపాన్ని సమర్పించుకొన్నట్లు ఉన్నది.[12]

ఈ జననాథపురం(నగరి) ని శ్రీ హెచ్.కృష్ణశాస్త్రి,[13] Yazdani G,[14] Dhirendra Chandra Ganguly,[15] Krishnaswwamy Ayangar[16] లాంటి ప్రముఖ చరిత్ర కారులు రాజమహేంద్రవరంగా గుర్తించారు.

శ్రీ ఎమ్.సోమశేఖరశర్మ The Chronology; of the Eastern Chalukyas అనే వ్యాసంలో "జననాథ నగరిని" ద్రాక్షారామం అని అభిప్రాయపడ్డారు.[17] కానీ – వీరచోడుని క్రీశ 1081 చెల్లూరు దానశాసనంలో వేంగి జననాథనగరి కోటలోకి ప్రవేశించాను అని 75వ లైనులో; ఇదే శాసనంలో ద్రాక్షారామంలో, బ్రాహ్మణులకొరకు సత్రాన్ని నిర్మించాను అని 97వ లైనులో ఉన్నది. ఒకే శాసనములో రెండు ఊర్ల పేర్లు విడివిడిగా రావటాన్ని బట్టి ఈ రెండు వేరు వేరు ప్రాంతాలు అని నిర్ధారించవచ్చు. కనుక జననాథనగరి ద్రాక్షారామం అయ్యే అవకాశం లేదు.[18]

రాజమహేంద్రపట్టణం అనే పేరు మొట్టమొదటి సారిగా క్రీశ. 1272 లో శ్రీకూర్మం ఆలయంలో కల ఒకశాసనంలో కనిపిస్తుంది.[19] ఆ తరువాతి శాసనాలలో "రాజమహేంద్ర పట్టణ" అన్న పదం క్రమేపీ "రాజమహేంద్రపుర" గా మార్పు చెందుతూ వచ్చింది.[20]

---

12. శాసన సంఖ్య 535 of 1911 …Vengipurattu Madhavabhatta of Jananatha-chaturvedimangalam...
13. Epigraphia Indica Vol V p. 71
14. The Early history of the Deccan (1960) p 60.
15. The Eastern Calukyas p.n 162
16. Ancient India by S Krishnaswami Aiyangar p.n 224
17. Journal of Oriental Research Madras, Vol 9 1935 P.45
18. The Indian Antiquary Vol 19, P 436. …. he established himself in the palace at the city of Jananathanagari (line.75) // At the pure Draksharama… he established Two sattras for feeding brahmanas (line.97)
19. EI Vol 5 p. 32 – verse 4- ... Residing in Rajamahendrapattana, which was crowded with princes ....
20. శాసనం నం 365 of 1899 … కొండపల్లి, రాజమహేంద్రావరం మొదలయిన దుర్గాలను సాధించి సింహ్యాద్రికి విచ్చేసి....

పై నిదర్శనాలను బట్టి రాజమహేంద్రపట్టణానికి ఆ పేరు 13వ శతాబ్దం నుంచి స్థిరపడిందని, అంతకు మునుపు అది జననాథపురంగా పిలువబడి ఉండొచ్చునని అర్థమౌతుంది. ఈ కోణంలోంచి చూస్తే "రాజమహేంద్ర" అనే బిరుదును కలిగి ఉన్నారు కనుక 10వ శతాబ్దానికి చెందిన మొదటి లేదా రెండవ అమ్మరాజు లేదా 11వ శతాబ్దానికి చెందిన రాజరాజనరేంద్రుడులలో ఎవరో ఒకరు ఈ పట్టణాన్ని నిర్మించి ఉంటారన్న వాదన వీగిపోతుంది.

రాజమహేంద్రవరాన్ని ఎవరు నిర్మించారు?

Robert Sewell, Henry Morris లు చెప్పిన విజయాదిత్య మహేంద్రుని వివరాలు మనకు కాలిన్ మెకంజీ సేకరించిన రాజమహేంద్రవరం కైఫియ్యతులో[21] లభిస్తాయి. కైఫియ్యతులు అనూచానంగా తాటియాకులపై మనపూర్వీకులు భద్రపరచిన చారిత్రిక సమాచారం. రాజమహేంద్రవరం కైఫియ్యతు 1820 లలో సేకరించబడినది.

"// కలివిష్ణువర్ధనుడి కొమారుడు విజయాదిత్య మహేంద్రుడనే రాజు ఆంధ్రదేశం రాజరికం చేస్తూ వుండి యొకనాటి కాలమందున వేట సరదాచేసి సమస్తసైన్యముతోట్టున్ను హ్యేమగిరి పర్వతానకు సమస్త సాధనములతోను వెళ్ళి కొంతసేపు వేటలాడి ఆ కొండపై నెత్తంపరుపు విశాలంవుండియున్నది గనుక అక్కడ పట్నం కట్టిస్తే బహు జాగ్రతగానుండును అని ఆలోచనచేసి అడవిలోనొక గొల్లవాడు మేకలమందమేపుతూ వుండగా వానిదగ్గరకి పిలిచి 'హోరీ యిక్కడ పట్టణము కట్టితే యేలాగువుంటుందిరా' అని ఆలోచన అడిగితే ఆ గొల్లవాడు రాజును జూచి దండము బెట్టి 'బాబుగారు యిది యెప్పుడు పాడుగాదు' అని అన్నాడు. వాడినోట శుభదమన్న వాక్యం వచ్చినదిగనుక ఆ క్షణమందే వానినోటినిండా వరహాలుపోయించి ఆ స్థలమందు కుంభము వండిపోయించి హ్యేమగిరి కొండమీద విశాలముగా దుర్గము కట్టించినారు. // ఆ దుర్గానికి వాయువ్య భాగమందు విస్తారమయిన ఆవయున్నది. ఆ ఆవలోన తామర విస్తారం కలదు. హ్యేమగిరి దుర్గము మొదలుకొని రెండుక్రోసులు దూరముపర్యంతము రాజమహేంద్రవరము అనేపేరిట పట్టణము కట్టించి పట్టణమునకు ఉత్తర భాగము నందు నేలకోటయొకటి కట్టించినారు// కోటకు దక్షిణభాగమందు పురద్వారమునకు సమీపమున గోపాలస్వామి ఆలయము కట్టించినారు. ఇంకా మార్కండేయ

21. AP Archives kaifiyat s R No 1084

ఆలయము పట్టణములో కొన్ని ఈశ్వరాలయములు, విష్ణు ఆలయములు కట్టించి నారు. ఈ ప్రకారము కోటలు, పట్టణములు కట్టించి హేమగిరి దుర్గములో ప్రవేశించి దేశం యవత్తున్ను నలభైనాలుగు సంవత్సరములు రాజరికం చేసినాడు. తరువాత విజయాదిత్యమహేంద్రునకు తమ్ముడయిన విక్రమాదిత్యుని కుమారుడు చాళుక్య భీమ మహారాజు రాజయి ముప్పై ఆరు సంవత్సరాలు పరిపాలించాడు".

పై ఉదంతంలో చెప్పిన హేమగిరి నేటి వేమగిరి. ఇది రాజమహేంద్రవరానికి పదికిలోమీటర్ల దూరంలో ఉంది. వేమగిరి కొండపై పంతొమ్మిదోశతాబ్దం వరకూ పైన చెప్పిన కోట ఉండేది. "ఈ కోటకు వాయువ్యభాగం అంటే నేటి రాజమహేంద్రవరం పట్టణము". పై వర్ణనను బట్టి అదంతా ఆవభూమిగా (వరదలలో మునిగిపోయే పల్లపునేల), తామరల కొలనుగా ఊహించుకొనవచ్చును. విజయాదిత్య మహేంద్రుడు ఆ ప్రాంతంలో రాజమహేంద్ర పట్టణం నిర్మించినట్లు అర్థమౌతుంది.

ఎవరీ విజయాదిత్య మహేంద్రుడు?

విజయాదిత్య మహేంద్రునికి తండ్రి కలి విష్ణువర్ధనుడని, కుమారుడు చాళుక్య భీముడు అని కైఫియ్యతులో ఉన్నది. చారిత్రికంగా ఈ వ్యక్తి "గుణగ విజయాదిత్యుడు".

గుణగవిజయాదిత్యుడు కలివిష్ణువర్ధనుడి కొడుకు. ఇతను తూర్పుచాళుక్య రాజులలో సుదీర్ఘకాలం పాలించి, రాజనీతిజ్ఞుడిగా, గొప్ప యుద్ధవీరుడిగా అత్యంత పేరు ప్రఖ్యాతులు గడించాడు. క్రీశ.848 లో సింహాసనాన్ని అధిష్టించాడు. 44 ఏండ్లు పరిపాలించాడు. ఇతనికి త్రిపురమర్ద్యమహేశ్వర, త్రిభువనాంకుశ, బిరుదాంకభీమ, గుణకనల్ల అనే బిరుదులు కలవు. అరవీరభయంకరుడైన పండరంగడు, కాదేయరాజ ఇతని సేనానులు, బుద్ధిశాలి అయిన వినయాదిశర్మన్ ఇతని మంత్రి. గుణగవిజయాదిత్యుడు నెల్లూరు కోటను ధ్వంసం చేసి బోయకొట్టములను జయించి వేంగి రాజ్యంలో విలీనంచేసాడు. క్రీశ.866లో గుణగ విజయాదిత్యుడు రాష్ట్రకూట రాజైన అమోఘవర్షుని చేతిలో ఓడిపోయాడు. చాన్నాళ్లు అతనికి సామంతుగా వ్యవహరించాడు. క్రీశ.880 లో అమోఘవర్షుడు మరణించాక గుణగవిజయాదిత్యుడు స్వతంత్రాన్ని ప్రకటించుకొని రాష్ట్రకూటులపై దండెత్తి విజయం సాధించాడు. వారి రాజధాని మన్యఖేతను (కర్ణాటక) నేలమట్టం చేసాడు. రాష్ట్రకూటరాజు రెండవ కృష్ణుడు ఓడిపోయి పారిపోయి తిరిగి గుణవిజయాదిత్యుని వద్దకు ముకుళి తహస్తాలతో శరణార్థియై రాగా అతని రాజ్యాన్ని అతనికి ఇచ్చివేసి భారీ సంపదలను కానుకలుగా స్వీకరించాడు. అనేక ఉత్తర, పశ్చిమ రాజ్యాలను జయించి వారి గంగ,

యమున విజయచిహ్నాలను తనవిగా స్వీకరించి తాను నివసిస్తున్న బిక్కవోలు పట్టణంలో నిర్మించిన ఆలయానికి ద్వారపాలకులుగా చెక్కించాడు.. బిక్కవోలులో గోలింగేశ్వర, చంద్రశేఖర, రాజరాజేశ్వర ఆలయాలను చేబ్రోలులో మహాశేన ఆలయం నిర్మించాడు.

గుణగవిజయాదిత్యుడు తెలుగు భాషను ప్రోత్సహించాడు. ఇతని కాలంలో వేయించిన అద్దంకి పండరంగని శాసనంలో, ఆనాటి తెలుగుభాష తరువోజ చందస్సులో మొదటి సారిగా శాసనాలకు ఎక్కింది. నన్నయపూర్వుడైన[22] నన్నెచోడుడు "*మును మార్గ కవిత లోకంబున వెలయగ దేశి కవిత పుట్టించి తెనుంగును నిలిపిరంద్ర విషయంబున జన చాళుక్య రాజు మొదలుగ పలువుల్*" అంటూ పూర్వ చాళుక్యరాజులు తెలుగుభాషను ప్రోత్సహించారు అన్నాడు. ఏ చాళుక్యరాజో తెలపలేదు. అది బహుసా గుణగవిజయాదిత్యుడే కావొచ్చు. ఇతని సాతులూరు తామ్రశాసనంలోని భాష సంస్కృతమైనప్పటికీ అంత్యప్రాసలున్న చంపకమాల లక్షణాలు ఉండటంచే అది ఎవరో తెలుగు కవి వ్రాసిందేనని అంటారు. గుణగవిజయాదిత్యుని తమ్ముడు యుద్ధమల్లుడు విజయవాడలో కట్టించిన కుమారస్వామి ఆలయ శాసనాన్ని మధ్యాక్కర తెలుగుచందస్సులో వేయించాడు.[23]

గుణగవిజయాదిత్యుడు ఒక యుద్ధంలో శత్రురాజైన మంగిరాజ తలను నరికి దానితో బంతి ఆట ఆడుకొన్నాడని, చక్రకూటాన్ని (త్రికళింగ రాజధాని) దగ్ధం చేసాడని పిఠాపురం శాసనంలో కలదు.[24] ఇతను శివభక్తుడు. వేదవేదాంగాలు నేర్చిన బ్రాహ్మణులకు అనేక గ్రామాలను దానం ఇచ్చినట్లు, కట్లపర్రు, సాతలూరు, పొన్నగి, సిసలి తామ్రశాసనాలు ద్వారా తెలుస్తున్నది. ఇతని పాలన మొదటిదశలో వేంగి రాజ్యాన్ని నెల్లూరు వరకు విస్తరించాడు. రెండో దశలో రాష్ట్రకూటులకు సామంతుగా విశ్వాసపాత్రుడిగా ఉన్నాడు. మూడో దశలో స్వతంత్రుడై గొప్ప విజయాలను సాధించి ఆంధ్రప్రాంతాన్ని శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకూ ఏకం చేసాడు.

---

22. నన్నెచోడుడు నన్నయకంటే పూర్వుడని నేలటూరి వెంకటరమణయ్య, చిలుకూరి వీరభద్రరావు లాంటి చరిత్రకారులు అభిప్రాయపడ్డారు.

23. ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర వాల్యూం 2

24. EI vol 4 p 239 – lines 9 and 10 ... The Great lord Gunaga Vijayadityadeva - the hero who played the game of ball on the battle field with the head of Mangiraja; who burnt Chakrakuta; who frightened Sankila, who recieved elephants as tribute from Kalinga king....

గుణగవిజయాదిత్యుని కుడిభుజం పండరంగడు : గుణగవిజయాదిత్యుని వద్ద సేనాని/కటకాధిపతి/superintendent of royal camp గా ఉన్న పండరంగడు నెల్లూరు లోని బోయకొట్టములను జయించిన వీరునిగా చరిత్రలో నిలిచిపోయాడు. ఇతని కొడుకు పేరు నిరవధ్యధవళ. పండరంగని అనంతరం ఇతను కటకాధిపతి పదవిని పొందాడు. ఇతని కొడుకు పేరు కటకాధిపతి విజయాదిత్య (ప్రభువుపేరు పెట్టుకొన్నట్లున్నారు). ఇతని కొడుకు పేరు దుర్గరాజ. ఈ దుర్గరాజ రెండవ అమ్మరాజు వద్ద కటకాధిపతిగా ఉన్నాడు. పండరంగని కుటుంబంలోని మూడు తరాలు ఈ చాళుక్య రాజులకు సేవలు అందిస్తూ ఉన్నారు. ఈ పండరంగని కుటుంబం జైనమతాన్ని అవలంబించేది. దుర్గరాజ కటకాభరణ పేరుతో ఒక జినాలయాన్ని నిర్మించాడు. ఈ జినాలయానికి రెండవ అమ్మరాజు మైలంపూడి అనే గ్రామాన్ని దానమిచ్చాడు. ఇది ఒంగోలు అద్దంకి వద్ద కలదు.[25]

గుణగ విజయాదిత్యుడు – అసలైన ఆంధ్రతేజం : తెలుగు వారి చరిత్రలో రాజరాజ నరేంద్రుని (క్రీశ. 1019–1061) గురించి ఎందుకో చాలా ఎక్కువచేసి మాట్లాడుకొంటాం. కానీ చరిత్రలో రాజరాజ నరేంద్రుడు ఆంధ్రదేశాన్ని తమిళరాజులకు తాకట్టు పెట్టిన వ్యక్తిగా కనిపిస్తాడు. ఇతని కాలంలో ఇక్కడ నుంచి అపారమైన సంపదలు తమిళ రాజ్యానికి తరలిపోయాయి. ఏ రకమైన పెద్ద ఆలయాలు ఇతని పాలనలో ఆంధ్రలో నిర్మించబడలేదు. ఇదే కాలంలో తమిళనాట బృహదాలయాల నిర్మాణం జరగటం కాకతాళీయం కాకపోవచ్చు. దాయాదుల గొడవలలో మామగారైన చోళరాజు సహాయం చేస్తే తప్ప సింహాసనం నిలుపుకోలేని పరిస్థితి ఉండేది. తన జీవిత చరమాంకంలో రాజమహేంద్రవరం నుండి తంజావూరు తరలిపోయాడు. మహాభారత అనువాదం ప్రారంభింప చేయటం ఇతడు తెలుగునేలకు చేసిన మేలుగా చెబుతారు కానీ దాని కర్తృత్వం, కాలం విషయాలలో అనేక వివాదాలు ఉన్నాయి.[26] రాజరాజ నరేంద్రుని విషయంలో అర్హతకు మించిన అందలం ఎక్కించామేమో మనం అని అనిపించకమానదు.

నిజానికి ఈ రోజు ఉత్తరాంధ్రనుంచి రాయలసీమ అంటూ ఆంధ్రప్రదేశ్ అని దేన్నైతే మనం పిలుచుకొంటున్నామో ఆ పటం నిర్మాత గుణగ విజయాదిత్యుడు. చోళ, పల్లవరాజులపై దండెత్తి జయించి అపారమైన బంగారాన్ని ఆంధ్రకు తీసుకొచ్చాడు.

25. EI Vol IX p.49

26. నన్నయభట్టారక చారిత్రము – కాశీభట్ల బ్రహ్మయ్య – 1901

ఒకానొక దశలో తన మేనమామ అయిన అమోఘవర్షుని చేతిలో ఓడిపోయి సుమారు పదిహేనేళ్ళు అతను బ్రతికున్నంతకాలమూ సామంతుగా కట్టుబడి ఉన్నాడు. ఇదొక మానవీయకోణంగా అనుకోవచ్చు. పదిహేనేళ్ల ఈ కాలం ఏ రకమైన యుద్ధాలు లేని ప్రశాంత సమయం. చేతినిండా అపారమైన బంగారం ఉంది. అనేక పట్టణాలు, దేవాలయాల నిర్మాణాలు చేసే అవకాశం చిక్కింది. బిక్కవోలులో ఆలయాలు నిర్మించాడు. ఆ రకంగా రాజమహేంద్రవరం పట్టణాన్ని నిర్మించింది గుణగవిజయాదిత్యుడే అవ్వటానికి అవకాశాలు ఎక్కువ.

ఆంధ్రతేజంగా పిలువబడటానికి రాజరాజ నరేంద్రునికంటే గుణగవిజయాదిత్యునికే ఎక్కువ అర్హత ఉందనటం అతిశయోక్తి కాదు.

గుణగవిజయాదిత్యునికి సంతానం లేకుండా క్రీశ. 888 లో మరణించగా మరలా రాష్ట్రకూట రాజైన రెండవ కృష్ణుడు వేంగిరాజ్యంపై ఆధిపత్యంకొరకు నాలుగేళ్ల పాటు అలజడులు సృష్టించారు. గుణవిజయాదిత్యుని సోదరుడు విక్రమాదిత్యుని కుమారుడైన చాళుక్యభీముడు ఆ ఆటంకాలను అధికమించి దాయాదులను సంహరించి క్రీశ. 892 లో వేంగి రాజయ్యాడు. చాళుక్యభీముడు చాళుక్యభీమవరంలో(సామర్లకోట) నివాసం చేసుకొని పాలించాడు. రాజమహేంద్ర పట్టణంలో ఏకాలంలో ఉన్నాడో తెలియరాదు. చాళుక్యభీముడు రాజ్యపాలన చివరలో దేవాలయనిర్మాణం, కళలపోషణలో గడిపాడు. ద్రాక్షారామ భీమేశ్వర, సామర్లకోట ఆలయాలను కట్టించాడు. రాజమహేంద్రవరపట్టణాన్ని ద్వితీయ నివాసస్థలంగా ఏర్పరచుకొని ఉండొచ్చు.ఇతని సామంతుడైన చట్టప ఇంద్రకీలాద్రిపై పార్థేశ్వరాలయం నిర్మించాడు. అత్తిలిశాసనం ద్వారా సంగీతంలో తుంబురునివంటి మల్లప్ప, ఆయన కూతురు గాంధర్వగాయని చెల్లన్న, కవి వృషభ బిరుదాంకితుడు భట్టి వామన (కావ్యాలంకార సూత్ర రచయిత) చాళుక్యభీముని ఆస్థానంలో ఉండేవారని తెలుస్తుంది.[27]

చాళుక్యభీముని తరువాత వేంగిరాజ్యం అంతర్గత కలహాలు, బయటనుంచి రాష్ట్ర కూటుల దాడులతో చాలాకాలం ఒడిదుడుకులను ఎదుర్కొంది. స్వల్పకాలంలోనే ఆర్గురు రాజకుమారులు సింహాసనం ఎక్కి మరణించారు. క్రీశ. 927-933 మధ్య కాలంలో వేంగిని రెండవ యుద్ధమల్లుడు రాష్ట్రకూటుల సాయంతో చేజిక్కించుకొన్నాడు. ఇతను పరిపాలించిన

27. ఆంధ్రుల చరిత్ర, బి.ఎస్. ఎల్ హనుమంతరావు

కాలాన్ని తరువాత రాజులు గుర్తించలేదు. ఈ ఏడేళ్ళను శాసనాలలో "అస్వామిక" అంటే రాజులేని కాలంగా వర్ణించారు. రెండవ అమ్మరాజు (క్రీశ.945-970) రాజమహేంద్ర పట్టణంలో అధికారనివాసంగా చేసుకొని వేంగిరాజ్యపగ్గాలు చేపట్టి పాలించినకాలం కొంత సుస్థిరమైనదిగా నిలిచింది. అమ్మరాజు సోదరుడు దనార్ణవుడు రాష్ట్రకూటుల సహాయంతో క్రీశ.970లో అమ్మరాజును చంపి సింహాసనాన్ని హస్తగతం చేసుకొన్నాడు. ఇతను మూడేళ్ళే పాలించాడు ఇతను జటాచోడభీముని చేతిలో హతమయ్యాడు. దనార్ణవుని కొడుకులైన శక్తివర్మ, విమలాదిత్యుడులు కళింగ పారిపోయారు. జటాచోడభీముడు కళింగనుకూడా జయించటంతో ఈ శక్తివర్మ, విమలాదిత్యుడులు తంజావూరులోని చోళచక్రవర్తి శరణు జొచ్చారు. చోళచక్రవర్తి రాజరాజ చోళుడు తనకుమార్తె కుందవాయిని విమలాదిత్యునికి ఇచ్చి వివాహం చేసి చాళుక్య-చోళ రాజ్యాల మేళనానికి బీజం వేసాడు.[28]

ఈ విమలాదిత్యునికి, కుందవాయికి పుట్టిన కొడుకు రాజరాజ నరేంద్రుడు. రాజరాజనరేంద్రుని కాలంలో (క్రీశ.1019-1061) రాజమహేంద్ర పట్టణ వైభోగం ఉజ్వలస్థితిని అందుకొంది. రాజరాజనరేంద్రుడు దాయాదులనుండి తన సింహాసనాన్ని కాపాడుకొనే క్రమంలో అనేక యుద్ధాలను ఎదుర్కొన్నాడు, తంజావూరులోని తన మామ గారైన చోళచక్రవర్తి సహాయం తీసుకొన్నాడు. క్రీశ.1053లో రాజరాజనరేంద్రుడు పశ్చిమచాళుక్య సోమేశ్వరునితో చేతిలో ఓడి గత్యంతరంలేక సమాధానపడి అతని సార్వభౌమత్వాన్ని అంగీకరించి ఒక సామంతుగా కొంతకాలం వేంగిని పాలించినాడు. ఇతని పాలనలో నన్నయ[29] మహా భారతాన్ని ఆంధ్రీకరించాడు.

---

28. వేంగిచాళుక్యులకు చోళరాజులకు మధ్య వివాహ సంబంధాలు మూడుతరాలపాటు కొనసాగాయి. చోళచక్రవర్తి రాజరాజచోళుని కొడుకు రాజేంద్ర I తన కూతురు అమ్మంగను విమలాదిత్యుని కొడుకైన రాజరాజనరేంద్రుతో వివాహం జరిపించాడు. రాజేంద్ర II తన కూతురు మధురాంతకిని రాజరాజనరేంద్రుని కొడుకైన రాజేంద్రచోళునకు ఇచ్చి పెళ్ళిచేసాడు. చోళసామ్రాజ్య వారసులు కుట్రలవల్ల హతమైనప్పుడు ఈ రాజేంద్రచోళుడు కుళోత్తుంగ I పేరుతో చోళ సింహాసనాన్ని అధిష్టించాడు. (ఈ కుట్రలో రాజేంద్రచోళుని పాత్ర ఉందంటారు) ఈ మూడు తరాలలో వేంగి సామ్రాజ్యం తన అస్తిత్వాన్ని కోల్పోయి అంతిమంగా చోళ సామ్రాజ్యంలో విలీనం అయింది.

29. మహాభారతం అవతారిక1.1.8 గద్యంలోని వేంగీదేశంబునకు నాయక రత్నంబునుంబోని రాజమహేంద్రపురంబునందు.... అనే వాక్యం కలదు. కానీ నన్నయకాలానికి రాజమహేంద్రపురం అనే నామ వాడిక ఉన్నట్లు ఇతర చారిత్రిక ఆధారాలు కనిపించవు. నన్నయ వ్రాసిన రాజమహేంద్రపురం అనే మాట బహుసా, తాళపత్రాలనుండి మహాభారతాన్ని పరిష్కరించే సమయంలో చొప్పించినది కావొచ్చును. లేదా 14 వ శతాబ్దపు అనవేమారెడ్డి కాలంలో నన్నయ విరచిత భారత భాగాలు కొన్ని చెదలు పట్టి పాడవడంతో వాటికి చేసిన పునరుద్ధరణలో (బి.వి. కృష్ణారావు) అప్పటికి స్థిరపడిన రాజమహేంద్రపురం అనే మాట చేరి ఉండవచ్చు.

జననాథపురం రాజమహేంద్రపురంగా ఎందుకు మారింది?

రాజరాజనరేంద్రుడు చనిపోయాక పాతశత్రువులు వేంగి రాజ్యాన్ని హస్తగతం చేసుకోవటానికి ప్రయత్నించారు. తంజావూరులోని రాజేంద్రచోళచక్రవర్తి తన కొడుకు వీర రాజేంద్ర, మనుమడు యువరాజు రాజమహేంద్రలను వేంగి రాజ్యం చేజారిపోకుండా రక్షించటానికి పంపాడు. అప్పుడు జరిగిన యుద్ధాలలో వీరిలోని "యువరాజు రాజ మహేంద్ర" క్రీశ. 1063 లో ఇక్కడ చనిపోయాడు. ఈలోపు తంజావూరులో రాజేంద్రచోళ చక్రవర్తి మరణించటంతో వీరరాజేంద్ర చోళసామ్రాజ్యాధినేతగా పగ్గాలు చేపట్టటానికి గంగైకొండచోళపురానికి వెళ్ళిపోయాడు.

మరణించిన చోళచక్రవర్తి మనుమడైన "యువరాజు రాజమహేంద్ర" జ్ఞాపకార్థంగా "జననాథపురం" పేరును "రాజమహేంద్రపురం"గా మార్చి ఉంటారు. యుద్ధాలలో గతించిన వీరుల పేరిట ఆలయాలు నిర్మించటం,[30] ఆత్మీయుల పేరిట ఊర్లకు పేరుపెట్టటం ఈ నేల సంప్రదాయం.

ఈ ప్రతిపాదనకు నిదర్శనంగా – చోళచక్రవర్తిగా పగ్గాలు చేపట్టిన వీరరాజేంద్రచోళుడు, చనిపోయిన రాజమహేంద్ర జ్ఞాపకార్థం శ్రీరంగంవద్ద "రాజమహేంద్ర–చతుర్వేద మంగళం" పేరుతో ఒక అగ్రహారాన్ని బ్రాహ్మణుల కోసం ఏర్పాటుచేయటాన్ని– చెప్పుకొనవచ్చును.[31]

వీర రాజేంద్ర అతని కొడుకు అధిరాజేంద్రలు కూడా తంజావూరు అంతఃకలహాలలో మరణించటంతో చోళసామ్రాజ్య వారసత్వంలో వచ్చిన శూన్యాన్ని పూరించటానికి రాజరాజ నరేంద్రుని కుమారుడు రాజేంద్రుడు క్రీశ. 1070లో కుళోత్తుంగ I పేరుతో చోళ సామ్రాజ్యాన్ని అధిష్టించాడు. కుళోత్తుంగుని భార్య మధురాంతకి చోళచక్రవర్తి కుమార్తె. రాజమహేంద్ర వరంలో చనిపోయిన "రాజమహేంద్ర యువరాజు" ఈమె సోదరుడే. బహుసా ఈ కాలంలో "జననాథపట్టణం" పేరును ఇక్కడే చనిపోయిన తన బావమరిది రాజమహేంద్ర యువరాజు పేరిట "రాజమహేంద్ర" పట్టణం" గా కుళోత్తుంగుడు మార్చి ఉంటాడు. ఇది కాలక్రమేణా

30. కలిదిండివద్ద రాజరాజ నరేంద్రునికి కల్యాణి చాళుక్యులకు జరిగిన ఘోర సంగ్రామంలో రాజరాజ బ్రహ్మమహారాజు, ఉత్తమ శోడచ్చోడగన్,, చోడమిలాడుడైయ్యాన్ (మామగారైన చోళ చక్రవర్తి పంపించిన దండనాథులు వీరు) అనే ముగ్గురు వీరమరణం పొందారు. వీరి సమాధులపై రాజరాజనరేంద్రుడు కలిదిండి వద్ద మూడు శివాలయాలు కట్టించాడు.

31. Memoirs of the archeological survey of india no 79, pn 42. (Rajamahendra-chaturvedimangalam). బ్రాహ్మణుల అగ్రహారాన్ని తమిళులు చతుర్వేదిమంగళం అంటారు

శాసనాలలో ప్రతిఫలించటానికి క్రీశ. 1272 వరకూ సమయం పట్టి ఉంటుంది. (నిజానికి మనకి దొరకని శాసనాలెన్నో ఉండొచ్చు కూడా). రాజమహేంద్రపట్టణం అనే పేరు క్రమేణా రాజమహేంద్రవరం, రాజమహేంద్రం, రాజమంద్రం, రాజమండ్రిలుగా పరిణామం చెందింది.

కుళోత్తుంగుడు సింహాసనాన్ని స్థిరపరచుకొన్నాక క్రీశ. 1078లో తన కొడుకు వీరచోడుడిని వేంగి రాజ్యాభిషక్తుడిని చేసాడు. ఇతను క్రీశ. 1193 వరకూ వేంగిని పాలించాడు. ఇతని తరువాత వేంగిని విక్రమచోడుడు, గొంక, రాజేంద్రచోడ, పృధ్వీశ్వర వంటి చాళుక్యరాజులు క్రీశ1207 వరకూ పాలన చేసారు. తరువాత రాజమహేంద్రవరం కాకతీయుల పాలనలోకి వెళ్ళింది. ఆ విధంగా వేంగి–చోళ సంబంధాలు తెగిపోయాయి. క్రీశ. 1323 లో ప్రతాపరుద్రుని మరణంతో రాజమహేంద్రవరంలో కాకతీయుల పాలన ముగిసిపోయింది.

రెడ్డిరాజులు, మహమ్మదీయులు, గజపతులు, బ్రిటిష్ పాలనలు

క్రీశ. 1323 లో మహమ్మద్ బిన్ తుగ్లక్ వరంగల్‌ను జయించాక రాజమహేంద్రవరం పై దండెత్తి కోటను వశపరచుకొన్నాడు. హుమాయున్ గుజ్జర్ అనే తన అనుచరుడిని తుగ్లక్ ఇక్కడ నియమించి ఢిల్లీ వెళిపోయాడు. పట్టణంపై దాడి జరిగిన రాత్రి కోటవెలుపల ఉండిన గోపీనాథ ఆలయానికి చెందిన పూజారులు మూలవిరాట్టును కాపాడి గోదావరి ఒడ్డున తాత్కాలికంగా భద్రపరచారట. అలా నిర్జనమైన గోపినాథ ఆలయాన్ని పడగొట్టి మసీదు నిర్మించారని కథనం. ఈ మసీదులో "మహమ్మద్ తుగ్లక్ చక్రవర్తి పాలనలో, హుమయూన్ గజ్జర్‌ఆధ్వర్యంలో ఈ మసీదును హిజ్రి 724 (క్రీశ. 1324) రంజాను నెల ఇరవయ్యవ రోజున షరిఫ్ సలార్ ఉల్విచే నిర్మించబడినది" అంటూ ఒక శాసనము నేటికీ కలదు.[32] (Figure 6)

క్రీశ. 1327 లో రెడ్డిరాజులు రాజమహేంద్రవరాన్ని తిరిగి స్వాధీనం చేసుకొన్నారు. వీరిపాలనలో రాజమహేంద్రవరం కొంతకాలం మరల పూర్వవైభవాన్ని పొందింది.

32. History of Rajahmundry -- by B. V. Krishna Rao, AHRS, July 1928 Vol III
తన వ్యాసంలో కోట దక్షిణగుమ్మం, గోదావరి రైల్వేస్టేషను సమీపంలో కల మసీదు శివాలయంపై నిర్మించారని, దాదాసాహెబ్ వీధిలో కల మరో మసీదు కూడా హిందూ ఆలయాన్ని తొలగించి నిర్మించారని ఇది ఒకప్పుడు కమలాచలం అని అక్కడ మార్కండేయ ఆలయం ఉండేదని ప్రజలు అనుకుంటారని అన్నారు

క్రీ.శ.1428 లో రాజమహేంద్రవర కోటలో ఉంటూ రాజ్యం చేసిన వీరభద్రారెడ్డి వద్ద శ్రీనాథ మహాకవి ఆశ్రయం పొందాడు. ఆ సమయంలో భీమఖండం రచించాడు. కాశీ ఖండం రచించి వీరభద్రారెడ్డికి అంకితం చేసాడు.

కపిలేంద్ర గజపతి కటక్ ను రాజధానిగా గజపతి రాజ్యాన్ని స్థాపించి 1434 – 66 వరకూ పాలించాడు. ఇతను గంగనుండి కావేరి వరకూ తన రాజ్యాన్ని విస్తరించే క్రమంలో క్రీశ.1448 లో రాజమహేంద్రవరం రెడ్డిరాజులను జయించి రాజమహేంద్రవరాన్ని కైవసం చేసుకొన్నాడు. విజయనగర రాజులపై ఇతను జరిపిన యుద్ధాలలో బహుమనీ సుల్తానులు సహకరించినందుకు రాజమహేంద్రవం, కొండపల్లిలను వారికి అప్పగించాడు. ఈ చర్యలను నిరసించిన కొండపల్లిలోని హిందూనాయకులు తమ శక్తియుక్తులను కూడదీసుకొని రాజమహేంద్రవరంలో ఉంటున్న తురుష్కసైన్యాన్ని తరిమివేసి పట్టణాన్ని ఆక్రమించు కొన్నారు. ఈ చర్యలకు ఉగ్రుడైన బహుమని సుల్తాను మహమ్మద్ గవాన్ క్రీశ 1478లో రాజమహేంద్రవరాన్ని ముట్టడించి కైవసం చేసుకొని గజపతి సైన్యాన్ని కటక్ వరకు తరిమివేసాడు. మరలా తిరుగుబాట్లు తలెత్తకుండా రాజమహేంద్రవరంలో రెండు సంవత్సరములు నివసించి క్రీశ 1480లో మాలిక్ అహమద్ ను తన ప్రతినిధిగా నియమించి తిరిగి గోల్కొండకు వెళ్ళిపోయాడు.

బహుమనీ సుల్తానుల సామ్రాజ్యం విచ్ఛిన్నమైన తరువాత గజపతి సామ్రాజ్యాధినేత అయిన ప్రతాపరుద్ర గజపతి తురుష్కులను రాజమహేంద్రవరం నుండి తరిమివేసి తిరిగి ఈ ప్రాంతాలను పరిపాలించనారంభించాడు. క్రీశ. 1515లో శ్రీ కృష్ణదేవరాయలు తన విజయయాత్రలో భాగంగా ఉదయగిరి, కొండవీడు, రాజమహేంద్రవరములను స్వాధీనము చేసుకొని సంధి ఒడంబడికలో భాగంగా కొండవీడు, రాజమహేంద్రవరాల్ని తిరిగి ప్రతాపరుద్ర గజపతికి ఇచ్చివేసి విజయనగరానికి వెళ్ళిపోయాడు.

క్రీశ. 1540 లో గోల్కొండ నవాబు కులీ కుతుబ్ షా ఈ ప్రాంతంపై దండెత్తి గజపతి సైన్యములను ఓడించగా– గజపతి వారితో సంధిచేసుకొని గోదావరి, కృష్ణ నడుమ ఉన్న ప్రాంతాలను గోల్కొండనవాబులకు అప్పగించవలసి వచ్చింది. నవాబు తరపున దిలావరు ఖాను పాలకునిగా వ్యవహరించేవాడు. కొంతకాలానికి గజపతిరాజ్యం వారసత్వ పోరులో పడింది. అప్పుడు జరిగిన తిరుగుబాటులో హరిచందన దేవు అనే హిందూ రాజు క్రీశ 1561 లో సింహాసనాన్ని చేజిక్కించుకొన్నాడు. ఇతని నాయకత్వంలో వేదాద్రి అనే మహాసేనాని రాజమహేంద్రవరాన్ని, భీమరాజు అనే వ్యక్తి కొండపల్లిని గోల్కొండ

నవాబుల నుండి స్వాధీనం చేసుకొని పాలించటం మొదలుపెట్టారు. ఈ సమయంలో గోల్కొండ సుల్తానులు విజయనగర సామ్రాజ్యంపై చేస్తున్న తళ్ళికోట యుద్ధంలో తలమునకలై ఉండటంతో ఇక్కడి విషయాలను పెద్దగా పట్టించుకోలేదు. వేదాద్రి (రాజవిద్యాధరుడు), సీతాఫిఖానుడు అనే ఇరువురు రాజమహేంద్రవరాన్ని గజపతుల సామంతులుగా చాలాకాలం పాలించారు. అంతేకాక ఏ క్షణమైనా గోల్కొండ సుల్తానులు ఇటువైపు దాడిచేయచ్చు అనే ముందుచూపుతో ఇక్కడి హిందూ రాజులు బలపడి సైన్యాన్ని సమకూర్చుకొని, రాజమహేంద్రవరం, పెద్దాపురం, రాజానగరం మొదలగు దుర్గాలను పటిష్టపరచుకొని సంసిద్ధులై ఉండేవారు.

సితాఫ్ ఖాన్ వద్ద దివానుగా పనిచేసిన అవసరాల పెద్దిరాజు ప్రోద్బలంతో గోల్కొండ ఇబ్రహిం కుతుబ్ షా – మాలిక్ నైబ్, అమల్దార్ తోప్ ఖాన్, మహమ్మద్ ఖాన్, జూపల్లె సామంతరావు, కఠారి వీరమరావు, ముత్యాల యల్లప్పాళ్వారావు లాంటివారి నాయకత్వంలో ఎనభైవేలమందితో కూడిన సైన్యాన్ని రాజమహేంద్రవరాన్ని ఆక్రమించుకొమ్మని పంపించాడు. వీరు మొదట వేమగిరి కోటను కైవసం చేసుకొన్నారు. క్రీశ 1572, ఆషాడ శుద్ధ గురువారం రోజున రాజమహేంద్రవరం కోటను జయించారు. కోటలో ఉంటున్న సితాఫిఖానులు,విద్యాధరులు గోల్కొండసేనల ధాటికి తాళలేక కోటవిడిచి పారిపోయారు. తోటపల్లి అడవిలో దాక్కొన్న సితాఫిఖానుడిని ముస్లిం సేనలు పట్టుకొని తలనరికి చంపివేసారు. సీతాఫిఖానుడి హతంతో సర్కారు జిల్లాలు గోల్కొండనవాబుల పాలనలోకి వెళ్లాయి. క్రీశ 1573 నుంచి 1767 వరకూ రాజమహేంద్రవరాన్ని కేంద్రంగా చేసుకొని సుమారు అరవైమంది గోల్కొండ, నిజాం నవాబుల ప్రతినిధులు ఈ ప్రాంతాన్ని పాలించారు. క్రీశ. 1756–1757 ల మధ్య ఫ్రెంచివారు శ్రీకాకుళం నుండి ఏలూరువరకూ గోల్కొండ నవాబునుండి ఈనాంగా గ్రహించి కొంతకాలం రాజమహేంద్రవరం కేంద్రంగా చేసుకొని ప్రభుత్వం చేసారు.

క్రీశ.1767లో విజయనగర రాజైన పూసపాటి సీతారామరాజు రాజమహేంద్ర వరాన్ని పాలిస్తున్న బడెజమాలుఖాన్ ను చంపివేసి కొంతకాలం పాలన సాగించాడు. రాజమహేంద్రవరాన్ని జయించి కైవసం చేసుకొన్న చివరి వ్యక్తిగా పూసపాటి సీతారామరాజు పేరు చరిత్రలో నిలిచిపోయింది. క్రీశ. 1768 మార్చ్ 1 న నిజాం రాజు ఈ ప్రాంతాలను ఏటా ఐదులక్షల రూపాయిల శిస్తుకట్టే ఒప్పందంపై ఈస్ట్ ఇండియాకంపెనీకి కౌలుకు ఇచ్చాడు. ఆ తరువాత నలభై అయిదు సంవత్సరాలకు మూడవనిజాం రాజుకు ధనం

అవసరమై క్రీశ. 1823 లో ఈస్ట్ ఇండియా కంపనీకి ఈ ప్రాంతాలను కోటి అరవై ఆరు లక్షలరూపాయిలకు అమ్మివేసాడు. ఆ విధంగా కోస్తా ఆంధ్రా మొత్తం బ్రిటిష్ పాలనలోకి వెళ్ళిపోయింది.[33]

రాజమహేంద్రపట్టణం ఎలా ఉండేది?

శ్రీనాథుడు కొన్నాళ్ళు రాజమహేంద్రవరం రెడ్డిరాజుల ఆశ్రయం పొంది ఇక్కడ కొంతకాలం నివసించాడు. తన కావ్యాలలో ఆనాటి రాజమహేంద్రపుర అందాలను ఎంతో హృద్యంగా పద్యాలలో బంధించాడు

ఉండునేవీట మార్కండేయమునినాథ సజ్జలింగమనంగ శాసనుండు
ప్రవహించునేవీటి పశ్చిమప్రాకార మొరసి గంగమ్మ సాగరముకొమ్మ
యావిర్భవించినా డేవీటికోటలో బలభేది మదనగోపాలమూర్తి
పాలించునేవీటి ప్రాగుదక్కోణంబు నుమతోడి శ్రీముల్లగూరిశక్తి

(కాశీ ఖండము)

కమలాచలాగ్ర మార్కండేయ శివశిరశ్శశిచంద్రికాధౌత సౌధ వీథి
గోదావరీపుణ్య కులంకషాలజలస్పారిత శ్రీ రుద్రపాదయుగళి
బలవదభ్యున్నత ప్రాకారపరివేష గండూషితాజాండ మండలంబు
గంధ దంతావళ గ్రైవేయఘంటికా ఠంకారముఖల ఘంటాపథంబు
రాజబింబాననా నూత్నరత్నపేటి వీరరాహుత్త సుభటకంఠీరవాద్రి
వేమభూపాలరాజ్యాభివృద్ధికరము సాంద్రవిభవంబురాజమహేంద్రవరము

(శ్రీ భీమేశ్వర పురాణం)

మొదటి పద్యంలో శ్రీనాథుడు రాజమహేంద్రవరం రెడ్డిరాజుల కాలంలో ఉన్నప్పటి వైభవాన్ని వర్ణిస్తున్నాడు. అక్కడ మార్కండేయ ముని ప్రతిష్టించిన స్ఫటికలింగం ఉన్నదట. ఈ పట్టణపు పశ్చిమ ప్రాకారాన్ని తాకుతూ గంగమ్మ (గోదావరి) సముద్రంవైపు ప్రయాణిస్తుందట. కోటలో ఉన్న మదనగోపాలుడు, కోటకు ఈశాన్యంవైపు ఉన్న ముల్లగూరి శక్తి (ఉమాదేవి) ఈ పట్టణాన్ని సదా రక్షిస్తున్నారట.

33. Re-cession of Seemandhra to the Nizam: A Historical Vignette - By: Gautam Pingle.



మహమ్మదీయుల దాడులలో కోటవెలుపల ఉండిన గోపీనాథ ఆలయాన్ని మసీదు గా మార్చారు. ఈ మసీదులో. మహమ్మద్ తుగ్లక్ చక్రవర్తి పాలనలో, హుమయూన్ గజ్జర్ఆధ్వర్యంలో ఈ మసీదును హిజ్ర 724 క్రీశ. 1324" రంజాను నెల ఇరవయ్యవ రోజున షరీఫ్ పలార్ ఉల్చిచే నిర్మించబడినది" అంటూ ఒక శాసనము కలదు
Photo Source శ్రీ రాజరాజ నరేంద్ర పట్టాభిషేక సంచిక - సంపాదకుడు శ్రీ మోదుగుల రవికృష్ణ



రాజమహేంద్రవరం కోట ఊహాచిత్రం Source-Postal Department Brochure

రెండవ పద్యంలో – కమలాచలం అనే కొండపై వేంచేసిన ఈశ్వరుని తలపై ఉన్న వెండి నెలవంకలా ఈ పట్టణం ప్రకాశిస్తున్నదట. గోదావరి పుణ్యజలాలు ఆ ఈశ్వరుని పాదాలను నిత్యం అభిషేకం చేస్తున్నాయట. బలంగా ఎత్తుగా, భీకరంగా ఉండే పట్టణపు గోడలు నక్షత్రాలమండలాన్ని తాకుతున్నట్లు ఉన్నాయట. మత్తగజములు రాజవీధిలో సంచరించేటపుడు వాటి మెడగంటల ఘలంఘలలను పట్టణము ప్రతిధ్వనిస్తోన్నదట. యోధులకు, వీరులకు ఆలవాలమైన ఈ పట్టణాన్ని, రాజైన వేమభూపాలుని రాజ్యాన్నీ లక్ష్మీదేవి సదా వృద్ధిచేస్తూ ఉన్నదట.

శ్రీనాథుని పై పద్యవర్ణనల ద్వారా అయిదువందలేళ్ల క్రితంనాటి రాజమహేంద్రి పుర వీధుల్లో సంచరించిస్తూ ఆనాటి వైభవాన్ని కళ్లారా దర్శించిన అనుభూతి కలుగుతుంది. ఒకప్పటి రాజమహేంద్రపట్టణం గోదావరి వైపు కిలోమీటరు పొడవుతో దాదాపు అంతే అడ్డంతో నలుచదరంగా ఉండేది. పట్టణంచుట్టూ బలిష్టమైన ప్రాకారాన్ని వీరభద్రారెడ్డి (క్రీ.శ.1423–1448) నిర్మించాడు. ఈ ప్రాకార శిథిలాలను నేటికీ గోదావరినదిపై ప్రయాణిస్తూ చూడవచ్చును.

రాజమహేంద్రవరం పట్టణం చుట్టూ ఐదు గిరులు ఉండుటచే దాన్ని పంచగిరి దుర్గం అనేవారు. అవి

హేమగిరి – నేటి వేమగిరి

ధవళగిరి – నేటి ధవళేశ్వరం

పద్మగిరి – గోదావరి స్టేషను ఉన్న ప్రాంతం

భద్రగిరి – వీరభద్రేశ్వరస్వామి ఆలయంఉన్న పట్టిసం. ఇది ఒకప్పుడు బహుసా రాజమహేంద్రపట్టణంతో కలిసి ఉండేది అనుకోవచ్చు. ఆ తరువాత కాలంలో వరదలవల్ల విడిపోయి నేడు గోదావరి మధ్యలో కనిపిస్తుంది

రామగిరి – ఇది రాజమండ్రికి సమీపంలో కల రామగిరి.

రాజమహేంద్రపట్టణంలో ఉన్న చిన్న చిన్న మెట్టలను కమలాచల, వేదాద్రి, పుష్పగిరి, శేష గిరి అని పిలిచేవారు. ఈ కమలాచల మెట్టపై ఈశ్వరాలయం ఉండేదట. దానినే శ్రీనాథుడు "కమలాచలాగ్ర మార్కుండేయ....." అని వర్ణించాడు. వేదాద్రిపై నరశింహస్వామి ఆలయం ఉండేదట. ఈ రెండు గిరులు నేడు కానరావు. పుష్పగిరి నేటి మున్సిపల్

వాటర్ వర్క్స్ ఉన్న ప్రాంతం. శేషగిరిని స్థానికంగా శేషాయి మెట్ట అని పిలుచుకొంటారు. ఇక్కడ చిత్రాంగి మేడ ఉండేదని స్థానికుల విశ్వాసం.

ఇన్ని గిరులమధ్య, మెట్టల మధ్య ఉన్న ప్రాంతం శత్రుదుర్భేద్యంగా ఉంటుందనే ఉద్దేశంతో ఇక్కడ కోట, పట్టణ నిర్మాణం చేపట్టి ఉంటాడు గుణగ విజయాదిత్యుడు.

రాజమహేంద్రవరం కోట

మెకంజీ కైఫియ్యతులో గుణగవిజయాదిత్యుడు గోదావరి ఆవ ప్రాంతంపై కోటనిర్మించాడని ఉన్నది. ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభం వరకూ రాజమహేంద్రవరం కోట శిథిలాలు ఉండేవి. రాచరికచరిత్ర చివరలో వచ్చిన బ్రిటిష్, ఫ్రెంచి వారు ఈ కోటపై ఆధిపత్యం కొరకు యుద్ధాలు చేసుకొన్నారు. కోట శిథిలాలుకూడా క్రమేపీ కనుమరుగైనాయి. నేడు అక్కడ కోటకు సంబంధించిన ఆనవాళ్ళు ఏమీ కనిపించవు. ఇరవైయ్యవ శతాబ్దం ప్రారంభంనాటి అరుదైన కోటశిథిలాల ఫొటోలు లభిస్తున్నాయి కానీ ఇవి గుణగవిజయాదిత్యుడు నిర్మించిన కోటశిథిలాలా లేక దానిని తరువాతి రాజులు పునర్నిమించినవా అనేది తెలియదు. శ్రీనాథుని పద్యాల ద్వారా రెడ్డిరాజుల పాలనలో కొన్ని నిర్మాణాలేవో చేసినట్లు తెలుస్తుంది.

1928 లో శ్రీ భావరాజు వెంకట కృష్ణారావు వ్రాసిన ఒక వ్యాసంలో రాజమహేంద్ర వర కోట వివరాలను ఇలా చెప్పారు.

"కోటకు రెండు ప్రధాన ద్వారాలుండేవి. నేడు జాంపేట ఉన్నవైపున తూర్పు ద్వారం, కోటగుమ్మం అని పిలువబడుతున్న ప్రాంతంవద్ద దక్షిణ ద్వారం. కోట లోపల విస్తీర్ణం ఒక చదరపు మైలు ఉండేది. రెండువరుసల ప్రాకారగోడలలో వెలుపలిగోడ గోదావరి తీరంపైన, లోపలి గోడ భవనాలను ఆవరిస్తూ ఉండేవి. ఒకప్పుడు కోట ఉండే ప్రాంతంలో నేడు– గోదావరి రైల్వేస్టేషను, మున్సిపల్ ఆఫీస్, ఆనం కళాకేంద్రం, సుబ్రహ్మణ్యమైదానం, దామెర్ల ఆర్టు గాలరీ, గౌతమీ గ్రంథాలయం, పశువుల ఆసుపత్రి, లూథరన్ హైస్కూలు వంటి నిర్మాణాలు కలవు. కోట గోడ పదిహేను గజాల వెడల్పు, అరవై దబ్బె అడుగుల ఎత్తుతో బలంగా ఉండేది. కోట చుట్టూ లోతైన కందకం ఉండేది. కోటలోపల రెడ్డిరాజుల కాలంలో త్రైలోక్యవిజయం అనే మందిరం ఉండేది. అక్కడ కూర్చొని "వీరభద్రారెడ్డి వెన్నెలలో గోదావరి అలలను చూస్తూ ఆనందించేవాడని" శ్రీనాథుడు వర్ణించాడు. కోటలోపల వీరభద్రేశ్వర, మదనగోపాల స్వామి, ముల్లగురి శక్తి ఆలయాలు



రాజమహేంద్రవరం కోటలోపల నేలమాళిగ సొరంగ మార్గము 1815 లో రాజమహేంద్రపురం జడ్జి లాంగ్ దొర గారు ఈ మార్గాన్ని కొంతదూరము తవ్వించి లోపలకు కూలీలను పంపించాడు. వారు యాభై బార్ల వరకూ వెళ్ళగా,మట్టి అడ్డముగా ఉన్నకారణంగా వెనుకకు తిరిగిరావడమైనది. ఈ నేలమాళిగ దాని కోరుకొండ కోటకు వెళుతుందని స్థానికులు నమ్ముతారు. (మీకంజీ రాజమహేంద్రవరం కైపియ్యతు) Photo Source B. V. Krishna Rao, AHRS, July 1928 Vol III



రాజమహేంద్రవరం కోట ఉత్తరభాగం. రెండు వరుసలలో కోట ప్రాకారాలు కోటలోపల ఎత్తుపై ఉన్న భవనాలు. ఇది అప్పట్లో బ్రిటిష్ రైల్వే ఇంజనీరు అధికారిక నివాసంగా ఉండేది

Source B. V. Krishna Rao, AHRS, July 1928 Vol III

ఉండేవి. ఇవి నేడు కానరావు. ఈ ఆలయాల శిథిల గోడలను బ్రిటిష్ వారు హావెలాక్ వంతెన నిర్మించే సమయంలో, రైల్వే లైన్ వేయటంకొరకు తొలగించారు. అక్కడ తొలగించిన విగ్రహాలను మ్యూజియంలోకి తరలించారు.[34]

ఉపసంహారం

కృష్ణ గోదావరుల మధ్య ఉండే రేగడి నేలలు చాలా సారవంతమైనవి. అపారమైన వ్యవసాయ ఉత్పత్తులను అందిస్తాయి. వీటిపై ఆధిపత్యం కొరకు నిత్యం యుద్ధాలు జరుగుతూండేవి. ఈ ప్రాంతాలను పాలించిన చాళుక్యులు, పల్లవులు, రాష్ట్రకూటులు, ముస్లిములు ఇక్కడ నుంచి భారీ ఎత్తున సంపదలను తోడుకుపోయి తమ స్వస్థలాలైన కర్ణాటక, తమిళనాడు, హైదరాబాదు రాష్ట్రాలలో పెద్ద పెద్ద ఆలయాలను, కట్టడాలను నిర్మించుకొన్నారు. తమిళ చోళులు వేంగి చాళుక్యులతో బంధుత్వం కలుపుకోవటం, వారి మధ్య వివాహ సంబంధాలు మూడుతరాలపాటు కొనసాగటం వెనుక కూడా ఉద్దేశాలు ఇవే కావొచ్చు. తిరువాయూరు ఆలయంలోని ఒక శాసనంలో[35] చోళ "సామంతు" అయిన వేంగి విమలాదిత్య దేవర్ ఎనిమిది వెండికలశాలను (1148 kalanjus weight = 52 kgs) దేవదేవునికి సమర్పించుకొన్నట్లు ఉన్నది. ఇక్కడ "సామంతు" అన్న పదం గమనార్హం. చోళులు తూర్పుచాళుక్యులను సామంతులుగానే చూసేవారని ఆర్థమౌతుంది. ఆ విధంగా వేంగి నుంచి అపారమైన ధన సంపదలు చోళరాజ్యానికి తరలిపోతుండేవి.

కృష్ణా గుంటూరుల వద్ద ఉన్న వజ్రాలగనుల నుండి ఉత్పత్తి అయ్యే వజ్రాలు రోమను కాలం నుండి ప్రపంచ ప్రఖ్యాతిగాంచాయి. ఈ వజ్రాల వ్యాపారం పద్దెనిమిదో శతాబ్దంవరకూ ఒక వెలుగు వెలిగింది. వజ్రాలనుండి వచ్చే గణనీయమైన ఆదాయం వ్యవసాయ ఉత్పత్తుల ఆదాయానికి అదనం.

---

34. History of Rajahmundry – by B. V. Krishna Rao, AHRS, July 1928 Vol III

35. శాసన సంఖ్య 215 of 1894. Inscription text- on the east wall of the mandapa an inscription mentioning the gifts made by Sri vishnuvardhana mahadevar alias vimaladitya devar of Vengi Nadu, the eastern Chalukyan prince and "viceroy"(రాజప్రతినిధి) under "Cholas" who married Kundavai, the daughter of Rajaraja I. (Ref. Middle Chola Temples by SR Balasubrahmanyam published in 1975, P.No. 90. On the strength of this inscription it was inferred that Rajendra Chola took the Vengi king captive to the chola Country)

రాజమహేంద్రవరం కోట దక్షిణభాగం. కోటలోపల భవనాలు
పైన కనిపించే భవనంలో ఆనాటి జిల్లా జడ్జ్ నివసించేవారు
Source B. V. Krishna Rao, AHRS, July 1928 Vol III

రాజమహేంద్రవరం కోటలోపల రెండో వరుస ప్రాకారం
దీనిని రెడ్డిరాజులు నిర్మించినట్లు శ్రీనాథుడు వర్ణించాడు
Source B. V. Krishna Rao, AHRS, July 1928 Vol III

చోళ చక్రవర్తి వీరరాజేంద్ర తంజావూరు ఆలయంలో క్రీశ. 1048 లో వేయించిన శాసనములో వేంగిని ఇతర ప్రాంతాలను తనతండ్రి తిరిగి సాధించగలిగాడని (పశ్చిమచాళుక్యుల నుండి), వాటినుంచి 340 kalanjus బంగారము (1kalanju = చిన్నవరహా), 1,10,000 kalams (Kalam = సుమారు 75 kgల ధాన్యం బస్తా) ప్రతి ఏటా ఆలయభాండాగారానికి వచ్చే ఏర్పాట్లు చేసాడని చెప్పుకొన్నాడు.[36]

ఇక్కడి సంపదల తరలింపు అనే తంతు నిన్నమొన్నటి నిజాంపాలకుల వరకూ కూడా సాగింది. ఈ మధ్యాంధ్రప్రదేశ్ ఎవరి ఆధీనంలో లేకుండా స్వయంపాలన జరుపుకొన్న కాలంలో– ఉదాహరణకు గుణగవిజయాదిత్యుడు, చాళుక్యభీముడు, కొంత మేరకు రెడ్డిరాజుల హయాలలో ఇక్కడ ఆలయాలు, కోటలు, పట్టణాల నిర్మాణం గణనీయంగా జరగటం, మిగిలిన సమయాలలో ఎలాంటి నిర్ధిష్టమైన నిర్మాణాలు లేకపోవటం కూడా పై అభిప్రాయాన్ని బలపరుస్తుంది.

ఏది ఏమైనప్పటికి ఈ వేయి సంవత్సరాల ప్రయాణంలో రాజమహేంద్రవరం ఎన్నో యుద్ధాలను, రక్తపాతాలను, మానవదౌష్ట్యాలను కళ్లారా చూసింది. ఎన్నో మహోన్నత మానవత్వ శిఖరాలకు ఆధారంగా నిలిచింది. కళలను పోషించింది. తెలుగు సంస్కృతికి ప్రతీకగా నిలిచింది. ఆరుద్ర అన్నట్లు "వేదంలా ఘోషించే గోదావరి చెంతన.... నేటికీ అమరధామంలా శోభిల్లుతోంది.

★ ★ ★

---

36. A. 82 of 1892 Tamil Inscriptions of the Madras Presidency Collected till 1915 V. Rangacharya Vol III P.no 1608 North and west wall of Brihadisvara temple. Record of Virarajendradeva. It refers to the King's conquest of the Vengi Country.

B. The Inscription goes on to narrate his own victories (against the Western Chalukyas and in the reconquest of Vengi). The inscription tells us that altogether 340 kalanjus of gold and 1,10,000 (one lakh ten thousands) kalams of paddy were to be given to the temple treasury annually by various villages named in it. (Ref. Middle Chola Temples Rajaraja I to Kulottunga I by SR Balasubrahmanyan p.no 255)

C. South Indian Inscriptions Volume III, Miscellaneous Inscriptions from the Tamil Country by Hultzsch p.no 31 to 35 says pottapinadu, vengi nadu districts were clearly mentioned in 82 of 1892 inscription. (Which confirms that MUCH MONEY HAD GONE TO CHOLA KINGDOM/TAMILNADU from Andhra in those days)

ఈ శాసనంలో పై విషయాలు మొదటి రాజరాజు విజయాలుగా చెప్పబడ్డాయి అంటే అవి క్రీశ. 1044–54 మధ్య జరిగి ఉండాలి. ఈ కాలం రాజరాజనరేంద్రుని పాలనాకాలం అవ్వటం గమనార్హం. ఆమేరకు చూస్తే రాజరాజనరేంద్రుడు స్వతంత్రరాజు కాడని నిరూపణౌతుంది.

అపురూప ఆలయాలకు నిలయం బిక్కవోలు

బిక్కవోలు కాకినాడకు ముప్పై కిలోమీటర్ల దూరం.క్రీశ.1815లో మెకంజీ సేకరించిన రాజమహేంద్రవరం కైఫియ్యతులో బిక్కవోలు గురించి ఇలా ఉంది.

"పూర్వమందు చాళుక్యవంశ సంభవులయిన కుబ్జవిష్ణువర్ధనుడుమొదలయిన రాజులు ఆంధ్రదేశరాజరికం చేసేటప్పుడు హేమగిరి పర్వతానకు పూర్వభాగము నందు అరకోశడు దూరానవున్నటువంటిన్ని యిప్పుడు బిక్కవోలు అని వాడిక నామము గలిగియున్న బిరుదాంకరాయపురం అనే ప్రాచీననామము కలిగియున్నటు వంటి పట్నమందు నివాసముగా వుండి ప్రభుత్వము చేస్తూ ఉండేవారని చెప్పుకొంటారు. ఇప్పుడు ఆ పట్నము బిక్కవోలు అనే వాడిక గలిగి కొద్దిగ్రామము అయినది. ఆ వూరికి సమీపమందు కూటదిబ్బలవలె గయాళుదిబ్బలు వున్నవి. పూర్వమందు మూడు ప్రాకారాలతో కోటలు వుండేవి అని ప్రజలు చెప్పుకొందురు. ఇందుకు శిలాశాసనము దాఖలాలేదుగాని యింకొక దాఖలా కనబడుతూ వున్నది..... బిక్కవోలు గ్రామమునందు యిప్పుడు శిథిలమయిన దేవాలయాలు విస్తరించియున్నవి.

ఇవిగాక అనేక దేవాలయములు బొత్తిగా అరూపకమయి కొన్నిపోతే యెప్పుడెప్పుడు గ్రామములో యవరయినా నూతులు తవ్వేటప్పుడుయేమి, వూరికి సామీప్యమయిన పొలములలో విత్తనములు వేయగలందులకు కాలువలు తవ్వేటప్పుడుయేమి దేవాలయ విమానపీఠములున్ను కీర్తిముఖాలు చెక్కిన రాళ్ళున్ను మంటపాల స్తంభాలమీది పీటలున్ను, ఆరేసివేళ్ళ దలసరి మూరెడు పొడవు జానెడు బెత్తెడు వెడలుపున్ను ఖచితము గలిగిన యిటుకలున్ను యిలాగంటివి అనేకంగా కనబడడము కలదని చెప్పుకొంటారు....."

పై వివరాలను బట్టి బిక్కవోలు ఒకప్పటి పేరుగాంచిన పట్టణం అని అర్థమౌతుంది. ఇది వివిధకాలాలలో బిరుదాంకరాయపురం, బిరుదాంకగండని ప్రోలు, బిక్కనప్రోలు, బిక్కవోలులాంటి వివిధ పేర్లు కలిగిఉంది. కానీ దీని చరిత్రకు సంబంధించి రెండు శతాబ్దాల క్రితం ఏరకమైన సమాచారం పైన చెప్పబడిందో నేటికీ అదే పరిస్థితి. ఏ విధమైన శాసనాధారాలు ఇంతవరకూ లభించలేదు. ఈ ఊరిలో ఆరు ప్రాచీన దేవాలయాలు, చేలమధ్య నిలువెత్తు పెద్ద గణపతి విగ్రహం ఒకనాటి వైభవాన్ని గుర్తుచేస్తూ నేటికీ నిలిచి ఉన్నాయి. కోటశిధిలాలు కానరావు.

చాళుక్యులు–రాష్ట్రకూటులు

తూర్పుచాళుక్యులు కుబ్జవిష్ణువర్ధనుడు మూలపురుషుడిగా క్రీశ. 624 లో పిఠాపురం కేంద్రంగా వేంగి సామ్రాజ్యాన్ని నిర్మించారు. పిమ్మట తమరాజధానిని వేంగికి, ఆ తరువాత రాజమహేంద్రవరానికి మార్చుకొంటూ వచ్చారు. రక్షణ కొరకు వివిధ ప్రాంతాలలో నివసించటం సహజం, మరీముఖ్యంగా యుద్ధసమయాలలో కుటుంబాలు ఒకచోట పాలనా కేంద్రాలు మరోచోట ఉండటమూ పరిపాటే. ఆ విధంగా తూర్పుచాళుక్యులు నివసించారని చెప్పబడే బిక్కవోలు, చాళుక్యభీమవరం (సామర్లకోట), వేమగిరి, ద్రాక్షారామం, నిరవద్యపురం (నిడదవోలు), బెజవాడ ప్రాంతాలను ఒకనాటి పట్టణాలుగానే చూడాలి.

రాష్ట్రకూటులకు (కర్ణాటక, మహారాష్ట్రను పాలించే రాజులు) చాళుక్యులకు మధ్య అనేక యుద్ధాలు జరిగాయి. కొంతకాలం రాష్ట్రకూటులకు చాళుక్యులు సామంతులుగా కూడా వ్యవహరించారు. ఆ సమయంలోనో అంతకు పూర్వంనుంచో ప్రస్తుత బిక్కవోలు చాళుక్యుల నివాసపట్టణంగా ఉండేదని ఊహించవచ్చు.

కుబ్జవిష్ణువర్ధనుడి తరువాత తొమ్మిదో తరంలోని వాడైన మొదటి విజయాదిత్యుడు (క్రీశ. 755–772) రాష్ట్రకూట రాజైన గోవిందుని చేతిలో ఓడిపోయాడు. వారితో సంధి చేసుకొని వారికి సామంతుడిగా వేంగిరాజ్యాన్ని తిరిగి దక్కించుకొన్నాడు. మొదటి విజయాదిత్యుని కొడుకు నాల్గవ విష్ణువర్ధనుడు రాష్ట్రకూట రాజైన ధ్రువునికి తన కూతుర్ని ఇచ్చి వివాహం చేసి వారితో బంధుత్వం కలుపుకొని వేంగి రాజ్యాన్ని నిలబెట్టుకొన్నాడు. ఇతని కుమారుడైన రెండవ విజయాదిత్యుడు రాష్ట్రకూటులపై తిరుగుబాటు చేసాడు. అప్పటి రాష్ట్రకూట రాజు మొదటి అమోఘవర్షుడు తన చెల్లెలు శీలమహాదేవిని[1] రెండవ

1. ఈమె అమోఘవర్షుని కూతురని శ్రీ బి వి కృష్ణారావు గారి అభిప్రాయం.

విజయాదిత్యుని కొడుకైన కలి విష్ణువర్ధనుడికి ఇచ్చి పెండ్లి చేసి సంధికుదుర్చుకొన్నాడు. కలి విష్ణువర్ధనుడి కొడుకు గుణగవిజయాదిత్యుడు. ఇతడు రాష్ట్రకూటులపై జరిపిన పోరులో (మేనమామ) అమోఘవర్షుని చేతిలో ఓడిపోయి అతనికి సామంతుడిగా రాజ్యంచేసాడు. క్రీశ.880 లో అమోఘవర్షుడు మరణించటంతో గుణగవిజయాదిత్యుడు స్వతంత్రాన్ని ప్రకటించుకొని రాష్ట్రకూటులపై దండెత్తి జయించి అనేక ఉత్తర,పశ్చిమ రాజ్యాలను ఓడించి వారి గంగ యమున విజయ లాంఛనాలను గ్రహించాడు.

ఈ మొత్తం వ్యవహారంలో క్రీశ.772 నుంచి 880 మధ్య సుమారు వందేళ్లకు పైన తూర్పుచాళుక్యులు రాష్ట్రకూటులకు సామంతులుగా ఉన్నారు. అంటే ఈ ప్రాంతంలో రాష్ట్రకూటుల పాలన పరోక్షంగా జరిగింది. రాష్ట్రకూటులు జైన మతావలంబకులు. ఈ ప్రాంతంలో జైన మతం ప్రబలంగా కనిపించటానికి అది ఒక కారణము కావొచ్చును.

అమోఘవర్షుడు రామతీర్థం, బిక్కవోలులలో జైనులకొరకు బసతులు కల్పించాడు. అమోఘవర్షుని చెల్లెలు, కలి విష్ణువర్ధనుడి భార్య, గుణగవిజయాదిత్యుని తల్లి అయిన శీలమహాదేవి బిక్కవోలులో వర్ధమాన మహావీరుని ఆలయాన్ని కట్టించింది. ఈ ఆలయంలో ఒకనాడు పూజలందుకొన్న జైనవిగ్రహం నేడు మద్రాసు మ్యూజియంలో కలదు.[2] (Figure 1)

ఈ విగ్రహం నల్లరాయితో చేయబడిఉంది. కూర్చున్న భంగిమలో ఉన్న తీర్థంకరుని తలపై ఎత్తుగా మూడు అంచెల ఛత్రము, సింహాసనానికి ఇరువైపులా స్పష్టంగా సింహ లాంఛన ఆకారాలను గమనించవచ్చు.[3] నేడు బిక్కవోలులో ఏ విధమైన జైన అవశేషాలు కనిపించవు.

బిక్కవోలులో కనిపించే ఆరు హిందూఆలయాలలో మూడు పూజలందు కొంటూ ఊరిమధ్యలో పక్కపక్కనే ఉన్నాయి. అవి గోలింగేశ్వర, రాజరాజేశ్వర, చంద్రశేఖర ఆలయాలు. ఇవి చక్కని శిల్పసంపదతో అలరారుతున్నాయి. ఇవికాక మరింత ప్రాచీనమైనవిగా కనిపించే– హైస్కూలు సమీపంలో విజయేశ్వరాలయం, పొలాలమధ్య నక్కలగుడి[4] పేరుతో ఒక ఆలయము, (Figure 2), బిక్కవోలు ఊరికి కొంచెం దూరంలో మరొక శిథిలాలయం కలవు. వీటికి నలుచదరంగా మూడు అంతస్తులలో గోపురనిర్మాణం, దాదాపు ఒకే

2. History of Rashtrakutas of Malkhed and Jainism by Nagarajiah pn 22.
3. Jaina Monuments in Andhra by G Jawaharlal, Pno 105.
4. ఇది జైనాలయమని Glimpses of Jaina Vestiges in Andhradesa అనే వ్యాసంలో H Sarkar అన్నారు. (Nirgrantha, Vol 2 1996 pl 4) (Figure 2)

View of a Tirthankara Sculpture found at Biccavolu in E.G. District - Preserved at Madras Museum
Source - Jaina Monuments in Andhra by G Jawaharlal.

Figure 1

Figure 2

నిర్మాణశైలి, రాతికట్టుబడి గమనించవచ్చు. నిర్మాణంలో మెత్తనిరాయి వాడటం వలన ఉప్పుగాలులకు శిల్పాలు కొంతమేరకు దెబ్బతిన్నాయి.

గుణగవిజయాదిత్యుని సాతలూరు శాసనంపై[4] ఉన్న రాజముద్రలో వినాయకునికి రెండు చేతులు ఉండటం, బిక్కవోలులో చేలమధ్య ఉన్న బృహత్ వినాయకుని విగ్రహానికి కూడా రెండు చేతులే కలిగి ఉండటాన్ని ఆధారంగా చేసుకొని– బిక్కవోలులోని ఆరు ఆలయాలలో విజయేశ్వర, నక్కలగుడి, ఊరికిదూరంగా ఉన్న మరో ఆలయాన్ని గుణగ విజయాదిత్యుడు నిర్మించాడని చరిత్రకారులు నిర్ధారించారు. వినాయక విగ్రహాలకు నాలుగు చేతులు ఉండటం, కిరీటాన్ని కలిగి ఉండటం ఆ తరువాతికాలంలో వచ్చిన రూప పరిణామం.[5]

విజయేశ్వర ఆలయంలో (స్థానికులు దీన్ని కంచర గుడి అంటారు) గంగయమున విగ్రహాలు ద్వారపాలకులుగా ఉండటం గమనించవచ్చు. గంగయమున విగ్రహాలు రాష్ట్ర కూటుల సామ్రాజ్య చిహ్నాలు. గుణగవిజయాదిత్యుడు రాష్ట్రకూటులను జయించిన సందర్భంగా (క్రీశ.880) వారి చిహ్నాలను గైకొని ఇక్కడ తన విజయానికి చిహ్నంగా నిర్మించిన విజయేశ్వర ఆలయంలో వాటిని ద్వారపాలకులుగా ప్రతిష్టించి ఉంటాడనే ఊహ కూడా పై మూడు ఆలయాలు గుణగవిజయాదిత్యుడే నిర్మించాడనటానికి సాక్ష్యంగా నిలుస్తుంది. ఇక మిగిలిన గోలింగేశ్వర, రాజరాజేశ్వరి, చంద్రశేఖర ఆలయ శైలులను బట్టి ఆ తరువాత రాజుల కాలానికి చెందినవని భావిస్తారు. ఈ ప్రతిపాదనలు వేటికి స్పష్టమైన శాసనాధారాలు లేవు.

4. Sathaluru Grant Source: Bulletin of the Madras Government Museum, Early Chalukya Sculpture by C Sivaramamurthi, 1957, Plate VIII. (Figure 3)
5. చాళుక్యులు రెండు చేతులుకలిగిన వినాయకుడిని పూజించేవారు. కర్ణాటకలోని బదామి గుహాల యాలలో ఆరోశతాబ్దానికి చెందిన వినాయక విగ్రహం, బిక్కవోలు బృహత్ వినాయక విగ్రహం ఒకేలా ఉండటాన్ని బట్టి బిక్కవోలు వినాయక ప్రతిమ ఏడు లేదా ఎనిమిదో శతాబ్దానికి చెంది ఉండవచ్చు అని చరిత్రకారుల అభిప్రాయం. అంటే గుణగవిజయాదిత్యుని కన్నా సుమారు వందేళ్ల ముందునించే బిక్కవోలు ఒక పట్టణంగా ఉండేదా అనే విషయం శోధించవలసి ఉంటుంది. Biccavol Ganesha Photo Source: Bulletin of the Madras Government Museum, Early Eastern Chalukya Sculpture by C Sivaramamurthi, 1957, Plate VII b (Figure 4)



క్రీశ 848 లో గుణగవిజయాదిత్యుని సాతలూరు శాసనంపై రెండుచేతులు కలిగిన వినాయకుని రాజముద్ర

Figure 3

జిక్కవోలులో చేలమధ్య రెండుచేతులతో ఉన్న బృహత్ వినాయకుని విగ్రహం.

Figure 4

బిక్కవోలు ఆలయ శిల్ప విశిష్టతలు

తూర్పుగోదావరి జిల్లా ప్రాంతంనుంచి తూర్పు/వేంగి చాళుక్యుల వంశ ఆవిర్భావం జరిగింది. వీరు కళలను, సాహిత్యాన్ని పోషించారు. ఆ క్రమంలో శిల్పనైపుణ్యం కలిగిన ఆలయాలను నిర్మించారు. బిక్కవోలు ఆలయాలు వీరి పరిపాలన ప్రారంభంలో నిర్మించిన కట్టడాలు. వీటిలో కనిపించే శిల్పాలు భారతీయ సాంస్కృతిక, శిల్పశాస్త్ర పరిణామాన్ని అధ్యయనం చేయటానికి ఎంతో సహాయపడుతున్నాయి. ఆ తరువాత నిర్మించిన మాచర్ల, గురజాల, సింహాచలం ఆలయ శిల్పరీతులతో పోల్చినపుడు చాలా అంశాలలో బిక్కవోలు ఆలయశిల్పాలు ప్రత్యేకమైనవిగా గుర్తింపు పొందాయి. భారతీయశిల్పకళాపరిణామక్రమంలో కనిపించే అతి ప్రాచీనమైన శిల్ప రీతులు బిక్కవోలు ఆలయాలలో కనిపించటం విశేషం. హిందూ మత శిల్పాకృతులు ఇంకా పూర్తిగా రూపుదిద్దుకొనక ముందు నిర్మించిన ఆలయం కనుక అత్యంత ప్రాచీనమైన, అరుదైన దేవతా రూపాలు ఈ ఆలయంలో కనిపిస్తాయి.

లకులీశ మూర్తి

వేదాలలో చెప్పిన రుద్రుడు పురాణాలకాలానికి త్రిమూర్తులలో ఒకడైన శివునిగా పరిణామం చెందాడు. నేడు హిందూమతంలో ఇది ప్రధాన ఆరాధన విధానం. ఇది కాక వేదాలను ప్రామాణికంగా అంగీకరించని పాశుపత, లకులీశ, కాపాలిక, కంకాళులు, కాలముఖ, భైరవ, లింగాయత్, జంగమ, సిద్ధాంత మార్గులు లాంటి పేర్లతో అనేక శైవ సంప్రదాయాలు ఉండేవి. కొన్ని సంప్రదాయాలు కొన్నికాలాలలో ప్రబలంగా ఉండి సమాజాన్ని ప్రభావితం చేసాయి.

ఈ కల్ట్‌లన్నీ పారలౌకిక విషయాలకన్నా ప్రాపంచిక విషయాల పట్లే దృష్టి పెట్టేవి. ఒకానొక దశలో తాంత్రిక ఆరాధనలు కూడా చోటుచేసుకొన్నాయి. అందుచేత ఈ సంప్రదాయాలకు చెందిన వ్యక్తులకు జైన, బౌద్ధ, హిందూ మతాచారాలను అవలంబించే వ్యక్తులకు ఒక దశలో ఘర్షణ వాతావరణం కూడా నడిచింది. బిక్కవోలులో గుణగ విజయాదిత్యుడు (క్రీశ. 848-891) నిర్మించిన ఒక ఆలయగోపురంపై (ఊలపల్లి వెళ్ళే దారిలో) లకులీశ సంప్రదాయానికి చెందిన వివిధ చిహ్నాలు కలవు.

క్రీశ. ఒకటో శతాబ్దంలో లకులీశ (Lakulisha = Lord of the Club) అనే రుషి పశుపతి సూత్ర అనే గ్రంథాన్ని రచించి లకులీశ ఆరాధనా శాఖను ఏర్పరిచాడు. లకులీశుడు లింగపురాణంలో శివుని చివరిదైన 28 వ అవతారంగాను; వాయుపురాణంలో వ్యాసుని సమకాలీనుడుగాను చెప్పబడ్డాడు. లకులీశ సంప్రదాయంలో ఆరు ప్రధాన సూత్రాలు ఉన్నాయి.

1. కారణ (ఈశ్వరుడు) 2. కార్య (జీవుడు) 3. కాల (అభేదం) 4. విధి (పద్ధతి) 5. యోగ (జీవుడు ఈశ్వరునిలో కలవటం) 6. దుఃఖాంత (దుఃఖం నుండి విముక్తమవ్వటం)

లకులీశ ఆరాధన నాలుగో శతాబ్దంనాటికి ఉత్తరభారతదేశంలో విస్తృతంగా ప్రచారం పొందింది. ఆరోశతాబ్దంలో చాళుక్యులు నిర్మించిన బదామి కొండగుహలలో లకులీశుని శిల్పాలు కనిపించటాన్ని బట్టి– చాళుక్యులు ఈ సంప్రదాయాన్ని ప్రోత్సహించినట్లు అర్థమౌతుంది. గుణగవిజయాదిత్యుడు కూడా ఆ వంశానికి చెందినవాడే. ఆంధ్రప్రదేశ్‌లో ఈ లకులీశ శిల్పాలు బిక్కవోలు కాక శ్రీకాకుళం జిల్లా ముఖలింగేశ్వర ఆలయం, కడప పుష్పగిరి ఆలయాలలో కనిపిస్తాయి.

లకులీశ శిల్ప శైలి : లకులీశ విగ్రహాలు ప్రత్యేకమైన నిర్మాణశైలిని కలిగి ఉంటాయి. అవి – పద్మాసనంలో కూర్చున్న భంగిమ; పద్మ పీఠము; తలపై సర్ప కిరీటము; చేతిలో లకుటము (దుడ్డుకర్ర); చెవులకు కుండలాలు; ధర్మచక్ర ప్రవర్తనా ముద్ర (రెండు చేతుల వేళ్ళు ఎదురెదురుగా ఉంచి ఏదో భోధిస్తున్న భంగిమ); చుట్టూ నలుగురు శిష్యులు.

బిక్కవోలులో ఉన్న లకులీశ శిల్పాలు: ఆలయాద్వారానికి కుడివైపున కొద్దిగా శిధిలమైన లకులీశుని శిల్పం కలదు. ఇదు సుమారు నాలుగడుగుల ఎత్తు ఉంటుంది. తలపై ఉన్న కిరీటము సర్పమో కాదో తెలియటం లేదు. చెవులకు పొడవైన కుండలాలు ఉన్నాయి. చేతులు ధర్మచక్ర ప్రవర్తనా ముద్రలో కలవు. చేతిలో దండము ఉంది. రుద్రాక్ష మాలలు కనిపిస్తున్నాయి. పద్మాసనము, పద్మపీఠము కలవు. పీఠం క్రింద ఇద్దరు శిష్యులు మాత్రమే ఉన్నారు. (ఫొటో1).

ఆలయగోపురంపై లకులీశ శిల్పాలుగా అనిపించే చిన్నచిన్నవి రెండు మూడు కనిపించాయి. (ఫోటో 2).

ఇవి కాక చేత దండం, ఢమరుకం ధరించి నర్తించే భంగిమలో ఉన్న శిల్పమొకటి కలదు. ఇది బహుసా లకులీశ మూర్తికి రూపాంతరం కావొచ్చు. (ఫొటో 3) ఈ శిల్పా లన్నిటిలో జంధ్యం ఉండటం గమనార్హం.

లకులీశ కల్ట్ పరిణామం: లకులీశుడు తన బోధనల ద్వారా అప్పటికే ఉన్న పాశుపత ఇంకా ఇతర శైవ కల్ట్ లను ఏకంచేసి ఒకే తాటిపైకి తెచ్చాడు. దానివల్ల ఈ కల్ట్ నాలుగో శతాబ్దానికి బలం పుంజుకొని ప్రజలను విపరీతంగా ఆకర్షించింది.

లకులీశ కల్ట్ ఆరాధకులు వంటిపై బూడిద పూసుకొని, ఓంకారాన్ని జపిస్తూ, శివుణ్ని స్తుతిస్తారు. ఏడో శతాబ్దంలో ఆంధ్రను సందర్శించిన చైనా యాత్రికుడు హుయాన్‌త్సాంగ్ ''లకులీశ ఆరాధకులకు రాజాదరణ ఉన్నదని, సమాజంపై వీరి ప్రభావం బలంగా ఉందని'' వ్యాఖ్యానించాడు. లకులీశ సంప్రదాయం పదో శతాబ్దం వరకూ కొనసాగింది. ఈ శాఖ నుంచే కాపాలిక, కాలముఖ శైవ శాఖలు వచ్చాయి. చివరలో వీరు తాంత్రిక పద్ధతులు అవలంబించటంతో ఈ కల్ట్ క్రమేపీ ప్రజల ఆదరణ కోల్పోయింది.

దక్షిణ భారతదేశంలో ఆ తదనంతరం వచ్చిన వీరశైవం, లింగాయత్ ఉద్యమాలకు లకులీశ కల్ట్ ప్రేరణగా పనిచేసిందనటంలో సందేహం లేదు. ఉత్తరభారతదేశంలో కనిపించే లకులీశ శిల్పాలలో Erect penis ను symbol of vigour గా చెక్కటం చూడవచ్చు. కానీ బిక్కవోలులోని లకులీశ శిల్పాలలో అలా లేకపోవటం గమనార్హం.

హిందూ మతం అనేక భక్తిమార్గాల సంగమం. బహుదేవతారాధన హిందూమత బలం. ఉపనదులన్నీ జీవనదిలో కలిసినట్లు ఎన్నో కల్ట్స్ వచ్చి చేరగా నేడు మనం అనుకొంటున్న హిందూ మతం ఏర్పడింది. ఈ క్రమంలో ఒక్కోకాలంలో ఒక్కో భక్తి మార్గం ప్రముఖంగా నిలిచింది. కొన్ని కాలగర్భంలో కలిసిపోయాయి. అలా కనుమరుగైన ఒక శైవ సంప్రదాయం లకులీశ మతం. ఒకనాటి తూర్పుగోదావరి జిల్లా ప్రజలు ఈ సంప్రదాయాన్ని పాటించారనటానికి బిక్కవోలులో గుణగవిజయాదిత్యుడు తొమ్మిదో శతాబ్దంలో కట్టించిన ఆలయం నేడు సాక్ష్యంగా నిలుస్తూఉన్నది.

ఏకపాద శివమూర్తి

హిందూ దేవుళ్ల రూపాలు అనేక చేతులతో వివిధ ఆయుధాలు ధరించి ఉంటాయి కానీ కాళ్ళుమాత్రం సాధారణంగా రెండే ఉంటాయి. బిక్కవోలు గోలింగేశ్వరుని ఆలయ ఉత్తరగోడపై ఏకపాదంతో ఉండే శివుని ప్రతిమ ఉంటుంది.

ఈ ప్రతిమకు ఒకే కాలు, నాలుగు చేతులు కలవు. ఈ రూపాన్ని ఏకపాద మూర్తి అంటారు. ఇది ఈశ్వరుని ప్రాచీనమైన రూపము. వేదాలలో "అజ ఏకపాద" పేరుతో రుద్రుని వర్ణనలు కలవు. విశ్వకర్మ రచించిన శిల్పశాస్త్రంలో ఈశ్వరుని పదకొండురూపాల్లో ఏకపాద మూర్తి ఒకటి. ఇది కఠోరతపస్సు చేస్తున్న స్థితికి సంకేతం.[6] ఈ మూర్తిని పూజించినట్లయితే ఐహిక సుఖాలను కలగచేస్తాడని ప్రతీతి.

6. "Single Footed Deities: Glimpses from Art and Literature" by Prachi Virag Sontakke - Heritage: Journal of Multidisciplinary Studies in Archaeology 3: 2015. చూడుడు: బిక్కవోలు ఏకపాద శివమూర్తి ప్రతిమ ఫొటో

ఫొటో 1

ఫొటో 2

ఫొటో 3

ఏక పాదంతో ఉండే ఈశ్వర రూపాలు మూడురకాలుగా ఉంటాయి. అవి ఏకపాద శివమూర్తి, ఏకపాద భైరవ, ఏకపాద త్రిమూర్తి. బిక్కవోలు ఆలయంలో ఉన్న రూపం ఏకపాద శివమూర్తి. ఏకపాద శివమూర్తి శిల్పాలు భారతదేశంలో మూడుచోట్ల మాత్రమే ఉన్నాయి. 1.ఒరిస్సా Chaunsanth Yogini Temple 2. ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ లింగం వద్ద సోమేశ్వర ఆలయం 3. బిక్కవోలు గోలింగేశ్వర ఆలయం

గంగ-యమున ప్రతిమలు

బిక్కవోలు హైస్కూలు సమీపంలో ఉన్న విజయేశ్వర ఆలయానికి ద్వారపాలకులుగా గంగయమున విగ్రహాలు కలవు. గంగయమున ప్రతిమలను పూజించటం ఉత్తర భారత దేశంలో గుప్తుల కాలం నుంచే ఉంది. (క్రీశ. 3-5 శతాబ్దాలు). వారినుండి బదామి చాళుక్యులు గ్రహించి తమ రాజచిహ్నాలుగా చేసుకొన్నారు. వారి వారసులైన రాష్ట్రకూటులు ఆ సంప్రదాయాన్ని కొనసాగించారు.

క్రీశ.880 లో చాళుక్యరాజైన గుణగవిజయాదిత్యుడు రాష్ట్రకూటులను జయించి, వారి సామ్రాజ్య చిహ్నాలను గైకొని బిక్కవోలులో తన విజయానికి గుర్తుగా నిర్మించిన విజయేశ్వర ఆలయంలో ద్వారపాలకులుగా ప్రతిష్టించుకొన్నాడు.

గంగ,యమున శిల్పాలు త్రిభంగ భంగిమలో ఉంటాయి. (దేహం మూడు ఒంపులతో). గంగ ఒకచేత కలశం ధరించి, మరొక చేయిని ఒక పరిచారిక తలపై ఆనించి మకరవాహనంపై నిలుచొని ఉండగా, యమున తాబేలు వాహనంపై చేత కలశం ధరించి నిలబడి ఉంటుంది.(పోల్చుకోవటానికి వీలుగా గంగ, యమున ఫొటోలను పక్క పక్కగా ఇవ్వటమైనది)

బిక్కవోలులోని ఈ గంగ యమున శిల్పాలు సుమారు పన్నెండుశతాబ్దాల క్రితపు ఈ ప్రాంత వైభవానికి సాక్షీభూతంగా నిలిచి ఉన్నాయి.

రామాయణ ఘట్టాలను ప్రతిబింబించే శిల్పాలు

మన సంస్కృతిలో శ్రీరాముడు జాతిని ఏకం చేసే ఒక ప్రముఖ ఆధ్యాత్మిక రూపం. కానీ చిత్రంగా భారతదేశంలో రామాలయాలు పదిహేనో శతాబ్దం నుంచి మాత్రమే కనిపించటం ఆశ్చర్యం కలిగించక మానదు. అలాగని రామాయణం యొక్క ప్రాచీనతను శంకించలేం. రెండువేల సంవత్సరాల నాటి ప్రాకృత గాథాసప్తశతిలో రామాయణ ప్రస్తావనలతో గాథలు కలవు. కర్ణాటకలో బాదామిలో చాళుక్యులు ఆరోశతాబ్దంలో నిర్మించిన ఒక శివాలయంగోడలపై అనేక రామాయణ ఘట్టాలు చిత్రించబడ్డాయి. రామాయణం

14-12-2020
ఏకపాద శివుడు


యమున
గంగ

సీతాదేవి

ధనుర్బాణములు ధరించిన శ్రీరాముడు?

రావణాసురుడు

హనుమంతుడు

భారతీయసంస్కృతిలో వేల సంవత్సరాలుగా మమేకం అయింది వైష్ణవం ప్రాచుర్యంలోకి వచ్చిన తరువాత ప్రత్యేక రామాలయాల నిర్మాణాలు జరిగాయి.

బిక్కవోలులోని తొమ్మిదో శతాబ్దానికి చెందిన విజయేశ్వర ఆలయ గోపురంపై రామాయణ ఘట్టాలను/పాత్రలను ప్రతిబింబించే శిల్పాలను గమనించవచ్చు.[7] బహుసా ఆంధ్రప్రదేశ్‌లో రామాయణగాథకు సంబంధించిన అతి ప్రాచీన శిల్పాలు ఇవే కావొచ్చు.

దశకంఠుడు ఒకసారి నందితో వాదులాడి, అహంకరించి కైలాసపర్వతాన్ని పైకి ఎత్తాడు. శివుడు అది చూసి బొటనవ్రేలితో పర్వతాన్ని క్రిందకి అదిమి రావణాసురునికి గర్వభంగం కావించే రామాయణ ఘట్టం గోపురానికి ఉత్తరం వైపున కీర్తిముఖ పై వరుసలో శిల్పరూపంలో కనిపిస్తుంది.

ఆలయగోపురముపై పైన చెప్పిన ఘట్టం ఉన్న వరుసలోనే కొద్దిగా దూరంగా ధనుర్భాణములు ధరించిన భంగిమలో ఒక శిల్పం కలదు. ఇది బహుసా శ్రీరామచంద్ర మూర్తి కావొచ్చు. ఇదే వరుసలో ఒక స్త్రీమూర్తి శిల్పం కలదు. ఆ శిల్పం సీతాదేవి కావొచ్చు. ఈ శిల్పం నేటి శిల్పరీతికి భిన్నంగా విలాసినీ భంగిమలో ఉన్న నర్తకి శిల్పం వలె ఉన్నది. చేతిలో పద్మం ఉంటే లక్ష్మీదేవి గా పోల్చుకొనవచ్చును కానీ చేయిభాగం విరిగిపోయి ఉన్నది. ఈ మొత్తం రామాయణ పాత్రలు ఒకేవరుసలో ఉన్నవి, అంతే కాక ఆ వరుసలో ఉన్న ఒకే ఒక స్త్రీ మూర్తి శిల్పం ఇదే కనుక సీతాదేవి అనే అనిపిస్తుంది.

అదే క్రమంలో ముకుళిత హస్తాలతో నమస్కారం చేస్తున్న వానరరూపంలో ఉన్న ఒక శిల్పాన్ని హనుమంతునిగా పోల్చుకొనవచ్చును. ఇది మానవరూపంలో కాక పూర్తి వానరరూపంలో ఉన్నది. భంగిమ కూడా అపసవ్యంగా అనిపిస్తుంది. కానీ ఈ శిల్పం రామాయణ పాత్రల నడుమ చెక్కబడి ఉండటంద్వారా హనుమంతునిగా అనుకోవచ్చు.[8]

---

7. ఈ ఫొటోలను ప్రముఖ చరిత్రకారులు డా.ఈమని శివనాగిరెడ్డి గారికి పంపగా వారు రావణ గర్వభంగ ఘట్టం, హనుమంతుడు శిల్పాలను నిర్ధారించి, మిగిలినవి కావొచ్చు అని అభిప్రాయ పడ్డారు.

8. జావా ద్వీపంలోని తొమ్మిదోశతాబ్దపు హిందూ ఆలయగోడలపై చెక్కిన ప్రతిమలలో హనుమంతుడు పూర్తి వానర రూపంలో ఉంటాడు. (Ref: Relief on Prambanan - Hanuman meeting Sita, Pentas Ramajanaa). ఇదే కాలానికి చెందిన కర్ణాటక హళేబేడు హొయసలేశ్వర ఆలయ కుడ్యశిల్పాలలో సీతాదేవి ఉంగరాన్ని ఇచ్చేఘట్టంలో హనుమంతుడు పూర్తి వానరాకారంలో ఉన్నాడు. (Ref: Rama giving Hanuman the ring to give Sita, Halebidu). ఈ ఉదాహరణల ఆధారంగా బిక్కవోలు ఆలయగోపురంపై ఉన్న రూపాన్ని హనుమంతుడుగా పోల్చుకొనవచ్చును.

ఈ శిల్పాలు నేడు మనం అలవాటుపడ్డ రూపాలకు భిన్నంగా ఉన్నాయి.కానీ ఈ ఆలయం క్రీశ.తొమ్మిదోశతాబ్దంలో నిర్మించినదనే అంశాన్ని దృష్టిలో ఉంచుకొన్నపుడు, ఈ వైవిధ్యం ఆయా శిల్పాలను చెక్కటంలో కాలానుగుణంగా వచ్చిన ఒక పరిణామ క్రమాన్ని సూచిస్తున్నట్లు భావించాలి.

ఇవేకాక బిక్కవోలు ఆలయశిల్పాలలో సూర్యభగవానుడు, వాయు, ఇంద్ర, అగ్ని, భిక్షాటన మూర్తి బ్రహ్మ, నాగ, చాముండి, మహిషాసురమర్ధిని, కంకాళ, అర్ధనారీశ్వర, ఆలింగన చంద్రశేఖరమూర్తి, గోలింగేశ్వరుడు, మైథున శిల్పాలు లాంటివి తొలి చాళుక్య శిల్పరీతులకు అద్దంపడతాయి.

తూర్పుచాళుక్యుల కాలంలో ఒక వెలుగు వెలిగిన బిక్కవోలు పట్టణం ఏకాలంలో తన ప్రాభవం కోల్పోయిందో తెలియరాదు. మెకంజీ కైఫియ్యతులో వర్ణించిన మూడు ప్రాకారాలతో ఉన్న కోటలు ఎప్పుడు పాడుపడ్డాయో వివరాలు అందవు. జిల్లాకు చెందిన వివిధ ఆలయాల శాసనాలలో బిక్కవోలు పేరు అక్కడక్కడా కనిపిస్తుంది.

పల్లవ భారద్వాజగోత్ర సోమ వంశోద్భవులైన వీరగొట్టపు సౌభాగ్యదేవరాజు అనే వ్యక్తి ద్రాక్షారామ భీమేశ్వరుని నైవేద్యానికి బిక్కవోలులో రెండు పుట్ల క్షేత్రము దానం ఇచ్చినట్లు ఒక శాసనం ఉంది. (సంవత్సరం లేదు)

క్రీశ. 1450 ప్రమోదూత సంవత్సర మాఘమాసమందు శివరాత్రి సూర్యగ్రహణ పుణ్యకాలమందు కొటికలపూడి గంగయ్య, కానిపాప కామయ్యలు తమ స్వార్జితమైన బిక్కవోలులోని ఒక అగ్రహారమును శ్రీ కుమారారమ చాళుక్య భీమలింగేశ్వర స్వామివారికి సమర్పించుకొని, దక్షిణద్వారం వెలుపల మండపస్తంభానికి శాసనము వ్రాయించినారు.

క్రీశ. 1468 బహుధాన్యనామ సంవత్సరం, శివరాత్రి సూర్యగ్రహణ పుణ్యకాల మందు శ్రీకుమారారామ చాళుక్య భీమలింగేశ్వరునకు, కళింగపు మాచిరాజు కొడుకు వీరన్న– బిక్కవోలులోని ఒక అగ్రహారం, పినవెంద్రలో తమ స్వార్జితమైన కొంతపొలము, ఇల్లు స్వామివారి నిత్యనైవేద్యాలకు సమర్పణ చేసి, లోన ప్రాకారానికి దక్షిణ ద్వారం బయటకల శిలాస్తంభానికి శాసనం వ్రాయించాడు.

క్రీశ. 1570 లలో బిక్కవోలు పరగణా కరణీకపు హక్కులను తోలేటి మార్కొండ్రాజు గోల్కొండ నవాబులనుండి పొందాడు.[9]

అటు పిమ్మట బిక్కవోలు పట్టణం క్రమేపీ తన వైభవాన్ని కోల్పోయి ఘనమైన గత చరిత్రను చిహ్నాలుగా మాత్రమే ధరించిన జిల్లాలో ఒకానొక గ్రామంగా మిగిలిపోయింది. ఈ ప్రాంతంలో ఆర్కియలాజికల్ శోధనలు జరిపితే ఎన్నో విలువైన చారిత్రిక ఆధారాలు దొరికే అవకాశం ఉంది. నేడు బిక్కవోలులో జరిగే షష్ఠి ఉత్సవవైభవం జిల్లావ్యాప్తంగా పేరుగాంచింది.

9. మెకంజీ కైఫియ్యతులు – తూర్పుగోదావరిజిల్లా

చరిత్రపుటలలో – కోరంగి మహాపట్టణం

కాకినాడకు పద్దెనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న కోరంగి గొప్ప చారిత్రిక ప్రాధాన్యత కలిగిన ఒకనాటి రేవుపట్టణం. క్రీస్తుపూర్వకాలం నుండి ఇరవయ్యో శతాబ్ద ప్రారంభం వరకూ కోరంగి ఓడరేవుగా, నౌకాపట్టణంగా, నౌకా నిర్మాణ కేంద్రంగా ఒక వెలుగు వెలిగింది.

గత వైభవం

సముద్రంలోకి నాలుక ఆకారంలో చొచ్చుకొని ఉన్న భూభాగాన్ని Cape (మూలాగ్రము) అని అంటారు. కోరంగి సహజసిద్ధంగా ఏర్పడిన ఒక Cape. క్రీశ.మొదటి శతాబ్దానికి చెందిన రోమన్ చరిత్రకారుడు Pliny, గంగానదీముఖము నుండి 625 రోమన్ మైళ్లదూరంలో Cape Calingon అనే ప్రముఖ రేవుపట్టణం ఉందని పేర్కొన్నాడు. దాన్ని కోరంగిగా Cunningham, Fergusson వంటి చరిత్రకారులు గుర్తించారు. కాలక్రమేణా తీరము విస్తరించటం, ఇసుక మేటలు వేయటం వల్ల ప్లీని వర్ణించిన కోరంగి రేవుపట్టణం నేడు సముద్ర తీరానికి దూరంగా జరిగింది.

ప్లీని వర్ణించిన Cape Calingon అనేది నేటి కళింగపట్నం రేవు కావొచ్చు అనే అభిప్రాయం కలదు. కానీ గంగానదిముఖద్వారం నుండి కళింగపట్నం సుమారు 400 రోమన్ మైళ్ళు మాత్రమే ఉండగా (1రోమన్ మైల్ =1.47కిమీ). కోరంగి సుమారు 610 రోమన్ మైళ్ల దూరంలో ఉన్నది. ఇది ప్లీని చెప్పిన 625 రోమన్ మైళ్లతో సరిపోతుంది. అంతే కాక ఒకప్పుడు కళింగ సామ్రాజ్యం ఒరిస్సానుంచి గోదావరి వరకూ తూర్పు తీరం అంతటా విస్తరించి ఉండేది. అప్పట్లో కోరంగి కళింగ సామ్రాజ్యంలో అంతర్భాగం. కనుక Cape Calingon కోరంగిగా గుర్తించటం సహేతుకమే అనిపిస్తుంది.

ఒకటో శతాబ్దానికి చెందిన పెరిప్లస్ అనే గ్రీకు నౌకాయాన గ్రంథంలో ఒక గోదావరి రేవు నుంచి నిత్యం మలేషియాకు నౌకలు ప్రయాణంచేస్తున్నాయి, దానికి సమీపంలో అల్లోసినె (Allosygne) అనే పెద్ద పట్టణం కలదు అని వర్ణించాడు. Mccrindles అనే చరిత్రకారుడు ఆ రేవుపట్టణం కోరింగ కావొచ్చునని ఊహించాడు.[1] కోరంగికి ఆరుకిలోమీటర్ల దూరంలో ఆర్యావటం అనే ప్రముఖ జైన క్షేత్రం కలదు. బహుసా టొలెమి చెప్పిన అల్లోసినె పట్టణం ఆర్యావటం పూర్వనామం కావొచ్చు.

కోరంగి రేవుపట్టణం నుండి రోమ్, ఈజిప్టులకు భారీగా వర్తకం జరిగేది. ఎక్కువగా సుగంధపరిమళాలు, మిరియాలు, యాలకులు, నీలిమందు, ఉక్కు, వజ్రాలు, ముత్యాలు, పత్తి, ఏనుగుదంతాలు, చందనము ఎగుమతి జరిగేది. సముద్రవ్యాపారం కారణంగా అపరిమితమైన బంగారం రోము నుండి భారతదేశానికి చేరిపోతున్నదని ప్లీని, హిప్పాలస్ వంటి వారి చరిత్రకారులు ఆందోళన వ్యక్తం చేసేవారు. కోరంగి రేవుద్వారా జరిగిన విదేశీ వాణిజ్యానికి సాక్ష్యంగా కోరంగి సమీపంలో కల మట్లపాలెం వద్ద రెండో శతాబ్దానికి చెందిన రోమను నాణెములు లభించాయి[2]. రేవు పట్టణములలో రాజు తరపున సుంక కరణములు అనే రాజోద్యోగులు ఉండేవారు. వీరు విదేశీ ఓడలకు రక్షణ కల్పించినందుకు, వ్యాపారులమధ్య ఘర్షణలు రాకుండా చూసినందుకు, మోసములు జరుగకుండా ఖచ్చితమైన తూకములు అమలుజరిపించేందుకు, ఓడదొంగలనుండి కాపాడేందుకు సరుకుల విలువలో నూటికి పదోవంతు చొప్పున రేవు సుంకం వసూలు చేసేవారు.

అయిదవ శతాబ్దంలో రోమను సామ్రాజ్యం పతనమయ్యాకా,కొంతకాలం భారత దేశం నుండి జరిగే విదేశీ వాణిజ్యం మందగించింది. కానీ ఈ ప్రాంత వ్యాపారులు కొత్త వ్యాపార అవకాశాను వెతుక్కొన్నారు. కోరంగి నుండి చైనా, జపాను, బర్మా, మలేషియా, జావా సుమత్రాలాంటి తూర్పుదేశాలను చేరి అక్కడి వారితో తమ వ్యాపారాలను కొనసాగించారు.

క్రీశ. పదవ శతాబ్దములో రాజమహేంద్రవరాన్ని రాజధానిగా చేసుకొని పాలించిన రాజరాజ నరేంద్రుడు వేయించిన నాణాలు బర్మా దేశములో ఇసుకలో కూరుకుపోయిన ఒక ఓడ శిధిలాల్లో లభించటాన్ని బట్టి ఆ తరువాత కూడా కోరంగి రేవు ప్రముఖ వ్యాపారకేంద్రంగా ఉండేదని ఊహించవచ్చును.[3]

---

1. Ancient India of Ptolemy by Mccrindles, p.no 68
2. సేకరణ: శ్రీ వెంకటేష్ కందుల, ప్రముఖ ప్రాచీననాణెముల సేకర్త
3. ప్రాచీనాంధ్ర నౌకాజీవనము – భావరాజు వెంకట కృష్ణారావు పే. 61

పదమూడవ శతాబ్దములో ఆంధ్రదేశాన్ని పాలించిన కాకతీయపాలకులు రేవులలో క్లుప్తశుంకమును (ముప్పదింట ఒకవంతు. అంతకుపూర్వం ఇది నూటికి పది వంతులు ఉండేది) ప్రవేశపెట్టి నౌకా వ్యాపారాన్ని ప్రోత్సహించారు. కాకతీయులు కృష్ణా తీర రేవులను ఎక్కువగా ప్రోత్సహించారు.

ఈ కాలంలో ఆంధ్రదేశాన్ని సందర్శించిన మార్కోపోలో కృష్ణా, గోదావరి రేవుల నుండి పెద్ద ఎత్తున విదేశీ వర్తకము జరుగుతున్నదని అన్నాడు. అంతే కాక ఇక్కడి ఓడలు చాలా బలమైనవని, పెద్దవిగా ఉన్నాయని ఒక్కొక్క ఓడకు అయిదారువేల మలగల (మలగ అనగా ఒక ఎద్దుమోయగల బరువు) మిరియములను మోయసామర్థ్యము ఉందని; ఓడను నడుపుటకు మూడు వందలమంది నావికులు ఉండాలని; ఓడ అడుగు భాగమున గదుల వంటి నిర్మాణములు కలవని; రాళ్లు లేదా తిమింగముల వలన ఏ గదికి దెబ్బతగిలితే ఆ భాగముమాత్రమే చెడిపోవును తప్ప ఓడ మునిగిపోయే ప్రమాదము లేదని అన్నాడు.[4] మార్కోపోలో కోరంగి అని ప్రత్యేకముగా ప్రస్తావించకపోయినా ఇక్కడ కూడా నౌకా వ్యాపారం జరిగే ఉంటుంది.

ఆ తరువాత వచ్చిన నిజాం పాలకులు మచిలీపట్నాన్ని ప్రముఖ ఓడరేవుగా ప్రోత్సహించటం వల్ల క్రమక్రమంగా కోరంగిరేవు ప్రాభవం కొంత మసకబారినా అది ఏనాడూ మూతపడలేదని అనేక ఆధారాలు లభిస్తాయి.

1619 జూలై నెలలో మచిలీపట్నం నుండి కెప్టెన్ Martin Pling నాయకత్వంలో సూరత్‌కు బయలుదేరిన ఒక ఓడ, వాతావరణం సహకరించక కోరంగిరేవులో కొన్నివారాల పాటు నిలిపి ఉంచవలసి వచ్చిందట. ఈ ఉదంతం ద్వారా కోరంగి రేవు అప్పటికి ఓడలకు కొన్ని వారాలపాటు ఆశ్రయం ఇచ్చే ఒక రేవు పట్టణంగా ఉండేది అని అర్థం చేసుకొన వచ్చును.[5]

1666 జూలైలో ఒక ఓడ లోని సరుకులు ఎవరికి చెందాలి అనే అంశంపై వచ్చిన ఒక వివాదంలో మచిలీపట్నం వ్యాపారులు బెంగాలులో ఉండే కంపనీ అధికారులకు వ్రాసిన ఒక లేఖలో కోరింగ ప్రాంతానికి 'మహమ్మద్ బేగ్ అనే వ్యక్తి సుబేదారుడు' గా ఉన్నాడు అని చెప్పటాన్ని బట్టి కోరంగి రేవు గోల్కొండ నవాబు ఆధీనంలో ఉన్నట్లు తెలుస్తుంది.[6] (ఈ మహమ్మద్ బేగ్ 1670–1676 మధ్య రాజమహేంద్రవరాన్ని కేంద్రంగా

4. ప్రాచీనాంధ్ర నౌకాజీవనము – భావరాజు వెంకట కృష్ణారావు
5. The English Factories in India 1618-1621
6. The English Factories in India 1665-1667

కోరంగి సమీపంలోని మట్లపాలెంలో దొరికిన క్రీశ. 198-217 కాలంలో తండ్రి అయిన Septimis Serverus తో కలిసి పాలించిన Felicitas Augg కు చెందిన రోమన్ నాణెములు - సేకరణ శ్రీ వెంకటేష్ కందుల, నాణెముల సేకర్త.



చేసుకొని, నిజాం ప్రభువు ప్రతినిధిగా వేంగిరాజ్యాన్ని పాలించినట్లు మెకంజీ కైఫియ్యతుల ద్వారా తెలుస్తున్నది)

ఆ తదుపరి కాలంలో నెలకొని ఉన్న రాజకీయ అస్థిరతల వల్ల కోరంగి నుండి జరిగే నౌకా వ్యాపారం క్షీణించింది. ఓడదొంగల దుర్మార్గములు పెరిగిపోయినవి. విదేశీ నౌకలు రేవులను చేరుటకు భయపడే పరిస్థితి వచ్చినది.

కోరంగికి సమీపంలో ఉన్న ఇంజరం బ్రిటిష్ వారికి ఒకనాటి ప్రముఖ వర్తక కేంద్రం. ఇంజరంలో నివాసముండే ఈస్ట్ ఇండియా కంపనీ ప్రతినిధి, జాన్ సాండర్‌సన్ 1731, ఏప్రిల్ 7 న వ్రాసిన ఒక ఉత్తరంలో కోరంగికి సమీపంలో డచ్చి వారు ఒక స్థావరాన్ని నిర్మించుకోనున్నట్లు తెలిసింది, మనం కూడా అక్కడ ఏదైనా గొడౌన్ నిర్మించుకోగలిగితే ఉపయోగకరంగా ఉంటుందని పై అధికారులకు విన్నవించాడు.[7]

1739 జూన్ 1 న ఇంజరం కంపనీ ప్రతినిధి Rich Prince వ్రాసిన ఒక ఉత్తరంలో బ్రిటిష్ వారు ఇంజరంలో కొనుగోలు చేసిన కాటన్ వస్త్రాలను రోడ్డుమార్గం గుండా కోరంగి రేవుకు చేరవేసి అక్కడ నుంచి ఎగుమతి చేయటం ఇబ్బందిగా ఉందని, వర్షాకాలంలో రోడ్డుమార్గంపై సరుకులను చేరవేసేటపుడు తడిచిపోయి పాడయి పోతున్నాయని చెప్పాడు.

1751, జనవరి 6 న ఇంజరంలో నివసించే ఈస్ట్ ఇండియా ప్రతినిధి వెస్ట్ కాట్ (Mr. Westcot) వ్రాసిన ఒక లేఖలో స్థానిక రాజు (పూసపాటి పెదవిజయరామరాజు) కోరంగిని సాలుకు 120 పగోడాల చొప్పున గోల్కొండ నవాబు నుండి కౌలుకి తీసుకొన్నాడు. అదే ధరకో కొంచెం ఎక్కువకో మనం తీసుకోగలిగితే మన వ్యాపారాలకు కోరంగి రేవు ఎంతో ఉపయోగపడుతుందని, తనకు అనుమతి ఇస్తే ముందుకు వెళతానని – అంటూ తన ఉన్నతాధికారులకు విన్నవించుకొన్నాడు. అదే సంవత్సరం సెప్టెంబరు నెలలో వెస్ట్ కాట్ వ్రాసిన మరో ఉత్తరంలో కోరంగిని కౌలుకు తీసుకోవటం విషయంలో తన ఆలోచనను సమర్ధించినందుకు ధన్యవాదాలు చెప్పినట్లు ఉండటాన్ని బట్టి ఈస్ట్ ఇండియా గవర్నరు ఆ ప్రతిపాదనకు ఆమోదం తెలిపి ఉంటాడని అర్థమౌతుంది.

1753 ఫిబ్రవరి 1 వ తేదీన వెస్ట్ కాట్ ఉన్నతాధికారులకు వ్రాసిన ఒక లేఖలో – రాజుగారి నుండి కోరింగ రేవు పట్టణాన్ని ఏడాదికి రెండువందల అరవై పగోడాల మొత్తానికి కౌలుకు తీసుకొన్నానని, కోరంగి రేవును స్వాధీనం చేసుకొన్నానని; అంతే కాక ఇక్కడ

7. Letters to Fort St. George 1731

దిగే ఓడలకు మూడు సంవత్సరాలపాటు సుంకం చెల్లించక్కరలేదని ప్రకటించానని, అలా చేయటం ద్వారా వివిధ దేశాలకు చెందిన నౌకలు ఇక్కడకు వస్తాయని తద్వారా ఎక్కువ వ్యాపారం చేసే అవకాశం ఉంటుందని చెప్పుకొచ్చాడు.[8] కోరంగి రేవుపట్టణాన్ని కౌలుకు ఇప్పించటంలో సహకరించిన వారికి 66 పగోడాల బహుమతులను ఇచ్చినట్లు 1756 నాటి కంపనీ జమా ఖర్చులలో ఉండటం ఆనాటి సమాజంలో ఉన్న అవినీతిని పట్టి చూపుతుంది.[9]

అంతవరకూ ఇంజరంలో ఉంటూ వ్యాపారాలు చేసిన వెస్ట్ కాట్ కోరంగికి తన మకాం మార్చి 1759 లో కోరంగి కాలువకు తూర్పువైపున అనేక నూతనభవనములు, గిడ్డంగులు నిర్మించాడు. వెస్ట్ కాట్ అభివృద్ధి పరచిన ఈ ప్రాంతం కొత్తకోరంగిగా పేరు గాంచినది. కోరంగి కాలువకు పశ్చిమఒడ్డున కల ప్రాచీన కోరంగిపట్టణాన్ని పాతకోరంగిగా ప్రజలు పిలుచుకొంటున్నారు.

వ్యాపారనిమిత్తం భారతదేశం వచ్చిన ఇంగ్లీషు, ఫ్రెంచి, డచ్చి, పోర్చుగీసు వర్తకుల మధ్య పద్దెనిమిదో శతాబ్దంలో విపరీతమైన పోటీ ఉండేది. ఒకరినొకరు బద్ద శత్రువులుగా చూసుకొనేవారు. ఆనాటి అరాచక పరిస్థితులను 1789 లో కోరంగిని సందర్శించిన Mr. Topping అనే బ్రిటిష్ వ్యాపారి కళ్లకు కట్టినట్లు వర్ణించాడు– "కోరంగిలో ఇంగ్లీషు, ఫ్రెంచి, డచ్చి, పోర్చుగీసు ఓడలు లంగరు వేసి ఉన్నాయి. చెడు ప్రవర్తన కలవారు ఇక్కడ విపరీతంగా సంచరిస్తున్నారు. ఎవరికీ భద్రత లేదు. రాత్రివేళల మధ్యం మత్తులో ఎవరు ఎవరిని హత్యచేస్తారో తెలియని పరిస్థితి ఉంది. ఎవరు దోపిడీ చేస్తారో తెలియని పరిస్థితులు కోరంగిలో నెలకొని ఉన్నాయి" అంటూ Mr.Topping తనకు రక్షణ కల్పించమని కంపనీ అధికారులను అభ్యర్థించాడు.[10]

పంతొమ్మిదో శతాబ్దం వచ్చేసరికి బ్రిటిష్ వారు రాజకీయంగా బలపడటంతో ఈ ప్రాంతంలో శాంతిభద్రతలు నెలకొన్నాయి. బ్రిటిష్ వారు కోరంగి రేవుకు తిరిగి పూర్వ వైభవాన్ని తీసుకొచ్చి, ప్రపంచ ప్రసిద్ధ రేవుపట్టణంగా అభివృద్ధిచేసారు.

1802లో Mr. Ebenezer Roebuck అనే వ్యాపారి ఓడలు నిలుపుచేసే స్థలాన్ని (Dock) ను నిర్మించాడు. Ebenezer Roebuck ఒక లండన్ వ్యాపారి.

8. Letters to Fort St. George 1752-53
9. Dairy and Consultation book 1756
10. Madras District Gazetteers, Godavari Vol I by FR Hemmingway p.211

ఇతను వ్యాపారనిమిత్తం భారతదేశం వచ్చి కోరంగిలో స్థిరపడి వ్యాపారాలు సాగించాడు. ఇతను నిర్మించిన Dock లో 155 అడుగుల పొడవు, 51 అడుగుల వెడల్పు ఉన్న Albatros పేరుగల ఓడకు మరమ్మత్తులు చేయటం అప్పట్లో ఒక రికార్డుగా నిలిచింది ఎందుకంటే కలకత్తా నుండి శ్రీలంక మధ్యలో ఎక్కడా ఇంతపెద్ద ఓడలను నిలుపుచేసే సౌకర్యం ఉండేది కాదు.[11]

1855లో ఈస్ట్ ఇండియా కంపనీ 62,638 రూపాయిలతో కోరింగ హార్బర్‌ను ఆధునీకరించింది. కోరంగి రేవు ద్వారా 1877-78 మధ్య ఎనిమిది లక్షల రూపాయిల వ్యాపారం జరిగింది.[12]

1845 లో కోరంగి లైట్ హౌస్ ను నిర్మించారు. (చూడుడు ఫొటో). దీని నిర్మాణానికి 73 వేల రూపాయిలు ఖర్చు అయ్యాయి. 1855 లో దీని ఎత్తు 20 అడుగులు పెంపుచేసి, ఎక్కువదూరం కనిపించటం కొరకు లైట్ హౌస్ దీపం సామర్థ్యం పెంచారు. ఈ లైట్ హౌస్ నుంచి వచ్చే కాంతి సముద్రంలో పద్నాలుగుమైళ్ల వరకూ ప్రసరిస్తూ నౌకలకు దారిచూపేది. 1902 తరువాత దీనిని వినియోగించటం నిలిపివేసారు. ప్రస్తుతం ఇది కోరంగి మడఅడవులను సందర్శించటానికి వచ్చే పర్యాటకులను ఆకర్షించే ఒక టూరిస్టు స్పాటుగా ఉంది.

మద్రాసు గవర్నరుగా పనిచేసిన లార్డ్ కన్నెమెరా 19 డిశంబరు 1889న మద్రాసులో Sirsa అనే ఓడపై బయలుదేరి మచిలీపట్నం, కాకినాడ రాజమండ్రి ప్రాంతాలను సందర్శన చేసాడు. ఇతను కోరంగిరేవులో దిగి కాకినాడ వెళ్ళిన వివరాలు ఇలా ఉన్నాయి

> *"మచిలీపట్నం నుంచి బయలుదేరి ఆ రాత్రంతా ప్రయాణించి ఉదయాని కల్లా కాకినాడకు పదిమైళ్ళ దూరంలో ఉన్న కోరంగి రేవుకు చేరుకొన్నాం. కోరంగి రేవు సందడిగా ఉంది. పెద్ద సంఖ్యలో ఓడలు, పడవలు లంగరు వేసి ఉన్నాయి. దూరంనుంచే యజమానులు తమ ఓడలను గుర్తించేందుకు వీలుగా ఓడలకు వివిధ రకాల రంగురంగుల జండాలు ఎగురుతూన్నాయి. జిల్లా కలక్టర్ Mr. Power వచ్చి ఓడలో గవర్నరు గారిని కలిసాడు. అప్పటికే సిద్ధం చేసిన ఆవిరి పడవ ఎక్కి కాకినాడ చేరుకొన్నాము....."*[13]

పై వివరాలనుబట్టి 1889 నాటికి కోరంగి రేవు ప్రధాన జలమార్గంగా ఇంకా ఓడరేవుగా ఉన్నట్లు అర్థమౌతుంది.

---

11. A descriptive & historical account of the Godavery District by Henry Morris, p. 55
12. Ibid p.40
13. Narratives of Tours in India by JD Rees



1845లో నిర్మించిన కోరింగ లైట్ హౌస్

1901 లో బ్రిటిష్ ప్రభుత్వం Mr. Brown అనే ఇంజనీరు ఆధ్వర్యంలో కోరంగి వద్ద తెరుచుకొనే వంతెన (Bascule Bridge) ను నిర్మించింది. ఓడలు వచ్చినప్పుడు ఈ వంతెన రెండుగా తెరచుకొని సుమారు 50 అడుగుల దారి ఇచ్చేది. ఈ వంతెన తలుపులను పైకిలేపటానికి ఎనిమిదిమంది పనివారు కావాల్సివచ్చేదట.[14]

ఇరవయ్యో శతాబ్దం వచ్చేసరికి కోరంగి రేవులో ఇసుకమేటలు వేయటంతో దానిలోతు క్రమేపి తగ్గనారంభించింది. ప్రతి పదేళ్లకు ఒక అడుగుచొప్పున ఇసుక పేరుకుపోయేదట. పెద్దఓడలు వచ్చినపుడు అవి ఇసుకలో కూరుకుపోయేవి. అందుచేత ఓడల రాక నెమ్మది నెమ్మదిగా తగ్గిపోవటం జరిగింది. 1898-99 నాటికి కోరంగి రేవులోకి ఓడలరాక పూర్తిగా నిలిచిపోయింది. కోరంగి తన వైభవాన్ని కోల్పోవటంతో కాకినాడ నౌకాశ్రయం క్రమేపీ దీని ప్రాభవాన్ని అందిపుచ్చుకొని ప్రధాన రేవుపట్టణంగా ఎదిగింది.

కోరంగి ఒకనాటి నౌకా నిర్మాణ కేంద్రం

పూర్వం నౌకల నిర్మాణం, మరమ్మత్తులకు కోరంగి ప్రపంచవ్యాప్త కీర్తి గడించింది. 500 టన్నుల బరువును మోయగలిగే సామర్థ్యం కల ఓడలు ప్రతీ ఏటా వందకుపైగా తయారయ్యేవి. అంతే కాక ఈ సంఖ్యకు నాలుగురెట్లు ఓడలు మరమ్మత్తుల కొరకు వచ్చేవి. నౌకానిర్మాణానికి ప్రధాన ముడిసరుకు టేకు కలప. గోదావరి జిల్లాలోని అడవులలో టేకు కలప విస్తారంగా కలదు. ఇది ఇతర ప్రాంతాలలో దొరికే టేకు కన్న తక్కువ ధరకు లభించటవల్ల కోరంగిలో నౌకా నిర్మాణ పరిశ్రమ బాగా అభివృద్ధిచెందింది. అంతే కాక కోరంగి నుంచి ప్రతీఏటా 2000-3000 టేకు దూలాలు ఇతరప్రాంతాలకు ఎగుమతి జరిగేది. 1793 లో Hamilton అనే ఈస్ట్ ఇండియా వ్యాపారికి కోరంగిలో వెయ్యి టేకుదూలాలను నిలువ చేయగలిగే గొడౌన్ ఉండేదంటే ఏ స్థాయిలో ఇక్కడ కలప వ్యాపారం జరిగిందో అర్థం చేసుకొన వచ్చును.[15] వందగదుల బిల్డింగ్ పేరుతో కోరంగిలో కొన్ని పునాది శిథిలాలు ఉండేవి. అవి ఒకనాడు ఇక్కడ జరిగిన లావాదేవీలకు జ్ఞాపకంగా మిగిలిన ఆనవాలు.[16]

---

14. Madras District Gazetteers, Godavari Vol I by FR Hemmingway p. 126
15. Economic Development of Andhra 1766-1957 by A. V Ramana Rao.
16. 2020 డిసంబరు 12 న నేను కోరంగి వెళ్ళినపుడు ఈ శిథిలాలు కనిపించలేదు.

నిజానికి భారతదేశ నౌకాయాన పరిశ్రమ అతి ప్రాచీనమైనది. వేదాలలో నావికా పరిశ్రమ, నౌకా వ్యాపారమును గురించి ప్రస్తావనలు ఉన్నాయి. భుజ్యురాజు ఓడ ప్రమాదానికి గురయినపుడు అశ్విని సోదరులు తమ నూరుతెడ్ల ఓడలో అతనిని సంరక్షించిన కథ వేదరుక్కులలో కలదు. మహాభారతంలో రాజసూయయోగ సందర్భముగా సహదేవుడు అనేక ద్వీపములను జయించాడని ఉన్నది. వరాహపురాణములో గోకర్ణుడను వర్తకుడు నౌకాయానముచేస్తూ నౌకా భంగానికి గురయినట్లు తెలుపబడింది. నౌకానిర్మాణానికి అనుకూలమైన కలప గురించి, నౌకా లక్షణముల గురించి, వివిధ అవసరాలకు తగినట్లు సుమారు 25 రకాల వివిధ నౌకలనిర్మాణం వాటి మంచి చెడ్డల గురించి "యుక్తికల్పతరువు" అనే గ్రంథంలో మన ప్రాచీనులు విపులంగా వర్ణించారు. మనుస్మృతిలో నౌకా వ్యాపారం చేసేందుకు అనుకూలమైన కాలములు చెప్పారు. చాణక్యుని అర్థశాస్త్రంలో– రేవుపట్టణంలో ఉండే రాజప్రతినిధి అయిన నావాధ్యక్షుని విధులు "పన్నులు వసూలు చేయటం, నౌకలకు కావలసిన సదుపాయములు కల్పించటం, ఎగుమతి దిగుమతుల్లో అక్రమాలు జరగకుండా చూడటం, ఓడదొంగలనుండి వ్యాపారులకు రక్షణ కల్పించటం" అని చెప్పబడింది. శాతవాహనపాలకులు నౌకా చిహ్నాలను తమనాణాలపై ముద్రించుకొన్నారు.[17]

అంతటి ఘన చరిత్ర కలిగిన భారతీయ నౌకా పరిశ్రమచే శాస్త్రీయంగా నిర్మించిన ఓడలను తొలిసారిగా చూసిన యూరోపియన్ లు అచ్చెరువొందారు. వాళ్ళు వ్యాపారం కొరకు వచ్చారు కనుక పనిలోపనిగా ఇక్కడ నిర్మించిన నౌకలను విదేశాలకు ఎగుమతి చేసి పెద్దఎత్తున వ్యాపారం చేసారు. కోరంగిలో నిర్మించిన నౌకలు దేశవిదేశాలలో క్షణాలలో అమ్ముడు పోయేవి. ఉదాహరణకు 1814లో కోరంగిలో నిర్మించబడ్డ Lady Hood పేరుకల ఓడ ఫ్రాన్స్ దేశంలో విక్రయించబడింది. 1816లో తయారైన City of Ediburgh ఓడను ఇంగ్లాండు వ్యాపారులు కొనుక్కొన్నారు. 1818 నాటి కోరంగిలో తయారైన Isabella అనే ఓడ ఆమెరికాలో అమ్ముడుపోయింది.[18]

1833 లో కోరంగి నౌకా నిపుణులచే నిర్మితమైన Charles Eaton అనే ఓడ ఎలా ఉండేదో వివరాలు ...

"Charles Eaton 350 టన్నుల బరువును మోయగలిగే సామర్థ్యము కలిగి ఉన్నది. కోరంగి ఓడరేవు అధికారిగా పనిచేసి, 1827 లో ఇక్కడే మరణించిన

17. భారత నౌకాపరిశ్రమ, కర్రి సీతారామయ్య (చూడుడు ఫొటో)

18. A Collection of Papers Relative to Ship Building in India By John Phipps p. 174



CHARLES EATON SHIP

Source: Charles Eaton, wake for the melancholy shipwreck - Australian maritime history



Charles Eaton పేరును ఈ ఓడకు పెట్టారు. ఈ ఓడ అత్యుత్తమ టేకుతో తయారయినది. రెండు అంతస్థులు కలవు. ఒక్కో అంతస్థు ఎత్తు ఆరున్నర అడుగులు. ఓడముందరి భాగము ఎత్తుగా అందంగా నగిషీలతో ఉన్నది. గదుల మధ్య నడవటానికి పొడవుగా, వెడల్పైన వసారా కలదు. ఓడ వెలుపలి భాగం దృఢంగా ఉండటం కొరకు చెక్కలకు సున్నం, తారులతో రాగిరేకులు తాపడం చేసి ఉన్నవి. ఈ ఓడకు చెప్పుకోదగ్గ విశేషం ఏమిటంటే, ప్రయాణికులు బసచేసే గదులు పెద్ద ఓడలలో ఉన్నట్లుగా చాలా విశాలంగా, విలాసవంతంగా ఉండి, ప్రతి గదికి ప్రత్యేకమైన *Toilet* కలిగి ఉండటం. ఈ ఓడను లండన్ మార్కెట్టులో అమ్మకానికి పెట్టగా *Gledstanes & Co* అనే కంపనీ కొనుగోలు చేసింది"[19]

కోరంగి ఓడలకు ఉన్న డిమాండ్ కారణంగా నౌకా నిర్మాణకారులకు ముందస్తుగా అడ్వాన్సులు ఇచ్చి తయారుచేయించుకొనేవారు. ఉదాహరణకు – 1854లో Delacombe అనే ఫ్రెంచి వ్యాపారి మాసరయ్య అనే వడ్రంగికి 20 మీటర్ల పొడవైన నౌకను నిర్మించి ఇవ్వటానికి 350 రూపాయిలు అడ్వాన్సుగా ఇచ్చి ఎగ్రిమెంటు చేసుకొన్నాడు.[20]

కోరంగి నౌకా నిర్మాతలు అంతర్జాతీయ ప్రమాణ నైపుణ్యాలను కలిగి ఉండేవారు.

కోరంగి రేవు వద్దకు అనేక అంతర్జాతీయ నౌకలు మరమ్మత్తుల కొరకు వచ్చేవి. CPT Laplace అనే ఒక ప్రపంచ యాత్రికుడు 1830 జూలై నెలలో కోరంగిలో ఆగి తన 120 అడుగుల పొడవు, 33 అడుగుల వెడల్పు కల La Favourite అనే నౌకను మరమ్మత్తు చేయించుకొన్న సంగతిని *'Voyage autour du Monde'* (Travel around the world) అనే పుస్తకంలో ఇలా గ్రంథస్థం చేసాడు.

"కోరంగి వద్ద నైపుణ్యం కలిగిన వడ్రంగులు, కమ్మరులు పెద్ద సంఖ్యలో ఉన్నారు. La Favourite చెడిపోయిన చుక్కాని యొక్క లోహ అమరికను జాగ్రత్తగా విప్పి, దాన్ని కరిగించి ఎంతో ఖచ్చితత్వంతో, నైపుణ్యంగా పూర్తిగా కొత్తదానివలె తయారు చేసి తిరిగి ఓడకు బిగించారు. చాలా చవకగా, తక్కువ సమయంలో ఓడకు వీరు చేసిన ఇది ఇంకా ఇతర మరమ్మత్తులు నాకెంతో సంతృప్తిని ఇచ్చాయి"

.... అంటూ ప్రపంచాన్ని చుట్టి వచ్చిన లాప్లాస్ కోరంగి ఓడలు నిర్మించేవారి పనితనాన్ని గురించి చేసిన వ్యాఖ్యలు విలువైనవి.

19. Charles Eaton: wake for the melancholy shipwreck - Australian maritime history
20. ఫ్రెంచిపాలనలో యానాం, బొల్లోజు బాబా

తుఫానులు, వరదలు, ఉప్పెనల కారణంగా ఏర్పడ్డ ఇసుకమేటల వలన ఇక్కడి నౌకా వాణిజ్యం, నిర్మాణ, మరమ్మత్తుల వ్యాపారం కాలక్రమేణా క్షీణించింది. అంతేకాక ఆవిరి ఓడల రాకవల్ల తెరచాపలపై ఆధారపడి నడిచే ఓడలు తమ ప్రాముఖ్యతను కోల్పోయి, కనుమరుగు కావటం కూడా మరో కారణం. గతవైభవానికి చిహ్నంగా కోరంగి సమీపంలో కల తాళ్లరేవులో పడవల నిర్మాణం ఇంకా నేటికీ కొనసాగుతున్నది.

కోరంగిని ధ్వంసం చేసిన తుఫానులు ఉప్పెనలు

కోరంగి తీరప్రాంతంలో ఉండటం వలన ఉప్పెనల తాకిడి ఎక్కువ. Topping అనే బ్రిటిష్ ఇంజనీరు 1789 లో కోరింగని సర్వే చేసేటపుడు, అతడు స్థానిక ప్రజలను చేసిన విచారణల ద్వారా 1706 లో కోరంగిలో వచ్చిన ఒక ఉప్పెన వల్ల స్వల్ప నష్టం జరిగిందని, ఆ తరువాత 1787 మే 20 న వచ్చిన ఉప్పెన మహా ప్రళయాన్ని సృష్టించిందని రికార్డు చేసాడు.

ఈ ఉప్పెన వచ్చిన మర్నాడు ఇంజరంలో నివాసం ఉంటున్న బ్రిటిష్ అధికారి తన పై అధికారులకు వ్రాసిన ఉత్తరంలో ...

"ఉప్పెన వల్ల కోరంగిపట్టణం, చుట్టుపక్కల గ్రామాలు నేలమట్టం అయ్యాయి. బంధువులను కోల్పోయిన ప్రజలు అటూ ఇటూ పరుగులెడుతూ రోదిస్తూ తిరిగుతుండటం హృదయవిదారకరంగా అనిపిస్తుంది. నూతులు చెరువులు ఉప్పునీటితో నిండిపోయాయి. ప్రజలకు తాగునీరు ఎక్కడా లభించటం లేదు. కనీసం ఇరవైవేలమంది ప్రజలు, అయిదులక్షల పశువులు కనిపించటం లేదు. ఆహారనిల్వలు, పంటలు అన్నీ నాశనం అయ్యాయి"

....అంటూ ఆనాటి ఉప్పెన విధ్వంసాన్ని వర్ణించాడు.

ప్రపంచయాత్రికుడు లాప్లాస్ తన పుస్తకంలో ఆనాటి విధ్వంసం గురించి ఇలా చెప్పుకొచ్చాడు

"తుఫాను ఒక్క రోజులో విలయం సృష్టించింది. తాడెత్తు కెరటం కోరంగిపై విరుచుకుపడింది. ఇరవై వేలమంది ప్రజలు ఆ ఉప్పెనలో కొట్టుకు పోయారు. అనేక భవనాలు నేలమట్టం అయ్యాయి. తుఫాను ముగిసాక కోరంగి పోర్టు ఆఫీసరు ఇల్లు, ఓడలు నిలుపు స్థలము తప్ప సర్వం మట్టిలో కప్పబడిపోయాయి. అంతవరకూ ఇక్కడ అన్ని యూరోపియన్ దేశాలకు చెందిన వర్తక స్థావరాలు ఉండేవి. 1787

లో వచ్చిన ఉప్పెనకు ముందు కోరంగిలో ముప్పై వేలమంది నివసించేవారు. అనేక ఎత్తైన భవనాలు ఉండేవి. ఈ రోజు ఏమీ లేదక్కడ" [21]

క్రీశ.1787 నాటి ఉప్పెనకు కోరంగిలో నిలుపుచేసిన ఓడలు సుమారు 70 కిలో మీటర్ల దూరంలో కల రాజమండ్రి వరకు కొట్టుపోయాయంటే ఎంత ఎత్తులో నీరు వచ్చిందో ఊహించుకొనవచ్చును.

ఆ తరువాత కాలంలో కోరంగిని అతలాకుతలం చేసిన అతి పెద్ద తుఫాను 1839 నవంబరు 16, 17 తారీఖులలో వచ్చింది. ఈ తుఫాను అండమాను నుంచి మొదలై తక్కువ వ్యాసంతో, ఎక్కువ శక్తితో, సుడులు తిరుగే గాలులతో కోరంగిని తాకిందని వాతావరణ శాస్త్రవేత్త Henry Piddington అభిప్రాయపడ్డాడు. ఈ రకపు తుఫానులకు Cyclone అనే పదాన్ని సృష్టించి వాడుకలోకి తీసుకొచ్చాడు

ఆనాటి రాజమండ్రి కలక్టర్ George Smith ఈ తుఫానుగురించి *"16వ తారీఖు ఉదయం నుంచీ గాలులు తీవ్రంగా వీచటం మొదలైంది. ఆ రాత్రికల్లా సముద్రం అనేక తీరప్రాంత గ్రామాలను ముంచెత్తింది. సుమారు అయిదువేలమంది మరణించి ఉంటారని అనుకొంటున్నాను"* అంటూ తుఫానుపై తన తక్షణ రిపోర్టును పై అధికారులకు తెలిపాడు. [22]

నవంబరు 27వ తారీఖు Madras Herald అనే పత్రిక ఈ తుఫానును గురించి ఇలా వ్రాసింది

"పదహారవ తారీఖు రాత్రి పదకొండు గంటలనుండి గాలుల తీవ్రత పెరిగి ఉదయం 4 గంటలవరకూ బీభత్సాన్ని సృష్టించాయి. ఆ సమయంలో కోరంగిలో కాస్త ఎత్తులో ఉన్న ఒకే ఒక పెద్ద బిల్డింగు, ఇంకా మూడు నాలుగు చిన్న ఇళ్ళు మాత్రమే మిగిలాయి. సర్వం ఆ ఉప్పెనలో కొట్టుకుపోయాయి. సుమారు 20,000 మంది చనిపోయారు. ఎక్కడ చూసినా శవాల కుప్పలు.

కోరంగికి దానికి నాలుగైదుమైళ్ళ దూరంలో ఉన్న Onagalo ఆలయానికి మధ్య నివాసప్రాంతాలన్నీ నిర్జనమయ్యాయి.(బహుశా చొల్లంగి ఆలయం కావొచ్చు). లైట్ హౌస్ లాంతరు, ఫోకస్ అద్దం పగిలిపోయాయి.". [23]

---

21. Sailors Horn-book by Henry Piddington
22. The progress of the development of the law of storms Reid, William pn. 99
23. Journal of Asiatic society, 1840 p.410

అదేవిధంగా Bombay Courier అనే పత్రిక 1839 డిసంబరు 7వ తేదీ సంచికలో ...

"నవంబరు లో వచ్చిన తుఫాను కారణంగా యూరోపియన్, దేశీయుల ఇళ్ళన్నీ నేలమట్టం అయ్యాయి. కోరంగిలో నేడు చూడటానికి ఏమీ లేవు శిథిలాలు తప్ప. ఒక్క అయిదారు గంటలు మాత్రమే సాగిన విధ్వంసంలో సుమారు 20,000 మంది పైగా మృతి చెందారు. ఎటుచూసినా మృతదేహాలు. పెద్ద పెద్ద ఓడలు నదిలో ఎక్కడెక్కడికో కొట్టుకుపోయాయి. వందలాది చిన్న పడవలు గల్లంతు అయ్యాయి."... అంటూ 1839 కోరంగి తుఫాను నష్టాన్ని రిపోర్టు చేసింది.

1839 కోరంగి తుఫాను ఉగ్రత గురించి సమీప ఫ్రెంచి కాలనీ అయిన యానాం అధికారి Colin De Bar పాండిచేరీకి గవర్నరుకు వ్రాసిన లేఖలలో ఇలా తెలియచేసాడు.

"ఆ రాత్రి 11 గంటలకు తుఫాను గాలులు తీవ్రతరం కావటంతో ప్రజలు భయాందోళనలకు గురయి సురక్షిత ప్రాంతాలకు తరలిపోవటం మొదలుపెట్టారు. నా అధికారిక నివాసంలోకి నీళ్ళు ప్రవేశించి చాలా రికార్డులు కొట్టుకు పోయాయి. నేనుకూడా నా నివాసాన్ని విడిచి మన్యం వారి మేడపైకి చేరుకొన్నారు. ఫ్రెంచి జండాను ఎగరేసే జండా స్థంభం మొదలులోకి విరిగిపడింది. యానాం, కాకినాడ రాజమండ్రి ప్రాంతాలలో సుమారు 130 నౌకలు ఎక్కడెక్కడికో కొట్టుకుపోయాయి. అనేక వందల పడవల ఆచూకీ లేదు. కొంతమంది వ్యక్తులు, శవాలు తమతమ ఇళ్ళకు కొన్ని కిలోమీటర్ల వరకూ విసిరివేయబడ్డారు. నాలుగొందలమంది తలదాచుకొన్న ఓ ఇల్లు కూలిపోవటంతో అందరూ అక్కడికక్కడే చనిపోయారు".[24]

1839 కోరింగ సైక్లోను ప్రపంచంలోనే అత్యంత విషాదకరమైనదని; దీనివల్ల మూడు లక్షల మంది చనిపోయారని; ఇది ప్రపంచ తుఫానులలో మూడవ అతి పెద్ద తుఫాను అంటూ అనేక ఇంటర్నెట్ సైట్లలో చెప్పబడుతూ ఉంది. కానీ ఈ సంఖ్యలకు సంబంధించిన సరైన చారిత్రిక ఆధారాలు కనిపించలేదు. ఈ తుఫానుగురించిన ఆనాటి వివిధ అధికారిక, పత్రికా ఉటంకింపులలో మృతుల సంఖ్య ఇరవై వేలు అని చెప్పబడింది. అప్పట్లో కోరంగి జనాభాయే ముప్పయివేలు ఉండేది. జిల్లా జనాభా ఐదు లక్షలు. వారిలో

24. ఫ్రెంచిపాలనలో యానాం, బొల్లోజు బాబా pn. 32

మూడు లక్షలమంది పది స్క్వేర్ కిలోమీటర్ల పరిధిలో వచ్చిన తుఫానులో చనిపోయారనటం నమ్మశక్యం కాదు. 1821-1839ల మధ్య జిల్లా జనాభా సాంద్రత రెండు లక్షలు తగ్గి పోవటానికి కారణాలు వేరే ఉన్నాయి, 1839 కోరింగ సైక్లోను కాదు.[25]

కోరంగి రేవునుంచి జరిగిన వలసలు

గోదావరి జిల్లాలలో పద్దెనిమిదో శతాబ్దంలో ఆహారపంటలు బదులుగా ఎక్కువ లాభాలను అందించే నీలిమందు, పత్తి, చెరకు, పొగాకు, నువ్వులు వంటి వ్యాపార పంటలను పెంచి వాటి ఉత్పత్తులను విదేశాలకు ఎగుమతి చేసేవారు. అలా సంప్రదాయ వ్యవసాయంలో వచ్చిన మార్పు వలన ఆహారధాన్యాలకు కరువు ఏర్పడింది. వ్యవసాయకూలీలకు పనులు లేక తిండిలేక కోరంగి కాకినాడ లాంటి రేవులలో కూలీలుగా మారి జీవనం సాగించేవారు. అనేకమంది కూలీలు ఇక్కడ విలయతాండవం చేస్తున్న కరువునుండి తప్పించుకోవటం కొరకు రంగూను, మారిషస్ ప్రాంతాలకు వలసపోయేవారు. ఎక్కువమంది అక్కడే స్థిరపడిపోయారు. ఇలాంటి వలసలు 1830 ల నుంచి మొదలైంది. (చూడుడు ఫుట్ నోట్స్ 25). కోరంగి రేవునుంచి రంగూను, మలేషియా వెళ్ళి అక్కడ స్థిరపడిన వారిని అక్కడి స్థానికులు నేటికీ కొరంగీలు, క్లింగ్ లు (కళింగ రూపాంతరం) అని పిలుస్తారు. 1850 ల తరువాత ధవళేశ్వరం ఆనకట్ట కారణంగా వేల ఎకరాలు సాగులోకి వచ్చి ఈ

---

25. 1821లో జిల్లా జనాభా 7,38,308. 1839-40 లో ఇది 5,33,836. ఈ అంకెలలో సుమారు రెండులక్షల మంది జనం తగ్గటానికి కారణం 1821 నుంచి పన్నెండేళ్ళ పాటు వర్షాలు సరిగా పడకపోవటం వల్ల 1832 లో వచ్చిన తీవ్రమైన దుర్భిక్షం. దీని ప్రభావం గుంటూరుజిల్లాలో ఎక్కువ కనుక ఈ కరువును గుంటూరు కరువు లేదా డొక్కల కరువు అని పిలుస్తారు. ఇదే సమయంలో ఉత్తరభారతదేశంలో తీవ్రమైన వర్షాభావం వల్ల గోదావరి నదిలో నీరు తగ్గి ఏ రకమైన పంటలు పండలేదు.

    ఈ పరిస్థితులలో తాగేందుకు నీరులేక, తినేందుకు తిండిలేక ప్రజలు పెద్దఎత్తున ఇతర ప్రాంతాలకు వలసలు పోవటం మొదలుపెట్టారు. ఎక్కడో ఒకచోట బ్రతికుంటారని చంటిపిల్లల్ని, ఆడబిడ్డల్ని అమ్ముకొన్నారు. ఆ తరువాత కూడా 1835 నుంచి 1838 వరకూ చుక్క వానపడక జిల్లాలో దుర్భిక్షం మరింత తీవ్రమైంది. జిల్లాలోని కరువు పరిస్థితులపై ఈస్ట్ ఇండియా కంపనీ ప్రభుత్వం 1844 లో Henry Montgomery ఆధ్వర్యాన ఒక కమిటీని వేసింది. ఇతను దవళేశ్వరం వద్ద ఆనకట్ట నిర్మించితే జిల్లాను కరువునుండి కాపాడవచ్చు అని సిఫారుసు చేసాడు. దానికి అనుగుణంగా Arthor Cotton సారధ్యంలో 1847 ధవళేశ్వరం ఆనకట్ట నిర్మాణం మొదలైంది. తరువాత వచ్చిన ఏ కరువు జిల్లాను తాకలేదు

    (Ref:Madras District Gazetteers, Godavari by F.R. Hemingway pn 138-40)

ప్రాంతంలో కరువు పరిస్థితులు తగ్గాయి. ఆ కాలంలో ఈ ప్రాంతవాసులు మెరుగైన అవకాశాలకొరకు, వ్యాపారం చేయటానికి రంగూను వెళ్ళేవారు. అలా వెళ్ళినవారిలో కోరంగి గ్రామానికి చెందిన శ్రీ మల్లాడి సత్యలింగం నాయకర్ ఒకరు. వీరు రంగూన్ వెళ్ళి, వ్యాపారాలు చేసి సంపాదించిన ఎనిమిది లక్షల రూపాయిలతో కాకినాడలో విద్యా సంస్థలు నెలకొల్పమని 1919లో ఏర్పాట్లు చేసారు. వారి ఆశయాలకు అనుగుణంగా నెలకొల్పిన MSN Charities విద్యాసంస్థలు నేటికీ నడుస్తూ జిల్లాకి తలమానికంగా నిలిచాయి.

కోరంగి సాంస్కృతిక అంశాలు

కోరంగి ఊరికి ఆ పేరెలా వచ్చిందో చెప్పే స్థలపురాణం ఒకటి మెకంజీ సేకరించిన సిద్ధాంతం క్రైస్తవ్యశకంలో కలదు. "త్రేతాయుగములో శ్రీరామచంద్రుడు సీతాలక్ష్మణ సమేతంగా వనవాసం చేస్తున్నపుడు గోదావరి తీరంపై కొంతకాలం నివసించాడు. ఒకనాడు సీత ముచ్చట పడిన బంగారు కురంగమును (జింక) పట్టుకోవటానికి దానిని చాలాదూరము వెంటతరిమాడు. అది ప్రాణము విడిచిన ప్రాంతములో ఆ పిమ్మట ఒక గ్రామము ఏర్పడినది. దానిని కోరంగి అని ప్రజలు పిలుచుకొంటున్నారు". ఈ కథ కోరంగి గ్రామనామానికి ఐతిహాస్య సంబంధాన్ని కల్పిస్తుంది.

ఏడవ శతాబ్దంలో కోరంగి కురంగేశ్వరపురము[26] పేరుతో ప్రఖ్యాతిక్కెకిన పట్టణముగా ఉండెను. నేడు కోరంగి సమీపములో ఉన్న తూరంగి వద్ద రాముడు ప్రతిష్టించినట్లు చెప్పబడే తురంగేశ్వర ఆలయము కలదు. కురంగేశ్వర నామం తురంగేశ్వరంగా కాలానుగుణ మార్పు చెంది ఉండవచ్చు.

తూర్పుతీరంపై నవంబరు నుండి జనవరి మధ్య ఉత్తరతూర్పు గాలులు బలంగా వీస్తాయి. భారతీయ పంచాంగం ప్రకారం ఈ రోజులు కార్తీకమాసంలో వస్తాయి. ఈ సమయంలో ఓడలు సరుకులు తీసుకొని తూర్పుదక్షిణ దేశాలకు వ్యాపారనిమిత్తం బయలు దేరేవి. ఓడలపై బయలుదేరివెళ్ళే పురుషులకు వారి కుటుంబస్త్రీలు తీరంవద్దకు వచ్చి ఆనందోత్సాహాలతో వీడ్కోలు చెప్పేవారు. తీరప్రాంతాలలో ఈ సమయంలో పెద్ద ఎత్తున ఉత్పత్తుల అమ్మకాలు కొనుగోళ్ళు జరుగుతూ ఒక పండగవాతావరణం ఉండేది. నేటికీ కార్తీకపౌర్ణమిరోజున నౌకాయానంతో సంబంధం ఉన్న ఒరిస్సానుంచి తమిళనాడు వరకూ స్త్రీలు బొమ్మపడవపై దీపాన్ని ఉంచి నదులలోకి విడిచిపెట్టటం ఒక ఆచారంగా పాటిస్తారు. దీనిని ఒరిస్సాలో బాలియాత్ర అని, తెలుగు, తమిళప్రాంతాలలో ఈ పండుగను కార్తీక

26. ఆంధ్రుల చరిత్రము – ప్రథమ భాగము చిలుకూరి వీరభద్రరావు పే. 24

పౌర్ణమని పిలుస్తారు. తెలుగు ప్రాంతాలలో కార్తీక అమావాస్య మరుసటి రోజు అంటే మార్గశిర పాడ్యమి నాడు నదీ స్నానం ఆచరించి అరటి డొప్పలో దీపాలు వెలిగించి నదిలో వదిలిపెట్టడం ఆనవాయతిగా ఉన్నది.

ఇదే విధంగా నీటిలో దీపం ఉంచిన పడవబొమ్మలను విడువటం అనే ఆచారం ఇక్కడ నుంచి మనవాళ్ళు వెళ్ళి ఎక్కడైతే వ్యాపారాలు చేసేవారో అక్కడి దేశాలలో కూడా ఉండటం గమనార్హం. థాయిలాండ్‌లో స్త్రీలు నీటిలో బొమ్మపడవలో దీపం ఉంచి విడిచే పండుగను Loykrathong పేరుతోను, బాలి లో Masakapan Ke Tukad పేరుతోను జరుపుకొంటారు. ఈ సాంస్కృతిక సారూప్యతను వందల సంవత్సరాల క్రితం జరిగిన Cultural Exchange గా అనుకోవచ్చు.

కార్తీక మాసంలో ఆడపడుచులు తమ సోదరులకు భగినీ హస్తభోజనం పేరుట విందు ఏర్పాటు చేసే ఆచారం కూడా తెలుగునాట కనిపిస్తుంది. ఇది బహుశా వ్యాపారాల నిమిత్తం బయలుదేరుతున్న సోదరులకు శుభకామనలు చెప్పటం కొరకు లేదా ఎక్కువ ధనంతో తిరిగి వచ్చి తమకు మంచి బహుమతులు ఇవ్వవలసి ఉంటుంది అంటూ తమ బంధాలను దృఢపరచుకోవటం కావొచ్చు. కారణమేదైనా ఈ పండుగలు నౌకలు ప్రయాణించే నెలలలో రావటం వెనుక ఉండే చారిత్రిక కారణాలను విస్మరించలేం.[27]

వ్యవసాయ ఉత్పత్తులు వచ్చే కాలంలో సంక్రాంతి పండుగ జరుపుకోవటం ఎలాంటి ఆచారంగా పరిణమించిందో తూర్పుతీరంలో నౌకా వ్యాపారాలు జరుపుకొనే కాలం కూడా పండుగల రూపంలో మన సంస్కృతిలో ఒక భాగంగా స్థిరపడటం జరిగింది. ఈ పండుగలు ఒకనాడు ఈ ప్రాంతాలలో జరిగిన నౌకావ్యాపారాల ఉత్సవవాతావరణపు అవశేషంగా అనుకోవచ్చు.

ముగింపు

కోరంగి సెమెటరీలో బ్రిటిష్ అధికారులకు చెందిన ఏడు సమాధులు ఉన్నట్లు List of Inscriptions on Tombs in Madras Vol II లో సమాచారం ఉంది. అవి William Clark (1802), A. Meris (1804), Alexander Woodcock (1816), John Eaton (1819), Charles Eaton (1827), William Charles Eaton (1857) వ్యక్తులవి. వీరు కోరింగలో ఈస్ట్ ఇండియా కంపనీ అధికారులుగా పనిచేసి ఇక్కడే గతించారు. వారి సమాధులను విక్టోరియా సమాధులు అని స్థానికులు

27. https://www.ancient-asia-journal.com/articles/10.5334/aa.118 /

పిలుచుకొనేవారు. 2009లో ఈ సమాధులను మొత్తం పెకలించి ఆ ప్రాంతాన్ని చదును చేయటం జరిగింది. స్థానిక మాజీ సర్పంచి శ్రీ బుజ్జి గారి సహాయంతో, అతి కష్టం మీద ఎవరో ఔత్సాహికుడు భద్రపరచిన ఒక సమాధి ఫలకం దొరికింది. (చూడుడు-ఫొటో). దానిపై

"Sacred to the memory of Alexander Woodcock, Esq, who departed this life on 19th May 1816, aged 46 and Mary Ann, his infant daughter, who died in March, 1810, aged 11 months" అని ఉన్నది. ఈ అలెగ్జాండర్ వుడ్ కాక్ కోరంగి ఒక పెద్ద ఓడరేవుగా, నౌకా నిర్మాణకేంద్రంగా వెలుగొందిన కాలంలో ఓడరేవు అధికారిగా పని చేసాడు (Master attendant).

1817 నాటి Asiatic Journal and Monthly Register లో ఈ అలెగ్జాండర్ వుడ్ కాక్, Lark అనే ఓడపై కోరంగినుండి మద్రాసు వెళుతూ దారిమధ్యలో చనిపోయాడని ఉంది.

పైన చెప్పిన ఫలకం మద్రాసులో తయారైనట్లు క్రింద రాసి ఉంది. ఆ ఫలకంపై అలెగ్జాండర్ పేరుతో పాటు అంతకు ఆరేళ్ల క్రితం పదకొండునెలల వయసులో చనిపోయిన అతని కూతురు Mary Ann పేరు కూడా ఉండటం గమనార్హం. బహుశా అలెగ్జాండర్ మిత్రులో బంధువులో ఎవరో ఈ ఫలకాన్ని మద్రాసులో తయారుచేయించి ఆ తండ్రి కూతుర్ల జ్ఞాపకార్థంగా పాతించి ఉంటారు.

1915లో గోదావరి జిల్లా చరిత్ర వ్రాసిన హెమ్మింగ్ వే "నేడు సముద్రంలోతీరానికి ఒక మైలు దూరంలో జాలరుల వలలకు ఏవో నిర్మాణాలు తగులుకొంటున్నాయని, పాటు సమయంలో అనేక ప్రాచీన నాణాలు బయటపడుతున్నాయని, సముద్రం లోపలేదో మునిగిపోయిన పట్టణం ఉండే ఉంటుంది" - అంటూ ఈ ప్రాంత ప్రాచీనతకు సముద్రాన్ని సాక్ష్యం చేస్తాడు.

భారతదేశ చరిత్రలో జగజ్జేయమానంగా వెలుగొందిన ఒకనాటి కోరంగి, తుఫానులు, సునామీలు, వరదలు వంటి ప్రకృతివైపరీత్యాల కారణంగా పదుల అడుగుల మట్టి క్రింద కప్పడిపోయింది, కొంత సముద్రంలో కొట్టుకుపోయింది. ఏమో నేటి కోరంగి మట్టిపొరల క్రింద ఒకనాటి ఆంధ్రదేశ ఔన్నత్యాన్ని చాటే ఏఏ ఆధారాలు నిద్రిస్తున్నాయో! కానీ పైకి కనిపిస్తూ గతవైభవాన్ని సూచించే ఏ చిహ్నాలూ నేడు ఇక్కడ లేవు. సెమెటరీని కూడా ఇటీవలే పాడుచేసుకోవటం దురదృష్టకరం.

★ ★ ★

చారిత్రిక ప్రాధాన్యం కలిగిన ఇతర పట్టణాలు

ఆంధ్ర వేదాద్రి కోరుకొండ

రాజమహేంద్రవరానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక ప్రాచీనపట్టణం కోరుకొండ. ఇక్కడికి సమీపంలో కల కాపవరం కొండపై క్రీ.శ. రెండో శతాబ్దానికి చెందిన బౌద్ధ అవశేషాలు ఈ ప్రాంతపు ఒకనాటి వైభవాన్ని గుర్తుచేస్తూ నిలిచి ఉన్నాయి. 2001 లో పురావస్తు శాఖవారు జరిపిన తవ్వకాలలో చైత్యాలు, ఆరామాలు, ఒక విశాలమైన ప్రార్థనామందిరం, అనేక స్థూపాలు బయటపడ్డాయి. ఐదు రాతిగుహలు కలవు. రాతిని తొలచి సహజంగా ఏర్పరచిన ద్వారాలు, కిటికీలు, మంచినీటి కుండీలు కలవు. కాలక్రమేణా బౌద్ధం కనుమరుగయ్యాకా ఈ ప్రాంతంలో శైవం ప్రవేశించినట్లు మెకంజీ కైఫీయ్యతుల ద్వారా తెలుస్తుంది.[1]

ముక్కంటి అనే పల్లవరాజు అయిదో శతాబ్దాంతంలో ఆంధ్రదేశాన్ని ధరణికోట కేంద్రంగా చేసుకొని పాలించాడు. ఇతని వద్ద మంచి, కొండ అనే ఇద్దరు సేనానులు ఉండేవారు. ఆ తదుపరికాలంలో వీరి వంశానికి చెందిన కేశమి నాయక, అతని కుమారుడు గణపనాయక, అతని కుమారుడు కూనయనాయకలు[2] కాకతీయ ప్రభువులకు సామంతులుగా ఉంటూ ఈ ప్రాంతాన్ని పాలించారు. కూనయనాయక కోరుకొండలో పెద్ద కోటను (వనదుర్గం) నిర్మించి దానిలో నివాసముంటూ ఈ ప్రాంతాన్ని పాలించాడు. కాకతీయుల

1. కోరుకొండ కైఫియ్యతు- కోరుకొండపై పారాశర్యుడు అనే రుషి తపస్సుచేసుకొనేవాడు. ఈయన ప్రతిరోజు మట్టితో శివలింగము చేసి, పూజాదికాలు నిర్వహించి కొండపై ఉన్న సరోవరంలో విడిచేవాడు. అవి శిథిలంకాకుండా శిలారూపం పొందేవట. తరువాత కొన్నినాళ్ళకు రాజరాజ నరేంద్రుడు వేటకు వచ్చి, సరోవరంలో అసంఖ్యాకంగా ఉన్న శివలింగాలను చూసి అక్కడొక శివాలయం కట్టించాడట.

2. History of the Reddi kingdoms by Sarma, M. Somasekhara rao P.no 314

పతనానంతరం ఇతను స్వతంత్రం ప్రకటించుకొన్నాడు. ఇతని కొడుకులు ముమ్మడి నాయక, సింగయనాయక, గన్నయనాయకలు. వీరిలో ముమ్మడినాయకుడు శక్తివంతుడు. ఇతడు గోదావరి పరీవాహక ప్రాంతాలను అనేకం జయించి కోరుకొండను రాజధానిగా చేసుకొని పాలించాడు. ఈ ముమ్మడి నాయకుడు తన సోదరులైన సింగయనాయకను కోటిపురికి (కోటిపల్లి), గన్నయనాయకను తాటిపాకకు (రాజోలు వద్ద) సామంతులను చేసాడు. సింగయనాయకుడు ముమ్మడివీడును (ముమ్మిడివరం) రాజధానిగా చేసుకొని కోనసీమను పాలించాడు.

శ్రీ రామానుజాచార్యుని శిష్యులలో ఒకరైన శ్రీవత్స చిహ్న మిశ్ర అనే ఆళ్వారు వంశంలో ఏడవ తరానికి చెందిన పరాశర భట్టు ఆంధ్రదేశానికి వచ్చి కోరుకొండలో స్థిరనివాసం ఏర్పరచుకొన్నాడు. ఇతను ముమ్మడినాయకునికి ఆధ్యాత్మిక గురువు. ముమ్మడినాయకుడు పరాశరభట్టు ద్వారా వైష్ణవాన్ని స్వీకరించాడు. ఇతనికి ముమ్మడి నాయకుడు కొట్టాలపర్రు అనే గ్రామాన్ని మాన్యంగా ఇచ్చాడు. పరాశరభట్టు కోరుకొండలోనే చనిపోయాడు. ఇతని తల్లి అప్పటికి బ్రతికి ఉన్నది. తన కొడుకుకు ఇచ్చిన కొట్టాలపర్రు గ్రామాన్ని ఆమెను అనుభవించకుండా కొంతమంది బంధువులు ఆటంకపరచటంతో, ఆమె ఆ గ్రామాన్ని శ్రీరంగనాథునికి దానం ఇచ్చినట్లు శ్రీరంగంలో లభించిన తామ్రశాసనం ద్వారా పై సంగతులన్నీ తెలుస్తున్నవి.[3]

క్రీశ. 1353 లో కోరుకొండ లక్ష్మినరసింహస్వామి ఆలయనిర్మాణం జరిగింది. ఈ ఆలయానికి ముమ్మడినాయకుడు పువ్వులుపాడు, పెంటపల్లె అనే గ్రామాలను స్వామివారి నిత్యపూజలకొరకు సమర్పించి, ఆ గ్రామాలనుండి వచ్చు ఆదాయాన్ని దేవాలయానికి చెల్లించేలా ఏర్పాటుచేసాడు. ఇతని శిల్పం కోరుకొండ ఆలయంలో ఉన్నది. (Figure 1) ముమ్మడిరెడ్డి తరువాత ఆయన కుమారుడు కూనారెడ్డి కోరుకొండను పట్టణముగా చేసుకొని పాలించాడు. స్వామి కొండకు దిగువున రంగనాయకుల దేవాలయము కట్టించి ప్రతిష్ట చేయించాడు. ముమ్మడి రెడ్డి వంశీయులు సుమారు నలభై సంవత్సరములు కోరుకొండ కేంద్రంగా పాలించారు.

కోరుకొండకి వేదాద్రి అనే పేరు ఉండేది. శ్రీనాథుడు కాశీఖండకృతిలో..... *వేదాద్రి నరసింహ విపుల వక్షస్థలీ/కల్హారమాలికా గంధలహరి...* అని కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామిని వర్ణించాడు.

3. శ్రీరంగం తామ్రశాసనం – క్రీశ. 1357 Epigraphia India Vol XIV p.no 83

Figure 1

ముమ్మడి నాయకుడు క్రీశ. 1353 కోరుకొండ

కాపయనాయకుడు క్రీశ.1405 సర్పవరం

కోరుకొండ రాజ్యంలో కోనసీమ, పానార (సర్పాపురం, భీమవరం తణుకులో కొంతభాగం) అంగరసీమ, కొఠాము సీమ (తుని), కురవాట సీమ (వేంగి సమీపంలోని కురవాడ లేదా కాకినాడ వద్ద కల కూరాడ), చాంగలునాటి సీమ మొదలగు సీమలు ఉండేవి. ఆ పిదప క్రీశ.1394లో కొండవీటి రాజు కుమారగిరిరెడ్డి సేనాని అయిన కాటయవేమారెడ్డి కోరుకొండ రాజ్యాన్ని జయించటంతో ఈ ప్రాంతం కొండవీటి రెడ్డిరాజుల పాలనలోకి వెళిపోయింది. ఆ తదనంతర రాజులు కోరుకొండలో నివసించని కారణంగా కోరుకొండ పట్టణము క్రమేపీ తన వైభవాన్ని కోల్పోయింది.

ముస్లిముల పాలనలో శరభన్న అనే బ్రాహ్మణుడు కోరుకొండ పరగణాను కౌలుకు తీసుకొని అధికారం చేసాడు. ఇతని తరువాత విన్నమండ జమిందారులయిన మందపాటి తిరుపతి రాజు కోరుకొండ పరగణా కౌలును గోలుకొండప్రభువునుండి పొందాడు. అటు పిమ్మట ఈ ఇతరప్రాంతాలతోపాటు కోరుకొండ కూడా బ్రిటిష్ వారి పాలనలోకి చేరింది. ఒకప్పుడు జిల్లాలో సింహభాగానికి రాజధాని పట్టణంగా వెలుగొందిన కోరుకొండ ఒక మామూలు టౌనుగా మిగిలిపోయింది కాలక్రమేణా.

ఆదుర్రు

తూర్పుగోదావరి జిల్లాలో ప్రాచీన బౌద్ధనిర్మాణాలు అనేకం ఉన్నప్పటికీ ఆదుర్రు స్థూపం ప్రత్యేకమైనది. ఇది కోనసీమలో రాజోలుకు సమీపంలో కలదు. ఇక్కడ అశోకుని కాలంనాటి బౌద్ధ స్థూపం ప్రపంచం సారనాథ్, టిబెట్ లలో బయటపడిన స్థూపాల స్థాయికి చెందినదని, దీనిని అశోకుని కూతురు సంఘమిత్ర క్రీపూ. రెండో శతాబ్దంలో నిర్మింపచేసిందని; ఇది ప్రపంచస్థాయిలో మూడవ అతి ముఖ్యమైన స్థూపమని బౌద్ధుల విశ్వాసం. ఇక్కడ జరిపిన తవ్వకాలలో 66 అడుగుల వ్యాసం కల మహాస్థూపం, ఆయక మండపాలు, ఆరామ అవశేషాలు, శాతవాహనుల నాణాలు లభించాయి.

బౌద్ధమతం తీరప్రాంతంలో వ్యాపించినంత ఎక్కువగా రాయలసీమ, తెలంగాణాలలో విస్తరించలేదు. తీరాంధ్రలో మొత్తం 52, తెలంగాణలో 14, రాయలసీమలో 6 బౌద్ధ నిర్మాణాలు కనిపిస్తాయి. ఇవన్నీ క్రీస్తుపూర్వం రెండోశతాబ్దం నుండి క్రీస్తుశకం మూడో శతాబ్దం మధ్యలో నిర్మించినవి. తీరప్రాంతం బౌద్ధిజానికి కేంద్రబిందువుగా ఉండేది. అమరావతిలో లభించిన బౌద్ధ ఫలకాలపై దానాలు ఇచ్చిన సామాన్యవ్యక్తుల పేర్లలో 47 పేర్లు హిందూమతానికి చెందిన విష్ణు, శివ, కృష్ణ, స్కంద లాంటివి ఉండగా బౌద్ధ మతానికి చెందిన బుద్ధ, బోధిశ్రీ, సంఘ, ధర్మ, రాహుల వంటి పేర్లు 67 మందికి ఉండటాన్ని బట్టి ఆంధ్రదేశంలో బౌద్ధం ఉచ్ఛస్థితిలో ఉన్న కాలంలో కూడా హిందూమతం ఉనికి గణనీయంగానే ఉందని తెలుస్తుంది.[4]

బౌద్ధక్షేత్రాలు ప్రాచీన వ్యాపారమార్గాలకు సమీపంలో ఉండటం – బౌద్ధానికి వాణిజ్యానికి కల అవినాభావసంబంధాన్ని తెలియచేస్తుంది. ఈ సంబంధం తీరాంధ్రలో ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. బౌద్ధ ఆరామాలు ఎక్కువగా నగరాలకు సమీపంలో ఉండేవి. నగరాలు వాణిజ్య కేంద్రాలు. బౌద్ధ ఆరామాల (మఠం) నిర్మాణం, నిర్వహణల కొరకు వర్తకులు (Guilds) అనేక దానాలు ఇచ్చేవారని వివిధ శాసనాల ద్వారా తెలుస్తుంది.

4. Ref.God,Trade and Worship: A Glimpse into the Religion of Early Andhradesa by P. Krishna Mohan Reddy.

   ప్రాచీన రహదారులు పటానికి Jouveau-Dubreuil map of budhist sites and routes of andhra ఆధారం.



ఆదుర్రు బౌద్ధ స్థూపం ఏరియల్ వ్యూ

అంతేకాక వ్యాపారనిమిత్తమై వచ్చిన పొరుగూరి వర్తకులకు ఈ ఆరామాలు సత్రాలవలే ఉపయోగపడేవి అనే కోణం కూడా కలదు. ఆదుర్రు వేంగినుంచి కళింగకు వెళ్ళే ప్రాచీన రహదారికి సమీపంలో ఉంది. అంతే కాక సముద్రానికి దగ్గరగా ఉండటం వలన జల రవాణాకు కూడా అనుకూలం. ఆ రకంగా ఆదుర్రు ఒకప్పుడు పెద్దఎత్తున వ్యాపారకలాపాలు సాగించిన ఒక రేవుపట్టణం కావొచ్చు.

క్రీశ 530 లో ప్రభాకర అనే రాజు విజయకాండలిపురంను నివాసంగా చేసుకొని కోనసీమను స్వతంత్రరాజ్యంగా పాలించినట్లు, ఇతని కొడుకు పృథ్వీమూలుడు వేయించిన కట్టుచెరువు తామ్రశాసనం ద్వారా తెలుస్తున్నది.[5] ఈ విజయ కాండలిపురం నేడు ఆదుర్రు సమీపంలో కల కడలి గ్రామంగా చరిత్రకారులు నిర్ధారించారు. ఈ దాన శాసనములో పృథ్వీమూలుడు తాను వర్ణాశ్రమధర్మపరిరక్షకుడినని, స్మృతులకు విద్యార్థినని చెప్పుకొన్నాడు. ఈ పృథ్వీమూలుని కొడుకు హరివర్మన్ బౌద్ధుడు. బౌద్ధులకొరకు ఒక విహారాన్ని నిర్మించాడు. ఇతని సోదరి పరమభట్టారక మహాదేవి తన పేరుమీదుగా చక్రపుర అనే ఊరిలో ఒక బౌద్ధ ఆరామాన్ని నిర్మించింది. (బహుశా ఆదుర్రు సమీపంలో కావొచ్చు) ఒకే కుటుంబంలో తండ్రి హిందూధర్మాన్ని పాటించటం, కొడుకు, కూతురులు బౌద్ధం ఆచరించటం ఆనాటి ప్రజలకు ఉన్న మతస్వేచ్ఛను పట్టిచూపుతుంది[6]. చాలా సందర్భాలలో రాజు హిందుమతాన్ని, రాచస్త్రీలు బౌద్ధ లేదా జైన మతాలను అవలంబించినట్లు అనేక ఆధారాలు కనిపిస్తాయి. వైదిక క్రతువులలో మొదట్లో స్త్రీలకు పాత్రలేకపోవటం దీనికి కారణంగా చెప్పుకోవచ్చు.

ఆ తదనంతరం కోనసీమలో బౌద్ధమతం ఏమరకు విస్తరించిందో తెలియరాదు. ఈ ప్రాంతం తూర్పుచాళుక్య రాజ్యంలో కలిసిపోయాక కొంతకాలం జైనం విలసిల్లింది. ఆ కాలానికి చెందిన జైన విగ్రహాలు ఆదుర్రు సమీపంలోని తాటిపాక వద్ద నేటికీ అక్కడక్కడా బయటపడుతున్నవి.

5. Raja Prithvimula, by M. Ramarao, SVU Oriental Journal Vol X p.no 59.
6. Ibid. p.no 63.

చాళుక్యభీమవరం

సామర్లకోట కుమారరామ భీమేశ్వర, ద్రాక్షారామ భీమేశ్వర ఆలయాల్ని మొదటి చాళుక్య భీముడు (క్రీశ.892-921) కట్టించాడు. సామర్లకోట కుమారరామ భీమేశ్వర ఆలయం చుట్టూ అనేక మహళ్లతో ఒకప్పుడు విరాజిల్లిన నగరానికి చాళుక్యభీమవరం అని పేరు. ఇక్కడినుండి రాజమహేంద్రవరానికి దండురహదారి ఉండేదట. చాళుక్య భీమవరానికి స్కందారామమని, కుమారారమని కూడా పేర్లు కలవు. చాళుక్యభీముడు ఇక్కడే నివసించేవాడు అంటారు. ఈ నగరానికి నాలుగు వైపులా నాలుగు ప్రవేశమార్గాలు ఉండేవట. ఈ ద్వారాల వద్ద ఉండే ఒక బంటు వేములవాడభీమకవిని లోనికి వెళ్లకుండా అటకాయించినపుడు ఈ నగరం పాడు పడుతుందని శపించగా, క్రమేపీ ఈ నగరము పాడయిపోయిందని సామర్లకోట కైఫీయ్యతు కథనం.

చాళుక్యభీముని మరణం తరువాత చాళుక్యరాజ్యం దాయాదుల పోరు ఎదుర్కోవలసి వచ్చింది. ఈ పోరులో చాళుక్యభీమవరాన్ని శత్రురాజులు నాశనం చేసి ఉంటారు. ఆ తరువాతి రాజైన మొదటి అమ్మరాజు (క్రీశ.921-927) నివాసాన్ని రాజమహేంద్రవరానికి మార్చటంతో చాళుక్యభీమవర పట్టణం ప్రాభవాన్ని కోల్పోయింది. కుమారరామ భీమేశ్వర ఆలయం మాత్రం మిగిలింది.

చాళుక్యభీమవరంలో మాండవ్యనారాయణ స్వామి ఆలయంలో మండప స్తంభంపై క్రీశ.1115 నాటి ఒక దాన శాసనంలో ఆ ఆలయాన్ని "మండయ" అనే వైశ్యోత్తముడు నిర్మించినట్లు ఉన్నది.[7] ఇదే ఆలయంలో కల మరో శాసనం పై ఈ ఆలయం పేరు "రాజనారాయణ విన్నగర" ఆలయమని,[8] దీనిని మండయ అనే వైశ్యుడు కుళోత్తుంగుని కాలంలో నిర్మించాడని ఉన్నది. కుళోత్తుంగుడు పాలనాకాలం క్రీశ 1070-1122 మధ్య కనుక ఆ మధ్యకాలంలో ఈ ఆలయం నిర్మించబడి ఉంటుంది. కొంతకాలానికి ఈ

7. 473 of 1893 ep. Ind vol VI pp 219-20 Hultzsch – which is stated to have been built by a vaisya named Mandaya

8. కుళోత్తుంగునికి రాజనారాయణుడు (రాజులలో విష్ణువు) అనే బిరుదుకలదు. విన్నగర అంటే విష్ణుగృహము అని అర్థం.

"రాజనారాయణ విన్నగర" అనే పేరు వాడిక పోయింది. క్రీశ. 1338 నాటి దోనేపూండి శాసనంలో ఈ ఆలయం పేరు దానిని నిర్మించిన మండయ పేరిట మండేనారాయణ స్వామి ఆలయంగా ప్రస్తావించబడింది.[9] కాలక్రమేణా ఈ పేరు మాండవ్యనారాయణ స్వామి ఆలయంగా స్థిరపడింది.

ఈ ఆలయంలో ఉన్న ఒక శాసనం[10] ద్వారా ఒకప్పుడు రాజనారాయన విన్నగర స్వామికి జరిగిన భోగములు, వివిధ సేవలు చేసేవారి వివరములు ఈ విధంగా తెలుస్తున్నాయి. స్వామివారికి నిత్యభోగము, త్రికాలసంధ్యా నైవేద్యసమర్పణ, అయనవీసు, నిత్యహోమము, అమావస్య పవిత్రారోహం లాంటి పర్వదినాల ఆచరణ; కర్మార్చన (యజ్ఞం) చేయువారు, అముదు (అన్నం) వండువారు, తిరువారాధన చేయువారు, తిరుగరకర్చి చేయువారు, పాత్రలు తోమువారు, విన్నపము చేయువారు, తిరువమురి విన్నపము చేయువారు, స్వస్తిసేవలవారు, గ్రాసచేయువారు, తోటమాలులు, శంఖం ఊదువారు, వాద్యకారులు, కుమ్మరులు, బోయిలు, వంటలు, చేయువారు వంటి వివిధ పనులు చేసేవారికి ఇవ్వాల్సిన జీతముల వివరములు ఈ శాసనంలో కలవు. ఈ శాసనములో వివిధ సామాజికవర్గాలకు చెందిన సుమారు 50 మందికి వ్యక్తులకు – ధనము (మాడలు), బియ్యం, నంజుండ్లు (పచ్చళ్ళు), నెయ్యి, పెరుగు మిరియాలు, బెల్లము, పెసలు వంటి వివిధ సరుకులు ఏఏ కొలతలలో ఇవ్వాలో లిఖించబడి ఉంది. ఆనాటి ఆలయవ్యవస్థ సమాజంలో పోషించిన పాత్రను, మాండవ్యనారాయణ స్వామి ఆలయ ఒకనాటి వైభోగాన్ని ఈ శాసనం ద్వారా అర్థం చేసుకొనవచ్చును.

చాళుక్యభీమవరం సమీపంలో కల మాండవ్యనారాయణ స్వామి ఆలయ ప్రాకారగోడలపై ఉన్న "జంట చేపల ముద్ర" ఒకనాడు ఈ ప్రాంతం పాండ్యుల పాలనలో ఉంది అనటానికి సాక్ష్యంగా నిలుస్తుంది. (చూడుడు ఫొటో)

తూర్పుగోదావరి జిల్లాలో పాండ్యుల ఉనికిని ద్రాక్షారామంలో కొప్పెరుజింగ అనే రాజు క్రీశ.1262లో వేయించిన ఒక శాసనం ద్వారా తెలుస్తుంది. ఈ కొప్పెరు జింగ మూడవ రాజరాజ చోళుని (క్రీశ 1231–32) సామంతుగా ఉంటూ పాండ్యుల సహాయంతో ఎదురుతిరిగి రాజరాజునే జయించి ఖైదుచేయించి తన స్వతంత్రాన్ని ప్రకటించుకొని,

9. Epigraphia Indica Vol IV 473 of 1893. pp358 . Mandenarayana the name of the Vishnu temple at Bhimavaram
10. Epigraphia Indica Vol V 478 of 1893

దేవేరితో చాళుక్య భీముడు (క్రీశ. 892–921)

పై శిల్పంలో రెండు దృశ్యాలు చిత్రించబడ్డాయి. మొదట చాళుక్యభీముడు తన అశ్వంపై మంది మార్భలంతో రావటము, రెండవ దృశ్యంలో చేతిలో రాజదండము, తలపై ఛత్రము, ఇరువైపులా చామర ధ్వయముతో రాజు ఆశీనుడై ఉండగా అతనికి కుడి వైపున చేతిలో కలువపూవు ధరించి పట్టపు రాణి కూర్చొని ఉండటము గమనించవచ్చును.

సామర్లకోట మాండవ్యనారాయణ స్వామి ఆలయగోడలపై పాండ్యుల రాజచిహ్నమైన జంటచేపలు

తదుపరి రాజరాజును విడుదల చేసి అతని రాజ్యాన్ని తిరిగి ఇచ్చివేసాడు. ఈ అలజడులను ఎదుర్కోలేక రాజరాజ చోళుడు రాజ్యం విడిచి పారిపోయాడు. కొప్పెరుజింగ క్రీశ 1243 లో మరలా స్వతంత్రాన్ని ప్రకటించుకొన్నాడు. పాండ్య చక్రవర్తి అయిన సుందరపాండ్యన్‌కు ఇతను సామంతుగా ఉండేవాడా స్వతంత్రరాజుగా ఉన్నాడా అనే వివరాలు తెలియరావు. కొప్పెరజింగ తమిళనాడునుంచి కళింగ వరకూ తన ఆధిపత్యాన్ని విస్తరింపచేశాడు. కాకతిసామ్రాజ్యంలో భాగమైన కర్నూలు త్రిపురాంతకంవరకూ చొచ్చుకొని వచ్చి అక్కడ ఒక శాసనము, ద్రాక్షారామం వద్ద మరో శాసనము తాను స్వతంత్రరాజుని అని చెప్పుకొంటూ వేయించుకొన్నాడు. తిరుపతిలో కూడా ఇతని ఒక శాసనం కలదు. క్రీశ.1243 లో ద్రాక్షారామంలో కొప్పెరజింగ వేయించిన శాసనంలో పాండ్యరాజ్యస్థాపనలో తాను సహాయపడ్డానని చెప్పుకొన్నాడు. ఇతని ఆక్రమణ ఎంతోకాలం నిలవలేదు. కాకతి గణపతిదేవుడు ఇతనిని ఓడించి సామంతుగా చేసుకొన్నాడు. క్రీశ.1262 ద్రాక్షారామ శాసనంలో కొప్పెర జింగ తాను గణపతిదేవుని సార్వభౌమత్వాన్ని అంగీకరిస్తున్నట్లు ఉన్నది. శాసనాలే కాక మాండవ్యనారాయణస్వామి ఆలయ గోడలపై పాండ్యుల రాజ చిహ్నమైన రెండుచేపల ముద్ర ఉండటాన్ని బట్టి ఈ ప్రాంతంలో కొంతకాలం పాండ్యుల ప్రభావం ఉండేదని భావించవచ్చు.

సర్పవరం

హిందూ మతంలో విష్ణుమూర్తి ఆరాధన ప్రముఖమైనది. వైష్ణవ చిహ్నాలైన శంఖ, చక్రాలు, లక్ష్మిదేవి ముద్రలు శాతవాహనుల నాణాలపై ఉండటం, హాలుని కొన్ని సప్తశతి గాథలలో వైష్ణవసంప్రదాయానికి చెందిన కృష్ణ, యశోద, గోపికలు, పాలసముద్రం లాంటి ప్రస్తావనలు కనిపించటం లాంటి ఆధారాలను బట్టి వైష్ణవమతం క్రీస్తుశకారంభంలోనే దక్షిణభారతంలో బీజంపోసుకొందని అనుకోవచ్చు. ఏడో శతాబ్దానికి చెందిన కుబ్జవిష్ణు వర్ధనుడు విష్ణు ఆరాధకుడు. తన శాసనాలలో పరమభాగవతుడిగా వర్ణించుకొన్నాడు. వైష్ణవ సంప్రదాయంలో భాగవతవైష్ణవం అనేది ప్రాచీనమైనది. పదకొండో శతాబ్దంలో రామానుజాచార్యుని బోధనలతో ఈ సంప్రదాయం శ్రీవైష్ణవంగా రూపుదిద్దుకొని ఆంధ్ర దేశంలో పాదుకొంది. సర్పవరం భావనారాయణస్వామి, పిఠాపురం కుంతీమాధవస్వామి, సింహాచలం వరాహనరసింహస్వామి, శ్రీకూర్మంలో కూర్మనాథస్వామి ఆలయాలు అప్పట్లో తీరాంధ్రలో శ్రీవైష్ణవం విస్తరించటానికి దోహదపడ్డాయి.

ఆంధ్రదేశంలో ప్రఖ్యాతిగాంచిన ప్రాచీన భావనారాయణస్వామి ఆలయాలు బాపట్ల, భావదేవరపల్లి, సర్పవరం, పొన్నూరు, పెదగంజాంలలో కలవు. ఇవి సుమారు పదకొండవ శతాబ్దం నుంచీ పూజలందుకొంటూన్న ఆలయాలు.

సర్పవరానికి కనీసం వెయ్యేళ్ల ప్రాచీన చరిత్ర ఉన్నట్లు అక్కడ నెలకొని ఉన్న భావనారాయణస్వామి ఆలయ శాసనాల ద్వారా తెలుస్తుంది. కానీ ఈ ఊరి చరిత్రను తెలుసుకోవటానికి శాసనాలు తప్ప వేరే ఇతర చారిత్రిక ఆధారాలు పెద్దగా లభించవు.

శ్రీ భావనారాయణస్వామికి వీరచోడ-ఆళ్వారు, భావయ్య, భావనారాయణ అనే వివిధ పేర్లు కనిపిస్తాయి.

సర్పవర భావనారాయణస్వామి ఉన్న ఒక దానశాసనం[11]లో భావనారాయణ స్వామిని "వీరచోడ-విన్నగరాళ్వారు" అని సంబోధించటాన్ని బట్టి ఈ ఆలయం వీరచోడుని కాలములో నిర్మించబడి ఉండవచ్చుననే అభిప్రాయం కలదు. ఈ శాసనంలో చెప్పబడిన

11. SI Vol 5 ins. No 12 pn 5 క్రీశ. 1195-శుత్తమల్లి చతుర్వేదిమంగ్గలమున శ్రీ పురుషోత్తమమున వీరచోడవిన్నగరాళ్వారికి శ్రీ వీరపెర్మాడిదేవర మహాదేవ మహాదేవి మీనవమ్మహాదేవి పెట్టిన అఖండవత్తి.... (విన్నగర-విష్ణుగృహము)

వీరపెర్మాడిదేవర (పిఠాపురం చాళుక్య శాఖకు చెందిన) క్రీశ. 1093-1107 మధ్య ఈ ప్రాంతాన్ని పాలించాడు.[12]

భావనారాయణస్వామి ఆలయాన్ని వీరచోడుడు నిర్మించి ఉండొచ్చనటానికి ఈ క్రింది ఆధారాలు కనిపిస్తాయి.

రాజరాజనరేంద్రుని కొడుకు కులోత్తుంగుడు చోళ సామ్రాజ్యాధినేతగా పగ్గాలు చేపట్టి తన కొడుకు వీరచోడుడిని క్రీశ.1078 లో వేంగి రాజ్యానికి రాజును చేసాడు. ఇతను సర్వలోకాశ్రయ శ్రీ విష్ణువర్ధన మహారాజు అనే తూర్పుచాళుక్యవంశ బిరుదును స్వీకరించి క్రీశ.1093 వరకూ వేంగిని పాలించాడు. ఇతను వైష్ణవమతావలంబకుడు. ఇతను (క్రీశ 1092-1093) తమిళదేశమునుండి 536గురు బ్రాహ్మణులను రప్పించి పిఠాపురము సమీపంలో వీరచోడ చతుర్వేదిమంగళమను పేరనొక అగ్రహారము ఏర్పాటుచేసాడు.[13] (దీని పేరు పైన చెప్పిన శాసనములో "శుత్తమిల్లి చతుర్వేదిమంగ్గలము" అని చెప్పబడింది.) అలా ఇక్కడకు వచ్చిన బ్రాహ్మణుల పేర్లలో భట్ట, త్రివేదిభట్ట, పార్థసారధి, కన్నన్, శ్రీధర వెన్నియకుట్టాన్, (శ్రీకృష్ణుడు)లాంటి వాటిని బట్టి వీరందరిని వైష్ణవులుగా గుర్తించవచ్చు. ఎక్కువమంది భరధ్వాజగోత్రం, వత్స, కౌండిన్య గోత్రాలకు చెందిన వారు. అప్పట్లో తమిళదేశంలో వైష్ణవులపై దాడులు జరుగుతున్న నేపథ్యం కనుక వారందరూ వేంగివైపు వలసలు వచ్చారని భావించవచ్చు.[14]

వీరచోడుడు ఈ చతుర్వేదిమంగళమును మలవెల్లి, పొన్నతొర్ర, ఆలమి అనే మూడు గ్రామాలను విలీనం చేసి ఏర్పాటుచేసాడు. ఈ గ్రామాలనుండి వచ్చే ఆదాయం ద్వారా ఆ బ్రాహ్మణులు జీవిక సాగించేవారని అనుకోవాలి. ఈ చతుర్వేదిమంగళముకు సరిహద్దులుగా దక్షిణాన పొన్నవాడ (పొన్నాడ) పశ్చిమాన కొల్లిప్రోలు (గొల్లప్రోలు) చెంప్రోలు (చేప్రోలు) ఉత్తరాన బెండపూండి (బెండపూడి), దంకలపూండి (తొండంగి?) తూర్పున సముద్రము అని పిఠాపురం తామ్రశాసనం ద్వారా తెలుస్తున్నది[15]. ఇవన్నీ పిఠాపురం సమీప గ్రామాలు. పై సరిహద్దుల ఆధారంగా వీరచోడుడు తమిళదేశంనుంచి వచ్చిన బ్రాహ్మణులకు దానంగా ఇచ్చిన ప్రాంతాన్ని నేటి పిఠాపురానికి పాతిక కిలోమీటర్ల దూరంలో

12. History of Andhras upto 1565 AD, by J. Durgaprasad p.no%. 118. ఈ సమయములో భావనారాయణ స్వామికి ఇతను అనేక దానాలు ఇచ్చిన శాసనాలు ఆలయంలో కలవు. SI Vol 5 ins. No 12, 15, 16,18
13. Pithapuram Plates of Vira Choda – Epigraphia Indica Vol V no 10
14. History of Andhras by .j. Durgaprasad p.n 117
15. Pithapuram Plates of Vira Choda – Epigraphia Indica Vol V no 10

ఉన్న"పెరుమాళ్లపురం" గ్రామంగా పోల్చుకొనవచ్చును. ఇప్పుడు ఇది పల్లీయులు అధికంగా నివసించే ఒక తీరప్రాంతగ్రామం. ప్రాచీన వైష్ణవాలయాలు ఉన్న జాడ కనిపించదు. కానీ గ్రామనామంలోని "పెరుమాళ్" (విష్ణుమూర్తి) అనే పదం ఒక్కటే– వీరచోడుడు తమిళ వైష్ణవులకొరకు ఏర్పాటుచేసిన చతుర్వేదిమంగళం ఇదే కావచ్చునని చెబుతుంది. ఈ చతుర్వేదిమంగళానికి దక్షిణం వైపున సర్పవరం ఉంది. బహుశా ఈ బ్రాహ్మణులు పైన చెప్పిన గ్రామాలనుండి వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తూ అప్పటికే పట్టణాలుగా ఉన్న పిఠాపురానికి, చాళుక్యభీమవరానికి మధ్యలో ఉన్న సర్పవరం అనే చోట నివాస స్థలాలను ఏర్పాటు చేసుకొని ఉండొచ్చు.

క్రీశ. 1090లో వీరచోడుడు పైన చెల్లూరు వైష్ణవాలయానికి కాలేరు అనే గ్రామాన్ని దేవభోక్తంగా సమర్పించుకొనటం వీరచోడుడు వైష్ణవాన్ని ఆదరించాడు అనటానికి మరో ఆధారం.[16]

భిన్నకాలాలకు చెందిన శాసనములలో సర్పవరానికి శ్రీపురుషోత్తమ పట్టణము, సబ్బపురము, భావపురము, భావయ్యనగరు, సర్పపురము అంటూ భిన్న పేర్లు కనిపిస్తాయి. అదే విధంగా భావనారాయణ స్వామి పేరు విన్నగరాళ్వార్, పురుషోత్తమ దేవర, భావయ్య, భావదేవయ, సర్పవరనాథ, భావనారాయణ పెరుమాళ్ అంటూ ప్రస్తావించబడ్డాయి,

క్రీశ. 1754 లో కూచిమంచి తిమ్మకవి రచించిన సర్పవరక్షేత్ర మహాత్యమ్ అనే గ్రంధంలో – అనంతుడనే సర్పము శ్రీ మహా విష్ణువును గురించి తపస్సు చేసి తనను పానుపుగా స్వీకరించమని కోరగా స్వామి ఆ విధంగా వరమిచ్చాడట. ఒక సర్పము విష్ణువు చేత వరం పొందిన క్షేత్రం కనుక దీనికి సర్పవరం అనే పేరు వచ్చింది అని ఐతిహ్యంగా చెప్పబడింది. ఈ ఆలయానికి ఎదురుగా ఉన్న తటాకానికి నారదగుండమని పేరు. నారదునికి గర్వభంగం కలిగించటానికి విష్ణుమూర్తి మాయపన్ని నారదుడు ఒక కొలనులో స్నానం చేసి బయటకు వచ్చిచూసుకొంటే స్త్రీగా మారిపోయేటట్లు చేసాడట. అలా నారదుడు స్త్రీగా మారిన తటాకానికి నారదగుండమని; విష్ణుమాయ తొలగి నారదుడు తిరిగి పురుషరూపాన్ని ధరించిన తటాకానికి మోక్షగుండమని పేర్లు వచ్చినట్లు క్షేత్రపురాణం చెబుతుంది. ఈ నారదగుండం అనే పేరు తొలిసారిగా క్రీశ. 1387 నాటి ఒక శాసనములో కనిపిస్తుంది.[17]

---

16. SII I Chellur plates pno 49

17. SI Vol 5 ins. No 6 pn 3 ..... *శ్రీ భావయ్యకు నాలవపాముల ఇమ్మడి సెట్టి నారదగుండ్డాము పడుమటి గట్టునం...*

ఈ ఆలయంలో కల ఒక తమిళశాసనం[18] ద్వారా రాజరాజ నరేంద్రుని కుమారుడు, చోళచక్రవర్తి కుళోత్తుంగచోళుడు ఈ ఆలయాన్ని క్రీశ 1116 లో దర్శనం చేసుకొన్నాడని తెలుస్తుంది. ఈ శాసనము ఈ ఆలయంలో లభించే అత్యంత ప్రాచీనమైనది.

కాలం లెక్కించటం అనేది అనాదిగ ఒక అవసరం. ఏదైనా ఒక కార్యానికి శుభముహూర్తం నిర్ణయించాక భారతీయసంప్రదాయంలో ఆ ఘడియను నిర్ధుష్టంగా తెలుసుకోవలసిన అవసరం ఎంతైనా ఉంది. కౌటిల్యుని అర్థశాస్త్రం, బౌద్ధరచనల ద్వారా మనపూర్వీకులు ముహూర్తసమయాన్ని ఖచ్చితంగా లెక్కించటానికి జలగడియారం[19] వాడేవారని అర్థమౌతుంది. దీనిలో అడుగుభాగాన రంధ్రము కలిగిన చిన్నపాత్ర, నీటితో నింపిన పెద్దపాత్ర, ఉంటాయి. ఈ చిన్న పాత్రను "కుడుక/ఘటికపాత్ర" అంటారు. ఈ కుడుకను పెద్దపాత్ర నీటి ఉపరితలంపై ఉంచితే రంధ్రంద్వారా నీరు దాని లోనికి ప్రవేశించి కొద్దిసేపటికి కుడుక నిండి మునిగిపోతుంది. అలా మునగటానికి పట్టే కాలాన్ని ఘటి, ఘటిక, నాడి అని వ్యవహరించేవారు.

ఖగోళశాస్త్ర నిపుణులైన బ్రాహ్మణులు ఈ ఘటికపాత్ర/ఘడియార నిర్వహణ చేసేవారు. ఈ ఆచారానికి సంబంధించిన ఒక శాసనం భావనారాయణ స్వామి ఆలయంలో లభిస్తుంది. దీనిద్వారా క్రీశ.1404లో గోలి సోమారెడ్డి అనే భక్తుడు భావనారాయణ పెరుమాళ్ కు ఘడియారము పెట్టించి దాని నిర్వహణకొరకు ఔభలోర్ఝు, సింఘూఓర్ఝు అనే ఇద్దరు బ్రాహ్మలను ఏర్పాటు చేసినట్లు, వీరి పోషణ కొరకు వంద టంకాలు పెట్టి ఐదు పుట్ల భూమిని కొని వారికి మాన్యంగా ఇచ్చినట్లు అర్థమౌతుంది.[20]

---

18. 454 of 1893 – Topographical list of the inscriptions of Madras presidency, vol II.

19. ఏడో శతాబ్దంలో లల్ల (Lalla) అనే గణితశాస్త్రజ్ఞుడు జలగడియారం తయారుచేసే ప్రమాణాలు ఇలా చెప్పాడు. కుడుక అనేది 9 అంగుళాల వ్యాసం, దానికి సగం ఎత్తుతో 377 గ్రాముల బరువు ఉండే రాగి పాత్ర. 3.4 గ్రాముల బంగారంతో నాలుగు అంగుళాల పొడవైన తీగను చేసి ఆ తీగబిగుతుగా దూరేలా ఆ కుడుకకు రంధ్రం చేయాలి. అలా చేసిన కుడుకను నీరునింపిన ఒక పెద్ద పాత్రలో ఉంచినపుడు అది మునగటానికి పట్టేసమయం ఒక ఘటిక అవుతుంది. ఘటిక అంటే 24 నిముషాల సమయము. ఈ ప్రమాణాలతో చేసిన కుడుకను "ఘడియ-కుడుక" అంటారు. పదిహేనోశతాబ్దపు బమ్మెరపోతన రచించిన వీరభద్రవిజయంలో – *"శుభలగ్నోదయ సూచకంబగుచు జలంబులందు మునుగు తామ్రఘటికాపాత్ర నిరీక్షించి...."* అనే వర్ణన ద్వారా శుభముహూర్త సమయం కొరకు ఘటికాపాత్ర మునగటాన్ని సూచికగా తీసుకొని అందరూ దానికొరకై నిరీక్షించేవారని అర్థమౌతుంది.

20. SI Vol 5 ins. No 10 pn 4 –..... *గోలిసోమారెడ్డింగారు ఘడియారము వెట్టి ఆ బ్రాహ్మలు ఔభళోర్ఝుసింగాఓర్ఝుంగారి జీతాలకు....*

క్రీశ 1405 పార్థివనామ సంవత్సరం లో కాటయవేమారెడ్డి తన స్వామి కొమరిగిరి రెడ్డికి శుభం కలగాలని శ్రీ భావనారాయణస్వామి ఆలయం ముందర వసంతరాయ మండపాన్ని కట్టించాడు. (చూడుడు Figure 1) క్రీశ.1515 లో శ్రీకృష్ణదేవరాయలు కటక గజపతిని జయించటానికి సైన్యముతో ఈ మార్గాన వెళ్ళేటపుడు శ్రీ భావనారాయణ పెరుమాళ్ కు అనేక విధములైన కైంకర్యములు, ఆభరణాలు సమర్పించుకొన్నాడు. ఆ తరువాత చిట్నీడి వంశస్థులు ప్రోలునాడును కౌలుకు తీసుకొని కొంతకాలం ప్రభుత్వం చేసారు

గోల్కొండనవాబుల పాలనాకాలంలో చిట్నీడివారు కప్పంకట్టక బాకీ పడటంతో అప్పటికే చిట్నీడివారి సంస్థానంలో పనిచేస్తున్న చంద్రారావు, జగ్గారావు అనే ఇద్దరికి గోల్కొండ నవాబు (అబ్దుల్ హుస్సేన్ 1611–1672) ప్రోలునాడు పరగణాల జమిందారీ ఇచ్చాడు. వీరు పిఠాపురం కోటలో స్థావరం ఏర్పరచుకొని ఈపరగణాలను ప్రభుత్వం చేయనారంభించారు. వీరిలో చంద్రారావు సర్పవరంలో కొంతభూమిని భట్టరు జగన్నాధాచార్యులు అనే శ్రీవైష్ణవులకు అగ్రహారంగా ఇచ్చి భావనారాయణ స్వామి ఆలయం ఎదుట శ్రీ వైష్ణవ అగ్రహారం నిర్మించాడు. అప్పట్లో సర్పవరం విస్తారమైన పట్నముగా ఉండేది. అలా సర్పవరం పిఠాపురం జమిందారీలో అంతర్భాగంగా ఉంటూ వచ్చి, జమిందారీలు రద్దయినపుడు స్వతంత్రభారతావనిలో విలీనం అయింది.

దాక్షారామము

శాసనాలలో దాక్షారామము, దాకరెమి, పెదదాకరెమి, దక్షారామ, జననాథపురం, భీమానాథపురమ్, దక్షతపోవనం, దక్షిణకాశి అనే వివిధ పేర్లతో పిలువబడింది.

ద్రాక్షారామం సమీపంలో ఉన్న పెద్దాపురపాడు వద్దలభించిన ఒక శాసనం ద్వారా – జైన కొకండి పర్రులో (నేటి కాకినాడ) ఉన్న కొన్ని జైన ఆలయముల నిర్వహణ నిమిత్తం యాపనీయ సంఘానికి చెందిన కనకసంది అనే జైనాచార్యునికి కొంతభూమిని రెండవ విష్ణువర్ధనుడు (క్రీశ. 673–682) దానం ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ శాసనంలోని ఆ జైన ఆలయములు కొకండిపర్రు (నేటి కాకినాడ), తూరంగు (తూరంగి), కొయ్యూరు (కోవూరు), పొత్తపి, నడిపూర్, ఇందూరు, పర్తిపాక ప్రాంతాలలో ఉన్నట్లు తెలుస్తున్నది. అంటే ఏడవ శతాబ్దంలో ఇక్కడ జైనమత ఉనికి గణనీయంగానే ఉన్నట్లు అర్థమౌతుంది. ద్రాక్షారామానికి పాతిక కిలోమీటర్ల పరిధిలో ఆర్యావటం, గొర్రిపూడి, జగన్నాధగిరి, బోయినపూడి, బిక్కవోలు, జల్లూరు లాంటి ప్రాంతాలలో జైన అవశేషాలు విస్తారంగా నేటికీ లభిస్తున్నాయి. తొమ్మిదో శతాబ్దం వరకూ ద్రాక్షారామ పరిసరప్రాంతాలలో జైన బౌద్ధాలు సర్వత్రా విలసిల్లాయి.

నేడు మనం చూస్తున్న ద్రాక్షారామ భీమేశ్వర ఆలయాన్ని మొదటి చాళుక్య భీముడు కట్టించాడని స్థలపురాణం చెపుతుంది. దీనికి శాసనాధారాలు లేవు. ఇక్కడ లభించే అత్యంత ప్రాచీనమైన శాసనం క్రీశ.1038లో రాజరాజ నరేంద్రుని పాలనా కాలం నాటిది.

పన్నెండో శతాబ్దం నాటికి ద్రాక్షారామభీమేశ్వర ఆలయం ఉచ్ఛదశకు చేరుకొంది. ద్రాక్షారామ ఊరు పట్టణంగా మారింది. ద్రాక్షారామంలో నెలకొని ఉన్న భీమేశ్వర ఆలయానికి దేశం నలుమూలలనుంచి భక్తులు వచ్చేవారు. వారి కొరకు అయిదు సత్రాలు ఉండేవి. రాజులు తమ దిగ్విజయాల అనంతరం భీమదేవునికి కానుకలు సమర్పించు కొనేవారు.

ద్రాక్షారామ ఆలయానికి వివిధ కాలాలలో 13 గ్రామాలను దానంగా ఇవ్వటం జరిగింది. 12-14 శతాబ్దాలలో వేల ఎకరాల పంటభూమిని, ఫలపుష్ప తోటలను ఆలయ నిర్వహణకొరకు భక్తులు దానమొసగారు. 11-14 శతాబ్దాల మధ్య సుమారు పన్నెండువేల పాడి పశువులను భీమేశ్వరునికి భక్తులు అఖండదీప నిర్వహణకొరకు దానంగా సమర్పించు కొన్నట్లు శాసనాలలో ఉంది. ఇది కాక నేరుగా బంగారు నాణాలు, ఆభరణాలు సమర్పించు కొనేవారు. ఒకరకంగా ఆలయాలు ఆనాటి సమాజపు మనీ సర్కులేటింగ్ వ్యవస్థలుగా పనిచేసేవి. ఈ మొత్తం వ్యవస్థను సమన్వయపరుస్తూ ఆనాటి ద్రాక్షారామం ఒక మహా పట్టణం స్థాయిని కలిగిఉండేది. అందమైన భవనాలతోను, పెద్దపెద్ద అంగళ్లతోను, వేశ్యా వాటికలతోను ద్రాక్షారామ పట్టణం ఉందని శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో వర్ణించ బడింది. శ్రీనాథుడు ద్రాక్షారామంలో కొంతకాలం నివసించాడు. ఇతను వ్రాసిన భీమ ఖండంలో ద్రాక్షారామ పరిసరప్రాంతాలలోని మరికొన్ని క్షేత్రాలను ఇలా ప్రస్తావించాడు.[21]

అదె సంవేద్యము; కోటిపల్లి యదె; దక్షారామ మను పట్టణం
బదె; యభ్రంకషసౌధకూటమున హేలావాస మభ్రాయ సం
పద సొమ్మారెడు భీమలింగము మహాప్రాసాద భూమీధరం
బిదె; సప్తర్షి నదీ ప్రవాహమిదె; సంవీక్షింపు మేకాగ్రతన్ (భీమపురాణం)

(తాత్పర్యం: అదే బ్రహ్మ సంవేద్యం (ఖైరవపాలెం లోని ఖైరవేశ్వరుడు), కోటిపల్లి, దక్షారామ పట్టణం, ఆకాశాన్నంటే సౌధాలతో, గొప్పసంపదలతో అలరారే భీమలింగని నివాసం, సప్తగోదావరి ప్రవాహం అదే - జాగ్రత్తగా చూడు)

అదె పట్టిస స్థాన మందుండు వీరభద్రేశ్వర స్వామి యర్ధేందు మౌళి
యదె పుండరీకాద్రి యచట మార్కండేయు,నిలువేల్పు ముక్కంటి వెలసె దొల్లి
యదె కుమారరామ మహర్ష్యరేఖయ, చాళుక్యభీమేశు సదనవాటి
యదె కుక్కుటేశ్వరం బయ్యుపాంతము మేడ, హుంకారిణీదేవి యొలగంబు
వాడె మాయింటివేల్పు పల్వలపురమున నుండులింగంబుభణిరాజ కుండలుండు
సప్తముని సింధు సంగమేశ్వరుడు వాడే, కుండలాముఖమదె మౌని కులవరేణ్య
(భీమపురాణం)

తాత్పర్యం : పట్టిసంలో నెలకొన్న వీరభద్రేశ్వరుడు, పుండరీకాద్రిలో మార్కండేయుడు (రాజమహేంద్రవరం),సామర్లకోట చాళుక్యభీమేశుడు,పిఠాపురంలోని కుక్కుటేశుడు, హుంకారిణీ శక్తిపీఠం, పలివెల కొప్పులింగేశ్వరుడు, సప్తముని సంగమేశ్వరుడు (ఏడిద గ్రామం)

21. ద్రాక్షారామ క్షేత్ర సాహిత్య సమీక్ష - పరిశోధనాగ్రంథం డా. ఎస్.వి రాఘవేంద్రరావు.

శ్రీనాథుడు భీమఖండంలో ద్రాక్షారామపురం గురించి చేసిన కొన్ని వర్ణనల అర్థాలను ఆధ్యాత్మికంగా కాక "మెటఫరికల్‌గా"అన్వయించుకొంటే ఆనాటి సామాజిక,ఆర్థిక పరిస్థితులు మన కళ్లముందు నిలుస్తాయి.

దాక్షారామంలో వాయుదేవుని భార్య ఇల్లువాకిలి తుడుస్తుందని (ధారాళంగా గాలులు వీచే పట్టణం); ఆ తుడిచిన స్థలాల్లో లక్ష్మీదేవి కళ్ళాపు జల్లుతుందని (అందరూ సంపదలతో తులతూగుతున్నారని); గంగానది ముగ్గులుపెడుతుందని (పుష్కలమైన జలవనరులు ఉన్నాయని); సప్తపాతాళాల్లో నివసించే కాంతలందరూ మణికాంతులతో స్వయంగాపెట్టిన దీపస్తంభాలు అవుతారని (రాత్రిపూట కూడా ప్రకాశవంతమైన దీపకాంతులతో దక్షారామం ప్రకాశిస్తుందని లేదా రాత్రిపూట అందమైన వారాంగనలు బయటకు వచ్చి మణులవలె మెరుపులు చిమ్ముతారని కూడా అర్థం చెప్పుకోవచ్చు. అప్పట్లో వేశ్యావృత్తి చట్టసమ్మతం); ఇచ్చట మహాత్ములైన తపశ్శాలురు ఎందరో ధ్యానంలో ఆసక్తికలవారై ముక్తికోసం నివసిస్తారని (ఒక ఆధ్యాత్మిక కేంద్రం); ఆయుధధారులైన నందీశ్వరుడు మొదలైన గుణశ్రేష్టులు ఎలా పార్వతిని రక్షిస్తూ ఉంటారో అలా కావలివారు దక్షావాటికలో అర్ధరాత్రి సమయాల్లో గస్తీ తిరుగుతూ ఉంటారు; (ఆనాటి దక్షారామంలో రాత్రివేళల గస్తీలు, లా అండ్ ఆర్డర్ పటిష్టంగా ఉండేదని); ఇక్కడి ముగ్ధస్త్రీలు రాత్రుల్లో మణులతో కూడిన మేడల అగ్రభాగాలనుండి నక్షత్రాల్ని ముత్యాలేమో అని పట్టుకొంటూ వుంటారనీ అది చూసి వారి భర్తలు నవ్వుతూ ఉంటారని (ఆకాశాన్నంటే మేడలు ఉండే వని, రాత్రివేళల స్త్రీపురుషులు సంతోషంగా ఉండేవారని); ఏలానదీ తీరంలో అన్నిపంటలూ విశేషంగా పండుతూ వుండటం వల్ల పర్వతాల్లా మిక్కిలి ఎత్తైన అనేక ధాన్యరాసులు కన్నులపండుగ చేస్తూ వుంటాయని (ఆనాటి వ్యవసాయ స్థితిగతులు); ఉత్సవ సమయాల్లో ప్రకాశించే వస్తువులతో నిండివుండే విపణివీధులు, మ్రోగే శంఖాలు, భేరీలు, మద్దెలల మొదలైన వాద్యాల ధ్వనులు సర్వ పాపాల్ని నశింపచేస్తాయి (సామాజిక వినోదం, వ్యాపారం)

ఒకనాటి ద్రాక్షారామ పట్టణం ఎలా ఉండేదో ద్రాక్షారామ ఆలయ శాసనాల ద్వారా కొంతమేరకు కల్పన చేయవచ్చు. ద్రాక్షారామ ఆలయము, చుట్టుపక్కల చేసిన నిర్మాణాలను అనేక శాసనాలు ప్రస్తావిస్తాయి. చోడమండపము, నాట్యమండపము, హోమ మండపము, కులోత్తుంగ చోడ సత్రము, పడుమటి సత్రము, మేడ మఠము, ఏఱు మఠము, సింగ్గలభణ్డారక పెట్టిన మఠము, తిరివిడి మఠము లాంటి అనేక సామాజిక

నిర్మాణాలు ఉండటాన్ని బట్టి అప్పటి ద్రాక్షారామం దూరప్రాంతాల వ్యక్తుల రాకపోకలకు తగినరీతిగా వసతిని కలిగి ఉండేదని అనుకోవచ్చు. ఈ శాసనాలలో ప్రస్తావించబడిన– తెలుగరి సెట్టి, సమస్త పెక్కణ్ణు, కాంపులు, పంచానము వారు, నానాదేశి పెక్కణ్ణు, కమ్మకోమటి, డకరేమి కోమట్లు, బలంజ ధర్మ ప్రతిపాలక వంటి వాణిజ్య వర్గాలు/సంఘాలను బట్టి ద్రాక్షారామం ఒకప్పుడు బలమైన వర్తక వాణిజ్యాలు జరిపిన పట్టణం అని తెలుస్తుంది.

పదిహేనో శతాబ్దం వచ్చేసరికి రాజకీయకారణాల వల్ల Temple patronage తగ్గిపోయింది. 12వ శతాబ్దంలో ఆలయానికి అఖండదీపారాధన కొరకు అవసరపడే నేయి నిమిత్తం 9470 ఆవులను దానం ఇవ్వగా, 15 వ శతాబ్దంలో ఆ సంఖ్య 55 గా ఉండటమే ఆలయపోషణ తగ్గిపోయిందనటానికి స్పష్టమైన ఆధారం. క్రమేపీ ద్రాక్షారామ పట్టణం కూడా తన వైభవాన్ని చాలామేరకు కోల్పోయింది. ద్రాక్షారామ గ్రామంలో ఉన్న పురాతన మసీదు మక్కామసీదుకు నమూనాగా నిర్మించబడిన మసీదు అంటారు. ద్రాక్షారామంపై ముస్లిములదాడులకు గురయినట్లు ఏ రకమైన చారిత్రక ఆధారాలు లభించవు.

శ్రీకాకుళం నుండి మచిలీపట్నం వరకూ కల కోస్తాంధ్రాను నిజాం నవాబు 1753 లో ఫ్రెంచి వారికి దఖలు పరిచాడు. వీటిని స్వాధీనం చేసుకోవటానికి ఫ్రెంచి సేనాని బుస్సి, మొరాసిన్ లు వచ్చినప్పుడు ఆనాటి శ్రీకాకుళం సుబేదారు జాఫర్ అలిఖాను ఎదురుతిరిగాడు. ఈ ప్రాంతాలను ఫ్రెంచివారికి అప్పగించటానికి నిరాకరించాడు. ఫ్రెంచివారిని భయభ్రాంతులు చేయటానికి నాగపూర్ నుంచి మరాఠా బందిపోటుదొంగలను ఆహ్వానించి వారిని ఫ్రెంచివారిపై ఉసిగొల్పాడు. వీరు గోదావరి జిల్లాలలో మెరుపులా ప్రవేశించి భీభత్సం సృష్టించి అందినంతమేరకు దోచుకొని వెళ్లిపోయారు. ఈ సమయంలో వీరు ద్రాక్షారామ ఆలయంలోకి ప్రవేశించి గుప్తనిధుల కొరకు నంది, హనుమంతుని విగ్రహాలను ధ్వంసం చేసారు. [22]

ద్రాక్షారామం ముస్లిములకు కూడా పవిత్రమైనదేనని ఒక స్థానిక గాథ కలదు. పదహారవ శతాబ్దంలో నాగూర్ మీరాసాహెబ్ సమకాలీనుడైన సయ్యద్ షా బాజి ఔలియ అనే ఒక యోగిపుంగవుడు కొంతమంది శిష్యులతో ద్రాక్షారామం వచ్చాడట. ఈయన మదినాలో జన్మించాడట. ఒకరోజు ఇతని శిష్యులు క్షుద్బాధతాళలేక ఒక శైవమఠానికి చెందిన ఎద్దును వధించి తిన్నారట. దీనికి ఆగ్రహించిన శివభక్తులు ఈ ముస్లిం గురుశిష్య

22. Madras District Gazetteers Godavari, Hemingway FR, p.no 251

బృందంతో వాగ్వివాదానికి దిగి, మేము శివలింగాలను ఒక చెరువులోకి ఉంచుతాము నీ మంత్రశక్తితో వాటిని పైకి రప్పించమని ఆ ముస్లిం యోగికి పరీక్ష పెట్టారట. ఆ ముస్లిం యోగి తన తపోమహిమతో చెరువులో వారు ఉంచిన శివలింగాలను అన్నింటిని పైకి రప్పించటంతో – ఆ శివభక్తులు సంతసించి తమ మఠంలో ఆ ముస్లిం యోగి నివసించ టానికి అనుమతించారట. అది కాలక్రమేణా మసీదుగా మారిందని కథనం. ఈ గాథ నిజంగా జరిగిందో లేదో తెలియదు కానీ, ఈ గాథ పుట్టుకలో మన పూర్వీకుల హిందూ ముస్లిం సహిష్ణుతా భావనలు ద్యోతకమౌతాయి.

లీలావతీ పరిణయం కావ్యంలో ద్రాక్షారామం : ఎనిమిదో శతాబ్దానికి చెందిన కౌహలుడు అనే జైన ప్రాకృత కవి, శాతవాహన చక్రవర్తి హాలుడిని ప్రధానపాత్రగా తీసుకొని లీలావతి (లీలావాయి) అనే కావ్యాన్ని రచించాడు. దీనిలో– హాలుని వద్ద సేనానిగా పనిచేస్తున్న విజయానందుడు, మంత్రి పొట్టిసలు ఒకరోజు ప్రతిష్టానపురం నుంచి బయలుదేరి పాండ్య రాజ్యం మీదుగా ధనుష్కోటి చేరుకొని రామేశ్వరాలయంలో పూజలు చేసి తిరిగి బయలు దేరేసమయానికి వీరు ప్రయాణిస్తున్న ఓడ పెద్ద తుఫానులో చిక్కుకొంటుంది. వీరు ఆ తుఫానులో కొట్టుకుపోయి గోదావరి నది సముద్రంలో కలిసేచోట ఒడ్డుకు చేరుకొంటారు. అక్కడనుంచి వారు అడవిలో కొద్దిసేపు ప్రయాణించి ద్రాక్షారామ సప్తగోదావరి భీమేశ్వర దేవుని ఆలయానికి[23] చేరుకొని, దైవ దర్శనం చేసుకొని దానికి దక్షిణం వైపు ఉన్న ఒక మఠంలో బస చేస్తారు. అక్కడ వీరు హాలుని పెండ్లాడాలని బయలుదేరిన సింహళ దేశ రాకుమారి అయిన లీలావతిని కలుస్తారు.

ఈ విషయాలన్నీ ప్రతిష్టానపురం వెళ్ళి హాలునికి చెప్పగా, హాలుడు బయలుదేరి సప్తగోదావరీ తీరానకల భీమేశ్వర ఆలయానికి వచ్చి సింహళరాకుమార్తె లీలావతిని భీమేశ్వర స్వామి సన్నిధిలో పరిణయమాడటంతో కావ్యం ముగుస్తుంది.

ఈ కావ్యకథనం యొక్క చారిత్రికతను నిర్ధారించే ఆధారాలు నేడు లభించవు. ఎనిమిదోశతాబ్దానికే దాక్షారామం భీమేశ్వరుని ఆలయంగా ఉండేదా అనేది కూడా శోధించ వలసిన విషయమే.

నేడు ద్రాక్షారామం ఊరుపరంగా పట్టణం కాకపోవచ్చుకానీ ఆధ్యాత్మికపరంగా. పంచారామాల్లో ఒకటిగా, దేశవ్యాప్తంగా దక్షిణకాశిగా గొప్ప పేర్గాంచిన హైందవక్షేత్రం.

23. Lilavai of Kouhala by A N Upadhye, Pno 60 and 75

బెండపూడి

తునికి సమీపంలో బెండపూడి కలదు. కాకతి ప్రతాపరుద్రుని హయాంలో (పద్నాలుగోశతాబ్దపు ప్రారంభదశకంలో) అతని ప్రతినిధులుగా పెదమల్లిదేవరాజు, చినమల్లి దేవరాజు అనే సోదరులు బెండపూడిని కేంద్రంగా చేసుకొని అక్కడ ఒక పెద్దకోటను నిర్మించుకొని నివాసముంటూ ఈ ప్రాంతాన్ని ప్రభుత్వము చేసారు.. వీరు చాలా నిరంకుశంగా అధికపన్నులు విధించి ప్రజలను పీడించటంతో రైతులు, వృత్తికారులు తమపనులు చేయనిరాకరించి తిరగబడి పొరుగూర్లకు వెళ్ళిపోయారు. క్రీశ. 1323-24 లో ప్రతాపరుద్రుడే స్వయంగా కల్పించుకొని అందరిని సమాధానపరచి, అంతకుపూర్వము ఏ విధంగా పన్నులుండేవో ఆ పద్ధతిలోనే పన్నులు వసూలు చేసేటట్టు ఏర్పాట్లు చేసి ఆ వివరాలను ఒక శిలాశాసనంగా వేయించాడు. దీన్ని ఆ తరువాత కోరుకొండ నరశింహస్వామి కల్యాణమండప స్తంభంగా నిలిపారు. ఈ సంఘటన ఈ ప్రాంత ప్రజల సామాజిక చైతన్యానికి చారిత్రిక చిహ్నం.

ఆ తరువాత బెండపూడి 1386-1402 వరకు కుమరగిరి రెడ్డి పాలనలోకి వెళ్ళింది. కొమరగిరి రెడ్డి అరియేటి అన్నమంత్రిని బెండపూడి కోటకు ప్రతినిధిగా నియమించాడు. ఇతనే బెండపూడి అన్నియమంత్రిగా పేరుపొందాడు. శ్రీనాథుడు ఇతని ఆశ్రయంపొంది తానురచించిన భీమేశ్వరపురాణం అనే కావ్యాన్ని క్రీశ1430లో అంకిత మిచ్చాడు. బెండపూడి అన్నియమంత్రి చేసిన దానములను శ్రీనాథుడిలా వర్ణించాడు

సీ. రాజమహేంద్రదుర్గమున గావించె శ్రీ
వీరభద్రునకు ప్రాకారరేఖ
నిలిపె మార్కండేయ నీలకంఠుని మ్రోల
రామేశుం దమతల్లి నామకముగ
సంగా మేశ్వరదివ్యశంభులింగమునకు
గల్పించెగళ్యాణ గర్భ గృహము
దక్ష వాటికియందు దరుణేందు మౌళికి
మొగలివాకిట ధామమును రచించె

గీ. బాగ్జిశావప గోపుర ప్రాంగణమున
సప్త మునిసింధుసోపాన సరళి కెలన
దీర్ఘభవనంబు భీమయదేవనగర
మంత్రదేవయయన్నయామాత్యవరుడు,

(తాత్పర్యము: వీరభద్రుడు ఉంటున్న రాజమహేంద్రవరం కోటకు ప్రహారిగోడ, మార్కండేయఆలయంలో తమతల్లిపేరుతో శివలింగ ప్రతిష్ట, సంగమేశ్వరునికి కళ్యాణ మండపం,ద్రాక్షారామంలో శివునికి ముఖద్వారం,తూర్పుదిక్కున గోపుర వాకటిలో సప్తరుషుల మెట్లు, భవనాలు అన్నయమంత్రి నిర్మించాడు)[24]

పంతొమ్మిదోశతాబ్దం ప్రారంభంలో వ్రాయబడిన మెకంజీ కైఫియ్యతులలో బెండపూడి గురించి ఒక ఆసక్తికరమైన కథనం కలదు.

కాకతీయులకు సామంతులుగా పెదమల్లి దేవరాజు, చినమల్లి దేవరాజులు బెండపూడి అనే గ్రామము వద్ద కొండ పక్క పెద్ద కోటను నిర్మించుకొని అక్కడ నివాస ముంటూ, కోనసీమ నుండి రాజమహేంద్రవరమువరకూ ప్రభుత్వము చేసారు. వీరు 50 సంవత్సరములు పాలనచేసారు. పెదమల్లరాజు బావుమరిది వెన్నెలరాయుడు ఈ దుర్గానికి కొంతదూరములో ఒకచిన్న గుట్టపై ఒక మేడకట్టుకొని దానిలో నివసిస్తూఉండేవాడు. ఇతను అతిసుకుమారుడు. వెన్నెలలో కొంతదూరము నడిచినంతనే వడదెబ్బతగిలినట్టు ఆయాసము వచ్చేదట. అందువల్ల ఇతనిని వెన్నెల రాయుడు అని ప్రజలు పిలుచుకొనేవారు. ఇతను నివసిస్తున్న గుట్టను వెన్నెలరాయునిగుట్ట అని వాడిక పడింది.

ఈ ప్రకారము నడుస్తూ ఉండగా, కటకపురి సింహాసనస్థులైన గజపతిరాజుల యొక్క బంధువు గోవిందరాజు అనే ఆయన తన కుమారుని వివాహం కొరకు కటకపురి నుండి కొండవీడు వెళ్ళి అక్కడ వివాహం కావించి తిరిగి స్వగృహానికి వెళ్లుతూ బెండపూడి వద్ద వేలాదిమంది అనుచరులతో మజిలీచేసాడు. పెండ్లికుమార్తె అపురూపసౌందర్యవతి అని ఆనోటా, ఈనోటా తెలుసుకొన్న పెదమల్లరాజు తమ అతిధిసత్కారములను స్వీకరించవలసినది అని గోవిందరాజును కోరి తమ దివాణమునకు ఆహ్వానించాడు. గోవిందరాజు కొత్తపెళ్ళికొడుకు, పెళ్ళికూతురు ఇతర బంధుమిత్రగణంతో బెండపూడి దుర్గము వచ్చాడు. వారికి పెదమల్లరాజు తగిన కట్నకానుకలు, నూతన వస్త్రములు,

24. ఈ వ్యాసంలోని వివిధ పద్య తాత్పర్యాలను వివరించిన ప్రముఖ కవి శ్రీ మధునాపంతుల సత్యనారాయణ మూర్తి గారికి కృతజ్ఞతలు

పాత్రలు బహూకరించి మర్యాదలు చేసాడు. వారందరి పల్లకీలను కోటదాటనిచ్చి పెండ్లి కుమార్తె సవారీని కోటదాటనివ్వకుండా కోటతలుపులు మూయించాడు. కోటబురుజులపై ఫిరంగులు బిగించి, కోటలోని సిబ్బందికి మందుగుండు సామాన్లు ఇచ్చి యుద్ధానికి సిద్ధమయ్యాడు పెదమల్లరాజు. గోవిందరాజు అతని బృందం కొద్దిసేపు యుద్ధం చేసి కోట దుర్భేధ్యంగా ఉండటంచే తిరిగి తమ గుడారాలలోకి వెళ్ళిపోయారు. ఆ తరువాత జరిగిన విషయాన్ని చెప్పమని కొంతమంది మనుష్యులను కటకమునకు పంపారు. కటకమునుండి వచ్చిన సైనికుల సహాయముతో గోవిందరాజులు బెండపూడి దుర్గమును స్వాధీనం చేసుకొన్నాడు. పెదమల్లరాజు, చినమల్లరాజులను ఇంకా కోటలోని శిశు,బాల వృద్ధులను పట్టుకొని తలలు తీయించాడు కోటను పాడుపడకొట్టించాడు. కోటబురుజులు, గోడలు జీర్ణమై శిథిలమైనాయి. ఆ తరువాత క్రమంగా దుర్గం వెలుపల విస్తారమైన గ్రామము పాడుపడినది.

కాలక్రమేణా బెండపూడి రాజకీయ ప్రాధాన్యతను కోల్పోయి పిఠాపురం జమిందారీ ఏర్పడ్డాక బెండపూడి పరగణా పిఠాపురం జమీలో చేరింది. నేడు బెండపూడిలో కోటకు చెందిన ఏ అవశేషాలు కానరావు.

పలివెల

అమలాపురానికి ఇరవై కిలోమీటర్ల దూరంలో పలివెల కలదు. ఇక్కడ అత్యంత ప్రాచీనమైనది, అగస్త్యమహాముని చే ప్రతిష్టింపబడినది అని చెప్పబడే ఉమాకొప్పేశ్వర స్వామి ఆలయం కలదు. ఈ ఆలయంలో పన్నెండో శతాబ్దం నుండి పదిహేనోశతాబ్దం మధ్య వేయించిన అనేక శాసనాలు ఉన్నాయి. వీటి ఆధారంగా పలివెల చారిత్రికంగా ప్రముఖమైన ప్రదేశంగా గుర్తించవచ్చు. శ్రీనాథుడు ఒక పద్యంలో "వాడె మాయింటి వేల్పు పల్వలపురమున నుండు లింగంబు ఫణిరాజ కుండలుండు" అని పలివెల కొప్పేశ్వరుని కొనియాడతాడు.

క్రీశ. 1172 లో రెండవరాజేంద్రచోళుని పాలనలో ఒక వెలనాటిచోళనృపుని వద్ద పనిచేసే ఒక మంత్రి కొంతభూమిని పలివెల కొప్పేశ్వరుని ఆలయ సత్రనిర్వహణకొరకు ఇచ్చిన దానశాసనం[25] ఈ ఆలయ శాసనాలన్నింటిలో అత్యంత ప్రాచీనమైనది

క్రీశ. 1317 లో కాకతిప్రతాపరుద్రుని వద్ద మంత్రిగా చేస్తున్న అయ్యనప్రగడ అంతర్వేదిలోని కొన్ని పొలాలు కొప్పేశ్వరునికి అర్పణం చేసాడు.

క్రీశ 1422 లో వీరభద్రారెడ్డి, అనితల్లెంమం గారున్ను కాటమవేమారెడ్డికి జయం కలగాలని కొప్పేశ్వరస్వామికి దానం చేసారు. అల్లాడరెడ్డి ఈ ఆలయానికి మండపాలు కట్టించినట్లు శాసనం కలదు.

మరొక సంవత్సరం లేని శాసనములో– హిందూరాయసుల్తాను శ్రీకుతువన వొడయలుం గారు రాజమహేంద్రవరాన్ని జయించాక ఈతకోట కౌలు తీర్మానం చేయటానికి కంబరు హుసేన్ కుమారుడు వాసం బేగు వచ్చిన సందర్భముగా ప్రభుత్వానికి జయం

25. SII Vol 5 No 105 .....శ్రీ మద్వెలనాంటి చోడనృప .... మంత్రిశిఖామణి... పలవిన గ్రామవయ్యేన్ కొప్పేశ్వరాయ...

26. SII Vol 5. బహుశా క్రీశ. 1572 లో ఇబ్రహిమ్ కుతుబ్ షా రాజమండ్రికోటను జయించిన సందర్భం కావొచ్చు.

కలగాలని జయశెట్టి అనే ఆసామీ తోటభూమి, చెరువు, తాటివనము స్వామివారికి సమర్పించుకొన్నాడు.[26]

పూర్వం సానివారు తమ వృత్తిని ప్రారంభించే ముందు కొప్పేశ్వరస్వామి అంతరాలయంలో మూడురోజులపాటు నిద్రచేయటమనే ఆచారం ఉండేదట. అలా చేయటం ద్వారా వారికి స్వామివారితో వివాహమైనట్లు ఒక నమ్మిక. ఒకనాడు అలా నిద్రించిన ఒక సాని స్త్రీ అదృశ్యమవటంతో ఆ ఆచారం నిలిచిపోయింది. కానీ ఊరిలో ఎవరైనా సాని స్త్రీలు మరణించినపుడు ఆలయం నుంచి తీసుకెళ్ళిన నిప్పుతో వారి చితిని వెలిగించేవారట. ఇదే ఆచారం తిరుచినాపల్లి శ్రీరంగం ఆలయంలో కూడా ఉండేదట.[27] కొప్పేశ్వర స్వామి ఆలయ స్థలపురాణంలో కూడా సాని స్త్రీ ప్రస్తావన ఉంటుంది.

ఒకనాడు ఈ ఆలయపూజారిని ఒక సంకటపరిస్థితి నుంచి కాపాడటానికి శివుడు తన తలపై కొప్పును సృష్టించుకొన్నాడట. అప్పటినుంచి ఇక్కడి ఈశ్వరుని ఉమాకొప్పేశ్వరు స్వామి అని భక్తులు పిలుచుకొంటున్నారని స్థలకథనం.

సుమారు వెయ్యేండ్ల చరిత్ర ఉన్న పలివెల జమిందారీలు వచ్చాక పిఠాపురం సంస్థానంలో కలిసిపోయింది.

27. Madras District Gazetteers Godavari, Hemingway FR, p.no 204

తొలితిరుపతి

ఇది పెద్దాపురానికి 12 కిలోమీటర్ల దూరంలో పురాతనకాలం నుంచి ఉన్న ఒక ఊరు తొలి తిరుపతి. ఇక్కడ శ్రీ శృంగారవల్లభ స్వామి కొలువై ఉన్నాడు. ఈ ఆలయంలోని శాసనాలు క్రీశ. 1399 నుండి 1854 మధ్య వేయించినట్లు తెలుస్తుంది.

క్రీశ. 1408 లో కాటమవేమారెడ్డి బంధువు కొమరగిరిపురపు శృంగారరాయనికి బృందావనం పెట్టించినట్లు ఒకశాసనంలో ఉండటాన్ని బట్టి ఈ ఆలయం రాజమహేంద్ర వరం రెడ్డిరాజుల ఏలుబడిలో ఉన్నట్లు అర్థమౌతుంది.

క్రీశ. 1442 లో ప్రతాపవత్సవాయి అయ్యపదేవమహారాజు ఆలయ నర్తకీమణుల పోషణ నిమిత్తం కొంతభూమిని దానంగా ఇచ్చారు. క్రీశ 1408 లో కాటమరెడ్డి వేమారెడ్డి స్వామివారికి 10 ఖండ్రికల భూమిని బృందావనం నిమిత్తం ధారవోసెను. ఈ శాసనంలో "కొమరగిరిపురపు శృంగారరాయనికి" అనే వాక్యం ఆకర్షిస్తుంది. బహుశా ఈ ఊరి పాతపేరు "కొమరగిరిపురం"[28] అయి ఉండవచ్చు.

ఒరిస్సాకు చెందిన కపిలేశ్వర గజపతి క్రీశ. 1448–1458 మధ్య కోస్తాజిల్లాలను జయించి రెడ్డి రాజ్యాన్ని కైవసం చేసుకొని పాలించాడు. శృంగారరాయని ఆలయంలోని ఒక శాసనంద్వారా ఈ సంగతి నిరూపణ అవుతుంది. (494 of 1893 శాసన వాక్యం–

28. SII Vol 5 Number103. కాటమరెడ్డి వేమారెడ్డి అనేక గ్రామాలను బ్రాహ్మణులకు దానం ఇస్తూ వాటి పేర్లను తన తండ్రి కొమరగిరి రెడ్డి పేరుమీదుగా "కొమరగిరిపురం" అని నామకరణం చేసాడు. ఆ విధంగా క్రీశ. 1404 లో వేమారెడ్డి సామర్లకోటకు సమీపంలోని మధురపూడికి కొమరగిరిపురం అని పేరుమార్చి కోరుకొండ నరసింహస్వామికి ధూపదీప నైవేద్యములకొరకు సమర్పించుకొన్నాడు.

కపిలేశ్వర మహారాయల రాజ్యాన, రఘుదేవనరేంద్ర మహా పాత్రులు రాజమహేంద్రవరపు రాజ్యం ఏలే కాలమందు)

క్రీశ. 1558 లో వేయించిన ఒక శాసనంలో – ఈ ప్రాంతం కపిలేంద్రగజపతి వారి పాలనలో, రాజమహేంద్రవరంలో రఘుదేవన నరేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు అన్యాక్రాంతమైన ఆలయభూములు తిరిగి విడిపించి స్వామివారికి సమర్పణచేసినట్లు ఉంది.[29]

తొలితిరుపతి తొమ్మిదివేల సంవత్సరాల చరిత్ర కలిగినది అని, ఈ ఆలయం పెద్ద తిరుపతి కన్నా ప్రాచీనమైనదని భక్తుల విశ్వాసము. శాసనాలలో తొలితిరుపతికి కనీసం ఆరువందలేళ్ల చరిత్ర కనిపిస్తుంది. అంతకుపూర్వం దీని ఉనికి తెలియరాదు. ఒకప్పుడు మహారాజులను ఆకర్షించిన ఊరు చరిత్రగమనంలో ఒక సాధారణ పల్లెటూరుగా మిగిలిపోయింది. శ్రీ శృంగారవల్లభ స్వామి మాత్రం దేశం నలుమూలలనుంచీ భక్తులను నేటికి తనవద్దకు రప్పించుకొంటున్నారు.

29. SII Vol 5 Number 100 - 104 ఆలయభూములు అన్యాక్రాంతం అవటం ఈనాటిది కాదని ఈ శాసనంద్వారా అర్థమౌతుంది. పిఠాపురం రాజులు స్వామివారికి 600 ఎకరాల భూమిని దానమివ్వగా ప్రస్తుతం 21 ఎకరాలు మాత్రమే ఉండటం తాజా ఉదాహరణ. (సోర్స్. వికిపీడియా)

పెద్దాపురం

నేడు కిమ్మూరు తూర్పుగోదావరి జిల్లా అడ్డతీగమండలంలో ఒక గ్రామంపేరు. కానీ ఒకప్పుడు అడ్డతీగల, యేలేశ్వరం కట్టమూరు, కాట్రావులపల్లి, గుడివాడ, కాంద్రకోట, జగ్గంపేట, మర్రిపాక తమిరె (పెద్దాపురం పాతపేరు) లాంటి గ్రామాలను కలిపి కిమ్మూరు సీమ అని పిలుచుకొనేవారు.

రెడ్డిరాజుల పాలనలో తనవద్ద విశ్వాసంగా పనిచేస్తున్న ఇసికపిల్లి పెద్దాపాత్రుడు అనే అధికారికి కిమ్మూరు సీమను ఇచ్చి దానిపై వచ్చే ఆదాయంలో ఆ పెద్దాపాత్రుని వెంట ఉండే సిబ్బంది ఖర్చులు మినహాయించుకొని మిగిలిన పైకము తనకు జమచేసేలా ఒక అనుమతిపత్రాన్ని ఇచ్చాడు. అప్పుడా పెద్దాపాత్రుడు పైన చెప్పిన తమిరె అనే గ్రామానికి ఉత్తరభాగమందు ఉన్న రెండు చిన్నకొండలను చదును చేయించి ఒక కోట కట్టించి, దానికి మట్టిగోడలు ప్రహరీగా ఏర్పరచి,, కోటకు దక్షిణం వైపున ఒక గ్రామమును ఏర్పరచి దానికి తనపేరిట పెద్దాపురమని పేరు పెట్టాడు. ఆ విధంగా ఒకనాటి తమిరె అనే గ్రామం పెద్దాపురం గా మారింది.[30]

క్షత్రియులైన వత్సవాయి వంశీకులు గోదావరి, కృష్ణా జిల్లాలలో కొంతకాలము స్వతంత్రముగాను, కొంతకాలము మహమ్మదీయులు, రెడ్డిరాజులు, గజపతుల పక్షమున సైన్యాధ్యక్షులుగా గొప్ప ధైర్యసాహసాలు ప్రదర్శిస్తూ గౌరవపాత్రులై ఉండేవారు. రెడ్డిరాజుల వద్ద వత్సవాయి తిమ్మరాజు (క్రీశ. 1555–1607) అనే రాజకుమారుడు రెండువేలమంది సైన్యంతో రక్షణభారం వహించేవాడు. ఆ సైన్యనిర్వహణ ఖర్చులనిమిత్తం కిమ్మూరు సీమను వత్సవాయి తిమ్మరాజుకు ఇవ్వటం జరిగింది. ఆ విధంగా వత్సవాయి తిమ్మరాజు లోగడ పెద్దాపాత్రుడు కట్టించిన పెద్దాపురం కోటలో ప్రవేశించి తన పరగణాలను స్వాధీనంలోకి తెచ్చుకొన్నాడు[31].

30. కాలిన్ మెకంజీ కిమ్మూరు కైఫియ్యతు

31. ibid

ఈ వత్సవాయి తిమ్మరాజు పూర్వీకుడైన సాగి పోతరాజు పల్నాటి యుద్ధంలో (క్రీశ. 1178-1182) పాల్గొన్నాడని ఇతనే పెద్దాపుర సంస్థానానికి మూలపురుషుడని పెద్దాపుర సంస్థాన చరిత్రలో గ్రంథరచయిత వి.ఆర్. జగపతివర్మ అభిప్రాయం.

ఈ వత్సవాయి వంశంలో ప్రతాపవత్సవాయి అయ్యపదేవమహారాజు పెద్దాపురం సమీపంలో కల తొలితిరుపతి శ్రీ శృంగారవల్లభ స్వామి ఆలయ నర్తకీమణుల పోషణ నిమిత్తం కొంతభూమిని దానంగా ఇచ్చినట్లుగా ఆ ఆలయంలో క్రీశ. 1442 వేయించిన ఒక శాసనం[32] ద్వారా తెలుస్తుంది. అంటే అప్పటికే వత్సవాయి వంశీకులు పెద్దాపురంలో తమ ఉనికిని చాటుకొన్నట్లు అనుకోవచ్చు.

ఈ వత్సవాయి వంశస్థులు అటు తోటపల్లి నుంచి ఇటు నగరం వరకూ పెద్దాపురం సంస్థానమును నిర్మించి పరిపాలన సాగించారు. కాండ్రకోట, సౌలిమేశ్వరము, దిగువల్లి, వడ్లమూరు, జగపతిరాయపురము, కిమ్మూరు, కిర్లంపూడి, ఏలేశ్వరం, తోటపల్లి, రంప, చోడవరం, తదితర గ్రామాలు పెద్దాపురం జమిందారీ లో ఉండేవి. వత్సవాయి పెదరాయ జగపతిరాయలు తమపేరిట జగ్గంపేట అనే గ్రామమును కట్టించినారు.

క్రీశ. 1734లో ఈ ప్రాంతాన్ని గోల్కొండ సైన్యం ఖాజి హుస్సేన్ ఆధ్వర్యంలో ఆక్రమించటానికి వచ్చినప్పుడు పెద్దాపురం సంస్థానం నిర్వహిస్తున్న రాణిరాగమ్మ తన ఇరవై ఏండ్ల కొడుకు తిమ్మరాజు, పిఠాపురం జమిందారు రావు కృష్ణారాయణిం, మొగల్తూరు జమిందారు కలిదిండి రామరాజును, నూజివీడు జమిందారు రావుసుబ్బన్నలను ప్రేరేపించి ఖాజీ హుస్సేన్ రాకను నిలువరించటానికి యత్నించింది. కానీ ఖాజి హుస్సేన్ ఎదురు తిరిగిన వారిని చంపివేసి పెద్దాపురం జమిందారీని స్వాధీనం చేసుకొన్నాడు. అప్పటికి ఏడు నెలల వయసున్న తిమ్మరాజుకొడుకు జగపతిరాజును రాగమ్మ విజయనగరంలోని విజయరామరాజు వద్దకు రహస్యంగా పంపించివేసి కోటలో బంధించుకొని ఆత్మాహుతి చేసుకొంది.

క్రీశ. 1759 లో కోస్తాతీరంపై ఫ్రెంచివారికి బ్రిటిష్ వారికి చందుర్తి వద్ద జరిగిన యుద్ధంలో -- విజయనగర సంస్థానాధిపతి ఆనందగజపతిరాజు బ్రిటిష్ పక్షం వహించగా, పెద్దాపురం సంస్థానాధిపతి జగపతిరాజు, పిఠాపురం జమిందారు నీలాద్రిరావులు ఫ్రెంచివారి

32. SII Vol 5 Number 102.... //వత్సవాయ అయ్యపదేవమహారాజులు ఆడువాళ్ల ఆరగింపులకు తిరుపతినే ఊరి ఉత్తరాన అలమేటి ధరిని....//

పక్షాన పాల్గొన్నారు. ఈ యుద్ధంలో పెద్దాపురం సంస్థానాధిపతి జగపతిరాజు చనిపోగా, నీలాద్రిరావు పారిపోయాడు. తదనంతరం పెద్దాపురం సంస్థానానికి వత్సవాయి నాల్గవ తిమ్మజగపతిరాజు వారసుడయ్యాడు

ఈస్ట్ ఇండియా కంపనీ 1802 లో Permanent Settlement చేసేసమయానికి (అప్పటికి జమిందారీలను అనుభవిస్తున్న వ్యక్తులకు శాశ్వతంగా వాటిని స్థిరపరచటం) పెద్దాపురం జమిందారీలో 372 గ్రామాలు ఉన్నట్లు వాటికి ఏటా 667,817 రూపాయిలు శిస్తు కంపనీకి చెల్లించేటట్లు నిర్ణయించి వత్సవాయి జగపతి రాజు పేరిట దఖలు పరచటం జరిగింది.[33] 1951లో జమిందారీలు రద్దయేవరకూ పెద్దాపుర సంస్థానం ఏలుబడి నడిచింది.

పెద్దాపురానికి పశ్చిమంవైపున కల పాండవుల మెట్టపై ఉన్న గుహలలో పాండవులు నివసించారని, ఇక్కడ నుంచి రాజమహేంద్రవరానికి సొరంగమార్గం ఉండేదని స్థానికుల విశ్వాసం. ఇవి బౌద్ధగుహలు కావచ్చునని ఒక అభిప్రాయం కలదు. ఎది ఏమైనప్పటికీ పెద్దాపురానికి పిఠాపురం అంతటి ప్రాచీనచరిత్ర అందుబాటులో లేనప్పటికీ తూర్పుగోదావరి జిల్లా రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాలలో తనదైన ప్రముఖ పాత్ర పోషించింది.

33. Descriptive and Historical account of the Godavery District by Henry Morris p.n 280

తూర్పుగోదావరి జిల్లా ప్రాచీన భౌగోళికత

రాజ్యంలో అతి చిన్న యూనిట్ గ్రామం. గ్రామం అంటే ఒక నాగలితో దున్నగలిగే భూమిఅని, వెయ్య వెండి నాణెముల దిగుబడినిచ్చే భూమి అని, ఒక క్రోసు (రెండు మైళ్లు) పరిమితి కలిగిన భూమి ఆంటూ వివిధ నిర్వచనాలు కలవు నగర, పురము, ప్రోలు లాంటి నామాంతాలు పట్టణాలకు ఉంటాయి. జననాథనగరి, పిష్టపురం, బిక్కవోలు. ఆపైన ఉండే విభాగాలకు వివిధ కాలాలలో వివిధ పేర్లు ఉండేవి. నిర్ధిష్టమైన భౌగోళిక ప్రాంతానికి రట్టము, హారము, రాష్ట్రము, మండలము, కొట్టము, విషయము, నాడు, రాజ్యము, సీమ, స్థలము, భోగము లాంటి పేర్లు కనిపిస్తాయి. వీటి వాడిక, విస్తృతి కాలానుగుణంగా మార్పులు చెందుతూ వచ్చింది. కొన్ని పేర్లు వివిధకాలాలలో సమానార్థ కాలుగా వాడబడినట్లు శాసనాల ద్వారా తెలుస్తూంది.

ఆంధ్ర, కళింగ రాష్ట్రములు బౌద్ధరచనలలో అంధకరట్ఠము, కళింగరట్ఠము పేర్లతో వ్యవహరించబడ్డాయి. కొన్నిశాసనాలలో ఆంధ్రదేశము ఆంధ్రపథము పేరుతో చెప్పబడింది. ముడియానూరు తామ్రశాసనములో ఆంధ్రమండలము పన్నెండువేల గ్రామాలను కలిగిన ప్రాంతంగా ఉన్నది(ఆంధ్రమండల ద్వాదశ సహస్రగ్రామ సంపాదిత).

వివిధ శాసనాలలో కనిపించే వేంగి రాష్ట్రము, వేంగి మండలము, వేంగి నాడు, వేంగి విషయము లాంటి పదాల ద్వారా రాష్ట్ర, మండల, నాడు, విషయము లాంటి పదాలు సమానార్థకాలుగా ఉండేవని అర్థమౌతుంది. రాజ్యం పరిపాలనా సౌలభ్యం కొరకు రాష్ట్ర, విషయ, భోగ అంటూ వరుసగా చిన్నచిన్న ప్రాంతాలుగా విభజించి ఉండేవి.

గుద్దవాది విషయము: ఇది తూర్పుగోదావరి జిల్లాలో అతి ప్రాచీనమైన భౌగోళిక నామము. ఇది అనేక శాసనాలలో కనిపిస్తుంది. నేటి రామచంద్రపురం, అమలాపురం, కాకినాడ తాలూకాలు కలిగి ఉన్న భూభాగాన్ని గుద్దవాడి విషయగా పిలిచేవారు. వివిధ శాసనములలో **గుద్దవాదివిషయ** ఊర్లుగా చెప్పిన– పులుంబూరు (పొలమూరు), మయిండవాడి (మహేంద్ర వాడ), కోరుమిల్లి, ద్రాక్షరామము, వెల్ల, కుందూరు లాంటి గ్రామనామాలు తూర్పుగోదావరి జిల్లాకు చెందినవిగా చరిత్రకారులు గుర్తించారు.

ప్రోలునాడు విషయము: పిఠాపురం, తుని, పెద్దాపురం, కాకినాడ (కాకండివాడ) ప్రాంతాలను ప్రోలునాడు విషయం గా పిలిచేవారు . వీరచోడుని పిఠాపురశాసనంలో ప్రోలునాడులో మాలవెల్లి, పొన్నతొర్ర, జలయూరు (జల్లూరు), అలమి పొన్నవాడ (పొన్నాడ), మల్లప్రోలు (మల్లవరం), కొల్లిప్రోలు (గొల్లప్రోలు), చెంబ్రోలు (చేబ్రోలు), పొలకుంబర్ర, డంకలపూండి, బెండపూండి, లింగమకుర్రు, గారపర్రు, దారెకి, జమ్మపర్రు, భీమాపుర (చాళుక్య భీమవరం), కప్పనిపర్రు, దొంణ్డెంగి (తొండంగి), నవవాడ, దుగ్గవాడ (దుర్గాడ), అరియవట్టము (ఆర్యావటం), సబ్బవరము (సర్పవరం) తుమ్మికి లాంటి వివిధ ప్రోలునాటి గ్రామనామాలు కలవు.

బిక్కవోలు స్థలము: చారిత్రిక ప్రాధాన్యం కలిగిన బిక్కవోలు కొన్నిశాసనములలో బిక్కవోలు స్థలముగా పేర్కొనబడింది. వీరన అనే భక్తుడు బిక్కవోలు స్థలంలోని పినవేంద్ర అగ్రహారాన్ని; కలపూండి గంగయ్య అనే మరోభక్తుడు బిక్కవోలు స్థలములోని అమికి అనే అగ్రహారాన్ని చాళుక్యభీమవరపు భీమేశ్వరునకు సమర్పించుకొన్నట్లు ఆ ఆలయ శాసనముల ద్వారా తెలుస్తున్నది.

రెండేరులనడిమి విషయము: ఇది నేటి కోనసీమ. దీనికే కోనదేశము, కోన స్థలము, కోన మండలము, సింధు యుగ్మాంతరదేశమని వివిధ పేర్లు. ఇది గోదావరి పాయలైన గౌతమి వశిష్టనదుల మధ్యభాగము, కోనసీమను కోన హైహయయులు పాలించారు (క్రీ.శ 1072–1364). వీరి వంశంలో కీర్తిరాజు ఆద్యుడు. ఇతని వారసులు సుమారు రెండు శతాబ్దాలు కోనమండలాన్ని పాలించారు. ఈ వంశంలో చివరి రాజు కోన భీమవల్లభుడు. ఆ తరువాత కోనమండలము రాజమహేంద్రవరం రెడ్డిరాజ్యంలో కలిసిపోయింది. క్రీశ 1128 నాటి ద్రాక్షారామ ఆలయంలో రాజేంద్రచోడుడి శాసనం– పలివెల, (రాజోలు) ముక్కామల, నడుపూడి గ్రామాలు కోనమండలంలో ఉన్నాయని తెలుపుతున్నది. కోనభీమరాజు భార్య పద్మావతి ద్రాక్షరామ భీమేశ్వరునికి 'ఖండెనపల్లి' (నేటి గున్నేపల్లి) గ్రామమును దానము చేసినట్లు శాసనము కలదు. అదే విధంగా నడుపుంబూడి (నడుపూడి), ముక్తీశ్వరము, ముక్రోమల (ముక్కామల) గ్రామాలను కోనమండలమునేలే రాజులు, భీమేశ్వరునికి వివిధ సందర్భములలో సమర్పించుకొన్నారు. వీరు వేయించిన శాసనములు జిల్లాలోని ద్రాక్షారామ, పిఠాపురం పాలకొల్లు ఆలయములలో కలవు. హైహయరాజులు జైనమతాన్ని కూడా ఆదరించారు.

సకటమంతని విషయము/నాడు: ఇది సామర్లకోట, బిక్కవోలు, కొంతమేరకు రామచంద్ర పురం తాలూకాలోని భూభాగాలను కలిగి ఉన్న ప్రాంతము.

కడలు నాడు: ద్రాక్షారామ శాసనములలో పేర్కొనబడ్డ కడలునాడుకు చెందిన గ్రామములు నేటి కాకినాడ లోనివిగా గుర్తించబడినాయి. శ్రీనాథుని భీమేశ్వర పురాణంలో కడలు నాడు కడలు సీమగా పేర్కొనబడింది.

ఏకభోగంబు గాక నేలేటి గరుసు
'గడలి సీమయు' గౌతమీగంగ మేన
కప్పురపు గ్రోవి కాశ్మీరఖండ మవధి
యేలె విశ్వకుటుంబి భీమేశ్వరుడు (భీమేశ్వరపురాణం)

పిష్టపుర విషయము : నేటి పిఠాపురం చుట్టుపక్కల ప్రాంతాలు.

చీకూరు విషయము: తూర్పుగోదావరి మండలంలోని చోడవరము తాలూకా శరభవరం అనే గ్రామంలో దొరికిన ఎనిమిదవ శతాబ్దమునాటి ఒక శాసనములో చీకూరు విషయము ప్రస్తావన కలదు. ఇది నేటి చోడవరం ప్రాంతము.

రంభ: నేటి చోడవరం సమీపంలో కల రంప. రెడ్డిరాజుల కాలంలో ఇక్కడ ఒక కోట ఉండేది. ఇది గిరిరాజులకు రాజధాని. శ్రీనాథుడు భీమేశ్వరపురాణంలో '.... *//దండకారణ్య మధ్య పులిందరాజ రంభాహివంశజులకు నభయమొసగి//* అని వర్ణించాడు.

చెంగర నాడు/సీమ: చెంగరనాడు నేటి చాగల్నాడు. ఇది పెద్దాపురం, రాజమహేంద్రవరం మధ్యగల మెట్టప్రాంతము. ఆంధ్రదేశంలో 'నాడు' అనేది ఒక ప్రాచీన భౌగోళిక విభజన. ఇది నేడు మనుగడలో లేకపోయినప్పటికీ, కొన్ని సామాజిక వర్గాల శాఖల పేర్లలో–వెలనాట్లు, (వెలనాడు ప్రాంతవాసులు అనే అర్థంలో), వేంగినాట్లు, కమ్మనాట్లు అనే పదాలద్వారా నాడు అనే పదం నేటికీ బ్రతికే ఉంది.

వేంగి విషయము: ఇది తీరాంధ్రలో అత్యంతప్రాచీనమైన భౌగోళిక నామము. సముద్రగుప్తుని అలహాబాదు శాసనములో ప్రప్రథమంగా "వైంగేయక హస్తివర్మ... అని వేంగి పేర్కొన బడింది. దీని కేంద్రాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో ఏలూరు సమీపంలో ఉన్న పెదవేగి గా గుర్తించారు. తూర్పుచాళుక్యులకు ఇది రాజధాని. వివిధ శాసనాలలో ఇది వేంగి రాష్ట్ర, వేంగి దేశము, వేంగిమండలము, వేంగినాడు అని వివిధ పేర్లతో కనిపిస్తుంది. కొన్ని శాసనాలలో ఈ పేరుకు చివర ఎన్ని గ్రామములు ఉన్నాయో వాటిసంఖ్యకూడా ఉండటం గమనార్హం.

తొమ్మిదోశతాబ్దపు మూడవ విజయాదిత్యుడు వేయించిన శాసనములో వేంగి–1000 (దశశత సకల ధరణి తలము) అని, అతడే ఇచ్చిన సాతలూరు దానశాసనంలో

వేంగి-1200 అని ఉంటుంది. వేంగి రాజ్యం చోళుల ఆధీనంలోకి వెళిపోయినపుడు కొంతకాలం చోళమండలంగా పిలువబడింది. వేంగి విషయ తీరాంధ్రలో విశాఖపట్టణం నుంచి ప్రకాశంజిల్లా వరకూ విస్తరించిన విశాలరాజ్యంగా భావించాలి.

ఆంధ్ర పథము: మూడవ శతాబ్దములో కాంచీపురము రాజధానిగా చేసుకొని ఆంధ్ర దేశమును పాలించిన శివస్కందవర్మ అనే పల్లవరాజు వేయించిన మైదవోలు శాసనములో ధరణికోట 'ఆంధ్రపథము' లోనిదని చెప్పబడింది. బాణరాజుకు చెందిన ఒక తామ్ర శాసనములో తన పూర్వుడైన జయనందివర్మ ఆంధ్రపథమునకు పశ్చిమమున ఉన్న భూభాగమును ఏలుతున్నాడని పేర్కొన్నాడు. ఈ భూభాగాన్ని అనంతపురము చిత్తూరులుగా గుర్తించారు. ఆ విధంగా నేటి కోస్తా ఆంధ్ర ఒకప్పుడు ఆంధ్రపథముగా పేర్కొనబడిందని తలచవచ్చు.

కాలగర్భంలో కలిసిపోయిన కోటలు

క్రీస్తుపూర్వం నాలుగోశతాబ్దానికి చెందిన గ్రీకు యాత్రికుడు మెగస్తనీసు ఆంధ్రులకు ప్రాకారాలు, దుర్గాలు కలిగిన ముప్పై పట్టణాలు ఉన్నాయని వారు చాలా బలవంతులని చెప్పాడు . ఈ ముప్పై కోటలు ఎక్కడెక్కడ ఉండేవో నేడు గుర్తించటానికి ఆధారాలు లేవు. వివిధ శాసనాలు, సాహిత్యం, కైఫియ్యతుల ఆధారాల ద్వారా జిల్లాకు చెందిన కొన్ని కోటలను పోల్చుకొనవచ్చును. ఇవన్నీ శిథిలమై కాలగర్భంలో కలిసిపోయాయి.

పిఠాపురం దుర్గం: పిఠాపురానికి కనీసం రెండువేల సంవత్సరాల చరిత్ర ఉంది. కళింగ, చాళుక్య రాజులకు ఇది చాలాకాలం రాజధానిగా ఉంది. క్రీశ. 634 నాటి ఐహోలు శాసనంలో పిఠాపురం కోట ప్రస్తావన ఉన్నది. దీనిలో రెండవ పులకేశి దుర్భేధ్యమైన పిఠాపురం కోటను జయించినట్లు చెప్పబడింది. చరిత్రలో రెండవపులకేశి చంద్రగుప్త, సముద్రగుప్త, గౌతమీపుత్ర లాంటి చక్రవర్తులతో పోల్చదగిన వీరుడు. అంతటి శక్తివంతునికే దుర్భేధ్యమైనది అంటే అప్పట్లో పిఠాపురం కోటఎంత పటిష్టంగా ఉండేదో అనిపించక మానదు. నేడు పిఠాపురం కోటగా పిలవబడే నిర్మాణం జమిందారీయుగపు భవనము.

రాజమహేంద్రవరం దుర్గం: మెకంజీ కైఫియ్యతులో గుణగవిజయాదిత్యుడు గోదావరి ఆవ ప్రాంతంపై కోటనిర్మించాడని ఉన్నది. ఇరవయ్యవ శతాబ్దం ప్రారంభం వరకూ రాజమహేంద్రవరం కోట శిథిలాలు ఉండేవి. గోదావరి గట్టుపై కొద్దిపాటి కోట అవశేషాలు నేడు కనిపిస్తాయి. (చూడుడు: రాజమహేంద్రవరం వ్యాసం)

కోరుకొండ దుర్గం: మంచికొండ కూనయనాయకుడు (క్రీశ. 1325–1340) కాకతీయులకు సామంతులుగా ఉంటూ కోరుకొండలో పెద్దకోటను (వనదుర్గం) నిర్మించి దానిలో నివసిస్తూ గోదావరిమండలాన్ని పరిపాలించాడు. కూనవరం అనే గ్రామనామం ఇతనిదే. ఇతని కొడుకు ముమ్మడినాయకుడు కోరుకొండను రాజధానిగా చేసుకొని గోదావరి మొదలు కోనసీమవరకూ పాలన సాగించాడు. ఇతను వైష్ణవమతాన్ని పాటించాడు. పరాశరభట్టు ముమ్మడినాయకునికి ఆధ్యాత్మిక గురువు. ముమ్మడినాయకుని హయాంలో క్రీశ 1353 లో కోరుకొండలో నృశింహస్వామి ఆలయం నిర్మించబడింది. మెకంజీ కైఫియ్యతులలో

(క్రీశ.1810 ప్రాంతంనాటి) కోరుకొండ కోట శిథిలమై, మొండిగోడలు కోటదిబ్బలు మాత్రమే కనిపిస్తున్నాయని ఉన్నది. నేడు అక్కడ ఏవీ కానరావు. కోరుకొండ సమీపంలో రహితాపురమనే చోట మరొక చిన్నమట్టికోట ఉండేది.

వేమగిరి దుర్గం: గుణగవిజయాదిత్యుడు హేమగిరి (నేటి వేమగిరి) మీద ఒక విశాలమైన కోటకట్టించినట్లు, కోటచుట్టూ కందకము తవ్వించి, నీళ్ళ వసతి కొరకు కోటకు దక్షిణ భాగమున పెద్దచెరువు తవ్వించాడని రాజమహేంద్రవరం కైఫియ్యతులో ఉన్నది. తూర్పు చాళుక్యరాజులు ఆ తరువాత వచ్చిన వివిధ పాలకులకు వేమగిరి కోటలో ఉంటూ రాజ్యం చేసేవారు. క్రీశ.1572 లో బహుమనీసుల్తాను ఇబ్రహిమ్ కుతుబ్‌షా సైన్యం మాలిక్‌నైబ్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం పై దండయాత్రకు వచ్చినప్పుడు మొదటగా వేమగిరి కోటను వశపరచుకొన్నారు. నేడు వేమగిరిపై ఏ రకమైన కోట ఆనవాళ్ళు కనిపించవు

బిక్కవోలుకోట: ఒకనాటి తూర్పుచాళుక్యుల ముఖ్యపట్టణమైన బిక్కవోలులో మూడు ప్రాకారాలతో కోటలు ఉండేవని రాజమహేంద్రవరం కైఫియ్యతులో ఉన్నది. నేడు ఇక్కడ ఏ విధమైన అవశేషాలు లేవు.

శ్యామలకోట : కుమారగిరి రెడ్డి (1386-1402) చాళుక్య భీమవరానికి ఉత్తరాన ఒక కోటనిర్మించాలనే ఉద్దేశంతో పునాదులు తీస్తున్నప్పుడు ఒక ప్రాచీనమైన మహిషా సురమర్ధిని (శ్యామలాదేవి) విగ్రహము బయటపడింది. ఆ విగ్రహము దొరికిన స్థలమందు ఒక నేలకోట కట్టించి, ఆ విగ్రహానికి శ్యామలాదేవి అనే పేరుపెట్టి ఒక ఆలయాన్ని నిర్మించాడు. (ఈ దేవి విగ్రహం నేడు చాళుక్యభీమవరం కుమారారామ ఆలయంలో కలదు). ఆ కోటకు దక్షిణంలో ఒక గ్రామాన్ని నిర్మించి దానికి శ్యామలకోట (నేటి సామర్ల కోట) అనే నామకరణం చేసాడు. ఈ కోట కొంతకాలం ఫ్రెంచివారి పరమై చివరకు బ్రిటిష్ వారి చేతుల్లోకి వెళ్లింది.

శ్యామలాదేవి

రాజపూడి రాతికోట: కటక్ గజపతుల సామంతులుగా రాజమహేంద్రవరాన్ని ఏలుతున్న సీతాఫిఖానుడు యుద్ధసమయాలలో సురక్షితంగా ఉంటుందని జగ్గంపేటకు సమీపంలో రాజపూడి అనే గ్రామం వద్ద దట్టమైన అడవులమధ్యలో ఒక రాతికోటను నిర్మించి దాన్ని కేంద్రంగా చేసుకొని మన్యంసీమ మొత్తాన్ని అదుపులో ఉంచుకొన్నాడు. క్రీశ.1572లో

బహుమనిసుల్తానులు దాడిచేసినపుడు ఇతను రాజమహేంద్రవరం కోటను విడిచి రాజపూడికోటలో తలదాచుకొన్నాడు. ముస్లిం సైన్యం రాజపూడికోటపై దాడిచేయగా ముప్పైరోజులపాటు తీవ్రంగా ప్రతిఘటించి తాళలేక కొత్తపిల్లి అడవిలోకి పారిపోగా, సైన్యం పట్టుకొని సితాఫిఖానుడిని తలనరికి చంపివేసింది.

ఈ క్రింది పద్యంలో కుమారగిరి రెడ్డి (క్రీశ.1386-1402) కళింగం వరకూ జరిపిన జైత్రయాత్రలో జయించిన దుర్గాల వివరాలు లభిస్తాయి.

ధాటీ ఘోటీ ఖురాగ్రతృటిత గిరితటేయత్ర ముల్లేటిదుర్గం
దుర్భేదం వజ్రకూటం జితవతిరభసా రామకిర్యాఖ్యదుర్గం
విఖ్యాతం వీరఘోటం గలితమసృహుదాం వీరసన్నాహ రార్ఢ్యం
దుర్గం కిమ్మూరు సంజ్ఞం దలితరిపుబలే దుర్గమం బెండపూండిమ్.

ముల్లేటి దుర్గం-మొల్లేరు రాజమహేంద్రవరానికి 60 కిలోమీటర్లదూరంలో గంగవరం వద్ద కలదు,

రామగిరి దుర్గం – తెలంగాణ,

వీరఘోట్టము – శ్రీకాకుళం, వీరఘట్టం మండలం. ఇది ఒక మట్టికోట. బ్రిటిష్ వారి కాలంలో ఇక్కడ కొన్నాళ్ళు హాస్పటల్, పోలీసు స్టేషను నడిపారట. ఈ కోటలో కాదువెట్టి వంశానికి చెందిన పల్లవులు నివసిస్తూ ఈ ప్రాంతాన్ని కొంతకాలం పాలించారు.

కిమ్మూరు దుర్గం –తూర్పుగోదావరి అడ్డతీగల మండలం, అడ్డతీగల, యేలేశ్వరం కట్టమూరు, కాట్రావులపల్లి, గుడివాడ, కాండ్రకోట, జగ్గంపేట, మర్రిపాక తమిరె (పెద్దాపురం పాతపేరు) లను కిమ్మూరు సీమ అనేవారు

బెండపూడి దుర్గం: కాకతీయ ప్రతాపరుద్రుని పాలనలో అతని సామంతులైన పెదమల్లి దేవరాజు, చినమల్లి దేవరాజు అనే సోదరులు తుని సమీపంలో ఉన్న బెండపూడి అనే చోట ఒక పెద్ద కోటను నిర్మించుకొని అక్కడినుంచి పాలన సాగించారు. రెడ్డిరాజుల కాలంలో అరియేటి అన్నయమంత్రి బెండపూడి కోటలో ఉంటూ ఈ ప్రాంతాన్ని ఏలుబడి చేసాడు. క్రమేపీ ఈ కోట శిథిలమై కాలగర్భంలో కలిసిపోయింది.

వజ్రకూటం విశాఖపట్నం జిల్లా. Vizagapatam District Gazetteer లో "రెండు కొండలనడుమ విశాలమైన కోట శిథిలాలు ఉన్నాయని, ఈ పెద్దకోట చుట్టూ ఏడు చిన్న కోటలు ఉండేవని, ఈ కోట తూర్పుగోడపై తెలుగులిపిలో ఉన్న శాసనాలు కలవు" అని ఉన్నది. నేడు ఈ శిథిలాలు కానరావు.

నక్షత్ర దేవాలయాలు

జన్మనక్షత్రాన్ని బట్టి కొన్ని నిర్ధేశించబడిన ఆలయాలలో పూజలు చేయించుకోవటం హిందువుల ఆచారం. తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌లలో ఈ ఆచారం అనాదిగా ఉంది. ద్రాక్షారామ ఆలయానికి సంబందించి కూడా ఇటువంటి సంప్రదాయం ఉంది. ఈ ఆలయచరిత్రలో జిల్లాలో వివిధ ప్రాంతాలలోని ఆలయాలు నిర్ధేశిత నక్షత్రాల పేరిట పేర్కొనబడ్డాయి. ఉదాహరణకు అశ్వని నక్షత్రం మొదటిపాదంలో జన్మించిన వారు బ్రహ్మపురి శ్రీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామిని, రెండవపాదం వారు ఉట్రుమిల్లి, శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత శ్రీభీమశంకర స్వామిని, మూడవపాదం వారు కుయ్యేరు శ్రీ బాలాత్రిపుర సుందరి సమేత మల్లేశ్వర స్వామిని, నాల్గవపాదం వారు దుగ్గదూరు శ్రీ పార్వతి సమేత మల్లేశ్వర స్వామిని దర్శించుకొన్నట్లయితే వారి కష్టాలు తొలగి, మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం.

27 నక్షత్రాలు ఒక్కోదానికి 4 పాదాలు చొప్పున తూర్పుగోదావరి జిల్లాలోని మొత్తం 108 శివాలయాలు ఆ విధంగా నిర్ణయించబడ్డాయి. ఈ నిర్ణయం ఎప్పుడు జరిగిందో తెలియరాదు. ఆ ఆలయాలన్నిటిని ఆకాశమార్గాన చూస్తే అన్ని కలిపి పద్మాకారంలో వుంటాయంటారు. తమిళనాడులో ఇదే విధంగా ఉండే జన్మ నక్షత్ర ఆలయాలు బహు ప్రాచీనమైనవి కావటంచే ఈ సంప్రదాయం చారిత్రికంగా కనీసం వెయ్యేళ్ళుగా ఉండేదని ఊహించవచ్చు.

ఈ ప్రాంతాన్ని పాలించిన చాళుక్యరాజు రెండవ విజయాదిత్యుడు/నరేంద్ర మృగరాజు (క్రీశ. 806-846) తన విజయాలకు చిహ్నంగా 108 శివాలయాలను నిర్మించాడని అనేక శాసనాలలో చెప్పబడింది. పైన వివిధ నక్షత్రాలకు నిర్ధేశించబడిన నూటఎనిమిది ఆలయాలు అతను కట్టించినవే కావొచ్చు అనటానికి ఆధారాలు లేవు కానీ 108 అన్న సంఖ్యను బట్టి ఆ కాలంనుంచే ఈ ఆచారం ఉండేదని అనుకోవచ్చు.

ఈ 108 ప్రాంతాలు నేడు అతి సామాన్యమైన గ్రామాలు. వీటిలో కుయ్యేరు, కాజులూరు, ఉండూరు, ఓడూరు, పొలమూరు, అంగర, కోటిపల్లి, ముక్తేశ్వరం, దంగేరు లాంటి గ్రామనామాలు వివిధ శాసనాలలో కనిపిస్తాయి. వీటిలో కొన్ని చోట్ల ప్రాచీన బౌద్ధ జైన అవశేషాలు లభిస్తుండటాన్ని బట్టి బహుశా ఈ 108 గ్రామాలు చరిత్రలో ప్రముఖమైన పాత్రవహించిన ప్రాంతాలు కావొచ్చు.

ఏది ఏమైనప్పటికీ – నేటి భౌగోళిక తూర్పుగోదావరి జిల్లాకు ఘనమైన చరిత్ర ఉంది. ఒకనాటి "కళింగ దేశాభరణం" ఈనాటి పిఠాపురం. "వేంగీ దేశంబునకు నాయకరత్నంబు" అని చెప్పిన పట్టణం నేటి రాజమహేంద్రవరం. భారతదేశంలోనే అరుదైన "పురాతన శిల్పశ్రేణి"కి నిలయం బిక్కవోలు. అంతర్జాతీయ విఫణివీధుల్లో నౌకల్ని విహరింప చేసిన "Cape Calingon" మన కోరంగి. బౌద్ధ, జైన మతాల ప్రారంభ వికాసంలో ఈ నేల పోషించిన పాత్ర అనన్యమైనది. ఈ చారిత్రిక విశిష్టతలన్నీ ఒక్క తూర్పుగోదావరి జిల్లాకే పరిమితం కావు. తెలుగువారందరూ గర్వించదగిన అంశాలివి.

బొల్లోజు బాబా

తల్లిదండ్రులు	బొల్లోజు బసవలింగం, అమ్మాజి
సహచరి	సూర్య పద్మ
పిల్లలు	అపరాజిత, బసవ శ్రీధర్
చదువు	M.Sc., B.Ed., M.Phil.
వృత్తి	జువాలజీ అధ్యాపకుడు
రచనలు	**యానాం విమోచనోద్యమం** (2007) **ఆకుపచ్చని తడిగీతం** (2009) కవితా సంపుటి **ఫ్రెంచిపాలనలో యానం** (2012) **స్వేచ్ఛావిహంగాలు** (2016) (రవీంద్రుని స్ట్రే బర్డ్స్ అనువాదం) **వెలుతురు తెర** (2016) కవితా సంపుటి **కవిత్వ భాష** (2018) సాహిత్య వ్యాసాలు **మూడో కన్నీటిచుక్క** (2019) కవితా సంపుటి **మెకంజీ కైఫియ్యతులు – తూర్పుగోదావరి జిల్లా** (2020)
ఇ.బుక్స్	**ఎడారి అత్తరులు** (ప్రముఖ సూఫీకవుల గీతాల అనువాదాలు) **ఇరవై ప్రేమకవితలు ఒక విషాదగీతం** (Pablo Neruda అనువాదం) **రవీంద్రుని క్రిసెంట్ మూన్** అనువాదం **అనువాద కవిత్వం** (రెండువందలకు పైన కవితానువాదాలు) **పరిచయాలు, సమీక్షలు, ప్రసంగాలు** (సాహిత్య వ్యాస సంపుటి) **గాథాసప్తశతి** విశ్లేషణా వ్యాసాలు (పై ఇ.బుక్కులు https://archive.org/details/@bolloju_baba వద్ద లభ్యం)
బ్లాగు	http://sahitheeyanam.blogspot.com/
ఎఫ్.బి.	https://www.facebook.com/bolloju.baba
అవార్డులు	'ఆకుపచ్చని తడిగీతం' కు శిలపరశెట్టి సాహితీ ప్రత్యేక పురస్కారం 2010 ఇస్మాయిల్ సాహితీ పురస్కారం 2017 రొట్టమాకు రేవు కవిత్వ అవార్డు 2018 పాతూరి అన్నపూర్ణ స్మారక సాహిత్య పురస్కారం 2020 పెన్నా సాహిత్య పురస్కారం 2021

pracheena pattanaalu - east godavari district

ఈ గ్రంథం సామాన్య పాఠకులలో, యువతీ యువకులలో చరిత్రపైన మక్కువను పెంచుతుందని, తాను జీవిస్తున్న ప్రాంతంగురించి మరింతగా తెలుసుకోవాలనే తపన పెంచేందుకు సహాయ పడుతుంది అని నేను నమ్ముతున్నాను.

డా. కె. ఎస్. కామేశ్వరరావు
చరిత్ర పరిశోధకులు, రచయిత

ఈ పుస్తకంలో నాకు అత్యంత ఆసక్తిని కలిగించిన విషయం–విస్తృత చరిత్ర ఆధారాలను సేకరించడం, విషయాలను సమన్వయీకరించి క్రోడీకరించడం, సమగ్రంగా విశ్లేషించి పాఠకులకు పరిశోధనా ఫలితాన్ని అందించే ప్రయత్నం నిజాయితీగా చేయడం. దీనికి నేను బొల్లోజు బాబాని మనసారా అభినందిస్తున్నాను.

డా. జాస్తి దుర్గాప్రసాద్
చరిత్ర పరిశోధకులు, రచయిత

PALLAVI PUBLICATIONS
59-1-23/2,Ashok Nagar
Vijayawada - 520010
Cell : 9866115655

ISBN 978-93-5473-695-7
9 789354 736957